teluguislam.net

# ఖుత్‌బాతె నబవీ (స)

దైవప్రవక్త ముహమ్మద్ (స) వారి

## ప్రసంగాలు

(మొదటి భాగం)



సంకలనం

మౌలానా ముహమ్మద్ దావూద్ రాజ్

అనువాదం

అబూ హయ్యాన్ హమ్మాద్ ఉమరీ

ఎడిటింగ్

డా॥ సయీద్ అహ్మద్ ఉమరీ, మదనీ

MARKAZ DARULBIR PUBLICATIONS

AHMED NAGAR, PEDANA - 521 366. A.P. INDIA

Phone: 08672-247799, Cell: 9912193013

teluguislam.net

# ఖుత్‌బాతె నబవీ (స)

## దైవప్రవక్త ముహమ్మద్ (స) వారి

# ప్రసంగాలు


సంకలనం

మౌలానా ముహమ్మద్ దావూద్ రాజ్

అనువాదం

అబూ హయ్యాన్ హామ్మాద్ ఉమరీ

ఎడిటింగ్

డా॥ సయీద్ అహ్మద్ ఉమరీ, మదనీ



ప్రకాశకులు :

మర్కజ్ దారుల్ బిర్ర్

అహ్మద్ నగర్, పెడన-521 366 కృష్ణా జిల్లా ఆంధ్రప్రదేశ్.

Phone: 08672-200003

teluguislam.net



Name of the Title : Khuthbaat E Nabavi(Telugu)

Compiled by : Mohammad Dawood Raaz

Translated by : Abu Hayyan Hammad Omari

Edited by : Dr. Sayeed Ahmed Omari, Madani
Abdusshakoor Omari,

*All Rights Reserved with Publishers*

1st Edition : 2018

Copies : 2000

Rate : Rs.200/-

DTP, Graphics : **Al-Baseer Graphics**
Hyderabad -500 059.
Cell : 9441055065

Publisher : **Markaz Darul Bir** (Regd.)
Ahmad Nagar, Pedana A.P. India.
Pin: 521 366 Phone: 08672-200003



# విషయసూచిక

ముందుమాట.................................... 5
ఖుత్బాత్ 1 & 2 .......................................... 7
1. ఇస్లాం మౌలికాంశాలు .................................... 9
2. మంచిని పెంచండి, చెడును నిర్మూలించడి ................ 16
3. ఈదుల్ అజ్‌హా ఆదేశాలు ................................ 23
4. హజ్ ఆదేశాలు ............................................. 27
5. జీవనోపాధి గురించి ఖుర్‌ఆన్, హదీసుల వెలుగులో........ 33
6. నమాజ్ విశిష్ఠత, ఆదేశాలు .............................. 39
7. మహాప్రవక్త (స) ఆదర్శ జీవితం.......................... 46
8. ముహర్రం మాస ఆదేశాలు ................................ 49
9. ఇస్లాం అమర వీరులు .................................... 52
10. హషర్ మైదానంలో దైవకారుణ్యం ........................ 58
11. పశ్చాత్తాపం మానవ గుణం ............................. 64
12. ప్రళయ సూచనలు ........................................ 71
13. పవిత్ర ఖుర్‌ఆన్ విశిష్ఠత ................................ 76
14. హదీసు విశిష్ఠత ........................................... 82
15. హితబోధనలు .............................................. 88
16. దుఆ ఘనత ................................................. 92
17. హిజ్రత్ తరువాత తొలి చారిత్రక ప్రసంగం ................ 98
18. వీడ్కోలు హజ్ ప్రసంగం ................................... 104
19. సఫర్ మాస నవీన పోకడలు .............................. 109

teluguislam.net




20. ఐక్యత - సోదరభావం ........................ 114

21. ప్రవక్త (స) వారి నమాజ్ ........................ 120

22. దురాచారాలను త్యజించండి ........................ 127

23. కృతజ్ఞతాభావం, దాని శుభాలు........................ 133

24. మద్యపానం, జూదం, వ్యభిచారం ఖండన ........................ 138

25. షఫాఅతే కుబ్రా ........................ 145

26. రమాజాన్ ఆదేశాలు ........................ 149

27. రమజాన్ మాస విశిష్ఠత ........................ 153

28. లైలతుల్ ఖద్ర్ ఘనత ........................ 157

29. జకాత్ విశిష్ఠత ........................ 160

30. ఇస్లాం జీవనశైలి ........................ 164

31. ఇస్రా మరియు .మేరాజ్ ........................ 169

32. తబూక్ యుద్ధం ........................ 174

33. వివాహ విధానం ........................ 180

34. వసీల వాస్తవికత ........................ 182

35. జనాజా నమాజ్ ఆదేశాలు ........................ 186

36. దైవప్రవక్త (స) మరణం ........................ 194

37. ఖుర్ఆన్ సందేశం ........................ 200




# ముందుమాట

ప్రసంగ కళ ప్రాచీన కాలం నుండి ఒక ప్రసిద్ధి చెందిన కళగా వస్తున్నది. ఈ కళ మానవుని మనుగడ నుంచి ప్రారంభమైనది. అరబ్బులు ఈ కళలో విశిష్ట పీఠం వేశారు. కాని ఇస్లాం ధర్మము ఈ కళను అరబ్బులలోనే కాకుండా యావత్ ప్రపంచంలో విస్తరింపజేసింది. జుమా ఖుత్బాలను తప్పనిసరి చేసి ఇస్లాం ధర్మము ప్రసంగ కళను ఉన్నత శిఖరాలకు చేరవేసింది.

తద్వారా ప్రతి కాలంలో, ప్రతి భాషలో అనేకమంది ప్రసంగీకులు ఖ్యాతి గడించారు. వారి ప్రసంగాలకు రచన రూపం ఇవ్వటం జరిగింది. చాలా పుస్తకాలు ప్రచురింపబడి మార్కెట్‌లోకి వచ్చినవి. కొన్ని పుస్తకాలు ప్రత్యేకించి జుమా ప్రసంగాల కోసమే ప్రచురించబడ్డాయి. అల్లామ దావూద్ రాజ్ రహిమహుల్లాహ్ గారి ఖుత్బాతే నబవీ కూడా ఈ కోవకే చేరినది. ఇది చాలా కాలం నుంచి అహ్లెహదీస్ మస్జిద్‌ల మెంబర్ల అలంకరణగా ఉన్నది. చాలా మంది ప్రసంగీకుల పఠన పుస్తకాలలో ఈ పుస్తకం ఉన్నది. అంతేకాదు కొంతమంది ప్రసంగీకులు మెంబరు పై ఈ పుస్తకాన్ని చూసి ప్రసంగం చేస్తున్నారు.

జుమా ప్రసంగం చేయడానికి లేదా ప్రసంగం కొరకు సిద్ధం అవటానికి తెలుగు భాషలో ఒక్క పుస్తకం కూడా ఉండేది కాదు. మర్కజ్‌దారుల్‌బిర్ పెడన ఉపాధ్యాయులు దీని వైపు దృష్టి సారించారు. వారందరి సలహాలనంతరం అల్లామ దావూద్ రాజ్ రహిమహుల్లా గారి ఖుత్బాతే నబవిను కొన్ని ప్రత్యేకతల వలన తెలుగులో అనువదించడానికి ఎంపిక చేయటం జరిగింది. ప్రత్యేకించి తెలుగువారి కొరకు ఈ పుస్తకం అనువైనదిగా భావించడం జరిగింది. ఎందుకనగా ఈ పుస్తకంలోని ప్రసంగాలు సంక్షిప్తంగా సరళరీతిలో అర్థమయ్యేలా ఉన్నాయి. సాధ్యమైనంత వరకు ఈ పుస్తకం జయీఫ్ హదీసులకి దూరంగా ఉన్నది. జీవన విధానానికి సంబంధించిన అన్ని విషయాల గురించి ప్రసంగాలు సమకూర్చటం జరిగింది. జ్ఞానపరంగా ధార్మిక పండితుల వద్ద ఉన్నత స్థానాన్ని పొందినవి.

teluguislam.net



దీని మూల రచయిత అల్లామ దావూద్ రాజ్ రహిమహుల్లా గారు ఆయన చేసిన కృషిని ఈ విధంగా వివరించారు. ఏ మస్జిద్‌లలో జుమా ఖుత్బాలు ఉర్దూలో అయ్యేవో అక్కడ సంక్షిప్తంగా సరళరీతిలో ఖుర్‌ఆన్ హదీసుల పరంగా అర్థమయ్యే విధంగా ప్రసంగాలు గల ఎటువంటి పుస్తకం ఉండేది కాదు. ఇంకా చాలా కారణాలు దృష్టిలో పెట్టుకుని స్నేహితులు పట్టుపట్టడం వలన నేను 23 సం॥ల ముందు తయారు చేసిన పథకము గురించి దీర్ఘ ఆలోచన చేశాను. దుఆ చేస్తూ ఉన్నాను. చివరికి అల్లాహ్ పై నమ్మకం పెట్టుకుని ఈ మహత్తర సేవ కొరకు తయారయ్యాను.

ప్రతి నెల మన మాస పత్రిక అయిన 'వెలుగు కిరణాలు'లో ఒక అంశమును తెలుగులో అనువదించి ప్రచురించాలని నిర్ణయం తీసుకున్నాము. తద్వారా ప్రతి నెల ఈ ప్రసంగాలు ప్రచురితమయ్యేవి. వీటి ద్వారా తెలుగు మాట్లాడే ప్రసంగీకులు చాలా మంది పూర్తిగా లబ్ధి పొందటం గ్రహించాము. కాని వెలుగు కిరణాలు మాస పత్రిక ఆగిపోవటం వలన ఈ కార్యము ఎంతో కాలం సాగలేదు.

మిగిలిన కార్యమును పూర్తి చేయడానికి మన మర్కజ్ దారుల్‌బిర్ పూర్వ అధ్యాపకులైన గౌరవనీయులైన ముహమ్మద్ హమ్మాద్ ఉమ్రి హఫిజహుల్లా గారికి ఈ బాధ్యతను అప్పగించటం జరిగింది. అల్‌హమ్‌దులిల్లాహ్ ఆయన కృషి వలన 60 ఖుత్బాలలోంచి (ప్రసంగాలు) 37 ఖుత్బాలు పూర్తి అయినవి. అవి మొదటి సంపుట రూపములో మీ చేతిలో ఉన్నవి. మిగిలిన ఖుత్బాల పని కూడా కొనసాగుతున్నది. అది తొందరగా పూర్తి అవుతుందని అల్లాహ్‌పై నమ్మకం ఉన్నది. అది పూర్తయిన తరువాత ఇన్‌షా అల్లాహ్ రెండవ సంపుటము రూపములో ప్రచురించబడుతుంది. ఈ కుత్బాలను ఎడిటింగ్ చేయడంలో అబ్దుష్షకూర్ ఉమరి గారి సహకారం కూడా ఉన్నది. అల్‌బసీర్ గ్రాఫిక్స్ వారు ఈ పుస్తకమును నిర్ణీత సమయానికి ప్రచురించి మన ముందుకు తీసుకురావటానికి పూర్తి సహకారాలను అందించారు. అల్లాహ్ తఆలా అందరి కృషిని స్వీకరించు గాక. ఆమీన్

**డా॥ సయీద్ అహ్మద్ ఉమరీ, మదని**
మర్కజ్‌దారుల్‌బిర్ కార్య నిర్వాహకులు
జమియతె అహ్లె హదీస్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు.



## మొదటి ఖుత్బా

ఇన్నల్ హమ్దలిల్లాహి నహ్మదుహూ, వనస్తయీనుహూ, వనస్తగ్‌ఫిరుహూ, వనుమినుబిహి, వనతవక్కలు అలైహి, వనఊజుబిల్లాహి మిన్‌షురూరి అన్‌ఫుసినా, వమిన్ సయ్యిఆతి ఆమాలిన, మైయ్యహ్దిహిల్లాహు ఫలాముజిల్లలహు, వమైయ్యుజ్‌లిల్ ఫలాహాదియలహు, వఅష్‌హదుఅల్లాఇలాహ ఇల్లల్లాహు వఅష్‌హదుఅన్నముహమ్మదన్ అబ్దుహు వరసూలుహు, అమ్మాబాదు : ఫఇన్న ఖైరల్‌హదీసి కితాబుల్లాహి వఖైరల్ హద్‌యి హద్‌యు ముహమ్మదిన్ సల్లల్లాహు అలైహి వసల్లమా వషర్రల్ ఉమూరి ముహ్‌దసాతుహా, వకుల్ల ముహ్‌దసతిన్ బిద్‌అ, వకుల్ల బిద్‌అతిన్ జలాలహ, వకుల్ల జలాలతిన్ ఫిన్‌న్నార్.

## రెండవ ఖుత్బా

ఇన్నల్ హమ్దలిల్లాహి, నహ్మదుహూ, వనస్తయీనుహూ, వనస్తగ్‌ఫిరుహూ, వనుమినుబిహి వనతవక్కలు అలైహి, వనఊజుబిల్లాహి మిన్‌షురూరి అన్‌ఫుసినా, వమిన్ సయ్యిఆతి ఆమాలిన, మైయ్యహ్దిహిల్లాహు ఫలాముజిల్లలహు, వమైయ్యుజ్‌లిల్ ఫలాహాదియలహు, వఅష్‌హదుఅల్లాఇలాహ ఇల్లల్లాహు, వఅష్‌హదుఅన్న ముహమ్మదన్ అబ్దుహు వరసూలుహు, అమ్మాబాదు : ఫఖద్ ఖాలల్లాహు తఆలా "ఇన్నల్లాహ వమలాయికతహు యుసల్లూన అలన్నబియ్యి, యాఅయ్యుహల్లజీన ఆమనూ సల్లూ అలైహి వసల్లిమూ తస్‌లీమా : అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మదిన్, వఅలా ఆలిముహమ్మదిన్, కమా సల్లైత అలా ఇబ్రాహీమ, వ అలా ఆలి ఇబ్రాహీమ, ఇన్నక హమీదుమ్మ్మజీద్. అల్లాహుమ్మ బారిక్ అలా ముహమ్మదిన్, వ అలా ఆలి ముహమ్మదిన్, కమా బారక్‌త అలా ఇబ్రాహీమ వ అలా ఆలి ఇబ్రాహీమ ఇన్నక హమీదుమ్మ్మజీద్. వసల్లల్లాహు అలా జమీయిల్ అన్బియాయి వల్ ముర్సలీన్ వల్ మలాయికతిల్ ముఖర్రబీన్, వఅలస్సహాబతి అజ్మయీన్.

teluguislam.net



అల్లాహుమ్మక్తుబుస్సిత్‌ర వస్సలామత వల్ ఆఫియత అలైనా వఅలా అబీదికల్ హుజ్జాజి వల్‌గుజాతి వల్ ముసాఫిరీన ఫీ బర్రిక వ బహ్రిక మిన్ ఉమ్మతి ముహమ్మదిన్ సల్లల్లాహు అలైహి వసల్లమ, వజ్అల్‌నా మిన్హుమ్, వక్‌జుల్ మన్ ఆరజ అన్ దీని ముహమ్మదిన్, సల్లల్లాహు అలైహి వసల్లమ, వలా తజ్అల్‌నా మిన్హుమ్, ఆమీన్. ఇబాదల్లాహ్ రహిమకుముల్లాహ్ ఇన్నల్లాహ యామురు బిల్‌అద్లి వల్ ఇహ్సాన్, వ ఈతాయి జిల్ ఖుర్బా, వయన్హా అనిల్ ఫహ్‌షాయి వల్ మున్కరి వల్ బగ్‌యి, యఇజుకుమ్ లఅల్లక్కుమ్ తజక్కరూన్, ఉజ్‌కురుల్లాహ్ యజ్‌కుర్‌కుమ్, వద్‌ఊహు యస్తజిబ్‌లకుమ్, వలజిక్రుల్లాహి తఆలా, ఆలా, వ అవ్‌లా, అఅజ్జు, వఅక్బర్.



బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్

# 1. ఇస్లాం మౌలికాంశాలు

## ఇస్లాం మౌలికాంశాలు, మూలస్తంభాలు

ఇస్లాం అంటే అల్లాహ్‌ని ఆరాధించడం మరియు ఆయన అంతిమ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) పట్ల విధేయత కనబరచడం. అల్లాహ్ ఆజ్ఞాలను, ముహమ్మద్ ప్రవక్త ప్రవచనాలను శిరసావహించడం అని అర్థం. ఈమాన్ (విశ్వాసం) సంబంధం మనసుతో ఉంటే ఇస్లాం యొక్క సంబంధం బాహ్యాచరణలతో ముడిపడి ఉంది. ఈమాన్ మరియు ఇస్లాం ఈ రెండింటికి మధ్య గల సంబంధం దేహానికి, ఆత్మకు మధ్యగల సంబంధంలాంటిది. ఇస్లాం సమగ్రమైన దైవధర్మం.అల్లాహ్ సమ్మతించి, ఆమోదించిన సత్య బద్ధమైన జీవన విధానం. దీని గురించి అల్లాహ్ స్వయంగా ఇలా సెలవిచ్చారు:

اَلْيَوْمَ اَكْمَلْتُ لَكُمْ دِيْنَكُمْ وَاَتْمَمْتُ عَلَيْكُمْ نِعْمَتِيْ وَرَضِيْتُ لَكُمُ الْاِسْلَامَ دِيْنًا

**"నేను ఈ రోజు మీ కోసం మీ ధర్మాన్ని పరిపూర్ణం చేశాను. నా అనుగ్రహాలను మీపై పూర్తిగావించి మీ కోసం ఇస్లాంను మీ ధర్మంగా ఆమోదించాను." *(అల్‌మాయిదా 5 : 3)***

"ఇస్లాం" మాత్రమే అల్లాహ్ సన్నిధిలో ఆమోదించదగినది, స్వీకరించదగినది. సర్వమానవాళి శ్రేయస్సు, శాంతిసుఖములు ఇహపరల సాఫల్యం, విజయం, మోక్షం "ఇస్లాం ధర్మం" లోనే ఇమిడి ఉన్నాయి. ధర్మబద్ధమైన "ఇస్లాం" లేకుంటే సర్వం వృధా, వ్యర్థం. సర్వం నాశనం. దాని గురించే అల్లాహ్ ఇలా స్పష్టపరచాడు:

وَمَنْ يَّبْتَغِ غَيْرَ الْاِسْلَامِ دِيْنًا فَلَنْ يُّقْبَلَ مِنْهُ ۚ وَهُوَ فِي الْاٰخِرَةِ مِنَ الْخٰسِرِيْنَ ◯

**"ఎవడు ఇస్లాం ధర్మాన్ని కాదని వేరే ధర్మాన్ని (ఇస్లామేతర విధానాన్ని) అవలంబిస్తాడో అది ఎన్నటికిని అంగీకరించబడదు. అలాంటివాడు పరలోకంలో ఘోరంగా నష్టపోతాడు. *(అలి ఇమ్రాన్ 3 :85)***

teluguislam.net



ముహమ్మద్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: "ఇస్లాం ధర్మం" ఐదు మౌలికాంశాలపై ఆధారపడి ఉంది. అవి: (1) అల్లాహ్ తప్ప మరో నిజ ఆరాధ్యుడు లేడు, ముహమ్మద్ (స) ఆయన దాసుడు మరియు ప్రవక్త అని సాక్షమివ్వాలి. (2) నమాజ్ వ్యవస్థను నెలకొల్పాలి. (3) రమజాన్ నెల ఉపవాసాలు పాటించాలి. (4) జకాత్ (విధిదానం) చెల్లించాలి. (5) స్థోమత కలిగిన వారు హజ్ యాత్ర చేయాలి." (సహీహ్ బుఖారీ)

ఈ ఐదు మౌలికాంశాలనే "అర్కానె ఇస్లాం" అంటారు. ఇందులో మొదటి మౌలికాంశం కలిమా 'లా ఇలాహ ఇల్లాహు ముహమ్మదుర్రసూలుల్లాహ్'ను చదివిన ప్రతివారు రెండవ మౌలికాంశం అయిన నమాజ్‌ను తప్పనిసరిగా నెలకొల్పాలి. ప్రతిరోజు ఐదుపూటల (వేళల) నమాజ్‌ను చేయాలి. ఆయా వేళల్లో నమాజ్‌ను చేయాలి. నమాజ్‌కు ముందు శుచీశుభ్రత, అవసరముంటే కాలకృత్యాలు తీర్చుకోవడం, గుసుల్ (స్నానం) చేయడం, వుజూ చేయడం తప్పనిసరి. తహారత్ (శుచీశుభ్రత) కు పరిశుభ్రమైన నీళ్ళు అవసరం. ఒకవేళ నీళ్ళు లభ్యంలో లేకుంటే తయమ్ముమ్ చేసుకోవచ్చు. తయమ్ముమ్ అంటే రెండు చేతుల్ని శుభ్రమైన మట్టిపై కొట్టి చేతులు దులిపి ముఖాన్ని, చేతులనూ స్పర్శించుకోవటం, రుద్దుకోవడం. దైవ ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారు: **الطهور شطر الإيمان "అత్తుహూరు షత్రుల్ ఈమాన్"** శుచీశుభ్రత నొందడం విశ్వాసం(ఈమాన్)లో సగభాగం. తహారత్ పొందిన తరువాత ప్రార్థనాస్థలం, వస్త్రాలు పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్త పడాలి. నమాజ్ సమయం ఆసన్నమయిన తరువాత వుజూ చేసుకొని ఖిబ్లా (కాబాగృహం) వైపుకు మొహం త్రిప్పి "అల్లాహు అక్బర్" అంటూ నమాజును ప్రారంభించాలి.

ప్రియ మిత్రులారా! అర్కానె ఇస్లాంలో అతి ప్రధానమైన రెండవ అంశం నమాజ్. నమాజ్ ను స్థాపించాల్సిందిగా ఖుర్ఆన్ మజీద్ లో పదే పదే ఆదేశించడం జరిగింది. ప్రియప్రవక్త ముహమ్మద్(స)వారు నమాజ్‌కు సంబంధించి చెప్పిన విషయాన్ని శ్రద్ధగా విని అర్థం చేసుకోండి. నమాజ్ ఘనతా విశిష్టతల గురించి వివరిస్తూ దైవప్రవక్త (స): "మీలో ఎవరి ఇంటి ముందయినా సెలయేరు ప్రవహిస్తూ ఉందనుకోండి. అతను ఆ సెలయేరులో ప్రతిరోజు ఐదు సార్లు స్నానం చేస్తూ ఉంటే, అతని ఒంటి మీద మురికి మిగిలుంటుందా? అని ప్రశ్నించారు"



అందుకు సహచరులు "లేదు. అతని శరీరం మీద ఎలాంటి మురికి మిగిలి ఉండదు" అని బదులిచ్చారు. అప్పుడు దైవప్రవక్త (స) "ఐదు పూటల నమాజు సంగతి కూడా అంతే, అల్లాహ్ వాటి మూలంగా నమాజీల పాపాలను కడిగి వేస్తాడు" అని చెప్పారు ( సహీ బుఖారీ). ఏ ముస్లిం అయితే అల్లాహ్ విధిగా చేసిన నమాజ్‌ను తిరస్కరిస్తాడో (త్రోసిపుచ్చుతాడో) అతడు సత్యతిరస్కారి (కాఫిర్) అవుతాడు (అంటే నమాజ్‌ను తిరస్కరించేవాడు ముస్లింగా మిగిలుండడు). మరెవరైతే నమాజ్ పట్ల అశ్రద్ధ, అజాగ్రత్త, బద్ధకం కనబరుస్తారో అలాంటి వారి గురించి ఇలా తెలుపబడింది: **من ترك الصلاة متعمدا فقد كفر 'మన్ తరకస్సలాత ముతఅమ్మిదన్ ఫఖద్ కఫర"** "ఎవడైతే ఉద్దేశపూర్వకంగా నమాజ్‌ను వదిలివేస్తాడో వాడు అవిశ్వాసానికి పాల్పడినట్లే.

ఒక హదీసులో ఇలా తెలుపబడింది: "ఎవరయితే తమ నమాజులను స్థిరంగా పాటిస్తారో (కాపాడుకుంటారో) వారికి ప్రళయదినాన జ్యోతి (వెలుగు) మరియు విముక్తి ప్రాప్తమవుతుంది. మరెవరైతే వాటిని కాపాడుకోరో వారికి ఎలాంటి వెలుగు, విముక్తి మార్గం కాని ప్రళయదినాన ప్రాప్తించదు. అంతేగాక అలాంటి వారంతా ప్రళయదినాన ఖారూన్, ఫిర్ఔన్, హామాన్, ఉబైయ్ బిన్ ఖల్ఫ్‌లాంటి ధిక్కారులతో ఉంటారు. (ముస్నద్ అహ్మద్)

నమాజ్ స్త్రీ, పురుషులిరువురిపై విధిగా ఉంది. కాని స్త్రీలు హైజ్ (బహిష్టు) మరియు నిఫాస్ (పురిటి రక్తస్రావం) పరిస్థితుల్లో నమాజ్ చేయకూడదని షరీఅత్ ఆదేశించింది. పరిశుద్ధకాలంలోనే స్త్రీలు నమాజ్ చేయాలి. ఎందుకంటే బహిష్టు కాలంలో స్త్రీలు నమాజ్ చేయటం నిషిద్ధం. దైవప్రవక్త ముహమ్మద్(స) తనకు ఇలా ఉపదేశించారని ఆయన సతీమణి ఆయిషా (రజి.అన్హా) ఇలా తెలియజేశారు: బహిష్టు కాలం మొదలవగానే నమాజ్ చేయటం ఆపు. తర్వాత ఆ కాలం పూర్తవగానే శరీరానికి అంటుకున్న బహిష్టు రక్తాన్ని కడుక్కొని, తలంటు స్నానం (గుసుల్) చేసి తిరిగి నమాజ్ చేయటం మొదలు పెట్టు". (.......)

ప్రియ సోదరులారా! ఇప్పుడు చెప్పే విషయాన్ని కూడా బాగా గుర్తుంచుకోవాలి. "దైవప్రవక్త ముహమ్మద్(స) ఇలా ఉపదేశించారు: **صلوا كما رأيتموني أصلي "సల్లూ కమా రఐతుమూని ఉసల్లి.** మీరు నన్ను ఏవిధంగా నమాజ్ (చేస్తుండగా) చూశారో, ఆ విధంగానే నమాజ్ చేయండి" (సహీహ్ బుఖారీ).

teluguislam.net



దైవప్రవక్త (స) తన సహచరులకు ఏవిధంగా నమాజ్ నేర్పించారో, సహాబాలు ఎలా నేర్చుకొని ఇతరులకు నేర్పించారో ఆ మస్నూన్ (దైవప్రవక్త విధానం) పద్ధతిలోనే నమాజ్ చేయాలి. సహీ బుఖారీ, సహీ ముస్లిం, సుననె అబూదావూద్ లాంటి హదీసు పుస్తకాల్లో నమాజ్ వివరణ గురించి స్పష్టంగా తెలుపబడింది.

ఇక ఇస్లాం ధర్మ మూడవ మౌలికాంశం రమజాను నెలలో ఉపవాసాలు పాటించడం. ఉపవాసం (రోజా) ఓ గొప్ప పుణ్య కార్యం. తన నిజదైవం అల్లాహ్ విధించిన ఈ ఆజ్ఞను శిరసావహించటానికి ఒక ముస్లిం పగలంతా అన్నపానియాలను మానుకుంటాడు. ధర్మ సమ్మతమైన లైంగిక వాంఛలను త్యజిస్తాడు. ఒక హదీసె ఖుద్సీలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: الصَّوْمُ لِي وَأَنَا أَجْزِي بِهِ "**అస్సౌము లీ వ అనా అజ్జీ బిహి** "ఉపవాసం నాది. స్వయంగా నేనే దానికి ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాను". *(సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం)*

మరో హదీసులో దైవ ప్రవక్త ముహమ్మద్ (స) ఈవిధంగా ప్రవచించారు: "ఎవరయితే అల్లాహ్‌పై సంపూర్ణ విశ్వాసంతో, పుణ్యాన్ని ఆశిస్తూ రమజాన్ నెల ఉపవాసాలు పాటిస్తారో వారి వెనకటి పాపాలన్నీ మన్నించబడతాయి.

*(ముస్నద్ అహ్మద్, సునన్ అబూదావూద్)*

ఇక నాల్గవ ప్రాథమిక విధి జకాత్ (విధిదానం) చెల్లించడం. జకాత్‌కు సంబంధించిన మూలధన పరిమితికి యజమాని అయిన ప్రతి ముస్లింపై "జకాత్ చెల్లింపు" విధిగా నిర్ణయించబడింది. ప్రాథమిక, నిత్యావసర వస్తువులను మినహాయించి కొన్ని ప్రత్యేక వస్తువులపై పూర్తిగా ఒక సంవత్సరం గడిచిన తరువాత జకాత్‌గా చెల్లించడం విధి. జకాత్ విధింపుకై బంగారం లేక బంగారు ఆభరణాల పరిమితి ఏడున్నర తులాలు అంటే 85 గ్రాములు. అదేవిధంగా వెండి పరిమాణం 595 గ్రాములు అంటే సుమారు $52^1/_2$ తులాలు..నగదుపై వాటికి $2^1/_2$ శాతం చొప్పున జకాత్ చెల్లించాల్సి ఉంటుంది. అలాగే వ్యవసాయ ఉత్పత్తులపై, జంతువులపై కూడా జకాత్ ఉంటుంది. ఖుర్ఆన్ మజీద్‌లో అనేక చోట్ల "నమాజ్ వ్యవస్థను నెలకొల్పండి మరియు జకాత్ (విధిదానం) ను చెల్లించండి" అని నమాజ్‌తో పాటు జకాత్ గురించి ప్రస్తావిస్తూ ఒకేసారి ఆదేశించడం జరిగింది. ఎందుకంటే నమాజ్ ద్వారా మనిషి అంతర్యం పరిశుద్ధమవుతుంది. అందుకనే ఇస్లాంలో నమాజ్ జకాత్‌లకు చాలా ప్రాముఖ్యతా, ప్రాధాన్యతా కలదు.



కేవలం జకాత్ ద్వారానే ఇస్లామీయ ఆదేశాలు అంబరాలను తాకే అభివృద్ధిని సాధించాయి. సామూహిక జకాత్ వ్యవస్థ ద్వారానే అవి ప్రపంచ దేశాలను సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి. ఎప్పుడైతే ముస్లింల సామూహిక జకాత్ చెల్లింపు వ్యవస్థ చతికిలపడిపోయిందో (క్షీణించిపోయిందో) వారిలోని వైభవం, గౌరవం, పురోగమనం కూడా కుంటుపడి పోయింది. నేటి ముస్లిం సోదరులు స్తోమత ఉండి కూడా జకాత్ చెల్లించడం లేదు. అంతేకాక బంగారం, వెండి (ఆభరణాలను)ని ప్రోగుచేస్తూ గర్వంతో విర్రవీగుతున్నారు. అలాంటి వారికి బాధకరమైన శిక్ష గలదనే వార్తను వినిపించుము. ప్రళయదినాన ఆ ధనమును నరకాగ్నిలో కాల్చి దానితో వారి నుదుళ్ళ మీద, వారి ప్రక్కల మీద, వారి వీపుల మీద వాతలు వేయబడుతాయి అప్పుడు వారితో ఇలా అనబడుతుంది:

هَٰذَا مَا كَنَزْتُمْ لِأَنفُسِكُمْ فَذُوقُوا مَا كُنتُمْ تَكْنِزُونَ ○

**ఓ విశ్వసించినవారలారా! పండితుల(అహ్‌బర్)లలో సన్యాసుల (రుహ్‌బాన్) లలో చాలామంది అక్రమంగా ప్రజల సొమ్ములను స్వాహా చేస్తున్నారు. వారిని అల్లాహ్ మార్గం నుంచి ఆపుతున్నారు.ఎవరు వెండీ బంగారాలను పోగుచేస్తూ వాటిని దైవమార్గంలో ఖర్చుపెట్టడంలేదో వారికి బాధాకరమైన శిక్ష ఉందన్న శుభవార్తను వినిపించు. ఏ రోజున ఈ ఖజానాను నరకాగ్నిలో కాల్చి దాంతోవారి నొసటిపై పార్శ్వాలపై, వీపులపై వాతలు వేయడం జరుగుతుందో అప్పుడు "ఇది మీరు మీ కోసం సమీకరించినది కాబట్టి ఇప్పుడు మీ ఖజానా రుచి చూడండి" (అని వారితో అనబడుతుంది.)** ***(అత్ తౌబా 9 :34,35)***

ఇక ఇస్లాం ధర్మ ఐదవ మూలస్తంభం హజ్ విధి గురించి అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

وَلِلَّهِ عَلَى النَّاسِ حِجُّ الْبَيْتِ مَنِ اسْتَطَاعَ إِلَيْهِ سَبِيلًا

**"ప్రజలపై అల్లాహ్‌కు ఉన్న హక్కు ఏమిటంటే, కాబా గృహానికి వెళ్ళే శక్తిగల వారు దాని హజ్‌ను విధిగా చెయ్యాలి."** ***(ఆలి ఇమ్రాన్ 3 : 97)***

ప్రతీ ముస్లిం యొక్క పూర్తి జీవితంలో అత్యంత శ్రేష్ఠమైన ఆచరణ హజ్ యాత్ర చేయడం. దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: "స్వీకార యోగ్యమైన హజ్‌కు స్వర్గమే ప్రతిఫలం: *(సహీహ్ బుఖారీ)*

teluguislam.net



మహాశయులారా! ఇస్లాం అనే ఈ పటిష్టమైన భవనం ఈ ఐదు మూల స్తంభాలపై ఆధారపడి ఉంది. ఈ పుణ్యకార్యాలే కాకుండా ఇస్లాంలో మరెన్నో సత్కర్మలు, సదాచరణలు, పుణ్యకార్యాలు ఉన్నాయి. ఉదాహరణకు దైవప్రవక్త (స) గారి ప్రవచనాన్ని వినండి: **اَلْمُسْلِمُ مَنْ سَلِمَ الْمُسْلِمُونَ مِنْ لِسَانِهِ وَيَدِهِ "అల్‌ముస్లిము మన్ సలిమల్ ముస్లిమూన మిన్‌లిసానిహి వ యదిహి".** (సహీహ్ బుఖారీ)

తోటి ముస్లింలు తన మాటల మరియు చేతుల నుండి సురక్షితంగా ఉంటే అతడే నిజమైన (విశ్వాసి) ముస్లిం. అంటే ఒక ముస్లిం తన మాటలతో ఇతర ముస్లింలపై బాణాలు ఎక్కుపెట్టడు. అలాగే తన చేత్తో ఇతరులకు కీడు తలపెట్టడు. ఈ లక్షణాలకు భిన్నంగా ప్రవర్తించే వ్యక్తి 'ముస్లిం' అని పిలుపించుకోవడానికి అనర్హుడు. ఎందుకంటే ఇస్లాం అంటేనే ఇతరుల శ్రేయస్సు ఆశించడం. ఇతరుల మేలు కోరడం. జగతిలో సయోధ్య, శాంతి, శ్రేయస్సులను నెలకొల్పేవాడే నిజమైన ముస్లిం.

**ప్రియసోదరులారా!**

'మానవులంతా ఒక్కటే' మానవులంతా సమానులే-మానవులంతా సోదరులే-అనే గొప్ప సందేశాన్నిస్తుంది ఇస్లాం. హెచ్చుతగ్గులు, నిమ్నోన్నతా భేదభవాలు లేవు. ధనిక,బీద తారతమ్యాలు లేవు. అల్లాహ్ ఇలా తెలుపుతున్నాడు:

يَا أَيُّهَا النَّاسُ إِنَّا خَلَقْنَاكُمْ مِنْ ذَكَرٍ وَأُنْثَىٰ وَجَعَلْنَاكُمْ شُعُوبًا وَقَبَائِلَ لِتَعَارَفُوا ۚ
إِنَّ أَكْرَمَكُمْ عِنْدَ اللَّهِ أَتْقَاكُمْ ۚ إِنَّ اللَّهَ عَلِيمٌ خَبِيرٌ ○

**"ఓ మానవులారా! మేము మిమ్మల్ని ఒకే స్త్రీ పురుషుల జంట ద్వారా పుట్టించాము. ఆ తరువాత మీ పరస్పర పరిచయ సౌలభ్యం కోసం మిమ్మల్ని జాతులుగా, తెగలుగా చేశాము. నిజానికి మీలో అత్యధికంగా దైవభీతి కలవాడే అల్లాహ్ సన్నిధిలో అమితంగా ఆదరణీయుడు.**

***(అల్ హుజురాత్ 49 :13)***

ఈ విశిష్ట ప్రాతిపదికపై ఇస్లామీయ చరిత్రలో నెలకొన్న ఎన్నో సంఘటనలు సర్వమానవాళికి మార్గదర్శకత్వం వహిస్తున్నాయి. హజ్రత్ బిలాల్ (రజి) ఒక నీగ్రో బానిస. కాని అతని గౌరవోన్నతులు విశ్వాస మాధుర్యాన్ని ఆస్వాదించలేకపోయిన ఎందరో ఖురైషుల కంటే చాలా ఉన్నతం. హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) తమ



**సొంత సొమ్ముతో** అతన్ని కొని బానిసత్వం నుండి విముక్తి కలిగించారు. అయినప్పటికీ స్వయంగా బిలాల్ (రజి) ను 'సయ్యదునా సయ్యిదునా' ఓమా నాయకుడా! ఓమా నాయకుడా! అని పిలిచేవారు.

**మహాశయులారా!**

జులైబీబ్ (రజి)[1] సంఘటనను బహుశా మీరు వినే ఉంటారు. ఆయన ఒక నల్లని పెళ్ళి కాని నవయువకుడు. పెండ్లి చేసుకోవాలన్న కోరికను ప్రవక్త(స) ముందు వెలిబుచ్చారు. దైవ ప్రవక్త(స) ఆ నల్లని యువకుణ్ణి ఒక అరబ్బు శ్రీమంతుని ఇంటికి పంపిస్తూ, అతని కుమార్తెను ఆ యువకునికిచ్చి వివాహం చేయమన్నారు. ఈ వివాహసందేశం గురించి విని ఆ అరబ్బు భార్య నొచ్చుకున్నది. అయితే ఈ వివాహ సందేశం పంపించినవారు దైవప్రవక్త (స) అని తెలుసుకున్న ఆమె కూతురు సంతోషంగా ఆ యువకుణ్ణి పెండ్లాడటానికి ముందుకువచ్చింది. పైగా అల్లాహ్ ప్రసన్నతను, దైవప్రవక్త సంతోషాన్ని కోరి ఈ సంబంధానికి ఒప్పుకుంటున్నానని ప్రకటించింది ఆ ఇస్లాం ముద్దుబిడ్డ.

**ప్రియ సోదరులారా, మిత్రులారా!**

ఇస్లాం అల్లాహ్ ప్రసాదించిన గొప్ప అనుగ్రహం. ఇది మానవ జీవితానికి సంబంధించిన అన్ని రంగాల్లోనూ మానవులకు పరిపూర్ణమైన మార్గదర్శకత్వాన్ని అందజేస్తుంది. ఈ ధర్మం నిఖిల జగతికి మహదానుగ్రహం. మహావరం ఉన్నత నైతిక విలువలకు పెద్దపీట వేసిన ధర్మమిది. మనిషి బాహ్యంతో పాటు ఆంతర్యాన్ని శుద్ధి చేసే ధర్మమిది. అల్లాహ్ మనందరికి ఇస్లాం ధర్మాన్ని అర్థం చేసుకొని, దానిప్రకారం ఆచరించే భాగ్యాన్ని ప్రసాదించుగాక. ఓ ఆరాధ్యదైవమా! ప్రతీ ముస్లింను సంపూర్ణ ముస్లింగా సంస్కరించు. ఇస్లాం ద్వారా మాకు గౌరవాన్ని, విలువను ప్రసాదించు, ముస్లింలందరికి ఇహపరలోకాల్లో నిజవిజయాన్ని, సాఫల్యాన్ని ప్రసాదించు. ఆమీన్.

**రబ్బనా తఖబ్బల్ మిన్నా ఇన్నక అన్తస్ సమీఉల్ అలీమ్.**

---

1. మూలంలో సాద్ అస్వద్ పేరు ఉంది

teluguislam.net



# 2. మంచిని పెంచండి చెడును నిర్మూలించండి

సకల లోకాల సృష్టికర్త, పాలకుడు, పోషకుడు, యజమాని అయిన అల్లాహ్ ఖుర్ఆన్‌లో ఇలా సెలవిస్తున్నాడు:

وَلْتَكُن مِّنكُمْ أُمَّةٌ يَدْعُونَ إِلَى الْخَيْرِ وَيَأْمُرُونَ بِالْمَعْرُوفِ وَيَنْهَوْنَ عَنِ الْمُنكَرِ ۚ وَأُولَٰئِكَ هُمُ الْمُفْلِحُونَ

**"మీలో ఒక వర్గం ప్రజల్ని మంచి వైపుకు పిలిచేవారు, సత్కార్యాలు చేయమని ఆజ్ఞాపించేవారు, చెడు నుండి వారించే వారు తప్పకుండా ఉండాలి. అలాంటి వారే (ఇహపరలోకాల్లో) సాఫల్యం పొందేవారు".**

***(ఆలి ఇమ్రాన్ 3:104)***

**ప్రియ ముస్లిం సోదరులారా..!**

ఈనాటి ప్రసంగంలో మనం మంచిని పెంపొందిచటం, చెడులను నిర్మూలించటం గురించి తెలుసుకుందాం. ఒకరి గురించి నీకెందుకు, మంచి చేసిన వారికి మంచి జరుగుతుంది, చెడు చేసిన వారికి చెడు జరుగుతుంది. ఎవరి కర్మకు వారు బాధ్యులు అని కొందరు సందేశకర్తలతో అంటుంటారు. ఇలా అనకూడదు. ఇది చాలా తప్పు. ఇలాంటి బృహత్తర కార్యసాధనలో ఒక వర్గం నిత్యం నిమగ్నమై ఉండాలని అల్లాహ్ తాకీదు చేశాడు. అలాంటప్పుడు ఒకరి గురించి నీ కెందుకు? అని భావించడం శుద్ధ అవివేకం. మంచిని పెంపొందిస్తూ, చెడుల నుండి వారిస్తూ ప్రజల సంస్కరణకై కష్టపడటం ప్రతి ముస్లిం విధ్యుక్త ధర్మం. ఈ విషయాన్ని తెలుపుతూ అంతిమ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు: "మీలో ప్రతి ఒక్కరూ బాధ్యత కలవారే, తమ ఆధీనంలో ఉన్నవారి గురించి ప్రతి ఒక్కరూ (అల్లాహ్ సన్నిధిలో) ప్రశ్నించబడతారు. పాలకుడు పాలితుల విషయంలో



బాధ్యుడు. అతడు వారి విషయంలో నిలదీయబడతాడు. అలాగే పురుషుడు తన ఇంటి వారి (సంరక్షణకు) బాధ్యుడు. స్త్రీ తన భర్త ఇంటికి, అతని పిల్లల (ఆలనా పాలన)కు బాధ్యురాలు, సేవకుడు తన యజమానికి, అతని ఆస్తికి బాధ్యుడు. కనుక మీలో ప్రతి ఒక్కరూ బాధ్యత గల మనిషే. మనందరిని మన బాధ్యతల గురించి అల్లాహ్ సమక్షంలో ప్రశ్నించడం జరుగుతుంది".

(సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం)

సత్య ధర్మ ప్రచారంలో మంచిని చేయమని ఆదేశించడం, చెడును నిర్మూలించడం ప్రతి ముస్లిం పై విధిగా పరిగణించబడింది. ఈ బాధ్యత ఇంటి నుండి ఆరంభమవుతుంది. ఇంట్లో ఒక వేళ భర్త, బిడ్డలను అదుపులో వుంచినట్లయితే ఆ ఇల్లు శాంతి నిలయమవుతుంది. ఒక వేళ స్త్రీ తన సంతానం, భర్త సంపాదన ఆస్తి పాస్తుల పట్ల జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉన్నట్లయితే ప్రతి నష్టం నుండి కుటుంబాన్ని కాపాడవచ్చు. స్త్రీ పురుషులిద్దరూ ఇలా అన్యోన్యంగా తమ బాధ్యతలను నిర్వహిస్తే సంతానంపై ఎలాంటి దుష్ప్రభావం పడదు. కాబట్టి ముస్లిం తమ బంధు, మిత్రులకు, ఆప్తులకు సత్కార్యాల గురించి ఆజ్ఞాపించడం, చెడు నుంచి వారించడం చేస్తూ సమాజ సంస్కరణలో తన వంతు పాత్రను బాధ్యతయుతంగా పోషించాలి. ఒక వేళ బద్ధకం చూపినట్లయితే ప్రళయ దినాన అల్లాహ్ సన్నిధిలో జవాబు చెప్పవలసి వుంటుంది. **అబూ సయీద్ ఖుద్రీ (రజి) కథనం ప్రకారం సత్య దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ఉపదేశించారు: "మీలో ఎవరైనా చెడు జరుగుతుండటం చూస్తే (ముందు) దాన్ని చేతితో ఆపటానికి ప్రయత్నించాలి, అలా ఆపే శక్తి లేకపోతే నోటితోనైనా దాన్ని వారించాలి, ఆ శక్తి కూడా లేకపోతే (కనీసం) మనసులోనైనా దానిని చెడుగా భావించాలి. ఇది అతి బలహీన విశ్వాసానికి నిదర్శనం".** (సహీహ్ ముస్లిం). అంటే ఇది ఈమాన్ (విశ్వాసం) యొక్క అధమాతి అధమ దశ. వేరొక హదీసు ప్రకారం ఎవరయినా సరే షరీఅతుకు విరుద్ధమైన చేష్టలను కనీసం మనసులో నయినా చెడుగా భావించకపోతే ఇక ఆ వ్యక్తిలో ఆవగింజంత విశ్వాసం కూడా లేనట్లే. ఇక విరోధులతో సావాసం చేయకూడదు. సాధ్యమైనంత వరకు వారికి దూరంగా మసలుకోవాలి.

ఈ హదీసు ప్రకారం చెడుపని ముమ్మాటికి చెడే. దాన్ని శాయశక్తులా నిర్మూలించేందుకు కృషి చేయటం ఒక ముస్లిం కర్తవ్యం. ముందు చేత్తో ఆపేందుకు

teluguislam.net



యత్నించాలి. సాధ్యం కాకపోతే నోటితో వారించాలి. దానికి కూడా పరిస్థితులు అనుకూలించకపోతే మనసులోనైనా ఆ దుర్మార్గాన్ని అసహ్యించుకోవాలి.

మరో హదీసులో హజ్రత్ ఇబ్నె మసవూద్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "నాకు పూర్వం పంపబడిన ప్రతి ప్రవక్తకూ అతని సమాజంలో అతనికి కొంతమంది అనుచరులు సహచరులు ఉండేవారు. వారు ఆ ప్రవక్త సాంప్రదాయాన్ని ఆచరించేవారు. ఆయన ఆజ్ఞానుసారం నడచుకునే వారు. ఆ తరువాత కాలక్రమంలో కొందరు అసమర్థులు పుడతారు. వీళ్ళు (ఎలాంటి వారంటే) స్వయంగా ఆచరించకుండా (ప్రజలకు నీతులు) బోధిస్తుంటారు. (సహీహ్ ముస్లిం)

సమాజంలో తప్పు జరిగితే వెంటనే దానిని నిర్మూలించడానికి ప్రయత్నించాలి. అన్యాయానికి ఆదిలోనే అడ్డుకట్టు వేయాలి. ప్రతి ముస్లిం తన శక్తి మేరకు సమాజంలో పడగవిప్పే నైతిక రుగ్మతలను నిర్మూలించడానికి తప్పనిసరిగా కృషిచేయాలి. ఆ కృషి అతని విశ్వాసానికి ప్రమాణం. చెడును ఆదిలోనే అంతమొందించే శక్తి లేకుంటే కనీసం మనసులోనైనా దాన్ని చెడుగా భావించాలి. ఇది అతని విశ్వాసానికి (ఈమాన్)కు నిదర్శనం. చెడును చూస్తూ కూడా మనసులో చెడుగా భావించటం లేదంటే ఇక అతను విశ్వాసపు అత్యంత బలహీన స్థాయి కంటే దిగజారిపోయాడని అర్థం.

సూరె హూద్‌లో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

وَلَا تَرْكَنُوْٓا اِلَى الَّذِيْنَ ظَلَمُوْا فَتَمَسَّكُمُ النَّارُ ۙ وَمَا لَكُمْ مِّنْ دُوْنِ اللّٰهِ
مِنْ اَوْلِيَآءَ ثُمَّ لَا تُنْصَرُوْنَ ۝

**"దుర్మార్గుల వైపు మొగ్గకండి, అలా చేస్తే నరకాగ్నికి సమిధులై పోతారు. ఆ తరువాత అల్లాహ్ తప్ప మరెవ్వరూ మీకు సంరక్షులుండరు, అప్పుడు మీకు ఎవరి సహాయం లభించదు"? *(హూద్ 11 : 113)***

**గౌరవ సోదరులారా...!**

మంచిని గురించి ఆజ్ఞాపించటం, చెడును నిర్మూలించటం లాంటి మహత్తర కార్యాన్ని విస్మరించడం వల్లే బనీ-ఇస్రాయీల్ పతనమైపోయి, సర్వనాశనమై పోయారు. ఆ విషయాన్ని దైవప్రవక్త (సలల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలిపారు:



అబ్దుల్లాహ్ బిన్ మస్వూద్ (రజిఅల్లాహు అన్హు) కథనం: దైవప్రవక్త సల్లల్లాహు **అలైహి** వ సల్లం ఇలా తెలిపారు: "ఇస్రాయీల్ జాతిలో అన్నిటికంటే ముందు పొడ చూపిన అపమార్గం ఏమిటంటే వారిలో ఒక వ్యక్తి మరొక వ్యక్తితో "అయ్యా! మీరు **అల్లాహ్**కు భయపడండి. మీరు చేస్తున్న చెడు పనిని వదిలివేయండి. అది మీకు సమ్మతం కాదు అని అంటాడు. కాని మరుసటిరోజు ఆ వ్యక్తి అదే స్థితిలో ఉన్నప్పటికీ అతను నిస్సంకోచంగా ఆ వ్యక్తితో కలిసి కూర్చొని తింటాడు, త్రాగుతాడు. అతనితో కూర్చుని కాలక్షేపం చేస్తాడు. (వాస్తవానికి ఎదుటి వ్యక్తి తన పద్ధతిని మార్చుకోనంత వరకూ అతనికి దూరంగా ఉండవలసింది.) కాని అతను అలా చేయలేదు. ఇస్రాయీల్ జాతి ధోరణి ఇలాగే వుండేది. వారు అలా చేసినందుకు వారందరి హృదయాలను ఒకేలా మార్చివేశాడు అల్లాహ్. అంటే పాపాత్ముల సహచర్యం వల్ల సజ్జనుల హృదయాలు కూడా కలుషితం అయిపోయాయి.

తరువాత దైవ ప్రవక్త (స) పవిత్ర ఖుర్ఆన్‌లోని ఈ ఆయతులను పఠించారు:

لُعِنَ الَّذِيْنَ كَفَرُوْا مِنْۢ بَنِيْٓ اِسْرَآءِيْلَ عَلٰى لِسَانِ دَاوٗدَ وَعِيْسَى ابْنِ مَرْيَمَ ۭ
ذٰلِكَ بِمَا عَصَوْا وَّكَانُوْا يَعْتَدُوْنَ ۝

**"ఇస్రాయీల్ సంతతి వారిలో అవిశ్వాస మార్గాన్ని అవలంబించిన వారిని దావూద్ నోట, మర్యమ్ కుమారుడైన మసీహ్ నోట శపించడం జరిగింది". *(అల్ మాయిద: 78)***

ఎందుకంటే వారు అవిధేయులయ్యారు. అత్యాచారాలు చేయసాగారు. చెడుపనులు చేయకుండా వారు ఒకరినొకరు నిరోధించడం మానివేశారు. వారు అవలంబించిన మార్గం చాలా చెడ్డది. ఈనాడు నీవు వారిలో చాలా ఎక్కువ మందిని (విశ్వాసానికి ప్రతి కూలంగా) అవిశ్వాసులను బలపరిచే వారిగా, వారితో మైత్రి చేసేవారుగా చూస్తావు. నిశ్చయంగా వారి మనస్సులు వారి కోసం తయారు చేసి పెట్టిన ముగింపు చెడ్డది. ఈ కారణంగా అల్లాహ్ వారిపై ఆగ్రహించాడు. వారు శాశ్వత శిక్షకు గురవుతారు. వారు నిజంగానే అల్లాహ్‌ను, ప్రవక్తను, ప్రవక్తపై అవతరించిన ఖుర్ఆన్‌ను విశ్వసించేవారే అయితే (విశ్వాసులకు ప్రతికూలంగా) అవిశ్వాసులను ఎన్నటికీ మిత్రులుగా చేసుకొని ఉండేవారు కాదు. కాని వారిలో చాలా మంది అల్లాహ్ పట్ల విధేయతకు దూరమైపోయారు.

teluguislam.net



ఈ సూక్తి పఠించిన తరువాత ఆయన(సఅస) ఇలా అన్నారు: “లేదు లేదు మీరు తప్పకుండా మంచి గురించి ఆదేశించవలసిందే. చెడు నుండి వారించవలసిందే. మీరు తప్పకుండా అన్యాయం చేసే వాడిని చెయ్యిపట్టి ఆపండి. బలవంతముగానైనా సరే అతడిని న్యాయం వైపుకు మరల్చండి. సత్యాన్ని (అంగీకరించేటట్లు) అతనిపై ఒత్తిడి తీసుకురండి. లేకపోతే అల్లాహ్ మీ అందరి హృదయాలను ఒకేలా మార్చివేస్తాడు. వారిని శపించినట్లుగానే మిమ్మల్ని శపిస్తాడు.

(సుననె అబూదావూద్, సుననె తిర్మిజీ)

మంచి వారు చెడ్డవారితో కలసిపోవడం వలన అల్లాహ్ ఇస్రాయీల్ జాతిని శపించాడు. కాబట్టి అన్నింటికన్నా ముందు చెడ్డ వారిలో మార్పు కోసం, సంస్కరణ కోసం కృషి చేయటం విశ్వాసానికి(ఈమాన్‌కు) నిదర్శనం. కాబట్టి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన అనుచర సంఘాన్ని హెచ్చరించారు. “చెడ్డవారితో కూర్చుంటే చెడ్డవారైపోతారు”.

**మహాశయులారా!**

విచారకరమైన విషయం ఏమిటంటే హదీసులో తెలుపబడిన విధంగానే నేటి మన ముస్లిం సమాజం పరిస్థితి మారిపోయింది. బనీ–ఇస్రాయీల్‌లా చెడును చూసి భయపడే రోజులు దాపురించాయి. అంతేకాక వారితో సత్సంబంధాలు, స్నేహాలు కూడా వుంటున్నాయి. అందువల్లే ముస్లింల హృదయాలు నల్లబడిపోయాయి. ఈ ఉమ్మత్ (సమాజం)లో షిర్క్ (బహుదైవారాధన), నవీన పోకడలు (బిద్అత్), మద్యపానం, జూదం, వ్యభిచారం, దోపిడి, అన్యాయాలు విపరీతంగా పెరిగి పోతున్నాయి. సమాధుల పూజలు ఎంత విస్తృత స్థాయికి చేరాయంటే బహిరంగంగా దైవ దాసులు సమాధులకు సజ్దా చేస్తున్నారు. మజార్, దర్గాల ప్రదక్షిణలు (తవాఫ్) చేస్తున్నారు. ప్రఖ్యాతి గాంచిన మత పండితులు పెద్దలు ఈ వింత దృశ్యాలను కళ్ళారా చూస్తున్నారు కాని వారికి మాత్రం రోషం రావటం లేదు. బహిరంగంగా స్త్రీ పురుషుల కలయికలు, అశ్లీలతకు మారుపేరైన క్లబ్బు డాన్సులు, బ్లూ(నీలి) చిత్రాలు వరదలై పారుతున్నాయి. ఆ వరదల్లో నైతిక విలువలు కొట్టుకుపోతున్నాయి. ముస్లిం స్త్రీలు బురఖాలు వేసుకుని మరీ సినిమాకు వెళ్తున్నారు. వీటన్నింటినీ మనం నిత్య జీవితంలో చూస్తునే వుంటాం. కాని వారించటానికి ఏ మాత్రం ప్రయత్నం



జరగటం లేదు. జరిగినా పూర్తిస్థాయిలో జగగటం లేదు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రతి ముస్లిం నడుం బిగించి మంచిని ప్రచారం చేస్తూ, సత్కార్యాల గురించి ఆదేశించాలి. చెడును కూకటి వ్రేళ్ళతో పెకలించివేయడానికి ప్రయత్నించాలి. ఈ కార్యక్రమంలో శతవిధాల కృషి చేయాలి. నిర్విరామంగా చెడుకు వ్యతిరేకంగా **పోరాటం జరపాలి.**

**హుజైఫా** (రజిఅల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త ముహమ్మద్(స) **ఇలా తాకీదు** చేశారు: మీరు మంచిని తప్పకుండా ఆజ్ఞాపించండి, చెడు నుండి వారించండి. లేకపోతే త్వరలోనే మీపై అల్లాహ్ తరపునుండి ఏదైనా శిక్ష అవతరించవచ్చు. ఇక ఆ తరువాత మీరు ఎంత దుఆ చేసినా (ప్రార్థించినా) మీ ప్రార్థనలు అంగీకరించబడవు (సుననె తిర్మిజీ).

సహీహ్ బుఖారీ గ్రంథంలో మాఖల్ బిన్ యసార్ (రజి) కథనం ప్రకారం **దైవప్రవక్త (సల్లల్లాహు** అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: “ఏ దాసుడైనా సరే **అల్లాహ్** అతనికి కొందరిపై అధికారాన్ని అనుగ్రహించగా అతను మంచిని పెంచమని, చెడును నిర్మూలించమని హితబోధన చేస్తూ ఉండకపోతే అతడు స్వర్గ సువాసన కూడా పొందలేడు”.

**ముస్లిం సహోదరులారా! సభ్యసమాజ ప్రముఖులారా!!**

ఈ హదీసును కూడా శ్రద్ధగా వినండి: ప్రియ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: “అల్లాహ్ హద్దులకు లోబడి నడుచుకునే **వార్ళు, వాటిని అతిక్రమించేవారి ఉదాహరణ** ఎటువంటిదంటే కొంత మంది ప్రయా**ణికులు** (ఒక నావలో క్రింది భాగంలోను, పై భాగంలోనూ ప్రయాణిస్తున్నారు) **నావ సముద్రంలో** ప్రయాణిస్తున్నప్పుడు క్రింది భాగంలో ఉన్నవారికి నీరు అవసరమై పై భాగానికి రావలసి వచ్చేది. వారి రాక పైభాగాన ఉన్న వారికి ఇబ్బంది కలిగించేది. దానిని గమనించిన క్రింద వారు పైకెళ్ళి వారికి ఇబ్బంది కలిగించడం కన్నా నావ క్రింది రంధ్రం చేసుకుంటే నీటికి ఎలాంటి ఆటంకం ఉండదని భావించారు. వారి ఆలోచనను పైభాగంలో ఉన్నవారు గమనించి వారిని నావలో రంధ్రం చేయకుండా ఆపగలిగితే అందరు క్షేమంగా వుంటారు. లేదా వారితో పాటు వీరు కూడా మునిగిపోతారు (సహీహ్ బుఖారీ).

teluguislam.net



ఒక వేళ మనం చెడు పనుల నుండి చెడ్డవారిని వారిస్తే వారితో పాటు మన మందరం చెడుల నుండి, ఆపదల నుండి బయట పడతాం లేకుంటే దైవ శిక్ష ఆ చెడు పర్యవసానంగా మనందరిపై విరుచుకుపడుతుంది. స్వేచ్ఛ పేరిట నేడు అశ్లీలం మూడు పువ్వులు ఆరు కాయలుగా పరిఢవిల్లుతోంది. బహుదైవారాధన, దురాచారాల గురించి నేడు పల్లెత్తు మాట అనేవారు కరువైపోతున్నారు. మద్యపానం, జూదం, వ్యభిచారం దినదిన ప్రవర్ధమానమవుతున్నాయి. సమాజంలో అన్యాయం, అత్యాచారం పెచ్చురిల్లాయి. ఈ చెడుగులకు వ్యతిరేకంగా నోరేత్తే ధైర్యం మంచి వారికి లేకుండా పోయింది. అందుకే మనపై రకరకాల ఆపదలు, ప్రకృతి వైపరీత్యాలు వచ్చి పడుతున్నాయి.



# 3. ఈదుల్ అజ్‌హా ఆదేశాలు

الَّذِينَ إِذَا ذُكِرَ اللَّهُ وَجِلَتْ قُلُوبُهُمْ وَالصَّابِرِينَ عَلَىٰ مَا أَصَابَهُمْ وَالْمُقِيمِي
الصَّلَاةِ وَمِمَّا رَزَقْنَاهُمْ يُنفِقُونَ ۝

**(వారి లోని సుగుణం ఏమిటంటే) అల్లాహ్ నామం స్మరించినప్పుడు వారి హృదయాలు వణుకుతాయి. తమపై ఏ ఆపద వచ్చిపడినా వారు ఓర్పు వహిస్తారు, నమాజులను నెలకొల్పుతారు. మేము వారికి ప్రసాదించిన దానిలో నుంచి (మా మార్గంలో) ఖర్చు చేస్తూ ఉంటారు.**

***(అల్ హజ్ 22 : 35)***

**మహాశయులారా!**

ఈదుల్ అజ్‌హా ఆదేశాలు అనే అంశంపై నేటి జుమా ప్రసంగం. ఈదుల్ అజ్‌హా ముస్లింల గొప్ప చారిత్రక పండుగ. నాలుగు వేల సంవత్సరాల క్రితం ఒక మహత్తర ఖుర్బానీ (త్యాగం) తో సంబంధం గల పండుగ ఇది. ఈ పండుగ దైవ ప్రవక్త ఇబ్రాహీం ఖలీలుల్లాహ్ (అలైహిస్సలాం) గారి సంప్రదాయం. ఆయన తన ప్రియపుత్రుడైన ఇస్మాయీల్ (అలైహిస్సలాం)ను 'మినా' ప్రదేశంలో దైవానికి సమర్పించటానికి సిద్ధమయ్యారు. నేను ఖుత్బాయే మస్నూనలో ఆ దైవ సూక్తులనే పఠించాను. అల్లాహ్ సెలవిస్తున్నాడు:

**(వారిలోని సుగుణం ఏమిటంటే) అల్లాహ్ నామం స్మరించినప్పుడు వారి హృదయాలు వణుకుతాయి. తమపై ఏ ఆపద వచ్చిపడినా వారు ఓర్పు వహిస్తారు, నమాజులను నెలకొల్పుతారు. మేము వారికి ప్రసాదించిన దానిలో నుంచి (మా మార్గంలో) ఖర్చు చేస్తూ ఉంటారు.**

***(అల్ హజ్ 22 : 35)***

**ప్రియ సోదరులారా!**

ఈ సుప్రసిద్ధ పండుగ జిల్‌హిజ్జ మాసం 10వ తేదిన జరుపబడుతుంది. ఈ మాసం ఎంతో పవిత్రమైనది, గౌరవప్రదమైనది. మొదటి తేది మొదలుకొని

teluguislam.net



10వ తేది వరకు, ఆ తరువాత తష్రీఖ్ రోజులు 11,12,13వ తేదీలు కూడా ఎంతో ప్రాముఖ్యత కలవే. ఈ పవిత్ర మాసంలోనే ముస్లింలు ఇస్లామీయ అతిముఖ్య మూలాంశమైన హజ్ విధిని నెరవేరుస్తారు. ఈ నెలలోనే ఒక హిజ్రి సంవత్సరం పూర్తవుతుంది. ఈ సుప్రసిద్ధ పండుగ ప్రత్యేకమైన మూడు పుణ్య కార్యాలతో కూడుకున్నది. మొదటిది: హజ్ చేయటం. జిల్‌హిజ్జ 8వ తేదీన హజ్ యాత్రికులు ఇహ్రామ్ ధరించి మక్కా నుండి 'మినా' ప్రాంతానికి చేరి ఆ రాత్రి అక్కడే బస చేస్తారు. ఆ ప్రదేశంలోనే ఇబ్రాహీమ్(అలై) ఖుర్బానీ సమర్పించారు. 9వ తేదీన తెల్లవారుజామున అక్కడ నుండి బయలుదేరి అరఫాత్ మైదానంలో హాజరవుతారు. జుహర్ నుండి సూర్యాస్తమయం వరకు దుఆలో నిమగ్నమై రాత్రికి 'ముజ్దలిఫా' చేరుకుంటారు. పదవ తేదీన ఉదయాన్నే మళ్ళీ 'మినా' చేరుకుని షైతాన్‌పై రాళ్ళు రువ్వుతారు. ఆ తరువాత ఖుర్బానీ సమర్పించుకుని ఇహ్రామ్ దీక్షను విరమించు కుంటారు.

ఇక రెండవ పుణ్యకార్యం ఈదుల్ అజ్‌హా రోజు ప్రపంచమంతటా అల్లాహ్ పట్ల కృతజ్ఞతాభావంతో చేయబడే రెండు రకాతుల నమాజ్ హాజీలో ఉన్నవారైతే ఈ రెండు రకాతుల నమాజ్‌కు బదులుగా కేవలం షైతాన్‌పై కంకర రాళ్ళు రువ్వు తారు. వారిని మినహాయించి ప్రపంచంలోని ముస్లింలందరూ ఈ పర్వదినాన ఈదుల్ అజ్‌హాను ఘనంగా జరుపుకుంటారు. ఇక మూడవ పుణ్యకార్యం ఖుర్బానీ ఇవ్వటం. ఇది పదవ తేది నుండి 13వ తేది వరకు ఇవ్వబడుతుంది. పదవ తారీఖున ఇవ్వడం అత్యుత్తమం.

**ప్రియసోదరులారా!**

మళ్ళీ ఈ పవిత్రమాసాన్ని మనకు అనుగ్రహించినందుకు అల్లాహ్‌కు కృతజ్ఞలు తెలపండి. మళ్ళీ ఎవరికి ప్రాప్తమవుతుందో అల్లాహ్‌కే తెలుసు.

జిల్‌హిజ్జ పది రోజులు, ఈదుల్ అజ్హా ఘనతలను తెలుపుతూ ప్రియ ప్రవక్త(స) ఇలా ప్రవచించారు: పుణ్యకార్యాల దృష్ట్యా ఈ పది రోజుల్లో చేసే పుణ్య కార్యాలు ఇతర పుణ్యకార్యాలకన్నా అల్లాహ్ దగ్గర అత్యంత ప్రియమైనవి. 'దైవ ప్రవక్తా! దైవ మార్గంలో పోరాడటం కూడా వీటికి సరితూగదా? అని ప్రశ్నించగా', సరితూగదు. కాకపోతే ఓ వ్యక్తి తన ధన ప్రాణాలతో దైవ మార్గంలో పోరాడటానికి వెళ్ళి ధనంతో పాటు ప్రాణత్యాగం కూడా చేసిన ఒక త్యాగధనుడు తప్ప అని సమాధానమిచ్చారు ప్రవక్త (స). *(సహీహ్ బుఖారీ)*



ఈ పది రోజుల్లో అత్యధికంగా అల్లాహ్ స్మరణ చేయాలి. తక్బీర్‌లు వీలైనంత ఎక్కువగా పఠించాలి. తక్బీర్!

الله أكبر الله أكبر لا إله إلا الله والله أكبر الله أكبر ولله الحمد

**"అల్లాహ్ అక్బర్, అల్లాహు అక్బర్, లా ఇలాహ ఇల్లల్లాహు అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హమ్ద్"**

జిల్ హిజ్జ మొదటి తారీకు నుండే తక్బీర్ పలుకటం మొదలెట్టాలి. ఇంటా-బయటా తక్బీర్‌లు పలుకుతూనే ఉండాలి. ఈద్గాహ్‌కు వెళ్తూ, ఈద్గాహ్‌లో ఉన్నం తకాలం, తిరిగి వచ్చేటప్పుడు, ఇలా మార్గం గుండా తక్బీర్‌లు పలుకుతూనే ఉండాలి. ఇక పండుగ రోజైతే ఈ తక్బీర్లను వీలైనంత ఎక్కువగా పలకాలి. జిల్‌హిజ్జా 13వ తేది అసర్ నమాజ్ వరకు పలకాలి.

ఇక ఖుర్బానీ గురించి అల్లాహ్ ఈ విధంగా ఆదేశించాడు.

الَّذِينَ إِذَا ذُكِرَ اللَّهُ وَجِلَتْ قُلُوبُهُمْ وَالصَّابِرِينَ عَلَىٰ مَا أَصَابَهُمْ وَالْمُقِيمِي
الصَّلَاةِ ۙ وَمِمَّا رَزَقْنَاهُمْ يُنفِقُونَ ۝

**"ఖుర్‌బానీ పశువులను మేము అల్లాహ్ సూచనలుగా జేసి యున్నాము. మీకు వాటిలో మేలున్నది. కాబట్టి వాటిని వరుసగా నిలబెట్టి అల్లాహ్ పేరును ఉచ్చరించండి. అవి ప్రాణం విడిచి ప్రక్కల మీద పడిపోయిన తరువాత మీరూ వాటిని తినండి. అడగని అభాగ్యులకు, అడిగే అగత్య పరులకు కూడా తినిపించదండి. ఈ విధంగా మేము వాటిని మీకు స్వాధీన పరిచాము. బహుశా మీరు కృతజ్ఞులవుతారేమోనని.** *(అల్ హజ్ 22 : 36)*

ఖుర్బానీ అల్లాహ్‌కు అత్యంత ప్రియమైన ఆచరణ. అల్లాహ్ ఈ ఆచరణ ద్వారా మీ అంతరంగాన్ని, సంకల్పాన్ని దైవభీతిని చూడదలిచాడు. సంకల్పశుద్ధితో అల్లాహ్ ప్రసన్నత గైకొనేందుకే ఖుర్బానీ ఇవ్వాలి. అల్లాహ్ ఆదేశం ఇలా ఉంది:

لَن يَنَالَ اللَّهَ لُحُومُهَا وَلَا دِمَاؤُهَا وَلَٰكِن يَنَالُهُ التَّقْوَىٰ مِنكُمْ

**"వాటి మాంసం గానీ, వాటి రక్తం గానీ అల్లాహ్‌కు చేరదు. కానీ మీ భయ భక్తులే ఆయనకు చేరుతాయి.** *(అల్ హజ్ 22 : 37)*

భక్తి ప్రేమలతో అల్లాహ్ ప్రీతి కొరకు విలువైన జంతువును ఖుర్బానీ చేసినట్లే

teluguislam.net



సమయం వచ్చినపుడు తాను కూడా అల్లాహ్ ప్రీతి కొరకు తన ప్రాణాలను సైతం అర్పిస్తాను అనే సంకల్పశుద్ధితో, కృత నిశ్చయముతో ఖుర్బానీ చేయాలి. అల్లాహ్‌కు ఇదే ప్రియమైనది. అంతేగాని అల్లాహ్‌కు వాటి రక్తమాంసాలు ప్రియమైనవి కావు.

ఖుర్బానీలో ఒంటె, ఆవు, మేక, గొర్రెలను సమర్పించుకోవచ్చు. ఖుర్బానీ పశువులన్నీ అల్లాహ్ చిహ్నాలు. వాటిని భయభక్తులతో జిబహ్ చేయాలి. జంతువుని ఖిబ్లా దిశలో ఉంచి **بسم الله الله اكبر "బిస్మిల్లాహి అల్లాహు అక్బర్"** అని జిబహ్ చేయాలి. పదునైన కత్తితో స్వయంగా జంతువును జిబహ్ చేయటం ఉత్తమం.

ఖుర్బానీ జంతువుల చర్మాన్ని, మాంసాన్ని అమ్మకూడదు. కూలి ఖర్చులు కూడా వీటి ద్వారా చెల్లించరాదు. ఖుర్బానీ మాంసాన్ని తాము స్వయంగా తినటంతో పాటు పేదలకు, అనాధలకు, అభాగ్యజీవులకు పంచిపెట్టాలి. వారు కూడా ఈద్ సంతోషాలలో పాల్గొనేలా చేయ్యాలి.

**సోదర, సోదరీమణులారా..!**

ఏ విధంగానైతే ఈద్ పర్వదినాన్ని భయభక్తులతో జరుపుకోవటానికి ఈద్గాహ్‌లో ఒక చోట సమావేశం అవుతామో అదే విధంగా ఒక రోజు మనమందరం అల్లాహ్ సన్నిధిలో హష్ర్ మైదానంలో సమావేశం కావాలనే అక్షర సత్యాన్ని మరవవద్దు. ఆ దినాన్ని తలచుకునేందుకే ఈద్గాహ్‌లో ముస్లింలందరూ గుమిగూడుతారు. అల్లాహ్ పట్ల కృతజ్ఞతా భావంతో నమాజ్ చేస్తారు. క్షమాభిక్షకై వేడుకుంటారు.

నా ముస్లిం సోదర, సోదరీమణులారా! శ్రద్ధగా వినండి. నేటి ఆధునిక కాలంలో స్త్రీలు పాశ్చాత్యనాగరికతకు ఆకర్షితులై ఫ్యాషన్ల పేరుతో కొంగ్రొత్త వేషాలతో బజారుల్లో దర్శనమిస్తూ ఉంటారు. అల్లాహ్‌కు భయపడండి. తమ మాన శీలాలను కాపాడుకోండి. పరదా పద్ధతిని పాటించండి. అత్యవసర పరిస్థితుల్లోనే తప్ప ఇతర సమయంలో ఇంటి నుండి బయటకు రాకూడదు.

ఈ ఖుత్బా చివరిలో అల్లాహ్‌తో దీనంగా దుఆ చేస్తున్నాను. అల్లాహ్ మనందరికి సద్బుద్ధిని ప్రసాదించుగాక, మన పాపాల్ని అల్లాహ్ క్షమించుగాక!

ఓ అల్లాహ్! ప్రవక్త అడుగుజాడల్లో నడిచే భాగ్యాన్ని ప్రసాదించు, నీ కారుణ్యాన్ని సదా మాపై కురిపిస్తూ ఉండూ, ముస్లింలకు ఇహపరలోకాల్లో గౌరవాన్ని, ఉన్నత స్థానాన్ని ప్రసాదించు.

**రబ్బనా తఖబ్బల్ మిన్నా ఇన్నక అన్తస్సమీ ఉల్ అలీమ్..**



# 4. హజ్ ఆదేశాలు

إِنَّ أَوَّلَ بَيْتٍ وُضِعَ لِلنَّاسِ لَلَّذِي بِبَكَّةَ مُبَارَكًا وَهُدًى لِّلْعَالَمِينَ ۝
فِيهِ آيَاتٌ بَيِّنَاتٌ مَّقَامُ إِبْرَاهِيمَ ۖ وَمَن دَخَلَهُ كَانَ آمِنًا ۗ وَلِلَّهِ عَلَى النَّاسِ
حِجُّ الْبَيْتِ مَنِ اسْتَطَاعَ إِلَيْهِ سَبِيلًا ۚ وَمَن كَفَرَ فَإِنَّ اللَّهَ غَنِيٌّ عَنِ الْعَالَمِينَ ۝

**నిశ్చయంగా, మానవ జాతి కొరకు మొట్ట మొదట నిర్ధారించబడిన (ఆరాధనా) గృహం బక్కా (మక్కా)లో ఉన్నదే, అది శుభాలతో నిండినది, సమస్త లోకాల ప్రజలకు మార్గదర్శకత్వాన్ని ప్రసాదించి వున్నది. అందులో స్పష్టమైన సంకేతా లున్నాయి. ఇబ్రాహీమ్ నిలిచిన స్థలం ఉంది. దానిలో ప్రవేశించిన వాడు రక్షణ పొందుతారు. అక్కడకు వెళ్ళేశక్తి గల వారికి ఆ గృహయాత్ర అల్లాహ్ కొరకు చేయుట విధిగా నియమించబడింది. ఎవరు దీనిని తిరస్క రిస్తారో, వారు నిశ్చయంగా అల్లాహ్ సమస్తలోకాల వారి అవసరం లేని స్వయం సమృద్ధుడు (నిరాపేక్షాపరుడు) అని తెలుసుకోవాలి.**

***(ఆలి ఇమ్రాన్ 3 : 96-97)***

**ముస్లిం సోదరులారా!**

హజ్ ఇస్లామీయ మూల స్తంభాలలో అతికీలకమైనది. నమాజ్, ఉపవాసం, జకాత్, పోరాటం, దానధర్మాలు ఇలాంటి ఎన్నో పుణ్యకార్యాల సమ్మేళనం. స్తోమత శక్తి గల ప్రతి ముస్లిం తప్పక హజ్ చేయాలి. శక్తిస్తోమతలు కలిగి హజ్ పట్ల అశ్రద్ధ వహించడం చాలా ఘోరం. అలాంటి వారి గురించి దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు:

"ఎవరైతే అల్లాహ్ గృహాన్ని (కాబా) చేరడానికి వాహన, ప్రయాణ సామాగ్రి కలిగి ఉండి కూడా హజ్ చేయడో అలాంటి వాడు యూదునిగానో, క్రైస్తవునిగానో మరణించవచ్చు".

(తర్గీబ్ వ తర్హీబ్)

teluguislam.net



'నైలుల్ అవ్‌తార్'లో ఉమర్‌బిన్ ఖత్తాబ్ (రజి) గారి మాటను ఇమాం షౌకానీ(రహ్మాలై) ఇలా పొందుపరిచారు.

"నేను ప్రతి గ్రామం వైపుకు ఒక మనిషినిపంపి, ఎవరు ఆ గ్రామంలో హజ్ యాత్ర చేయడానికి సర్వ సౌకర్యాలు, సదుపాయాలు ఉండి కూడా హజ్‌కు ఉపక్రమించరో వారిపై నేను జిజ్‌యా విధించాలని నిశ్చయించుకున్నాను. ఎందుకంటే హజ్ పట్ల అశ్రద్ధ వహించేవారు ముస్లింలు కారు.

న్యాయబద్ధంగా పరిశీలించినట్లైతే మక్కాలాంటి పవిత్ర గృహానికి ఉపక్రమించటం పట్ల అశ్రద్ధ, అజాగ్రత్త వహించేవ్యక్తి నిజంగానే చాలా దౌర్భాగ్యుడు సౌకర్యాలు, సదుపాయాలు, సామగ్రి ఉండికూడా నేను ముస్లింనంటూ వాదిస్తూ హజ్‌యాత్ర చేయనివాణ్ణి ఏమనాలి మరి?

దైవ ప్రవక్త (స) మక్కా వదిలి మదీనా హిజ్రత్ (ప్రస్థానం) చేసి వెళ్ళే ముందు కాబాగృహం వైపుకు తిరిగి దాన్నుద్దేశిస్తూ ఇలా పలికారు: "దైవసాక్షిగా ఓ మక్కా! సమస్త భూమండలంలో నీవు అల్లాహ్ సన్నిధిలో చాలా శ్రేష్ఠమైనదానివి. ప్రియమైన దానివి. నా దృష్టిలో కూడా నీవు ఎంతో ప్రియమైనదానివి. ఒకవేళ ఈ దైవ తిరస్కారులు నన్ను ఈ పవిత్ర మక్కా నుండి బహిష్కరించకుంటే నేను నిన్ను విడిచి వెళ్ళేవాణ్ణే కాదు".

అబూ హురైర (రజి) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ఎవరైతే కాబాతుల్లాహ్ దర్శన సంకల్పంతో హజ్ చేయుటకై ఒంటె (వాహనం)పై ప్రయాణం అవుతారో, ఆ వాహనం వేసే ప్రతి అడుగుకు అల్లాహ్ అతని ఒక పాపాన్ని తుడిచివేస్తూ ఒక అంతస్తును స్వర్గంలో పెంచుతాడు. అలా ఆ వ్యక్తి కాబాగృహం చేరి కాబా చుట్టు తవాఫ్ (ప్రదక్షిణ) చేసి, సఫా-మర్వాల మద్య నడిచి, వెంట్రుకలు కత్తిరించుకుంటే, ఆ వ్యక్తి ఆ రోజే తల్లి గర్భంనుండి జన్మించిన శిశువులా నిర్దోషి (పరిశుద్ధుడు) అవుతాడు.

మరెవరయితే మక్కా నుండి అరఫాత్‌కు కాలినడకన వచ్చి, అక్కడ నుండి మిగతా హజ్ విధులన్నీ కాలినడకతో పూర్తిగా నెరవేరుస్తారో అలాంటి వాని ప్రతి అడుగుకు దైవం ఏడొందల పుణ్యాలను ప్రసాదిస్తాడు. అందులో ప్రతీ పుణ్యం



మక్కా పుణ్యంలా ఉంటుంది. "మక్కా పుణ్యం' అంటే ఏమిటని ప్రశ్నించగా: ప్రతి ఒక పుణ్యం మక్కాలో లక్ష పుణ్యాలకు సమానం అని దైవ ప్రవక్త సమాధనమిచ్చారు.

దైవ ప్రవక్త (సలల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు:

**الْحَجُّ الْمَبْرُورُ لَيْسَ لَهُ جَزَاءٌ إِلَّا الْجَنَّةُ،**

**అల్ హజ్జుల్ మబ్‌రూరు లైస లహు జజాఉన్ ఇల్లల్ జన్నత**

**"స్వీకార యోగ్యమైన హజ్‌కు ప్రతిఫలం స్వర్గమే"**[1] ( సహీ బుఖారీ)

ఆయన ఇలా అన్నారు: "హజ్ గతంలో మనిషి వల్ల జరిగిన పాపాలన్నింటినీ తుడిచివేస్తుంది". ఇంకో హదీసులో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విధంగా ప్రవచించారు: హజ్ ఉమ్రా యాత్రకు వెళ్ళేవాళ్ళు అల్లాహ్ అతిథులు. వారు గనక దుఆ చేస్తే అల్లాహ్ వారి దుఆలను ఆమోదిస్తాడు. వారు తమ మన్నింపు కోసం వేడుకుంటే ఆయన వారిని మన్నిస్తాడు. (నసాయి)

కాబట్టి హజ్ వీలైనంత త్వరగా చేయడానికి ప్రయత్నించాలి. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విధంగా ప్రవచించారు: తాను హజ్ చేయాలి అని అనుకునే వ్యక్తి దాని కోసం తొందరపడాలి. ఆలస్యం చేస్తే అతను వ్యాధి బారిన పడవచ్చు లేదా వాహనాన్ని అయినా పోగొట్టుకోవచ్చు. లేదా ఇంకా ఏదయినా ఆటంకం ఏర్పడవచ్చు. (ముస్నద్ అహ్మద్)

ఆయన ఇంకా ఇలా అన్నారు:

వీలైనంత త్వరగా హజ్ చేసుకోండి. ఎవరికి ఎప్పుడు ఏ ఆటంకం వస్తుందో ఎవరికీ తెలియదు. (సునన్ అబూదావూద్)

అల్లాహ్ మార్గంలో సత్కార్యాలకోసం ఎవరయితే ఖర్చు చేయరో అలాంటి వారికి నష్టం వాటిల్లుతుంది. హజ్ చేయడానికి అన్నీ ఉన్నా వాయిదాలు వేస్తూ ఉంటే అలాంటి వారికి అనుకోని ఆపద కలిగి నష్టానికి గురవుతారు. ఎలాంటి సమృద్ధిని పొందలేరు. ఎందుకంటే ఇస్లామీయ ఆదేశాలు సత్యమైనవి. వీటికి వ్యతిరేకంగా నడిచేవారు నిస్సందేహంగా నష్టాన్నే పొందుతారు కాబట్టి హజ్ కోసం తొందరపడాలి.

teluguislam.net



దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారు ఈ విధంగా ప్రవచించారు: "హజ్ సంకల్పంతో బయలుదేరి మార్గం మధ్యలోనే మరణించేవారెవరైనా సరే అలాంటి వారికోసం ప్రతి సంవత్సరం హజ్ చేసే పుణ్యం ప్రళయదినం వరకు లిఖించబడుతుంది. అదే విధంగా ఎవరైనాఉమ్రా సంకల్పంతో బయలుదేరి మార్గం మధ్యలోనే చనిపోతే అతనికి కూడా ప్రళయదినం వరకు ఉమ్రా పుణ్యాం లిఖించబడుతుంది. జిహాద్ (ధర్మయుద్ధం) కోసం బయలుదేరి, మార్గం మధ్యలోనే చనిపోతే అతనికి కూడా ప్రళయం వరకు అమరవీరుని పుణ్యం లిఖించబడుతుంది.

*(తర్గీబ్ వ తర్హీబ్)*

ఆయిషా (రజి.అన్హా) కథనం ప్రకారం దైవ ప్రవక్త (స) ఈ విధంగా ప్రబోధించారు:

"ఎవరైనా హజ్ లేదా ఉమ్రా సంకల్పంతో బయలుదేరి మార్గం మధ్యలోనే చనిపోతే అలాంటి వారి పాపాలు తీర్పుదినాన అల్లాహ్ సమక్షంలో సమర్పించబడవు. వారి నుండి ఎలాంటి లెక్కా అడగబడదు. అంతేకాక వారితో ఇలా అనబడుతుంది– స్వర్గంలో ప్రవేశించండి. *(తర్గీబ్ వ తర్హీబ్).*

**ప్రియ సోదరులారా!**

హజ్ ఘనత, విశిష్టతలను గురించి మీరు విన్నారు మక్కాలోగల కాబా గృహ సందర్శన కోసం చేయబడే సంకల్పాన్నే హజ్ అంటారు. 4 వేల సంవత్సరాల క్రితం ఖలీలుల్లాహ్ ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) వారి సుపుత్రుడు జబీహుల్లాహ్ ఇస్మాయీల్ (అ) అల్లాహ్ స్మరణ కోసం నిర్మించిన మొట్ట మొదటి అల్లాహ్ గృహమే కాబా గృహం. వారికంటే ఎన్నో వేల సంవత్సరాల క్రితం ఆదం (అలైహిస్సలాం) ప్రప్రథమంగా దాన్ని నిర్మించారు. కాల క్రమేణా దాని చిహ్నాలు చెరిగిపోయాయి. ఆతర్వాత అల్లాహ్ ఆజ్ఞ మేరకు ఇబ్రాహీం (అలైహిస్సలాం) ఆ పాత పునాదులపైనే పునర్నిర్మాణం ప్రారంభించారు. ఆ నిర్మాణంలో తన కుమారున్ని కూడా కలుపుకున్నారు. ఆ భవన నిర్మాణం చతురాస్రాకారంలో ఉంది. అంటే పొడవు, వెడల్పులో వాటి గోడలు సరిసమానంగా ఉంటాయి. అందుకనే ఆ నిర్మాణాన్ని 'కాబా' అంటారు.



నాలుగు వేల సంవత్సరాలు గడిచినప్పటికినీ ప్రతీ సంవత్సరం హజ్‌యాత్ర పరంపర నిరాఘాటంగా కొనసాగుతూనే ఉంది. ఇస్లాంకు పూర్వం ఖురైష్ వాళ్ళు కాబా నిర్మాణం మరమ్మతులు చేపట్టారు. ఆ తర్వాత వివిధ కాలాలలో సందర్భానుసారంగా, అవసరానుగుణంగా మార్పులు, మరమ్మతులు చేశారు. నేటి సౌదీ ప్రభుత్వం కాబాగృహాన్ని మరింత విస్తృత పరిచి అమూల్యమైన సామగ్రితో బ్రహ్మాండమైన నిర్మాణాలను నిర్మించింది. ఇలాంటి బ్రహ్మాండమైన 'పవిత్రకట్టడం' భూమండంలోనే లేదు. అదే 'కాబాగృహం' ప్రత్యేకత.

**ముస్లిం సహోదరులారా!**

ప్రతీముస్లిం తన జీవితంలో కనీసం ఒక్కసారైనా హజ్ చేయాలని సంకల్పించుకోవాలి. అలా ఆశించటంకూడా విశ్వాసానికి ప్రతీక. అల్లాహ్ ప్రసన్నతను పొందే ఉద్దేశంతో దైవగృహాన్ని సందర్శించుకోవటాన్నే 'హజ్' అంటారు. హజ్ కోసం వెళ్ళేవారు హజ్ సంకల్ప విధికి ముందే ప్రత్యేకమైన తెల్లని దుస్తులు ధరించాలి. దాన్నే 'ఇహ్రామ్' అంటారు. ఇహ్రామ్ ధరించిన తరువాత గోళ్ళు, వెంట్రుకలు కత్తిరించుకోవటం నిషిద్ధం. ఈ ప్రక్రియ జిల్‌హిజ్జ మాసపు 8వ తేది నుండి మొదలుకొని 13వ తేదిన పూర్తి అవుతుంది. 8వ తేదీన హజ్ యాత్రికులు ఇహ్రాం దీక్షబూని మక్కా నుండి బయలు దేరి 'మినా'గా ప్రసిద్ధిగాంచిన మైదానంలో ఆగుతారు. అక్కడ నుండి 9వ తేది ఉషోదయం బయలుదేరి అరఫాత్ అనే విశాల మైదానంలో హాజరై మగ్రిబ్ వరకు దుఆలలో నిమగ్నులై ఉంటారు. అరఫాత్ మైదానానికి హాజరు కావటం ఒక కీలకమైన విధి. అసలు అరఫాత్‌లో విడిది చేయటమే హజ్. కాబట్టి ఎవరయినా ఏదయినా కారణం చేత అక్కడికి వెళ్ళక పోతే వారి హజ్ నెరవేరదు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విధంగా ప్రవచించారు: **అల్‌హజ్జు అర్ఫహ్** "అరఫాత్ హాజరుకు మారు పేరే హజ్".

ఇక పదవ తేదీ రాత్రి బయలుదేరి 'ముజ్దలిఫా' మైదానంలో వచ్చి అక్కడ రాత్రి గడపాలి. ఆ తరువాత 'మినా' చేరి షైతాన్ పై రాళ్ళు రువ్వాలి. పిమ్మట ఖుర్బాని సమర్పించి ఇహ్రాం వస్త్రాలు విడువాలి. ఆ తరువాత మక్కా వెళ్ళి కాబాగృహం తవాఫ్ చేయాలి. మళ్ళీ రాత్రి మక్కా నుండి బయలుదేరి 'మినా' వచ్చి అక్కడ

teluguislam.net



13వ తేది వరకు ఉండాలి. 'మినా' లో ఏ ప్రదేశంలో షైతాన్ ఇస్మాయీల(అలై)ను ఖుర్బానీగా సమర్పించటం నుండి వారిస్తూ హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) ను సతాయించాడో ఆ ప్రదేశాలలో కంకరాళ్ళతో షైతాన్‌ను కొట్టాలి. షైతాన్ దుష్ట ప్రేరణ హజ్రత్ ఇస్మాయీల్ (అ) పై ఎలాంటి ప్రభావం చూపలేదు. అలాగే తనపై కూడా చూపదని ప్రతి ముస్లిం ఆశిస్తాడు. దైవ విధేయునిగా, దాసునిగా తౌహీద్‌పై స్థిరంగా ఉంటూ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం విధానం ప్రకారం జీవితం గడుపుతాడు.

హజ్‌తో పాటు 'ఉమ్రా' పేరుతో మరో సత్కార్యం కూడా చేయబడుతుంది. దానికి ఎంతో విశిష్టత, ప్రతిఫలం ఉంది. ఉమ్రా కోసం ఎలాంటి నిర్ణీత కాలం, సమయం, దినం గాని లేవు. సంవత్సరంలోని పన్నెండు నెలల్లో ఎప్పుడు వీలైతే అప్పుడు ఉమ్రా చేయవచ్చు.

హజ్, ఉమ్రాలు చేసే ఉద్దేశ్యంతో బయలుదేరే ముందు

لَبَّيْكَ اللَّهُمَّ لَبَّيْكَ لَبَّيْكَ لَا شَرِيكَ لَكَ لَبَّيْكَ

إِنَّ (أَنَّ) الْحَمْدَ وَالنِّعْمَةَ لَكَ وَالْمُلْكَ لَا شَرِيكَ لَكَ

**"లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్, లబ్బైక్ లా షరీకలక లబ్బైక్, ఇన్నల్ హమ్ద వన్నిమత లక వల్ ముల్క లాషరీక లక్"** అని సంకల్పించుకోవాలి. (అనువాదం: హాజరయ్యాను ప్రభూ! నేను హాజరయ్యాను. సాటి లేని ప్రభువా! నేను నీ సన్నిధికి వచ్చేశాను. నిశ్చయంగా స్తోత్రం నీకే శోభిస్తుంది. అనుగ్రహాలన్నీ నీవు ప్రసాదించినవే. అధికారం కూడా నీదే. నీకు సాటి ఎవరూ లేరు).



# 5.జీవనోపాధి గురించి ఖుర్ఆన్, హదీసుల వెలుగులో

وَمِنْهُم مَّن يَقُولُ رَبَّنَا آتِنَا فِي الدُّنْيَا حَسَنَةً وَفِي الْآخِرَةِ حَسَنَةً وَقِنَا عَذَابَ النَّارِ

**ప్రజల్లోనే మరికొందరు, "ప్రభూ! మాకు ప్రపంచంలోనూ మేలును ప్రసాదించు, పరలోకంలో కూడా మేలును ప్రసాదించు. ఇంకా మమ్మల్ని నరకాగ్ని శిక్ష నుండి కాపాడు" అని ప్రార్థించేవారు కూడా ఉన్నారు.**

***(అల్ బఖర 2 : 201)***

**ప్రియసోదరులారా!**

నేటి జుమా ప్రసంగంలో 'జీవనోపాధి' గురించి ఖుర్ఆన్, హదీసుల వెలుగులో తెలుసుకుందాం. అల్లాహ్ సూరె మూమినూన్, 51వ ఆయతులో ప్రవక్తలందరినీ సంబోధిస్తూ ఇలా సెలవిస్తున్నాడు:

يَا أَيُّهَا الرُّسُلُ كُلُوا مِنَ الطَّيِّبَاتِ وَاعْمَلُوا صَالِحًا إِنِّي بِمَا تَعْمَلُونَ عَلِيمٌ

**"ఓ ప్రవక్తలారా! పరిశుద్ధ వస్తువులు తినండి, సదాచరణ చేయండి. మీరు చేసేదంతా నాకు తెలుసు."** ***(అల్ మూమినూన్ 23 : 51)***

ప్రవక్తలకు గల గౌరవస్థానం సర్వ సృష్టిలో మరెవ్వరికీ లేదు. వారి స్థానం ఎంత గొప్పదో వారికి ఇవ్వబడిన పై ఆజ్ఞ కూడా అంతే గొప్పది! బ్రతుకు తెరువుకోసం ప్రపంచంలో జీవనం గడపటంకోసం ధర్మ సమ్మతమైన, పరిశుద్ధమైన వస్తువులను సంపాదించాలని పై ఆయతులో ప్రవక్తలందరికీ ఆదేశించబడింది.

ఇక ఖుత్బాయే మస్నూన తరువాత నేను పఠించిన మరొక ఆయతులో ఇహపరాల మంచికై వేడుకోలు ఉంది.

విశ్వాసి సాఫల్యమార్గాన్ని ఎన్నుకుని తన ఇహలోక జీవితాన్ని ఎంత చక్కగా, అందంగా తీర్చిదిద్దుకుంటాడో దాని మీదనే అతని పరలోక జీవితం, సాఫల్యం

teluguislam.net



ఆధారపడి ఉంటుంది. ప్రాపంచిక జీవిత సంస్కరణలో మొట్టమొదటగా ప్రాముఖ్యత ఇవ్వదగిన విషయం-మనిషి సంపాదన. మనిషి సంపాదన ధర్మసమ్మతమైనదైతే, పరిశుద్ధమైనదైతే అతని జీవితంలోని ఇతర విషయాలు కూడా శుభప్రదమవుతాయి.

మనిషి ప్రాపంచిక జీవితానికి ధర్మ సమ్మతమైన (హలాల్) సంపాదన ఎంతో అవసరం. ఖుర్‌ఆన్, హదీసులలో ఏ విధంగా నమాజ్, రోజా, జకాత్, హజ్ గురించి పదేపదే తాకీదు చేయబడిందో అదే విధంగా హలాల్ సంపాదన గురించి కూడా నొక్కి చెప్పటం జరిగింది. దానికి గల మార్గాలు ఎంతో చక్కగా విశ్లేషించబడ్డాయి. హలాల్ సంపాదనకుగల ప్రాముఖ్యతను, విశిష్ఠతను దాని లాభాలను, ప్రయోజనాలను స్పష్టపరచటం జరిగింది.

తన మార్గంలో హలాల్ సంపాదనకై కృషి చేయమని ప్రత్యేక ఆజ్ఞ ఇస్తూ అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

فَإِذَا قُضِيَتِ الصَّلَوٰةُ فَانتَشِرُوا فِي الْأَرْضِ وَابْتَغُوا مِن فَضْلِ اللَّهِ
وَاذْكُرُوا اللَّهَ كَثِيرًا لَّعَلَّكُمْ تُفْلِحُونَ ۝

**"నమాజు ముగిసిన తరువాత భూమిలో విస్తరించి, దైవానుగ్రహాన్ని అన్వేషించండి. ఎక్కువగా అల్లాహ్‌ను స్మరిస్తూ ఉండండి. తద్వారా మీరు సాఫల్యం పొందవచ్చు". *(అల్ జుమఅ 62 :10)***

వ్యాపారం కోసం, సంపాదన కోసం దైవ అనుగ్రహాలను అన్వేషించాలని, ఆరాధన తరువాత మళ్ళీ తమ విధి నిర్వహణలో నిమగ్నమైపోవాలని, వ్యవసాయం చేసేవారు, ఇతర వృత్తి పనులు చేసుకునేవారు తమ తమ కార్యకలాపాల్లో చేరి పోవాలనేది ఈ ఆయత్ భావం.

'హలాల్ సంపాదన' కూడా మనిషి విధే. అది లేనిదే అతని జీవన రథం ధర్మపథంలో ముందుకు సాగదు మరి! దానిని సాధించటానికి శక్తికొలదీ శ్రమించాలి. ఇలా చేసే శ్రమకు ప్రతిఫలం, పుణ్యం లభిస్తుంది.

**గౌరవనీయులైన సహోదరులారా!**

బ్రతుకు తెరువుకు సంబంధించిన సమస్యలను పరిష్కరించటంలో వ్యాపారం ప్రధాన భూమికను నిర్వహిస్తుంది. అందుకే దైవ ప్రవక్త (స) తన యవ్వనంలో



వ్యాపారం చేసేవారు. వ్యాపారం కేవలం లాభదాయకమైన, శుభప్రదమైన అంశం మాత్రమే కాదు, అది దైవ ప్రవక్త (స) సంప్రదాయం కూడా.

వ్యాపార విశిష్ఠతను తెలిపే కొన్ని ప్రవచనాలను, విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం. వాటిని శ్రద్ధగా విని, అర్థం చేసుకొని, వాటిని ఆచరించే భాగ్యాన్ని అల్లాహ్ మనకు ప్రసాదించుగాక! ఆమీన్..

అబూ సయీద్ ఖుద్రీ (రజి) కథనం ప్రకారం: దైవ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

**التَّاجِرُ الصَّدُوقُ الأَمِينُ مَعَ النَّبِيِّينَ ، وَالصِّدِّيقِينَ ، وَالشُّهَدَاءِ**

**"అత్తాజిరుస్ స్సదూకుల్ అమీను మఅన్నబియ్యీన వస్సిద్దీఖీన వ ష్షుహదాఇ"**

"ధర్మంగా వ్యాపారం చేసే నిజాయితీ పరుడైన ముస్లిం ప్రళయదినాన దైవ ప్రవక్తల వెంట అమరవీరుల వెంట, సత్యవంతుల వెంట ఉంటాడు". *(సునన్ తిర్మిజీ)*

ఈ హదీసు ప్రకారం నిత్యం నీతి, నిజాయితీ, సత్యాన్ని దృష్టిలో పెట్టుకొని, మోసానికి దూరంగా ఉండేదే అల్లాహ్ దృష్టిలో సిసలైన వ్యాపారం. ఇలాంటి వ్యాపారం శుభం ఉంటుంది. ఇలాంటి వ్యాపారం చేసేవారు ప్రపంచంలోనూ అభివృద్ధిలోకి వస్తారు. పరలోకంలో కూడా సాఫల్యం పొందుతారు. *(సునన్ తిర్మిజీ)*

అబూ ఉబైదా బిన్ రిఫాఅ (రజి) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: "దైవ భీతితో అసత్యం, దగా మోసములను త్యజించి, ప్రజల పట్ల ఉదారంగా వ్యవహరిస్తూ, అత్యంత నిజాయితీగా వ్యాపారం చేసేవారు తప్ప మిగతా వ్యాపారులంతా ప్రళయదినాన హష్ర్ మైదానంలో దుర్మార్గులు, పాపాత్ముల రూపంలో హాజరుపరచబడతారు".

అబ్దుల్లాహ్ (రజి) కథనం ప్రకారం దైవ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రబోధించారు: **طلب كسب الحلال فريضة بعد الفريضة** **"తలబు కస్బిల్ హలాలి ఫరీజతున్ బాదల్ ఫరీజతి"** హలాల్ సంపాదన కోసం ఏదైనా వ్యాపారం చేయటం అల్లాహ్ విధుల తరువాత ఒక పెద్ద విధి.
*(సహీహ్ బుఖారీ)*

అందుకే తల్లిదండ్రులు తమ సంతానానికి ధార్మిక విషయాలు, విద్యా బుద్ధులు నేర్పించటంతో పాటు జరుగుబాటుకోసం వారికి ఏదైనా ఒక మంచి పని నేర్పించాలి.

రాఫే బిన్ ఖదీజ్ కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)

teluguislam.net



ను ఆయన అనుచరులు 'దైవ ప్రవక్త!'అతి శ్రేష్ఠమైన, ధర్మసమ్మతమైన సంపాదన (వ్యాపారం) ఏదని ప్రశ్నించగా- عَمَلُ الرَّجُلِ بِيَدِهِ وَكُلُّ بَيْعٍ مَبْرُورٍ **"అమలుర్రజులి బియదిహీ వకుల్లు బైయిన్ మబ్‌రూర్"** "మనిషి తన స్వహస్తాలతో ఏదైనా పని చేస్తే వచ్చే సంపాదన అని ఆయన (స) బదులిచ్చారు. (ముస్నద్ అహ్మద్)

కుట్టుపని, కుమ్మరి, వడ్రంగి పనులు, ఫ్యాక్టరీల్లో మిషన్లు నడపటం, దుస్తులు నేయటం, దుక్కి దున్నటం, వ్యాపార సామగ్రి చేతితో చేయటం, ఇలాంటి పనులన్నీ స్వహస్తాలతో చేసే పనుల క్రిందికే వస్తాయి. వీటన్నింటిని అల్లాహ్ ఇష్టపడతాడు. వీటి ద్వారా వచ్చే సంపాదన ధర్మ సమ్మతమైనది, చాలా శ్రేష్టమైనదీను. అందుకోసమే ముస్లిం ఏ పని చేసినా అతనికి పుణ్యఫలం లభిస్తుంది. నమాజ్, ఉపవాసాలతో పాటు పొలం దున్నటం, ఫ్యాక్టరీ నడపటం, కాయకష్టం చేయటం వీటన్నింటికీ పుణ్యాలు లభిస్తాయి.

ప్రజలకు ఇలాంటి సత్కార్యాల గురించి తెలుపుతూ ఇందుకోసం వారిని ప్రోత్సహించటం ముస్లిం పండితుల బాధ్యత. ఖుర్‌ఆన్ గ్రంథంలో అల్లాహ్ నమాజ్ నెలకొల్పండి, జకాత్ విధిధానం చెల్లించండి అని అనేక చోట్ల ప్రస్తావించాడు. ప్రతి ముస్లిం ఆరాధన చేస్తూ ధర్మసమ్మతమైన మార్గంలో సంపాదించి ధనికులయి జకాత్ చెల్లించగలగాలి. అదే ఈ ఆయత్ లక్ష్యం. ఇస్లామీయ చరిత్రలో ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ లాంటి సుప్రసిద్ధ సహచరుల సంఘటనలు మనందరికి గర్వకారణం, ఆదర్శప్రాయం. ఇస్లాం ధర్మసేవ కోసం, దైవ ప్రసన్నతకోసం వారు తమ సంపదనంతా ధారపోశారు.

హదీసువేత్తలు వ్యాపార విశిష్ఠతను దృష్టిలో ఉంచుకునే నమాజ్,రోజా జకాత్ ప్రకరణాలతో పాటు వాణిజ్య ప్రకరణాన్ని (కితాబుల్ బుయు) ను కూడా తమ హదీసు గ్రంథాల్లో పొందుపరిచారు. వ్యాపార, వాణిజ్యాలకు సంబంధించిన ఆదేశాలన్నీ అందులో మనకు లభిస్తాయి. ఏయే వ్యాపార కార్యాలు ధర్మ సమ్మతమో మరేవీ కావో బోధపడతాయి. వాటిని అధ్యయనం చేస్తే వ్యాపార నిబంధనలు మనకు తెలియటంతోపాటు ధార్మిక, ప్రాపంచిక ప్రయోజనాలు కూడా చేకూరుతాయి.

ఇమామ్ బుఖారీ (రహ్మాలై) భూమిపై, సముద్రంలో చేసే వ్యాపారాల గురించి వేర్వేరు అధ్యాయాల ద్వారా ఎన్నో విషయాలను తెలియపరిచారు. వాటిలో దైవ ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రవచనాలు ఎన్నో మనకు మార్గదర్శకం అవుతాయి. వాటి ద్వారా వాటి ఆవశ్యకత, ప్రాధాన్యత బోధపడుతుంది.



మిఖ్దామ్ (రజి) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: "స్వహస్తాలతో సంపాదించి తిన్న దానికంటే శ్రేష్ఠమైన తిండి మరేది కాజాలదు. నిశ్చయంగా దావూద్ (అలైహిస్సలాం) తమ స్వహస్తాలతో శ్రమించి ఆర్జించిన సంపాదనను భుజించేవారు". (సహీహ్ బుఖారీ)

హజ్రత్ హుజైఫా(రజి) కథనం ప్రకారం దైవ ప్రవక్త (స) పూర్వకాలానికి చెందిన ఒక వ్యాపారస్తుణ్ణి గురించి ఇలా ప్రస్తావించారు: పూర్వకాలంలో దైవదూతలు ఒక వ్యక్తి ప్రాణం తీసుకున్నారు. తరువాత అతన్ని "ప్రపంచం నుండి నీవేమైన మంచి పనులు తీసుకువచ్చావా"? ఇలా అడిగారు. దానికావ్యక్తి, నా దగ్గర పనిచేసే యువకులకు 'అభాగ్యులైన రుణగ్రస్తుల రుణాన్ని మాఫీ చేయండి' అని చెబుతూ ఉండేవాణ్ణి. అంతే. ఈ ఒక్క సత్కార్యాన్నే నా వెంట తీసుకొచ్చాను' అని బదులిచ్చాడు.

ఈ మాట చెప్పిన తరువాత దైవప్రవక్త ఇలా ఉద్బోధించారు: దైవాజ్ఞతో దైవ దూతలు కూడా ఆ వ్యక్తిని మన్నించారు. అతడు మన్నించబడ్డాడు. (సహీహ్ బుఖారీ) మనందరికి అల్లాహ్ అలాంటి సద్బుద్ధిని ప్రసాదించు గాక! ఆమీన్.

వ్యాపారమే కాకుండా హస్తకళలాంటి వృత్తులు కూడా మంచి జీవనోపాధిని కలుగజేస్తాయి. వాటిలో బట్టలు నేసీ, అల్లె పని చాలా ప్రధానమైనది. ఎందుకంటే మనిషికి తిండితోపాటు గుడ్డకూడా చాలా అవసరం కాబట్టి ఈ వృత్తి చేస్తే మనం జీవించటమేకాకుండా ఇతరులకు కూడా దుస్తుల్ని అందించగలం.

ఇమాం బుఖారీ (రజి) ఈ వృత్తికి సంబంధించి ఒక ప్రత్యేక అధ్యాయాన్నే ఏర్పరిచారు. ఆ కాలంలో బట్టలు నేసే ఒక స్త్రీ గురించి అందులో ప్రస్తావించారు. అబూ హాజం కథనం : నేను సహ్లా బిన్ సాద్ చెబుతుండగా విన్నాను. ఒక స్త్రీ ఒక బుర్దా (అంచు దుప్పటి) తీసుకొని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సన్నిధికి వచ్చింది. (ఈ సందర్భంగా సహ్ల్ బిన్ సాద్-బుర్దా అంటే ఏమిటో తెలుసా అని ప్రజల్ని ప్రశ్నించారు. అవును తెలుసు అంచుగల దుప్పటిని 'బుర్దా' అంటారని వారు సమాధనమిచ్చారు) ఆ స్త్రీ ఇలా అంది: దైవ ప్రవక్తా! దీనిని నేను నా స్వహస్తాలతో ప్రత్యేకంగా మీ కోసమే చేసి తీసుకువచ్చాను. దాని అవసరం ఉండటం చేత ఆయన (స) దానిని స్వీకరించారు.

తరువాత ఆయన (స) దానిని తన అంగ వస్త్రంగా ధరించి బయటకు వచ్చే వారు. సమావేశంలో ఉన్న ఒక సహచరులు మదీనా నగర సుప్రసిద్ధవ్యాపారి అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి)-దైవప్రవక్తా(స)! ఆ వస్త్రాన్ని మీరు నాకు ప్రసాదించరా! అని అడిగారు. 'సరే తీసుకో' అని చెప్పి అక్కడే కాసేపు కూర్చొని తరువాత ఇంటికి

teluguislam.net



వచ్చి ఆ వస్త్రాన్ని తీసి మడత పెట్టి అబ్దుర్రహ్మాన్ ఇంటికి పంపారు. దానిపట్ల ప్రజలు–ప్రవక్తకు కానుకగా ఇవ్వబడిన ఆ వస్త్రాన్ని మీరు అడగటం ఏమీ బాగా లేదు ఆయన (స) అడిగిన వారికి 'లేదు' అని చెప్పరని మీకు తెలుసుకదా" అని అబ్దుర్రహ్మాన్‌ని నిలదీశారు.

అపుడు అబ్దుర్రహ్మాన్ ఇలా అన్నారు: అల్లాహ్ సాక్షిగా! నేను ఆ వస్త్రాన్ని ఎందుకు కోరానంటే నేను మరణించిన తరువాత అదే నా శవవస్త్రం(కఫన్) కావాలని ఆశించాను. ఆయన ఆశించినట్లే అలాగే జరిగిందని సహల్ తెలియజేశారు. అబ్దుర్రహ్మాన్ మరణం తరువాత ఆ దుప్పటిని ఆయన శవవస్త్రం (కఫన్)గా ఉపయోగించటం జరిగింది.

కుట్టుపని, వడ్రంగి, కుమ్మరి–ఇలాంటివి అనేక వృత్తి విద్య, వృత్తుల గురించి ఇమామ్ బుఖారీ (రహ్మా) గారు తమ గ్రంథంలో పొందుపరచి, వాటిలో ఏ వృత్తి పని చేయటానికి కూడా తలవంపుగా భావించవలసిన అవసరంలేదని నిరూపించారు. ఎందుకంటే కొందరు వాటిని నామోషిగా, సిగ్గు చేటుగా భావిస్తారు. అలా భావించటం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రవచనాలకు విరుద్ధం. వ్యవసాయం కూడా మంచి వృత్తే. దాని ద్వారా కూడా జీవనోపాధిని సమకూర్చుకోవచ్చు.

**సహోదరులారా!**

నేడు ముస్లింలు తమ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచుకోవలిసిన అవసరం ఎంతైనా ఉంది. అల్లాహ్ వారి కార్యాచరణలోను, ఆలోచనల్లోనూ విజయాన్ని, ధృఢసంకల్పాన్ని ప్రసాదించుగాక! ఆమీన్.

ఇతర జాతుల్లో ఎన్నో సంస్థలు, కమిటీలు తమ జాతి యువకుల నిరుద్యోగ సమస్యను దూరం చేసే పనిలోనే తలమునకలై ఉన్నాయి. మనం కూడా నిరుద్యోగ నిర్మూలన బాధ్యతను స్వీకరించి మన యువకులకు వీటి గురించి తెలిపి వారికి బ్రతుకు తెరువు మార్గాలను చూపుదాం. నేడు జీవనోపాధికి పుష్కలంగా అవకాశాలు ఉన్నాయి. అత్యాధునిక ఉపాధి పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. అత్యాధునిక పరికారాలను అందుబాటులోకి తీసుకురావటం కూడా గొప్ప పుణ్యకార్యమే. మన యువతను కూడా వారికి నచ్చిన రంగాల్లోకి పంపితే వారు కూడా ఎన్నో కర్మాగారాల, వ్యాపార మార్కెట్లకు యజమానులు అవుతారు.

అల్లాహ్ మనందరికీ సద్బుద్ధిని ప్రసాదించు గాక! ఆమీన్.



# 6. నమాజ్ విశిష్టత, ఆదేశాలు

وَاسْتَعِينُوا بِالصَّبْرِ وَالصَّلٰوةِ ۚ وَإِنَّهَا لَكَبِيرَةٌ إِلَّا عَلَى الْخٰشِعِينَ ۝
الَّذِينَ يَظُنُّونَ أَنَّهُمْ مُّلٰقُوا رَبِّهِمْ وَأَنَّهُمْ إِلَيْهِ رٰجِعُونَ ۝

**మీరు ఓర్పు ద్వారా, నమాజు ద్వారా సహాయం అర్థించండి. నిశ్చయంగా ఇది కష్టమయిన పనే. కాని (అల్లాహ్‌కు) భయపడేవారికి (ఇది సులువైన పని). (ఎందుకంటే) ఎట్టకేలకు తాము తమ ప్రభువును కలుసుకోవాల్సి ఉందనీ, ఆయన వైపునకే మరలిపోవలసి ఉందనీ వారు నమ్ముతారు.**

***(అల్ బఖర 2 : 45, 46)***

నేటి జుమా ఖుత్బాలో నమాజ్ విశిష్టతలను, ఆదేశాల గురించి తెలుసుకుందాం. ఇస్లాంలో నమాజ్ అతి కీలకమైనది. ఇస్లాం నమాజ్‌కు ఎంతో ప్రాముఖ్యం ఇచ్చిం. సద్వచనం(కలిమయె తయ్యిబా) తరువాత ఇస్లాం ధర్మానికి రెండవ మూల స్తంభం నమాజ్. ఈ మూలస్తంభం మీదనే ఇస్లాం ఉంది. ఖుర్ఆన్, హదీసుల్లో నమాజ్ ప్రాముఖ్యత గురించి తెలుపబడింది. సూరె బఖరలో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

నిశ్చయంగా, అది (నమాజ్) వినమ్రులైన వారికి తప్ప ఇతరులకు ఎంతో కష్టతరమైనది. అట్టివారు తాము, తమ ప్రభువును నిశ్చయంగా, కలుసు కోవలసి ఉందనీ, ఆయన వైపునకే మరలిపోవలసి ఉందనీ నమ్ముతారు. *(అల్ బఖర 2:45,46)*

అబూ హురైరా (రజి) కథనం ప్రకారం దైవ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విధంగా ప్రవచించారు:

**إن أول ما يحاسب به العبد يوم القيامة من عمله صلاته**

**فإن صلحت فقد أفلح وأنجح وإن فسدت فقد خاب وخسر**

teluguislam.net



**"ఇన్న అవ్వల మాయుహాసబు బిహిల్ అబ్దు యౌమల్ ఖియామతి మిన్ అమలిహి సలాతుహు ఫ ఇన్ సలుహత్ ఫఖద్ అఫ్లహ వఅన్జహ వ ఇన్ ఫసదత్ ఫఖద్ ఖాబ వ ఖసిర"** "తీర్పుదినాన అల్లాహ్ సమక్షంలో దాసుని ఆచరణలు ఉంచబడినపుడు మొట్టమొదట నమాజ్ గురించి లెక్క అడుగబడు తుంది. నమాజ్ లెక్క సరిగా ఉంటే అతడు విజయం, మోక్షం పొందుతాడు. ఒకవేళ నమాజ్ లెక్క సరిగా లేకపోతే నష్టం, పరాభవం పొందుతాడు.

సూరె ఇబ్రాహీమ్‌లో అల్లాహ్ ఆదేశం ఇలా ఉంది:

قُلْ لِّعِبَادِیَ الَّذِیْنَ اٰمَنُوْا یُقِیْمُوا الصَّلٰوةَ وَیُنْفِقُوْا مِمَّا رَزَقْنٰهُمْ سِرًّا وَّعَلَانِیَةً
مِّنْ قَبْلِ اَنْ یَّاْتِیَ یَوْمٌ لَّا بَیْعٌ فِیْهِ وَلَا خِلٰلٌ ○

**"ప్రవక్త ! విశ్వసించిన నా దాసులకు ఎలాంటి క్రయవిక్రయాలు, స్నేహ సహకారాలు జరగని దినం రాక ముందే నమాజు వ్యవస్థ నెలకొల్పమని, మేము ప్రసాదించిన సంపద నుండి రహస్యంగానూ, బహిరంగంగానూ దాన ధర్మాలు చేయమని చెప్పు"** ***(అల్ ఇబ్రాహీమ్ 14 : 31)***

మరో చోట ఇలా ఆజ్ఞాపించబడింది.

مُنِیْبِیْنَ اِلَیْهِ وَاتَّقُوْهُ وَاَقِیْمُوا الصَّلٰوةَ وَلَا تَكُوْنُوْا مِنَ الْمُشْرِكِیْنَ ﴿31﴾

**"ఆయనకు భయపడుతూ ఉండండి. నమాజును స్థాపించండి. బహుదైవారాధకులతో కలసిపోకండి."** ***(అర్ రూమ్ 30 : 31)***

నమాజ్ వ్యవస్థను నెలకొల్పి, వాటిని పరిరక్షించునే వారే నిజమైన విశ్వాసులు. నమాజ్ వ్యవస్థలో అశ్రద్ధ, బద్ధకాన్ని ప్రదర్శిస్తూ నమాజులు సక్రమంగా చేయనివారు నమాజీలు అనిపించుకోరు. విశ్వాసులకు, అవిశ్వాసులకు మధ్యగల విచక్షణా రేఖ నమాజ్. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విధంగా ఉద్బోధించారు:

**"الْعَهْدُ الَّذِي بَيْنَنَا وَبَيْنَهُمُ الصَّلَاةُ، فَمَنْ تَرَكَهَا فَقَدْ كَفَرَ "**

**"అల్ అహ్‌దుల్లజీ బైననా వ బైనహుమ్ అస్సలాతు ఫమన్ తరకహా ఫఖద్ కఫర"** "మన(ముస్లింల) మధ్య వారి (తిరస్కారుల మధ్య) ఉన్న ఒప్పందమే నమాజ్. దాన్ని త్యజించిన వాడు తిరస్కారానికి ఒడిగట్టినవాడు.

*(ముస్నద్ అహ్మద్, సునన్ తిర్మిజి)*



మరో హదీసులో ఈ విధంగా ప్రవచించారు: "ఇస్లాం మూలాధారాలు మూడు. ఒకటి, అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యదైవంలేదని సాక్ష్యమివ్వటం, రెండు నమాజ్ స్థాపన, మూడు రమజాన్ ఉపవాసాలు. ఈ హదీసులో జకాత్, హజ్‌ల ప్రస్తావన లేదు. ఎందుకంటే అవి రెండు ధనికులపై మాత్రమే విధిగా ఉంటాయి. కలిమా , నమాజ్, రమజాన్ ఉపవాసాలు ఈ మూడు ప్రతి మనిషిపై తప్పనిసరి. ధనికుడైనా, నిరుపేదైనా వీటిని పాటించి తీరాలి. కాని జకాత్, హజ్ విధులను ధనికులైన ముస్లింలు మాత్రమే నెరవేర్చగలరు.

జాబిర్ (రజి. అన్హు) కథనం: దైవ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: **بَيْنَ الرَّجُلِ، وَبَيْنَ الشِّرْكِ – أَوِ الْكُفْرِ – تَرْكُ الصَّلَاةِ** **"బైనర్రజులి వబైనష్షిర్కి అవిల్ కుఫ్రి తర్కుస్సలాతి"** (విశ్వాసి అయిన) ఒక వ్యక్తి- కుఫ్ర్, బహుదైవారధన (షిర్క్)లకు మధ్యగల విచక్షణా రేఖా నమాజ్‌ని పరిత్యజించటమే. *(సహీహ్ ముస్లిం)*

అంటే నమాజ్‌ను త్యజించువాడు తిరస్కారి. నమాజ్ స్థాపన విశ్వాసానికి ప్రతీక. ఇక్కడ గమనార్హమైన విషయం ఇంకొకటి కూడా ఉంది. అదేమంటే- ఏ నమాజు విశ్వాసానికి నిదర్శనంగా పేర్కొనబడిందో, ఏ నమాజు క్షమాభిక్షకు సాధన మని చెప్పబడిందో, ఏ నమాజు ముక్తికి సోపానమని అనబడిందో అది వేళకు చేయబడే నమాజు, క్రమం తప్పకుండా చేసే నమాజు అని మరువరాదు. నిర్ధారిత వేళల్లో జమాఅత్‌తో కలిసి చేయకుండా అప్పుడప్పుడూ తమకు వీలు కుదిరినప్పుడు, లేక సౌకర్యం ఉన్నప్పుడు చేసే నమాజు వల్ల ఒరిగేదేమీ ఉండదు. పైగా అటువంటి నమాజు వారి పాలిట భారంగా పరిణమిస్తుంది.

అనస్ (రజి అన్హు) కథనం ప్రకారం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విధంగా ప్రవచించారు: ఎవరయినా ఉన్నత రీతిలో వుజూ చేసి, తొలివేళలో నమాజ్ కై నిలిచి అత్యంత భయభక్తులతో, వినమ్రతతో, ఏకాగ్రతతో ఖియామ్, రుకూ, సజ్దాలు చేస్తూ , నమాజ్ ముగిస్తే.. నమాజ్ అతన్నుండి సెలవు తీసుకునేటపుడు మెరిసే కాంతిలా ప్రజ్వలిస్తూ నమాజీతో ఇలా ఉంటుంది. "అల్లాహ్ నిన్ను కూడా రక్షించుగాక". మరెవ్వరయితే తొలివేళలో కాకుండా ఉన్నత రీతిలో వుజూ చేయక, భయభక్తులలో అత్యంత వినమ్రతతో ఖియాం, రుకూ, సజ్దాలు చేయడో నమాజ్ అతన్నుండి సెలవు తీసుకుని వెళ్తూ కాంతి హీనంగా నిస్తేజంగా ఉంటుంది. ఇక

teluguislam.net



ఆ నమాజ్ అల్లాహ్ కోరినంత ఎత్తుకు చేరుకున్న మీదట పాతగుడ్డ పేలిక మాదిరిగా అది ఆ నమాజీ ముఖంపై తిప్పి కొట్టబడుతుంది.

దైవప్రవక్త (స) వారి ఈ ప్రసంగాన్ని బట్టి సజావుగా చేయబడే నమాజు ఏదో, ఎటువంటి నమాజు దైవసన్నిధిలో ఆమోదముద్ర పొందుతుందో, ఏ నమాజు త్రోసిపుచ్చబడుతుందో స్పష్టంగా అవగతమవుతోంది. కాకి ముక్కుతో టకటకా పొడిచినట్లు ఆదరాబాదరాగా సజ్దాలు చేసి, కేవలం కొన్ని నిమిషాల్లోనే బోలెడన్ని రకాతుల నమాజు ముగించే వారికి ఇది హెచ్చరిక. అలాంటి వారు అల్లాహ్‌కు భయపడాలి. మనసును అల్లాహ్‌యందే లగ్నం చేసి నింపాదిగా నమాజు చేయాలి. లేనిచో అట్టి నమాజు వారి పాలిట కష్టతరమవుతుంది.

ఇబ్నె మస్‌వూద్ (రజి) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రబోధించారు: **"తొలి వేళలో చేసే నమాజ్ ఆచరణలన్నింటిలోకెల్లా శ్రేష్ఠమైనది".** (సునన్ తిర్మిజి)

ఫర్జ్ నమాజ్‌ను సాముహికంగా మస్జిదులో జరపాలి. సామూహిక నమాజు సందర్భంగా చక్కగా వరుసలు తీరి నిలబడాలి. భుజానికి భుజం ఆనించి తిన్నగా నిలబడాలి. మధ్యలో ఖాళీని వదలకూడదు. కాని మనలో ఎంతమంది ఈ నియమాన్ని పాటిస్తున్నారో సమీక్షించుకోవాలి. అల్లాహ్ మనందరకీ మహాప్రవక్త ముహమ్మద్(స) విధానం ప్రకారం నమాజు చేసే సద్బుద్ధిని ప్రసాదించుగాక! (ఆమీన్)

**నమాజీ సోదరులారా!**

నమాజ్ గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒక ప్రసంగంలో ఇలా ప్రవచించారు: "మీలో ఎవరి ఇంటి ముందయినా సెలయేరు ప్రవహిస్తూ ఉందనుకోండి. ఆ ఇంటి అతను ఆ సెలయేరులో ప్రతీరోజు ఐదుసార్లు స్నానం చేస్తూ ఉంటే అతని ఒంటి మీద మురికి మిగిలుంటుందా?, అందుకు అనుచరులు 'లేదు అతని శరీరం మీద ఎలాంటి మురికీ మిగిలుండదు. అని బదులిచ్చారు. అపుడు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) "ఐదు పూటల నమాజ్ కూడా అంతే, అల్లాహ్ వాటి మూలంగా పాపాలను తుడిచిపెట్టేస్తాడు" అని చెప్పారు. తర్గీబ్ వ తర్హీబ్‌లో అనస్ (రజి) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రబోధించారు. "నిస్సందేహంగా ప్రతీ నమాజ్ వేళలో అల్లాహ్ తరఫున నియమించబడిన ఒక దైవదూత ఇలా అంటాడు. 'ఓ ఆదం సంతానమా! ఏ అగ్నిని నువ్వు మండించావో దాన్ని చల్లార్చటానికి లే, ఉపక్రమించు-నమాజు చేయి' (తబ్రానీ)



మనిషి ద్వారా పొరపాట్లు, తప్పులు జరిగినపుడు నరకాగ్ని భగ్గుమంటుంది. మంట ఎక్కువై పోతుంది. ఎందుకంటే అది అల్లాహ్ ఆగ్రహానిలయం కాబట్టి. నమాజు సమయం ఆసన్నమయినపుడు కరుణాకటాక్షాల ద్వారాలు తెరువబడతాయి. అపుడు ఆ దైవదూత ఇలా అంటూఉంటాడు: "ప్రజలారా! మన్నింపు మరియు కారుణ్య సమయం ఆసన్నమయింది. దైవారాధనకు ఉపక్రమించి నమాజ్ చేస్తూ అల్లాహ్‌ను క్షమాబిక్ష వేడుకోండి, మీ పాపాలు తుడిచివేయబడతాయి. నరకాగ్ని జ్వాలలు చల్లార్చబడతాయి".

మరో హదీసులో దైవ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ప్రతి నమాజు వేళ అయినపుడు దైవదూత ఎలుగెత్తి ప్రకటిస్తాడు: "ఓ ఆదం సంతానమా! నీవు నీ పాపాల ద్వారా ఏ అగ్నిని రాజేశావో దాన్ని చల్చార్చుటకై నమాజు స్థాపించు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రవచనాలను శిరసావహిస్తూ సత్యసన్మార్గగాములు నమాజుకై ఉపక్రమించి తహారత్ (పరిశుద్ధ)ను పొంది వుజూ చేసుకుని నమాజు చేస్తారు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ఉద్బోధించారు: "ప్రతి నమాజు దాని క్రితం నమాజ్ వరకు, ప్రతి జుమా మరో జుమా వరకు రమజాన్ మాసం-సంవత్సరం పొడుగునా జరిగే పాపాలకు పరిహారం అవుతుంది అయితే అందుకోసం కబాయిర్ (ఘోరపాపాలకు) దూరంగా ఉండాలి. (సహీహ్ ముస్లిం)

పాపాలను తుడిచి వేసుకునేందుకు నరకాగ్నిని చల్లార్చేందుకు వారు నమాజు చేస్తే రెండు నమాజువేళల మధ్య జరిగే పాపాలు కూడా క్షమించబడతాయి. ఫజర్ నమాజు చేసిన వ్యక్తి జొహార్ నమాజు చేస్తే వాటి మధ్య జరిగిన పాపాలు తుడిచివేయబడతాయి. ఇలా ఐదు పూటల నమాజులు వాటి మధ్య జరిగే పాపాలకు పరిహారం (కఫ్ఫారా) అవుతాయి. ఇలా ప్రతీ నమాజును భక్తి శ్రద్ధలతో చేసే వ్యక్తి జన్నతీగా (స్వర్గవాసి) గా తెల్లవార్చుతాడు. నమాజుల పట్ల అశ్రద్ధ చూపేవాడు, నమాజులను త్యజించేవాడు వాడి పాపాల మూలంగా నరకవాసి (జహన్నమీ)గా ఉదయం గడుపుతాడు. నమాజ్ మామూలు విషయం కాదు. దీనికి ఇస్లాంలో ఎంతో ప్రాముఖ్యత, విశిష్ఠతా కలదు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తమ అంతిమ దినాల్లో వ్యాధిగ్రస్తునిగా ఉన్న సమయంలో కూడా నమాజు గురించే

teluguislam.net



పదే పదే తాకీదు చేసేవారు. ఉమ్మె సలమా (ర.అన్హ) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఏ వ్యాధితో మరణించారో ఆ వ్యాధిలో ఉన్నప్పుడు నమాజు గురించి బానిసల గురించి పదే పదే చెప్పేవారు. నమాజులను కాపాడమని, బానిసల పట్ల మృదువుగా వ్యవహరించమని తాకీదు చేసేవారు.

అల్లాహ్ విధిగా నిర్ణయించిన ఐదుపూటల నమాజును ఎవరైతే చక్కని రీతిలో వుజూ చేసుకొని, తొలి వేళలో ప్రతీ నమాజును చక్కని రుకూ, సజ్దాలతో నిదానంగా, హుందాగా చేస్తారో అలాంటి వారికై అల్లాహ్ వాగ్దానం ఉంది. అల్లాహ్ అతన్ని క్షమిస్తాడు.

మరెవరైతే నమాజులను కాపాడుకోడో నమాజు వ్యవస్థను స్థాపించడో అలాంటి వారికి అల్లాహ్ వాగ్దానం లేదు. కాని వయీద్ (హెచ్చరిక) ఉంది. అల్లాహ్ అతన్నీ శిక్షిస్తాడు.

హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (ర.అన్హ) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రబోధించారు: "నమాజు తరువాత మస్జిదులో జిక్ర్ (నామస్మరణ) చేస్తూ సమయం గడపటం, జమాత్ కోసం, జిక్ర్ కోసం మస్జిదుకు నడిచి వెళ్ళటం, ఇబ్బందికర పరిస్థితుల్లో (చలికాలంలో) వుజూ పూర్తిగా చేయటం చల్లటి నీటితో వుజూ చేయుటకు మనసొప్పదు. కాని అలాంటి సమయంలో కూడా వుజూ చేయటం) ఇవన్నీ మనిషి పాపాలకు పరిహారాలు (కఫ్ఫారా).

ఇలా తన జీవితాన్ని గడిపి, ఆ స్థితిలోనే మరణించే వ్యక్తి పాపాల నుండి అప్పుడే తన తల్లి కడుపున పుట్టిన శిశువులా పవిత్రుడవుతాడు.

నమాజును స్థాపించటం వల్ల అతని ఇహలోకం, పరలోకమూ బాగు పడు తుంది. పాపాలన్ని ప్రక్షాళనమై నరకాగ్నికి దూరమై స్వర్గంలో చేర్చబడతాడు.

బురైదా అస్లమీ (ర.అన్హు) కథనం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విధంగా సువార్తనిచ్చారు: "చీకటి వేళల్లో మస్జిదుకు నడుచుకుంటూవచ్చే వారికి ప్రళయదినాన పరిపూర్ణకాంతి ప్రాప్తమవుతుందని శుభవార్త ఇవ్వండి".

(సునన్ తిర్మిజీ)

ఇలాంటి శుభవార్తలు ఒక్క నమాజును కూడా తప్పిపోకుండా జాగ్రత వహిస్తూ,



ఎవరైతే పరలోక సాఫల్య పుణ్యఫలాపేక్షతో సామూహిక నమాజులను చేస్తారో అలాంటి వారికే వర్తిస్తాయి. నమాజులను ఎగ్గొట్టేవారికి, అశ్రద్ధ, బద్ధకం, ఏమరుపాటు చూపే వారికి నరక విముక్తీ లభించదు, పరిపూర్ణ స్వర్గ కాంతీ లభించదు. వారు నరకపు చిమ్మచీకటిలో నరక యాతనలు అనుభవిస్తారు. ప్రళయదినాన ఫిర్ఔన్, ఖారూన్, హామాన్, ఉబైబిన్ ఖల్ఫ్ లాంటి దైవ తిరస్కారులతో లేపబడతారు.

అల్లాహ్ మనందరినీ అలాంటి శిక్షల నుండి, యాతనల నుండి కాపాడుగాక, ప్రతీ రోజు ఐదు పూటల నమాజులను చిత్తశుద్ధితో దైవ ప్రవక్త (స) సూచించిన పద్ధతిలో చేసే భాగ్యాన్ని ప్రసాదించుగాక, నమాజు ద్వారా ఇహలోకంలో కంటి చలువను, ప్రశాంతతను ప్రసాదించి, పరలోకంలో పరిపూర్ణ కాంతి, స్వర్గాన్ని ప్రసా దించుగాక! ఆమీన్. యా రబ్బల్ ఆలమీన్.

teluguislam.net



# 7. మహా ప్రవక్త (స) ఆదర్శజీవితం

**لَقَدْ كَانَ لَكُمْ فِي رَسُولِ اللَّهِ أُسْوَةٌ حَسَنَةٌ لِّمَن كَانَ يَرْجُو اللَّهَ وَالْيَوْمَ الْآخِرَ وَذَكَرَ اللَّهَ كَثِيرًا**

**నిశ్చయంగా దైవప్రవక్తలో మీ కొరకు అత్యుత్తమ ఆదర్శం ఉంది- అల్లాహ్ పట్ల, అంతిమ దినం పట్ల ఆశ కలిగి ఉండి, అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించే ప్రతి ఒక్కరి కొరకు. *(అల్ అహ్‌జాబ్ 33 : 21)***

**ముస్లిం సోదర సోదరీమణులారా!**

దైవ ప్రవక్త ముహమ్మద్ (స) పవిత్ర జీవితచరిత్ర, గుణగణాలు అలవాట్లు మహితోక్తుల గురించి నేటి జుమా ఖుత్బాలో తెలుసుకుందాం.

దైవ ప్రవక్త ముహమ్మద్ (స) పూర్తి పవిత్ర జీవితం 63 సంవత్సరాలు. ఆ పవిత్ర జీవితంలో అనేక భాగాలు, అంశాలు, కోణాలు ఉన్నాయి. వాటన్నింటిని లిఖించడానికి ఎన్ని గ్రంథాలైనా సరిపోవు. కాబట్టి ఆయన (స) జీవిత చరిత్రలోని కొన్ని ముఖ్యమైన ఘట్టాలను, అంశాలను తెలుసుకుందాం. తత్ఫలితంగా మనం మహనీయ ముహమ్మద్ ప్రవక్త (స) జీవిత చరిత్రను అస్వాదించి, వారి గుణగణాలు, పవిత్ర అలవాట్లను ఆదర్శంగా మన జీవితాలను మలచుకుందాం. దైవ ప్రవక్త (స) జీవిత చరితంలోని విభాగాలన్నీ మనకు ఆదర్శమే. వారి ఆంతర్యమూ, బాహ్యాము సర్వము మనకు ఆదర్శప్రాయమే. ఉమ్మహాతుల్ మోమినీన్ ఆయిషా (రజి. అన్హా) తో కొందరు దైవ ప్రవక్త (స) గుణగుణాలు, నైతిక లక్షణాలను గురించి ప్రశ్నించగా అమె ఇలా బదులిచ్చారు: **كَانَ خُلُقُهُ الْقُرْآن** **"కాన ఖులుఖుహుల్ ఖుర్ఆన్"** ఏమిటి మీరు ఖుర్ఆన్ చదవరా? ఆయన గుణగుణాలు ఖుర్ఆన్ ప్రబోధనలకు ప్రతిబింబం".

సత్యప్రదాత ముహమ్మద్ (స) గుణగణాలన్నీ దైవ గ్రంథం ఖుర్ఆన్‌లో ప్రస్తావించబడ్డాయి. అందుకే అల్లాహ్ ఆ మహాప్రవక్తను నైతిక శిఖరాల మకుటంగా అభివర్ణించాడు. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: **وَإِنَّكَ لَعَلَىٰ خُلُقٍ عَظِيمٍ** **"వ ఇన్నక**



**లఅలా ఖులుఖిన్ అజీమ్"** ఓ ప్రవక్తా! మీరు నైతికంగా ఉన్నత శిఖరాన్ని అధిరోహించి ఉన్నారు. *(అల్ ఖలమ్ 68:4)*

సృష్టికర్త అల్లాహ్ తన అంతిమ ప్రవక్తను యావత్తులోకానికి కారుణ్యమూర్తిగా చేసి ప్రభవింపజేశాడు. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: **وَمَا أَرْسَلْنَاكَ إِلَّا رَحْمَةً لِّلْعَالَمِينَ** **"వమా అర్‌సల్నాక ఇల్లా రహ్మతల్లిల్ ఆలమీన్"**. ఓ ముహమ్మద్(స)! మేము నిన్ను సమస్త లోకవాసుల కోసం కారుణ్యంగా చేసి పంపాము.

*(అల్ అంబియా 21 : 107)*

ఆయన పవిత్ర జీవితంలోని ప్రతి కోణంలో ఒక ప్రత్యేకత ఉట్టిపడుతూ ఉంది. ఆయన చరిత్ర సైతం ఒక నిండు వెన్నెల. ఆ పవిత్ర చరిత్రలోని కొన్ని ముఖ్య ఘట్టాలను, భాగాలను ఇప్పుడు తెలుసుకుందాం.

ఆయిషా సిద్దీఖా (రజి.అన్హా) ఆయన(స) నిరాడంబరత, ఐహిక అనాస్తకత గురించి ఇలా తెలుపుతున్నారు. దైవ ప్రవక్త (స) దైవందిన జీవితం ఎలా ఉండే దంటే, ఆయన తన పూర్తి జీవితంలో నిరంతరం ఏ రెండు రోజులు కూడా జొన్న రొట్టెలు కడుపు నిండా తినలేదు. అలాంటి అవకాశం కూడా ఆయనకు ఏనాడూ కలుగలేదు. (సునన్ తిర్మిజీ)

ఆయన ప్రత్యేక సేవకుడైన అనస్ (రజి) ఇలా తెలిపారు: ఒక రోజు దైవ ప్రవక్త(స) బాగా ఆకలిగా ఉన్నారు. ముఖకవళికలు ఆయన ఆకలి వేదనను ప్రస్ఫుటం జేస్తున్నాయి. వారి పరిస్థితిని గ్రహించిన నేను జొన్న రొట్టెను కాస్త కొవ్వు పదార్థాన్ని తీసుకుని వారి సన్నిధికి చేరాను. దాంతో ఆయన తమ ఆకలి తీర్చుకున్నారు. ఆ సమయంలో ఆయన తన యుద్ధ కవచాన్ని కొన్నిసేర్ల (ధాన్యానికి) బదులుగా తాకట్టు పెట్టి ఉన్నారు. (సునన్ తిర్మిజీ)

ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (స) ఒకసారి చాపపై పడుకుని ఉండటం చూశాను. ఆయన పవిత్ర దేహంపై ఆ చాప గుర్తులు కూడా చూశాను. ఆయన బాధను చూసి "ప్రవక్తా! ముస్లింలకు భోగభాగ్యాలు లభించాలని మీరు దుఆ చేయండి "కిస్రా, ఖైసర్ లాంటి అవిశ్వాసులకు సిరిసంపదలెలా ఉన్నాయో చూడండి? అని అన్నాను. అది విన్న దైవ ప్రవక్త (స) "ఓ ఉమర్! నీవు కూడా ఇలాంటి మాటలే పలుకుతావా? అవిశ్వాసులకు ఈ తాత్కాలిక ప్రాపంచిక భోగవిలాసాలే కాని మనకు

teluguislam.net



శాశ్వతస్వర్గం తయారు చేయబడి ఉంది. అనే ఈ విషయం పట్ల నీకు సంతోషం లేదా?" అని అన్నారు. *(సునన్ తిర్మిజీ)*

దైవ ప్రవక్త (స) తన నిత్యజీవితంలో సదా ఇలా దుఆ చేసేవారు: ఓ ప్రభూ! జీవితాంతం నన్ను ఓ నిరుపేదగా ఉంచు నిరుపేదగానే నాకు మృత్యువు ప్రసాదించు, ప్రళయదినాన నిరుపేదలతోనే నన్ను నిలబెట్టు". నిరుపేదగా ఉండటం అంటే తన కుటుంబం సదా ఆకలితో అలమటిస్తూ ఉండాలని భావం కాదు. స్వయంగా ఆయనే ఆకలి అలమటల నుండి శరణుకోరేవారు. దానర్థం తన మనసులో కృతజ్ఞతా భావం, అణుకువ, వినమ్రత జనించటం. గర్వం అహంకారం లాంటి చెడు లక్షణాల నుండి మనసులను పవిత్రం చేయటం.



# 8. ముహర్రం మాస ఆదేశాలు

**ప్రియసోదరులారా!**

అల్లాహ్ అనుగ్రహాలకు కృతజ్ఞతలు తెలుపండి. అల్లాహ్ ఆదేశం :

إِنَّ عِدَّةَ الشُّهُورِ عِندَ اللَّهِ اثْنَا عَشَرَ شَهْرًا فِي كِتَابِ اللَّهِ يَوْمَ خَلَقَ السَّمَاوَاتِ وَالْأَرْضَ
مِنْهَا أَرْبَعَةٌ حُرُمٌ ذَٰلِكَ الدِّينُ الْقَيِّمُ فَلَا تَظْلِمُوا فِيهِنَّ أَنفُسَكُمْ

**"నిశ్చయంగా నెలల సంఖ్య అల్లాహ్ దగ్గర-అల్లాహ్ గ్రంథంలో పన్నెండు మాత్రమే. ఆయన ఆకాశాలను, భూమిని సృష్టించిన రోజునుంచీ (ఈ లెక్క ఇలాగే సాగుతున్నది). వాటిలో నాలుగు మాసాలు నిషిద్ధమైనవి (గౌరవ ప్రదమైనవి.) ఇదే సరైన ధర్మం. కాబట్టి ఈ మాసాలలో మీకు మీరు అన్యాయం చేసుకోకండి. ముష్రిక్కులు మీ అందరితో పోరాడు తున్నట్లే మీరు కూడా వారందరితో పోరాడండి. అల్లాహ్ భయభక్తులుగల వారికి తోడుగా ఉంటా దన్న సంగతిని తెలుసుకోండి."**

***(తౌబా 9 : 36)***

**ముస్లిం సహోదరులారా!**

మనం దైవానుగ్రహాలకు కృతజ్ఞతలు చెల్లించాలి. అల్లాహ్ తన గ్రంథంలో ఏమంటున్నాడంటే,

**ఓ నా దాసులారా! మీరు గనక నా అనుగ్రహాలకుగాను కృతజ్ఞులై ఉంటే, నేను మీకు మరింతగా అనుగ్రహిస్తాను. ఒకవేళ మీరు గనక నా మేళ్ళను మరిచి పోతే నా శిక్ష తీవ్రంగా ఉంటుందన్న సంగతిని మరువకండి.**

కాబట్టి మనం దైవానుగ్రహాల విలువను తెలుసుకోవాలి. అంటే అల్లాహ్ మేళ్ళను, వరాలను కాపాడుకోవాలి. వాటి ద్వారా అభివృద్ధి చెందాలి. ఒకవేళ అల్లాహ్ ఎవరికైనా ధర్మసమ్మతమైన ఉపాధిని ప్రసాదిస్తే, దాన్ని కాపాడుకోవాలి.

teluguislam.net



ఎవరికైనా విద్యాబుద్ధులు అబ్బితే వాటి ద్వారా లాభం పొందాలి. ఇతరులకు కూడా లాభం చేకుర్చాలి. అయితే అల్లాహ్ మనకు ప్రసాదించిన అనుగ్రహాలోకెల్లా అతి ముఖ్యమైన అతివిలువైనది 'జీవితం' అల్లాహ్ అనుగ్రహం వల్లే మనం మన జీవితంలో మరో పవిత్ర ముహర్రం మాసంను పొందాము. ముహర్రం అంటే నిషిద్ధమైన, పవిత్రమైన, గౌరప్రదమైన నెల. అల్లాహ్ నాలుగు నెలలను పవిత్ర మాసాలుగా నిర్ణయించాడు. అవి చాలా పవిత్రమైనవి. అందులో యుద్ధాలు, పోరాటాలు నిషిద్ధం. ఈ నెలల్లో చాలా గౌరవ ప్రదంగా పవిత్రంగా గడపాలి. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: **"నిశ్చయంగా, నెలల సంఖ్య అల్లాహ్ దగ్గర పన్నెండు నెలలు మాత్రమే ఇది భూమ్యా కాశాలు సృష్టించిన దినం నుండి అల్లాహ్ గ్రంథంలో వ్రాయబడి ఉంది. వాటిలో నాలుగు నిషిద్ధ మాసాలు. ఇదే సరైన ధర్మం. కావున వాటిలో మీకు మీరు అన్యాయం చేసుకోకండి. బహుదైవారాధకులతో అందరూ కలసి పోరాడండి. ఏ విధంగానైతే వారందరూ కలిసి పోరాడుతున్నారో, నిశ్చయంగా, అల్లాహ్ దైవభీతి గలవారితోనే ఉంటాడని తెలుసుకోండి.** (తౌబా 9 : 36)

12 నెలల్లో 4 మాసాలు నిషిద్ధమైనవి. అవి రజబ్, జిల్‌ఖాయిదా, జిల్‌హిజ్జ, ముహర్రం. ఈ మాసాల్లో నే అరబ్బులు వ్యాపారాలు, వాణిజ్యాలను ముమ్మరం చేసేవారు. యుద్ధాలను, పోరాటాలను నిలిపివేసేవారు. యుద్ధాలు చేయటం హరాం. ఇస్లాం కూడా ఈ నాలుగు నెలలనే పవిత్ర నిషిద్ధ మాసాలుగా నిర్ణయించింది.

అందులోని మొదటి నెల ముహర్రం.

అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి. అన్హు) కథనం ప్రకారం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మదీనా వలస వచ్చినప్పుడు యూదులను ఆషూరా దినాన (ముహర్రం 10 తేదీన) ఉపవాసం పాటించటం చూశారు. కారణం అడిగితే ఇది మూసా (అలైహిస్సలాం) మరియు ఇస్రాయీల్ సంతతి వారికి వారి శత్రువు (ఫిర్ఔన్) నుండి అల్లాహ్ విముక్తి ప్రసాదించిన రోజు అనీ, ఇందుకు గాను కృతజ్ఞతాభావంతో మూసా(అ) ఈ రోజున ఉపవాసం పాటించారని యూదులు తెలిపారు. అది విన్న దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: మూసా(అ) తో నాకున్న సంబంధం మీకన్నా పటిష్టమైనది. కాబట్టి ఆషూరా రోజు ఆయన(అ) స్వయంగా ఉపవాసం ఉండటమేగాక , తన సహచరులను కూడా ఉపవాసం పాటించాల్సిందిగా తాకీదు చేశారు. (ముస్లిం)



రమజాన్ ఉపవాసాల తరువాత అత్యంత శ్రేష్ఠమైన ఉపవాసం ముహర్రం నెల ఉపవాసమే అని మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సెలవిచ్చారు. (ముస్లిం)

ఆషూరా ఉపవాసం గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను ప్రశ్నించగా అది గడిచిన ఒక సంవత్సరపు పాపాలను తుడిచేస్తుందని వివరించారు. (ముస్లిం)

**ఇస్లాం సోదరులారా!**

పవిత్ర ముహర్రం నెల ఇస్లామీయ సంవత్సరంలోని అత్యంత శ్రేష్ఠత గల నెల. హిజ్రీ సంవత్సరం ఈ నెలతోనే ప్రారంభమవుతుంది.

ఈ పవిత్ర మాసంలోని పదవ తేదీన దైవ ప్రవక్త (స) ప్రియ మనవడు హుసైన్ (రజి)అమరగతి పొందిన సంఘటన చరిత్రలో అత్యంత విషాదకర సంఘటన. **"ఇన్నాలిల్లాహి వఇన్నా ఇలైహి రాజివూన్.**

హుసైన్ (రజి) అమరగతి సంఘటన అనేక విధాలుగా ప్రచారంలో ఉంది. హజ్రత్ హుస్సేన్ (రజి) విశిష్ఠతను, ఘనతలను పట్టించుకోని ఆయన విరోధులు ఆయన్ని అతీదారణంగా హతమార్చారు.

అల్లాహ్ మనందరి తరపునుండి అమరుడు హుసైన్‌పై శాంతి కరుణలు కురుపించుగాక. అల్లాహ్ విధివ్రాత ప్రకారం హుస్సేన్ (రజి) అమరగతి నొందారు. అలాంటి అమరవీరుల గురించి అల్లాహ్ ఖుర్ఆన్‌లో ఇలా ప్రబోధించాడు:

وَلَا تَقُولُوا لِمَن يُقْتَلُ فِي سَبِيلِ اللَّهِ أَمْوَاتٌ ۚ بَلْ أَحْيَاءٌ وَلَٰكِن لَّا تَشْعُرُونَ ۝

**"అల్లాహ్ మార్గంలో చంపబడిన వారిని మృతులని అనకండి. నిజానికి వారు సజీవులుగా ఉన్నారు, కాని మీరు గ్రహించలేరు."**

***(అల్ బఖర 2 : 154)***

teluguislam.net



# 9. ఇస్లాం అమరవీరులు

وَلَا تَقُوْلُوْا لِمَنْ يُّقْتَلُ فِىْ سَبِيْلِ اللّٰهِ اَمْوَاتٌ ؕ بَلْ اَحْيَآءٌ وَّلٰكِنْ لَّا تَشْعُرُوْنَ ○

అల్లాహ్ మార్గంలో చంపబడినవారిని మృతులు అని అనకండి. వారు బ్రతికే ఉన్నారు. కాని ఆ విషయం మీకు అర్థం కాదు."

*(అల్ బఖర 2 : 154)*

**మహాశయులారా!**

పై ఆయతులో అల్లాహ్ ధన్యజీవుల గురించి ప్రస్తావించాడు. వారే ఇస్లాం మార్గంలో ప్రాణాలు అర్పించిన అమరవీరులు. అల్లాహ్ సన్నిధిలో వారికి మహోన్నత స్థానం ఉంది. మన ఊహకందని మహత్తర జీవితం, ఆనందం వారికి అక్కడ లభిస్తుంది. పవిత్ర ఖుర్ఆన్ గ్రంథంలో అమరవీరుల గురించి, వారి విశిష్ఠత గురించి పలు ఆయతుల్లో చెప్పబడింది.

దైవ ప్రవక్త ముహమ్మద్ (స) కాలంలో అధర్మంగా, మోసగించబడి ప్రాణాలు కోల్పోయిన ఆ ప్రముఖ అమరవీరుల గాథలను ఈ రోజు తెలుసుకుందాం. కాని కరుడుగట్టిన విరోధులు వారిని మోసగించి హతమార్చారు. పిరికిపందలైన తిరస్కారుల అలవాటే అది. సత్యవంతులను ఎదుర్కొనే ధైర్యం వారికి లేకపోయింది. అందుకే మోసపూరిత సన్నాగాలు, కుట్రలు పన్ని వారిని అధర్మంగా హతమార్చారు. నేటి ఇస్లాం విరోధుల స్థితి కూడా అలానే ఉంది.

**ముస్లిం సోదరులారా!**

మీ ముందు చెప్పబోయే ఈ సంఘటన ఉహద్ యుద్ధం తరువాత హిజ్రీ శకం 4వ యేట జరిగింది. హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం.

ఉహద్ యుద్ధానంతరం తిరస్కారులు, ఇస్లాం విరోధులు ముస్లిం గౌరవ మర్యాదలను మట్టిపాలు చేయటానికి, వారికి నష్టం కల్గించే ప్రయత్నంలో తలమునకలై ఉన్నారు. కుట్రలు, కుతంత్రాలు పన్నసాగారు. ఇంత నష్టం జరిగిన ముస్లింల



యుద్ధ వ్యూహరచనలతో, శక్తిసామర్థ్యాలతో, సైన్యాన్ని సమీకరిస్తూ పుంజుకోవటాన్ని వారు సహించలేకపోయారు. ఇస్లాంను దెబ్బతీయటానికి, నష్టం, కీడు తలపెట్టడానికి మరో దుష్టాలోచన చేశారు. ఖురైషులంతా కలసి అజల్ ఖీరా జాతిలోని 7 గురు వ్యక్తులను ఎన్నుకుని వారిని మదీనాలో దైవ ప్రవక్త (స) సన్నిధికి పంపారు. వారు ముందుగా వేసుకున్న పథకం ప్రకారం, దైవ ప్రవక్త (స) ! మా వర్గమంతా ఇస్లాం స్వీకరించటానికి సిద్ధంగా ఉంది. వారి శిక్షణ కోసం ఇస్లామీయా బోధకులను మీరు మా వెంట పంపించండి అని అంటారు.

కావున దైవ ప్రవక్త ముహమ్మద్ (స) ప్రముఖ పది మంది అగ్రశేణి సహచరులను వారి వెంట పంపారు. ఉమర్ ఫారూఖ్ (రజి) తాతగారైన ఆసిమ్ బిన్ సాబిత్ నాయకత్వంలో ఆ దైవధర్మబోధకులు బయలు దేరారు. మక్కా, అస్ఫాన్ ప్రాంతాల మధ్యలోగల ఓదాంగ్ ప్రదేశానికి చేరుకున్న తరువాత ఆ విరోధులు హుజైల్ జాతికి చెందిన బనూ లహ్యాన్ వర్గం వారికి కబురు పంపింది. వెంటనే 200 మంది విలుకాండ్రు ప్రవక్త సహచరుల అన్వేషణలో బయలుదేరారు. వారి పాదచిహ్నాలను అనుసరిస్తూ అంచనావేస్తూ ఆ ధర్మ విరోధులు మదీనా నుండి తమ వెంట తెచ్చుకున్న ఖర్జూర పండ్లలను తిని పడేసిన చోటుకు చేరుకున్నారు. ఆ ఖర్జూర గింజలను చూసి ఆ తిరస్కారులు ఇవి కచ్చితంగా మదీన వాళ్ళవే అని అనుకున్నారు. వారి పాదచిహ్నాలను అనుసరిస్తూ బయలు దేరారు. చివరికి ఆసిమ్ (రజి) వారి సహచరులు విరోధులను చూసిన వెంటనే ప్రాణరక్షణకై అక్కడే ఉన్న కొండలోకి వెళ్ళారు.

వారిని పసిగట్టిన ఆ విరోధులు వారిని మోసగిస్తూ హత్యా సంకల్పంతో ఇలా ప్రకటించారు. ఆయుధాలను పడేసి కొండ దిగి క్రిందకి విచ్చేయండి, మీకూ-మాకూ మధ్య ఒక ఒప్పదం ఉంది. దాని ప్రకారం మేము మీలోని ఏఒక్కరికి హాని తలపెట్టం.

**సోదరసోదరీమణులారా!**

గుర్తుంచుకోండి, అలాంటి ఇస్లాం విరోధులంతా ఇలాంటి కుతంత్రాలే పన్నారు. మోసాలతోనే హతమార్చారు. 1400 సంవత్సరాల ఇస్లామీయ చరిత్ర సాక్షిగా ఇలాంటి కుట్రలతోనే ఇస్లాం విరోధులు, తిరస్కారులు ముస్లింలకు ఎంతో హాని తలపెట్టారు. నేడు కూడా ఇస్రాయీల్‌లోని యూదులు ఇలాంటి పన్నాగాలే పన్నుతున్నారు.

teluguislam.net



ఆ విరోధుల ఆ మాటలు విన్న నాయకుడు ఆసిం (రజి) ఇలా అన్నారు: నేను ఎట్టిపరిస్థితిల్లోనూ వారి శరణును స్వీకరించలేను. వారు ఒప్పందానికి కట్టుబడి ఉంటారన్న నమ్మకమూలేదు. "తరువాత ఓ అల్లాహ్"! మా స్థితి గురించి ప్రియ ప్రవక్త (స) కు తెలియ పరచు" అని ఆయన (స) అల్లాహ్‌ను వేడుకున్నారు. దాని తరువాత ఆ మోసగాళ్ళు బాణాల వర్షం కురిపించారు. ఆసిం (రజి)తో సహా ఏడుగురు అనుచరులు వీరమరణం పొందారు. మిగిలిన ముగ్గురు ప్రముఖ సహాబీలు ఖుబైబ్ అన్సారీ, ఇబ్నె వస్నా, అబ్దుల్లాహ్ బిన్ తారిఖ్ వారి ఒప్పందంపై కొండ దిగి వచ్చారు (సహీహ్ బుఖారీ)

ఆ ఇస్లాం శూరులు దిగి రాగానే తిరస్కారులు వారిని బంధించారు. అపుడు అబ్దుల్లాహ్ బిన్ తారిఖ్ (రజి) ఇలా అన్నారు: అల్లాహ్ సాక్షి! ఇది మీ మొదటి ద్రోహం. నేను మీతో రానేరాను. వీరమరణం పొందటానికైనా సిద్ధమే. ఆ తిరస్కారులు ఆయన్ను అక్కడే వధించారు.

ఖుబైబ్ (రజి) బద్ర్ సమరంలో మక్కా నాయకుడైన తిరస్కారి హారిస్ బిన్ ఆమీర్ ను హత మార్చారు. అందుచేత హారిస్ కుమారులు తన తండ్రి మరణానికి ప్రతీకారం తీర్చుకునేందుకు ఖుబైబ్‌ను చంపివేయలనుకొన్నారు.

తరువాత ఇస్లాం స్వీకరించిన హారిస్ కూతురు జైనబ్ (రజి) ఇలా తెలిపారు: చాలా రోజుల వరకు ఖుబైబ్ బందీగా నా దగ్గరే ఉన్నారు. ఆ సమయంలో నేను ఆయనలోని ఎన్నో మంచిలక్షణాలను చూశాను. సత్యతిరస్కారులు ఆయనకు మరణ శిక్ష విధించే రోజున ఖుబైబ్(రజి) అల్లాహ్ సన్నిధికి చేరుకునే ముందు నాభి క్రింది వెంట్రుకలను తొలగించుకుని పరిశుభ్రత, పరిశుద్ధతలను పొందాలనుకున్నారు. అదే నిమిత్తం ఆయన మంగలికత్తి ఇవ్వమని నన్ను అడిగారు. నేను ఆయనకు మంగలికత్తి ఇచ్చాను. కొంతసేపటికి చూస్తే నా పిల్లవాడు ఆయన తొడపై కూర్చుని ఆడుకుంటు న్నాడు. ఆ సమయంలో ఆయన చేతిలో ఆ కత్తి కూడా ఉంది. నేను భయాందోళనకు గురయ్యాను. ఆయన నా పరిస్థితిని గమనించి " అమ్మా జైనబ్! నీ పిల్లవాడ్ని చంపుతానని భయపడుతున్నావా, అమ్మా!నిశ్చింతగా ఉండమ్మా. నా వల్ల నీ పిల్లవాడికి ఎలాంటి కీడు జరగదు" అని అభయమిచ్చారు.



**మహాశయులారా!**

కాస్త మీరే ఆలోచించండి! ఆ పరిస్థితులు ఎలాంటివి? ఖుబైబ్ (రజి) ఎంతో సాహసంగా ఇస్లామీయ ఆదేశాలను ప్రదర్శిస్తున్నారు.

ఇస్లాంలో యుద్ధ మైదానంలో కూడా పిల్లల్ని, స్త్రీలను చంపటం ధర్మ సమ్మతం కాదు. ఖుబైబ్ (రజి) కూడా అదే అన్నారు. ఆయన(రజి) గురించి జైనబ్ ఇంకా ఇలా అన్నారు: "అల్లాహ్ సాక్షి! నేను ఖుబైబ్(రజి) కంటే ఉత్తమ ఖైదీని ఎన్నడు చూడలేదు".

అల్లాహ్ సాక్షి! నేను ఆయన చేతిలో ద్రాక్ష గుత్తుల్ని చూశాను. ఆయన వాటిని తింటున్నారు. ఆ స్థితిలో ఆయన సంకెళ్ళతో బంధించబడి ఉన్నారు. అది ద్రాక్ష పండ్ల సీజన్ కూడా కాదు. అల్లాహ్ అగోచరంగా ప్రసాదించిన ఆహారాన్ని ఆయన తింటున్నారు. ఆ మక్కా బహుదైవారాధకులు ఆయన్ని చంపటానికి సిద్ధమైనప్పుడు ఆయన వారితో ఇలా అన్నారు: వీరమరణానికి ముందు రెండు రకాతుల నమాజ్ చేసుకోనివ్వండి. తిరస్కారులు అనుమతించిన పిమ్మట ఆయన 2 రకాతులు పాటించి ఆ విరోధులతో ఇలా అన్నారు: ప్రాణ భయంతో సుదీర్ఘమైన రకాతులు పాటిస్తున్నాడని మీరనుకుంటారనే నేను త్వరగా నమాజ్ ముగించాను లేదా నేను పొడవాటి నమాజు పాటించేవాణ్ణి.

**ప్రియసోదరులారా!**

అల్లాహ్ కిశోరాల స్థితి ఇలా ఉంటుంది. ఒక వైపు ఉరికంబం! మరొకవైపు నమాజ్ పట్ల ప్రేమ! ఖుబైబ్ (రజి) పాటించిన ఆ 2 రకాతులు మనలాంటి వారి వేలాది రకాతులకంటే ఎంతో ఉత్తమం. అల్లాహ్ మనందరికి అలాంటి ధీరత్వాన్ని, ప్రేమను ప్రదర్శించే భాగ్యాన్ని ప్రసాదించుగాక ఆమీన్..

నమాజ్ తరువాత ఖుబైబ్(రజి) ఇలా వేడుకున్నారు: ఓ అల్లాహ్! ఈ సమూహంలో ఉన్న ప్రతి ఒక్కరి వ్యవహారాన్ని తేల్చు. ఒక్కొక్కరిని సర్వనాశనం చెయ్యి" అని అల్లాహ్‌ను మొరపెట్టుకున్నారు. (ఆయన మొరను అల్లాహ్ ఆలకించాడు. తరువాతి కాలంలో ఆ కర్కశులంతా ఒక్కొక్కరుగా నాశనమయ్యారు)

ఆ తరువాత కొన్ని కవితలు చదివారు. ఒక దుర్మార్గుడు ఆయన గుండెను గాయపరచి విఱ్రవీగుతూ ఇలా అన్నాడు: నీ స్థానంలో నీ దైవ ప్రవక్త (స) వచ్చి

teluguislam.net



నీవు విముక్తి పొందటం నీకు ఇష్టమేనా? అపుడు ఉద్వేగభరితుడై ఖుబైబ్ (రజి) ఇలా జరిపిచ్చారు: నా ప్రాణం కాపాడుకోవటానికి నా ప్రవక్త కాలుకు ముల్లు గుచ్చుకోవటం కూడా నాకు సహించదు.

ఆయన చివరిగా ఈ దుఆ చేశారు: 'ఓ అల్లాహ్! మేము నీ దైవ ప్రవక్త (స) ప్రవచనాలను, ఆదేశాలను ప్రజలకు అందజేశాము. ఇప్పుడు నీవు నీ ప్రవక్తకు మా పరిస్థితిని తెలియపరచు". అల్లాహ్ ఆ దుఆను స్వీకరించి ఆ స్థితుగతులను వహీ ద్వారా తన ప్రవక్తకు తెలియపరిచాడు. దైవ ప్రవక్త (స) ఆ సంఘటనలను తీరు అనుచరులకు తెలియజేసారు. ఆసిం వీరమరణ వార్త విన్న అనుచరులు కన్నీరుమున్నీరయ్యారు. అయితే ఆయన మృతదేహం కోసం ఒక అవిశ్వాస వ్యక్తి పురమాయించాడు. ఎందుకంటే వారు ఆయన మృత దేహాన్ని ముక్కలుముక్కలు చేస్తారని. ఆసిం (రజి) బద్ర్ యుద్ధంలో ఖురైషీయులు ప్రసిద్ధ నాయకుడు ఉఖ్బా బిన్ అబి మూయాత్ ను హతమార్చాడు. కానీ అల్లాహ్ ఆయన మృతదేహ రక్షణకు దైవదూతలను నియమించి కాపాడాడు. అనుచరులు ఆయన మృతదేహాన్ని భద్రంగా తీసుకొని వెళ్లాడు.

తరువాతి కాలంలో ఉమర్ ఫారూఖ్ (రజి)చే నియమించబడిన గవర్నర్ సయీద్ బిన్ ఆమిర్ పరిస్థితి విచిత్రంగా ఉండేది. ఒక్కోసారి ఆయన స్పృహదప్పేవారు. ప్రజలు కారణమడుగగా వారికిలా బదులిచ్చేవారు.

"ఖుబైబ్ వీరమరణ సమయంలో నేను అక్కడ ఉన్నాను. హృదయవిదారకమైన ఆ దృశ్యం అప్పుడప్పుడు నాకు గుర్తుకు వస్తూ ఉంటుంది. ఖుబైబ్ మాటలు గుర్తుకు వస్తుంటాయి. అంతే నా శరీరమంతా కంపించిపోయి స్పృహ తప్పిపోతాను".

**మహాశయులారా!**

ఇస్లాం అనే మహావృక్షం పెంపుదలలో సహాబాలు తమ రక్తాన్ని దారపోశారు. వారి త్యాగాలతో ఆ మహా వృక్షం శాఖోపశాఖలుగా విస్తరించింది. అలాంటి సంఘటనలు ఇస్లామీయ చరిత్రలో మాత్రమే మనకు అగుపిస్తాయి. వారి త్యాగ ఫలితంగానే నేడు అరబు ఎడారుల నుండి ఇస్లాం ప్రపంచ నలువైపులా చేరిపోయింది. ప్రతి చోట 'అల్లాహ్ అక్బర్' నినాదాలు మోగిపోయాయి. ముస్లింలలో త్యాగనిరతి



ఎప్పటి వరకు ఉందో ప్రతిచోట వారి ఆధిపత్యం, అధికారం ఉంది. ఎప్పుడైతే ముస్లింలు త్యాగనిరతిని విస్మరించి ప్రపంచ వ్యామోహంలో పడిపోయారో అప్పటి నుండి వారి పతనం మొదలయింది.

వాస్తవంగా ఒక సమాజ పురోగమనానికి, పతనానికి ఆ సమాజ ఆర్థిక స్థితితో పాటు త్యాగనిరతి ఎంతో అవశ్యం. వట్టి మాటలతో, పెద్దపెద్ద ఉపన్యాసాలతో ఒరిగేదేమీ ఉండదు.

**ఓ నవ యువకులారా!**

జాగ్రత్తగా వినండి. ఖుబైబ్ (రజి) ను ఆదర్శంగా తీసుకుని పదే పదే కాస్త ఆలోచించండి. ఆయన ఎలాంటి త్యాగాన్ని లోకానికి చాటి చెప్పారో ఆత్మవిమర్శ చేసుకోండి. ఆయన త్యాగనిరతిని ఆదర్శప్రాయంగా తీసుకొని ముందడుగు వేయండి. అల్లాహ్ మనందరికి అలాంటి భాగ్యాన్ని చేసే పద్ధతిని ప్రసాదించుగాక. ఆమీన్.

teluguislam.net



# 10. హష్ర్ మైదానంలో దైవకారుణ్యం

**స్వర్గవాసులు ఈ రోజు తమ (ఆహ్లాదకర) వ్యాపకాలలో నిమగ్నులై ఆనందిస్తూ ఉన్నారు.** ***(అల్ ఫాతిర్ 35 : 53)***

**ముస్లిం సహోదరులారా!**

ఖుత్బాలో నేను పఠించిన ఆయత్ అర్థాన్ని మీరు విన్నారు. దైవ ప్రవక్త ముహమ్మద్ (స) సన్నిధికి కొంత మంది వృద్ధులు వచ్చి ఇలా విన్నవించుకున్నారు. "ఓ దైవ ప్రవక్తా! ఇస్లాం స్వీకరించటానికి మేము సిద్ధంగా ఉన్నాము. కాని మేము మహా పాపాలు చేశాము. మా కర్మలపత్రాలు వాటివల్ల నలుపై పోయాయి. ఇప్పుడు ఇస్లాం స్వీకరించి ఏమి చేయమంటారు? అప్పుడు పై ఆయత్ అవతరింపజేయ బడింది. ఇందులో అల్లాహ్ తన దాసులకు ఎంతో ఓదార్పును నమ్మకాన్ని ఇచ్చాడు. వాస్తవానికి ఇస్లాం మానవుని పూర్వ పాపాలన్నింటినీ తుడిచివేస్తుంది. ఖుర్ఆన్ మజీద్లో ఈ అంశానికి సంబంధించిన అనేక ఆయతులున్నాయి. అల్లాహ్ అనంత కరుణామయుడు. పాపాలు చేసి పశ్చాత్తాపంతో మరలే వారికి క్షమాభిక్ష పెట్టటం ఆయన సుగుణం. అల్లాహ్ పవిత్ర ఖుర్ఆన్ గ్రంథంలో ఇలా సెలవిస్తున్నాడు:

وَالَّذِينَ إِذَا فَعَلُوا فَاحِشَةً أَوْ ظَلَمُوا أَنفُسَهُمْ ذَكَرُوا اللَّهَ فَاسْتَغْفَرُوا لِذُنُوبِهِمْ وَمَن يَغْفِرُ الذُّنُوبَ إِلَّا اللَّهُ وَلَمْ يُصِرُّوا عَلَىٰ مَا فَعَلُوا وَهُمْ يَعْلَمُونَ ○

**తమ ద్వారా ఏదైనా నీతిబాహ్యమైన పని జరిగిపోతే లేదా తమఆత్మలకు వారు ఏదైనా అన్యాయం చేసుకుంటే వెంటనే అల్లాహ్ను తలచుకుని, తమ పాపాల క్షమాపణకై వేడుకుంటారు. నిజానికి అల్లాహ్ తప్ప పాపాలను క్షమించే వాడెవడు న్నాడు?వారు తమ వల్ల జరిగింది తప్పు అని తెలిసినపుడు దానిపై హటం చెయ్యరు.** ***(ఆలి ఇమ్రాన్ 3 : 135)***

**మహాశయులారా!**

పాపాల మన్నింపు, దైవ కారుణ్యం గురించి ఈ రోజు ఖుత్బాలో తెలుసు



కుందాం. పైన పఠించిన ఆయత్తో నేను చెప్పబోయే విషయాన్ని గ్రహించే ఉంటారు. ఈరోజు దైవ ప్రవక్త (స) హారి ఒక మహోన్నతమైన ప్రవచనాన్ని బోధించ బోతున్నాను. అందులో ప్రళయదిన దృశ్యాలు మన ముందుకొస్తాయి. అల్లాహ్ ప్రళయ దినాన తనదాసుల పాపాలను ఎలా మన్నించి స్వర్గానికి చేరుస్తాడో కూడా మనకు బోధపడుతుంది. దైవ ప్రవక్త(స)వారి ఈ దివ్య వచనాన్ని వినేముందు అల్లాహ్తో దుఆ చేసుకోవాలి. "ఓ ప్రభూ! ప్రళయదినాన నీ కృపతో మమ్మల్ని మన్నించు" అని వేడుకోవాలి. అల్లాహ్ మనందరి పాపాలను మన్నించి నరకాగ్ని నుండి కాపాడి స్వర్గంలో ప్రవేశింపుగాక.. ఆమీన్.

అబూ సయీద్ ఖుద్రీ (రజి) కథనం ప్రకారం కొంతమంది దైవ ప్రవక్త (స) ను ఇలా ప్రశ్నించారు. "ఓ దైవ ప్రవక్తా! మేము ప్రళయదినాన మా ప్రభువును చూడలేమా!" నిశ్చయంగా చూడగలరని బదులిచ్చారు ఆయన. విశాల వాతావరణంలో మిట్టమధ్యాహ్నం మేఘాలు లేని ఆకాశంలో సూర్యున్ని ఎలా ఎలాంటి అడ్డు, అవరోదం లేకుండా లేదా పున్నమి వెన్నెల రాత్రి పూర్ణచంద్రుణ్ణి చూసినట్లే మీరూ ప్రళయ దినాన మీ ప్రభువును చూస్తారు. జాగ్రత్తగా వినండి. పిలుపునిచ్చేవాని తరపున ఇలా పిలుపు ఇవ్వటం జరుగుంది. ప్రపంచంలో ఎవరు ఏఏ వస్తువులనైతే పూజించారో వారంత వారి కల్పితదైవాల వెనుక నిలబడండి. అలాగే వారందరు ప్రపంచంలో ఎవర్ని దైవంగా కొలిచారో ఏ విగ్రహాన్ని దైవంగా మలిచారో వారివెనుక నిలబడతారు ఆ తరువాత కల్పిత అసత్యదైవాలను వారి ఆరాధకులందర్ని నరకంలో నెట్టేయడం జరుగుతుంది. హష్ర్ మైదానంలో కేవలం సత్యవంతులు మాత్రమే మిగిలి ఉంటారు. వారంతా ఇహలోక జీవితంలో సత్య దైవం అల్లాహ్ ను మాత్రమే పూజించేవారు. అల్లాహ్కు మరెవ్వరిని సాటి కల్పించేవారు కాదు. వారివద్దకు సాక్షాత్తు విశ్వప్రభువైన అల్లాహ్ వచ్చి వారితో ఇలా అంటాడు: వారందరు వారివారి దైవాలతో సహా నరకంలో వెళ్ళిపోయారు. మరి మీరెందుకు నిరీక్షిస్తున్నారు? అపుడు ఆ ఏకదైవారాధకులు "ఓ ప్రభువా! ప్రాపంచిక జీవితంలో మేము నీకు సాటి కల్పించే వారికి బహుదూరంగా ఉన్నాము. అలాంటి వారి సాన్నిధ్యాన్ని త్యజించాము. కాని ప్రాపంచిక అవసరాల రీత్యా మేము వారి అవసరం కలవారమే. అయినప్పటికీ షిర్క్ వల్ల మేము వారి సహచర్యాన్ని త్యజించాము. ఇక ఇదే మా స్థలం. మా ప్రభువు వచ్చేంత వరకు మేము ఇక్కడే ఉంటాము. ఎవరి వెనుకా వెళ్ళము. మా

ప్రభువు రాగానే మేము ఆయన్ని గుర్తిస్తాము అని అంటారు. అబూ సయీద్ ఉల్లేఖనంలో ఇలా ఉంది: అల్లాహ్ "ఏమిటి! మీకు మీ ప్రభువు అనవాళ్ళ గురించి తెలుసా? అని వారిని ప్రశ్నిస్తాడు. అపుడు వారిలా బదులిస్తారు. ఖచ్చితంగా గుర్తిస్తాము. మా ప్రభువు దివ్యఖుర్ఆన్ ఇలా సెలవిచ్చాడు:

يَوْمَ يُكْشَفُ عَنْ سَاقٍ وَيُدْعَوْنَ إِلَى السُّجُودِ فَلَا يَسْتَطِيعُونَ

**"ఏ రోజున పిక్క విప్పబడుతుందో, అప్పుడు వారు సాష్టాంగ ప్రణామం (సజ్దా) కొరకు పిలువబడతారు. కాని వారు సాష్టాంగపడలేరు."**
***(అల్ ఖలమ్ 68 : 42)***

ఆ తరువాత అల్లాహ్ తన మోకాలిని విప్పేస్తాడు. ముస్లింలందరు అల్లాహ్ సమక్షంలో సాష్టాంగ పడతారు. వారంతా చిత్తశుద్ధితో ఆ దైవాన్ని ఆరాధించేవారు. మరెవరైతే ప్రదర్శనాబుద్ధితో నమాజు సలిపేవారో వారంతా సజ్దా చేయటానికి ప్రయత్నిస్తారు. వారు ప్రక్కకు ఒరిగిపోతారు. కాని సజ్దా ఎన్నటికి చేయలేకపోతారు.

**ప్రియ నమాజీ సోదర సోదరీమణులారా!**

అది చాలా భయంకర దినం. ఆ రోజు స్వచ్ఛమైన ఏక దైవరాధకులు, కపటులు వేరు చేయబడతారు. సత్యనమాజీ సజ్దా చేయగలుగుతాడు. కపట నమాజీ సజ్దా చేయలేకపోతాడు. అల్లాహ్ మనందర్ని సత్యనమాజీ చేయుగాక! ఆమీన్..

ఆ తరువాత దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

నరకంపై సన్ననివంతెన (పుల్‌సిరాత్) వేయబడుతుంది. సిఫారసు ద్వారం తెరవబడుతుంది. ఆ భయంకర పరిస్థితిని చూసి ప్రవక్తలందరు అల్లాహ్‌ను మొరపెట్టుకుంటారు ఓ అల్లాహ్ నాకు శాంతిని, మోక్షాన్ని ప్రసాదించు. "ఓ అల్లాహ్! నన్ను కరుణించు. ఆ వంతెన పై నుండి సత్యవంతులు మెరుపువేగంలా లేదా కనురెప్పలు తెరచుకునే వేగంలా లేదా గాలివేగంలా తమ తమ పుణ్యాలకనుగుణంగా వారంతా స్వర్గంలో ప్రవేశిస్తారు. కొందరు ఎలాంటి అడ్డంకులు, అవరోధాలు లేకుండా క్షేమంగా భద్రంగా స్వర్గం చేరుతారు. మరికొందరు అడ్డంకులు ఎదుర్కొని గాయపడి ఆ వంతెనను దాటిపోతారు మరికొందరు వారి పాపాల చిత్తం నేరుగా నరకంలో పడిపోతారు.

teluguislam.net



**మహాశయులారా!**

మీరు వింటున్న ఈ దైవ ప్రవక్త (స) ప్రవచనంలోని వంతెన పుల్ సిరాత్ గురించి అల్లాహ్ పవిత్ర ఖుర్ఆన్ గ్రంథంలో ఎంతో గొప్పగా వివరించాడు:

وَإِنْ مِنْكُمْ إِلَّا وَارِدُهَا ۚ كَانَ عَلَىٰ رَبِّكَ حَتْمًا مَقْضِيًّا ﴿٧١﴾ ثُمَّ نُنَجِّي الَّذِينَ اتَّقَوْا وَنَذَرُ الظَّالِمِينَ فِيهَا جِثِيًّا ﴿٧٢﴾

**మీలోని ప్రతి ఒక్కరూ అక్కడికి రావలసిందే. ఇది నీ ప్రభువు చేసిన తిరుగులేని నిర్ణయం. దాన్ని నిర్వర్తించే బాధ్యత ఆయనపై ఉంది.తర్వాత మేము భయభక్తులు కలిగివున్న వారిని రక్షిస్తాము. దుర్మార్గులను అందులో మోకాళ్లపైపడి ఉన్న స్థితిలోనే వదిలేస్తాము.** ***(మర్యమ్ 19 :71,72)***

అల్లాహ్ మనందరికి ఆ వంతెన దాటడం సులభతరం చేసి స్వర్గ ప్రవేశాన్ని ప్రసాదించుగాక.. ఆమీన్

దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: ఎవరి చేతిలో నా ప్రాణం ఉందో ఆ దైవం సాక్షి! విశ్వాసులందరు నరకాగ్ని నుండి రక్షింపబడతారు. అవిశ్వాసులు, తిరస్కారులు నరకంలో ప్రవేశిస్తారు. కొందరు విశ్వాసులు అల్లాహ్‌ను ఇలా వేడుకొంటారు: "ఓ అల్లాహ్! మాతో పాటే నమాజులు, ఉపవాసాలు, పాటించే సోదరులు కూడా నరకంలోకి వెళ్ళారు. ప్రభూ! వారిని క్షమించి రక్షించు". అప్పుడు అల్లాహ్ ఇలా సెలవిస్తాడు: మీరు వారిని గుర్తించి నరకంనుండి తీసుకురండి. వారి ముఖాలు ఇక నుండి నరకాగ్ని కొరకు నిషిద్ధం. అందుకే వారి మొహాలు యధావిధంగా ఉంటాయి. స్వర్గవాసులు నరకంలో ఉన్న తమతోటి సత్యసహచరుల్ని వెతికి వెతికి నరకం నుండి బయటకు తీసుకువస్తారు.

ఓ అల్లాహ్! మాలాంటి పాపాత్ములకు కూడా ఆరోజు సత్యవంతుల సిఫారసును ప్రసాదించు, నరకాగ్ని నుండి విముక్తి ప్రసాదించు మమ్మల్ని స్వర్గంలో చేర్చు.. ఆమీన్..

మళ్ళీ ఇలా అంటారు: ఓ అల్లాహ్ నీ ఆజ్ఞ మేరకు వారందర్ని నరకం నుండి బయటకు తీసుకువచ్చాము. అప్పుడు అల్లాహ్ ఇలా సెలవిస్తాడు: మళ్ళీ వెళ్ళండి వెళ్ళి (ఎవరి మనసులో) దీనారంతా బరువు గల విశ్వాసమున్న పాపాత్ములను

teluguislam.net



కూడా తీసుకురండి. వారంతా వెళ్ళి అలాంటి పాపాత్ములను నరకాగ్ని నుండి విముక్తి కలిగిస్తారు. ఆ తరువాత అల్లాహ్ ఇలా సెలవిస్తాడు: "అర్ధరూపాయంతా విశ్వాసమున్న పాపాత్ములను కూడా నరకం నుండి తీసుకురండి". స్వర్గవాసులు మళ్ళీ వెళ్ళి అలాంటి వారిని కూడా నరకం కూపం నుండి కాపాడుతారు. అల్లాహ్ మళ్ళీ ఇలా సెలవిస్తాడు: "రవ్వంత విశ్వాసమున్న వారిని కూడా నరకం నుండి తీసుకురండి". వారు అలాంటి వారిని కూడా తరువాత తీసుకువస్తారు. వారు 'ఓ అల్లాహ్! నరకంలో ఎవర్నీ వదలకుండా రవ్వంత విశ్వాసమున్నవారిని కూడా తీసుకువచ్చాం' అని అల్లాహ్‌తో అంటారు. అప్పుడు అల్లాహ్ ఇలా సెలవిస్తాడు: దైవదూతల సిఫారసు ముగిసింది. దైవ ప్రవక్తల సిఫారసు కూడా అయిపోయింది. ఇక కేవలం సర్వలోకాల స్వామి అనంత కరుణామయుడైయిన అల్లాహ్ సిఫారసు మిగిలిఉంది. ఇలా అని సాక్షాత్తు అల్లాహ్‌నే నరకంలో నుండి పిడికిలితో నరకస్తులను తీస్తాడు. అల్లాహ్ కృప వలన వారుకూడా నరకాగ్ని నుండి విముక్తి ప్రసాదించబడతారు. వారు ఒక్క పుణ్యం కూడా చేసి ఉండరు. అలాంటి కఠిన ఘోర పాపాత్ములను సైతం అల్లాహ్ నరకాగ్ని నుండి కాపాడుతాడు. వారు తమ పాపాల వల్ల శిక్షలనుభవించి బొగ్గులుగా తయారవుతారు. అలాంటి బొగ్గులాంటి వారిని అల్లాహ్ ఒక కాలువలో ముంచి తీస్తాడు. ఆ కాలువను స్వర్గస్తుల బాషలో 'నహ్రెహయాత్' (జీవన సరస్సు) అంటారు. ఆ తరువాత అప్పుడే మొలకెత్తిన పైరులా రెపరెపలాడుతూ ముత్యాల్లా మెరుస్తూ ఉంటారు. వారి మెడలో కొన్ని చిహ్నాలుంటాయి. వాటి ద్వారా వారు స్వర్గవాసులుగా గుర్తింపబడతారు. ఈ ధన్యజీవులంతా సాక్షాత్తు అల్లాహ్ తన ప్రత్యేక కారుణ్యం ద్వారా విముక్తి పొందినవారు. ఆ ధన్యజీవులు తమ జీవితంలో ఏ ఒక్క పుణ్యకార్యం చేసినవారు కారు. స్వర్గం చేరిన అలాంటి ధన్యజీవులతో ఇలా అనటం జరుగుతుంది: మీరు చూస్తున్న ఈ స్వర్గం మీకోసమే. మీరు ఊహించని మరెన్నో అద్భుతానుగ్రహాలు కూడా మీరు చూస్తారు..

**ప్రియసోదరులారా!**

దైవ ప్రవక్త (స) ప్రవచించిన ఈ ప్రవచనం ఎంతో కమనీయమైనది. దీన్ని పదేపదే చదువుతూ, వింటూ వుండాలి. సత్కర్మలు చేస్తూ అల్లాహ్ కారుణ్యం పట్ల ఆశ కలిగి ఉండాలి. ఎందుకంటే హదీసె ఖుద్సీలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: నిశ్చయంగా నా కారుణ్యం నా ఆగ్రహాన్ని ఆవరించి ఉన్నది. ఈ ప్రత్యేక కారుణ్యం దయ వల్లే అలాంటి నీచఘోర పాపాత్ములు కూడా నరకవిముక్తి పొందారు.

సర్వముస్లిలకు అల్లాహ్ ప్రళయదినాన స్వర్గాన్ని ప్రసాదించుగాక, నరక విముక్తిని ప్రసాదించి కరుణించుగాక.. ఆమీన్..

teluguislam.net



# 11. పశ్చాత్తాపం-మానవ గుణం

قَالَا رَبَّنَا ظَلَمْنَا أَنفُسَنَا وَإِن لَّمْ تَغْفِرْ لَنَا وَتَرْحَمْنَا لَنَكُونَنَّ مِنَ الْخَاسِرِينَ ۝

**"ఓ మాప్రభువా! మేము మాపై దౌర్జన్యం చేశాము, నీవు గనక మమ్మల్ని క్షమించకపోతే, మాపై కరుణించకపోతే మేము నష్టపోయే వారిలో చేరి పోతాము".)** ***(అల్ ఆరాఫ్ 7 : 23)***

**ప్రియ మిత్రులారా..!**

తౌబా, ఇస్తిగ్‌ఫార్, క్షమాభిక్ష గురించి నేటి ఖుత్బాలో మనం తెలుసుకుందాం.

ఇస్లామీయ షరీఅత్ లక్ష్యమేమిటంటే సృష్టికర్తయిన అల్లాహ్‌కు దాసులందరూ విధేయత చూపాలి, ఆయన అవిధేయత నుండి ప్రజలందరూ దూరంగా వుండాలి. దాదాపు లక్షా ఇరవై నాలుగు వేల మంది ప్రవక్తలు దీని కోసమే పంపబడ్డారు. షరీఅత్ దేనినైతే ఆజ్ఞాపిస్తుందో అదే పుణ్య కార్యం. దేని నుండి వారిస్తుందో అదే దుష్కార్యం.

మానవుడు పొరపాట్లు, పాపాలు చేయటం సహజం. హజ్రత్ ఆదం అలైహిస్సలాం ద్వారా పొరపాటు జరిగింది. ఆయన సంతానం కూడా తప్పుచేస్తుంది. పొరపాటు జరిగిన తరువాత ఆదం (అ) ఏ మార్గాన్నైతే అవలంబించారో అదే మార్గాన్ని ఆయన సంతానం కూడా అవలంబించాలి. అదే పశ్చాత్తాపం. ఆదం అలైహిస్సలాం తప్పుచేసిన తరువాత పశ్చాత్తాపపడి దీనాతిదీనంగా అల్లాహ్‌తో క్షమాభిక్ష వేడుకున్నారు. **رَبَّنَا ظَلَمْنَا أَنفُسَنَا وَإِن لَّمْ تَغْفِرْ لَنَا وَتَرْحَمْنَا لَنَكُونَنَّ مِنَ الْخَاسِرِينَ** **"రబ్బనా జలమ్‌నా అన్‌ఫుసనా వ ఇల్‌లమ్ తగ్‌ఫిర్ లనా వతరహమ్‌నా లనకూనన్న మినల్ ఖాసిరీన్".** (అర్థం. "ఓ మాప్రభువా! మేము మాపై దౌర్జన్యం చేశాము, నీవు గనక మమ్మల్ని క్షమించకపోతే, మాపై కరుణించకపోతే మేము నష్టపోయే వారిలో చేరిపోతాము".) *(అల్ ఆరాఫ్ 7 : 23)*



పశ్చాత్తాపం, వేడుకోలు వల్లనే అల్లాహ్ ఆయన తప్పులను మన్నించాడు. అందుకే ఆదం (అలైహిస్సలాం) సంతతికి అదే బోధన చేయబడుతుంది. తప్పులు, పొరపాట్లు, పాపాలు చేసిన వెంటనే "తౌబా" (పశ్చాత్తాపం పడి) అల్లాహ్‌ను క్షమాభిక్ష వేడుకోవాలి. పాపాలకు దూరంగా వుంటూ, అల్లాహ్ అవిధేయతకు దూరంగా వుండాలి. పొరపాటున పాపం జరిగితే వెంటనే క్షమాబిక్ష వేడుకోవాలి. పాపాల పట్ల భయపడటం విశ్వాసానికి తార్కాణం.

అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ (రజి) ఇలా అన్నారు: విశ్వాసి తన వల్ల జరినిన పాపాన్ని ఓ పెద్ద పర్వతంలా భావిస్తాడు. దాని ప్రక్కనే తాను కూర్చుని ఉన్నాననీ, అది ఏ క్షణం లోనయిన తనపై కూలిపోవచ్చని కంపించి పోతాడు. అదే అవిశ్వాసి అయితే పాపాన్ని చాలా చిన్నచూపు చూస్తాడు. ముక్కుమీద ఈగవాలినట్టు భావిస్తాడు (దానిని చేతితో దూరం చేస్తాడు) అంటే పాపం చేసినప్పుడు అతనిలో భయభీతులు నశించిపోతాయి. కాలం గడిచే కొద్ది ఆ పాపాలను పూర్తిగా మరచిపోతాడు. అసలు పాపమే ఎరగనట్టు మిన్నుకుండిపోతాడు. కాని దైవప్రవక్తలు చిన్న చిన్న పొరపాట్లకు కూడా ఎంతో భయపడేవారు. వాటికి కూడా దూరంగా వుండాలని నొక్కి చెప్పేవారు. అల్లాహ్ పవిత్ర ఖుర్‌ఆన్‌లో ఇలా సెలవిస్తున్నాడు:

وَوُضِعَ الْكِتَابُ فَتَرَى الْمُجْرِمِينَ مُشْفِقِينَ مِمَّا فِيهِ وَيَقُولُونَ يَا وَيْلَتَنَا مَالِ هَٰذَا
الْكِتَابِ لَا يُغَادِرُ صَغِيرَةً وَلَا كَبِيرَةً إِلَّا أَحْصَاهَا ۚ وَوَجَدُوا مَا عَمِلُوا حَاضِرًا ۗ
وَلَا يَظْلِمُ رَبُّكَ أَحَدًا ﴿٤٩﴾

**"మరియు వారి ముందు వారి కర్మపత్రాలు ఉంచబడినప్పుడు ఆ నేరస్థులు వాటిలో వున్న దాని నుండి భయపడటాన్ని నీవు చూస్తావు, వారు ఇలా అంటారు: అయ్యో మా దౌర్భాగ్యం ఇదేమి పుస్తకం (కర్మల పత్రం) ఏ విష యాన్ని చిన్నదైనా, పెద్దదైనా కాని దానిని లెక్కించింది. వారు అక్కడ తాము చేసిందంతా తమ ముందు పొందుతారు, నీ ప్రభువు ఎవరిపై దౌర్జన్యం (అన్యాయం) చేయడు".** ***(అల్ కహఫ్ 18 : 49)***

పై వాక్యం గురించి సహల్ బిన్ సాద్ (రజి అల్లాహు అన్హు) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "చిన్న చిన్న పాపాలను తేలికగా భావించకండి. చిన్న పాపాలు ఇలా వ్యాపిస్తాయి. ఒక అడవిలో ఒక వర్గం

teluguislam.net



బస చేసింది. ఒకొక్క వ్యక్తి ఒకోక్క కర్రను ఏరుకొచ్చి ఆ కట్టెలను ఒక చోట చేర్చి దానికి నిప్పంటించి తమ రొట్టెలను కాల్చుకున్నారు. ఇలాగే చిన్న చిన్న పాపాలు తప్పకుండా మనిషిని నాశనం చేస్తాయి.

(ఒకొక్క కట్టే జోడిస్తే అగ్నికి ఎలా ఇంధనంగా మారుతాయో అలాగే చిన్న చిన్న పాపాలు కూడా మనిషిని అగ్నిగుండంలో దహించివేస్తాయి).

అబూ హురైరా(రజి అల్లాహు అన్హు) ఇలా సెలవిచ్చారు: "నిస్సందేహంగా ఒక విశ్వాసి పాపం చేసినప్పుడు అతని హృదయంపై నల్లటి చుక్క ఏర్పడుతుంది. ఒక వేళ ఆ వ్యక్తి వెంటనే తన తప్పును గ్రహించి పశ్చాత్తాప పడితే అది చెరగిపోతుంది. మన్నింపు కోరకుండా పాపాలు చేసుకుంటూ పోతే అతని హృదయమంతా నలుపైపోతుంది. తుప్పుపట్టిన ఇనుములా మారిపోతుంది. *(సునన్ ఇబ్నె మాజ)*

కావున ప్రతి ముస్లిం తప్పని సరిగా, విధిగా పెద్దపాపాలకు, చిన్నపాపాలకు దూరంగా వుండాలి. అవి దగ్గరకు రాకుండా జాగ్రత్తపడాలి. ఒక వేళ పొరపాటు, పాపం జరిగినా వెంటనే కుమిలిపోయి అల్లాహ్‌తో క్షమాపణకై వేడుకోవాలి.

**సోదరులారా..!**

పశ్చాత్తాప భావంతో కుంచించుకుపోతూ క్షమాభిక్షకై వేడుకునే వారికోసం ఎన్నో శుభవార్తలు, సంతోష వార్తలున్నాయి. దైవ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు:

**"పాపాలకు దూరంగా వుండే వ్యక్తి పాపాలు చేయని వాడిగా ఉంటాడు"**

***(సునన్ ఇబ్నె మాజ)***

మరో హదీసులో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలాప్రవచించారు: "పాపాలకు పాల్పడిన దాసుడు మనసు మార్చుకుని క్షమాభిక్ష వేడుకుంటే అల్లాహ్ ఎంతో సంతోషిస్తాడు. ఒక విలువైన వస్తువును పోగొట్టుకుని తిరిగి పొందినవాడు ఎంత సంతోషిస్తాడో అంతకంటే ఎక్కువ సంతోషం దాసుడు తన పాపాలనుండి తౌబా చేసుకుంటే అల్లాహ్‌కు కలుగుతుంది. పాపాల మన్నింపుకై దాసుడు దైవ సన్నిధిలో చేతులెత్తి అర్థిస్తే ఆ దాసుడు పైకి లేపిన చేతులను ఖాళిగా పంపడానికి అల్లాహ్ సిగ్గుపడతాడు. అలాంటి దాసుని గురించి అల్లాహ్ తన దూతల్లో చర్చిస్తాడు. ఓ దూతల్లారా..! మీరు సాక్ష్యంగా వుండండి. నేను నా ఈ దాసుడి పాపాలను మన్నించేశాను.



**పాపాల మన్నింపుకై అత్యుత్తమ దుఆ:**

**رَبَّنَا ظَلَمْنَا أَنْفُسَنَا وَإِنْ لَمْ تَغْفِرْ لَنَا وَتَرْحَمْنَا لَنَكُونَنَّ مِنَ الْخَاسِرِينَ**

**"రబ్బనా జలమ్‌నా అన్‌ఫుసనా వ ఇల్‌లమ్ తగ్‌ఫిర్ లనా వత రహమ్‌నా లనకూనన్న మినల్ ఖాసిరీన్".**

**అర్థం:** ఓ మా ప్రభువా! మేము మాపై దౌర్జన్యం చేశాము. మరి నీవు మమ్మల్ని క్షమించకపోతే, మాపై కరుణించక పోతే మేము నష్టపోయే వారిలో చేరిపోతాము".

ప్రతి రోజు ఉదయం, సాయత్రం వేళల్లో తౌబా చేస్తుండాలి. ప్రతి నమాజ్ తరువాత తప్పకుండా తౌబా చేయాలి. ముస్లిములు స్త్రీ పురుషుల్లో చాలా మంది వృద్ధాప్యంలో లేక మరణానికి ముందు పశ్చాత్తాపం చేసుకుందాం అని భావించు కుంటారు. కాని అలా చేయకూడదు. ఎందుకంటే ఎవరి మరణం ఎప్పుడు సంభవిస్తుందో ఎవరికీ తెలియదు, మరి మరణం సంభవించినప్పుడు తౌబాకు అవకాశం ఉంటుందో లేదో ఊహించలేము.

అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (ర) కథనం ప్రకారం దైవ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: "పాపాల నుండి పశ్చాత్తాప పడుతూ వాటిని వదలని వాడు తన ప్రభువుతో పరిహాసమాడుతున్నాడు". *(తర్గీబ్ వ తర్హీబ్)*

పాపాల పట్ల సిగ్గుతో మధనపడుతూ స్వచ్ఛమైన మనసుతో చేసే తౌబా మాత్రమే అల్లాహ్ సన్నిధిలో స్వీకారయోగ్యం అవుతుంది. దైవభీతి లేని తౌబా ఎలాంటి ప్రయోజనాన్నీ చేకూర్చదు.

హజ్రత్ ఆయిషా (రజిఅల్లాహు అన్హా) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "ఎక్కువ దాస్యం చేసేవారి కన్నా అత్యుత్తమ స్థానం పొందాలనుకునే వారు పాపాల పట్ల భయభీతులై వాటికి దూరంగా ఉండాలి". *(తర్గీబ్ వ తర్హీబ్)*

పాపాల పట్ల భయపడటం, మన కర్మల గురించి జాగ్రత్త వహించడం ఎంతో అవసరం. సత్యవంతులు, దైవ భీతిపరుల అలవాటే ఇది. పాపాల నుండి సాధ్యమైనంత వరకు తమను తాము కాపాడుకోవటానికి ప్రయత్నించాలి.

teluguislam.net



అబూ బకర్ సిద్దీఖ్ (రజి), ఉమర్(రజి) వంటి అగ్రశేణి సహాబీల ఉదాహరణ మన ముందున్నది. వారు నిత్యం దైవభీతితో నిలువెల్లా కంపిస్తూ ఉండేవారు. కాని మనమూ ఉన్నాం. పాపాలు చేసి కుడా నిర్భయంగా, నిశ్చింతగా ఉన్నాము.

హజ్రత్ అనస్ (రజిఅల్లాహు అన్హు) కథనం: దైవ ప్రవక్త (సలల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "ఆదం సంతానం అంతా తప్పులు చేసేవారే. అలాంటి వారిలో మంచి వారు తమ తప్పులపై పశ్చాత్తాప పడేవారే". *(తిర్మిజీ, ఇబ్నెమాజ)*

ఎన్ని సత్కార్యాలు చేసినప్పటికి ప్రతి మనిషి నుండి ఏదో ఒక పొరపాటు దొర్లుతూనే ఉంటుంది. జరిగే పొరపాట్లను సరిదిద్దుకుంటూ పశ్చాత్తాపం చెందే వారే ఉత్తములు.

**మహాశయులారా..!**

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) చేసిన ఒక ఉపదేశం అనేక హితోక్తుల సారాంశం: అందులోని ప్రతి అక్షరం మన శ్రేయస్సు కోరేదే. అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజిఅల్లాహు అన్హు) కథనం ప్రకారం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "చేసిన తప్పులపై సిగ్గుతో కుంచించు కుపోయినవాడు అల్లాహ్ కారుణ్యాన్ని కోరుకుంటారు. పాపాల పట్ల ఏమరుపాటించేవాడు అల్లాహ్ పట్ల నిర్లక్ష్యంగా ఉన్నవాడు అల్లాహ్ ఆగ్రహానికి గురవుతాడు. దైవ దాసులారా..! శ్రద్ధగా వినండి: ప్రతి కార్యాన్ని ఆచరించేవాడు త్వరలోనే దాని ప్రతి ఫలాన్ని పొందుతాడు. తాను చేసిన కార్యపు ప్రతి ఫలాన్ని అనుభవించేవరకు ఏ ప్రాణీ నశించదు. అచరణలన్నీ మనిషి అంతం (చావు)తో ముడి పడివుంటాయి. అంటే ముగింపు మంచిగా వుంటే ప్రతి ఫలం బాగుంటుంది. ముగింపు చెడిపోతే సర్వం నాశనం అవుతుంది. రాత్రి పగలు రెండు వాహనాలు లాంటివి. ఆ రెండు వాహనాల్లో పరలోకానికి సత్కార్యాలతో చేరుతారు. స్వర్గాన్ని చేరుతారు. ఇవాళ, రేపు అని వాయిదాలు వేయరు. అల్లాహ్ సహనశీలుడు,మృదు స్వభావి కదా! అన్న భ్రమలో పడి ఉండరాదు. ఎందుకంటే స్వర్గ నరకాలు మీకు అతి చేరువలో వున్నాయి. మీ పాదరక్షల పట్టీలు ఎంత దగ్గరగా వున్నాయో అలాగే స్వర్గ నరకాలు మీకు సమీపంగా వున్నాయి.ఎప్పుడు, ఏ విషయం మూలంగా స్వర్గంలోకిపోతామో, ఏ విషయం మూలంగా నరకానికి ఆహుతి అవుతామో తెలీదు. తరువాత దైవప్రవక్త (స)



**فَمَنْ يَعْمَلْ مِثْقَالَ ذَرَّةٍ خَيْرًا يَرَهُ (7) وَمَنْ يَعْمَلْ مِثْقَالَ ذَرَّةٍ شَرًّا يَرَهُ (8)**

**"ఎవరు అణుమాత్రం సత్కార్యం చేసుకుంటారో అతను దాన్ని చూసుకుంటాడు. మరెవడు అణుమాత్రం దుష్కార్యం చేసుకుంటాడో అతనూ దాన్ని చూసుకుంటాడు".(అల్ జిల్జాల్ 99 : 7,8)** అనే వచనాన్ని పఠించారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) హదీసులో ఏ విషయాన్ని బోధించారో అవన్నీ ఓ సందేశ మాల. పాపాత్ముల్లో రెండు రకాల వారుంటారని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పేర్కొన్నారు. మొదటి రకం: దైవ కారుణ్యానికి అర్హులు కాగలరు. వారు పాపాలు చేసి పశ్చాత్తాపంతో క్షమాభిక్ష వేడుకునేవారు. రెండో రకం పాపాత్ములు అల్లాహ్ ప్రసన్నతకు నోచుకోలేరు. వారు పాపాల పట్ల నిర్లక్ష్యంగా ఉంటారు. కాస్త మన్నింపు కోరుకుని అసలు ఏమి ఎరగనట్టు పాపాల్లో కూరుకు పోతారు. సత్యవంతులు ఆ పాపాల జోలికి వెళ్ళరు. ఎక్కడ వాటిని చూసినా అక్కడ నుండి నిష్క్రమిస్తారు. పశ్చాత్తాపం పొందే ఆ పాపాత్ములే ధన్యజీవులు. వారే దైవ ప్రసన్నతకు పాత్రులు కాగలరు.

వారి ఉదాహరణ మేలిమి బంగారం లాంటిది. అది కొలిమిలో ఎంత కాలితే అంతే కుందనంలా తయారవుతుంది. అల్లాహ్ మనందరికి ఆ అదృష్టాన్ని ప్రసాదించుగాక. ఆమీన్ రెండవ రకం వారు పాపాల వల్ల దైవాగ్రహానికి గురవుతారు. పాపాలు చేస్తూ చేస్తూ అందులో రాటుతేలిపోతారు. సిగ్గు, లజ్జలను తుంగలో తొక్కి షైతానులా తమ తప్పులను ఒప్పులుగా వాదిస్తారు. వారే అవమానానికి తురవుతారు. అలాంటి వారే నరకాగ్నికి ఇంధనంగా మారుతారు.

**ప్రియ మిత్రులారా..!**

మొదటి రకం వారిలో మనల్ని చేర్చాలని అల్లాహ్‌ను మనం వేడుకోవాలి. ఎందుకంటే నేటి ఆధునిక కాలంలో ఎంతోమంది స్త్రీ, పురుషులు రెండవరకానికి చెందినవారే అయి వుంటున్నారు. పాపాలను పాపంగా కూడా భావించడంలేదు. ఇలాంటి కష్టకాలంలో మనం జీవిస్తున్నాము. అసత్యపలుకులు, పరోక్షనింద మోపటం, చాడీలు చెప్పటం నేడు సర్వసాధారణంగా మారిపోయాయి. వీటినే ప్రస్తావిస్తూ దైవ ప్రవక్త(స) తన సహచరులను ఆచరణ వైపు పురిగొల్పారు. ఈ విధంగా సావధాన

teluguislam.net



పర్చారు– బాగా గుర్తుంచుకోండి! మీరు చేసిన కర్మను పరలోకంలో అనుభవిస్తారు. అయితే ప్రపంచంలో కూడా దాని దుష్ఫలితం మీ ముందుకు వస్తుంది. పరలోక ఫలితం తరువాతి సంగతి. మీ ముగింపునే బట్టే మీ పట్ల వ్యవహారం జరుగుతుంది. ముగింపు బాగుంటే పరలోకంలో వ్యవహారం కూడా బావుంటుంది. ఒకవేళ ముగింపు బాగుండకపోతే, ఇక మూడినట్లే.

పగలవుతుంది, రాత్రవుతుంది. జీవితం ఇలానే పూర్తవుతుంది.

అందుకే ఏ రోజు చేయవలసిన పని ఆ రోజే అదే సమయంలో చేయాలి. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "నమాజ్, ఉపవాసం, జకాత్, హజ్ వీటన్నింటిని ఆయా వేళలోనే నెలకొల్పుతూ ఉండాలి.

అల్లాహ్ కరుణామయుడు, కృపాశీలుడు. పాపాలన్నింటిని మన్నిస్తాడు అనే ఆలోచన కలిగి వుండటంకూడా ఒక భ్రమే. ఇది షైతాన్ దుష్ప్రేరణ. అల్లాహ్ ఎంతటి కరుణామయుడో అంతే శిక్షించేవాడు. ఎంత కరుణామయుడో అంతే క్షుణ్ణంగా లెక్క తీసుకునేవాడు. అవగింజంత పుణ్యాన్ని వృథా కానివ్వడు.

అల్లాహ్! మా పాపాలను తెలుసుకుని ప్రాయశ్చిత్తం పొందే సౌభాగ్యాన్ని మాకు ప్రసాదించు, పాపాలకు దూరంగా వుండే జీవితాన్ని ప్రసాదించు. ఆమీన్..



# 12. ప్రళయదిన సూచనలు

إِذَا زُلْزِلَتِ الْأَرْضُ زِلْزَالَهَا ۝ وَأَخْرَجَتِ الْأَرْضُ أَثْقَالَهَا ۝
وَقَالَ الْإِنْسَانُ مَا لَهَا ۝ يَوْمَئِذٍ تُحَدِّثُ أَخْبَارَهَا ۝ بِأَنَّ رَبَّكَ أَوْحَىٰ لَهَا ۝
يَوْمَئِذٍ يَصْدُرُ النَّاسُ أَشْتَاتًا لِيُرَوْا أَعْمَالَهُمْ ۝ فَمَنْ يَعْمَلْ مِثْقَالَ ذَرَّةٍ
خَيْرًا يَرَهُ ۝ وَمَنْ يَعْمَلْ مِثْقَالَ ذَرَّةٍ شَرًّا يَرَهُ ۝

భూమి చాలా తీవ్రమైన తన ప్రకంపనలతో కంపింపజేయబడినప్పుడు, మరి భూమి తన బరువులన్నింటినీ తీసి బయటపడవేసినప్పుడు,"అరె! దీనికేమై పోయిందీ?" అని మనిషి (కలవరపడుతూ) అంటాడు. ఆ రోజు భూమి తన సంగతులన్నీ వివరిస్తుంది. ఎందుకంటే నీ ప్రభువు దానికి, ఆ మేరకు ఆజ్ఞాపించి ఉంటాడు. ఆ రోజు జనులు–వారి కర్మలు వారికి చూపబడేందుకు గాను – వేర్వేరు బృందాలుగా తరలివస్తారు. కనుక ఎవడు అణుమాత్రం సత్కార్యం చేసినా దాన్ని అతను చూసుకుంటాడు. మరెవడు అణుమాత్రం దుష్కార్యం చేసినా దాన్ని అతను చూసుకుంటాడు. ***(జిల్‌జాల్ 99 :1-8)***

**ఇస్లామీయ సోదర సోదరీమణులారా..!**

ఏ రోజైతే విశ్వవ్యవస్థ నాశనమై మరో కొత్త విశ్వసృష్టి ఏర్పడుతుందో దాన్ని ఖియామత్ ప్రళయదినం అంటారు. ఆ రోజు సృష్టిజీవరాశులంతా ఆదం (అలై) నుండి ప్రళయపు చివరి వ్యక్తి వరకు మరణించిన వారంతా అల్లాహ్ సమక్షంలో హాజరుపరచబడతారు. ఆ రోజే వారి కర్మపత్రాల లెక్క తీసుకోబడుతుంది. అత్యధిక పుణ్యకార్యాలు, సత్కార్యాలు చేసిన వారు స్వర్గంలో ఉంటారు. ఎవరి పాపాలు అత్యధికంగా ఉంటాయో వారు నరకంలో ఉంటారు. ప్రళయం సంభవించటం తథ్యం. ఇది ఓ తిరుగులేని సత్యం. ప్రళయదినం గురించి పవిత్ర ఖుర్‌ఆన్ గ్రంథంలో అనేక ఆయతుల్లో ప్రస్తావించటం జరిగింది. పలుచోట్ల వాగ్దానం చేసి మరీ నొక్కి

teluguislam.net



చెప్పటం జరిగింది. ప్రళయం సంభవించటం సత్యం. ఎప్పుడు ఏ తేదీన ఏ సమయాన సంభవిస్తుందో ఎవరికి తెలియదు. ప్రళయం శుక్రవారం సంభవిస్తుందని, దానికి ముందే కొన్ని సూచనలు బహిర్గతం అవుతాయని మాత్రం హదీసు వెలుగులో తెలుసు.

ప్రళయ సూచనల గురించి అంతిమ దైవ ప్రవక్త (స) పవిత్ర నోటి నుంచి జాలువారిన ఒక పవిత్ర ప్రవచనాన్ని ఈ రోజు మనం ఆలకించబోతున్నాం.

**ప్రియసోదరులారా!**

సర్వసృష్టికర్త అయిన అల్లాహ్, ఆయన దైవ ప్రవక్త ప్రవచించిన ఈ దివ్య ప్రవచనాలను శ్రద్ధగా వినండి. ఏయే సూచనలు నేడు ఆవిష్కృతం అయ్యాయో కూడా శ్రద్ధగా గమనించండి. ఆ సూచనల ద్వారా ప్రళయం ఎంత సమీపంలో ఉందో బోధపడుతుంది. అల్లాహ్ దగ్గర ఒక రోజంటే ప్రపంచపు వెయ్యి సంవత్సరాలకు సమానం.

అల్లాహ్ మనందరికి ఆ రోజు గౌరవస్థానాన్ని ప్రసాదించుగాక...ఆమీన్.

ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: దైవ ప్రవక్త (స) తన అంతిమ హజ్జ్‌యాత్ర సందర్భంగా కాబాగృహ ద్వారాన్ని పట్టుకుని నిలబడి ఇలా ప్రబోధించారు:

**ప్రజలారా!**

"ఏమిటి నేను మీకు ప్రళయదిన సూచనలు, చిహ్నాలు చెప్పనా"? అన్నారు. దానికి స్పందించిన సల్మాన్ ఫార్సి (రజి), మా తల్లిదండ్రులను మీకు అర్పింతు! తప్పు కుండా తెలుపండి ప్రవక్తా!(స) అని అన్నారు. అప్పుడు దైవ ప్రవక్త(స) ఇలా ప్రవచించారు: శ్రద్ధగా వినండి! నమాజులను వృథా చేయటం, మనోవాంఛల వైపుకు మొగ్గు చూపటం, ధనం వలన ధనివంతులను గౌరవించటం". ఇది వినగానే సల్మాన్ (రజి) ఆశ్చర్యంతో ఇలా అన్నారు: దైవ ప్రవక్తా (స) ఏమిటి, అలా జరుగుతుందా"? ఆ తరువాత దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: దైవసాక్షిగా అలాగే జరుగుతుంది. శ్రద్ధగా వినండి! ఆ సమయాన జకాత్ పన్నుగా పరిగణించదుతుంది. యుద్ధ ప్రాప్తిని తమ సంపాదనగా లెక్కగడతారు, అసత్యవంతులను సత్యవంతులుగా



భావిస్తారు . సత్యవంతులను అసత్యవంతులుగా లెక్కగడతారు. అప్పగింతలను కాజేసేవారే నిజాయితి పరులుగా ప్రసిద్ధి చెందుతారు. నిజాయితి పరులు ద్రోహులుగా పరిగణించబడుతారు. ఎలా మాట్లాడాలో కూడా తెలియని వారు ఇస్లాం పండితులు, నాయకులు, బోధకులుగా కీర్తి గడిస్తారు.

సత్యధర్మ విషయంలో తొమ్మిది విషయాలను నిరాకరిస్తారు. ఇస్లాం నామ మాత్రంగానే ఉండిపోతుంది. ఖుర్ఆన్ కేవలం అక్షర రూపంలోనే ఉంటుంది. ఖుర్ఆన్ సువర్ణాక్షరాలతో అలంకరించబడుతుంది. మృతులపై పఠించబడుతుంది. పురుషులలో స్థూలకాయులు పెరుగుతారు. దాసీలు సలహాదారులుగా ప్రఖ్యాతి గడిస్తారు. పిన్న వయుస్కులు వేదిక(మెంబర్)పై ప్రసంగాలిస్తారు. కార్య నిర్వహణ స్త్రీ చేతిలో ఉంటుంది. అత్యంత విశాలంగా, అందంగా మసీదులు నిర్మిస్తారు. చర్చీల మాదిరిగా ,ఆశ్రయాల మాదిరిగా నిర్మించటం జరుగుతుంది. నమాజీల పంక్తులు ఎక్కువగా ఉంటాయి. కాని వారి ఆలోచనలు, పలుకులు మనసు పూర్తిగా వేర్వేరుగా ఉంటాయి". సల్మాన్ (రజి) మళ్ళీ ఆశ్చర్యంతో ఇలా దర్యాప్తు చేశారు: ఓ దైవ ప్రవక్తా! ఏమిటి అలా జరుగుతుందా? "అవును" అల్లాహ్ సాక్షిగా అలాగే జరుగుతుందని దానికి బదులిచ్చారు ప్రవక్త (స) వారి దృష్టిలో విశ్వాసి ఒక దాసి కంటే అత్యంత హీనమైన వాడుగా ఉంటాడు. ఎందుకంటే అల్లాహ్ పట్ల అవిధేయత, కృతఘ్నుతను చూస్తూ కూడా వారు సంస్కరించలేని హీనస్థితిలో ఉంటారు. లోలోపలే కుమిలిపోతూ, నీటితో ఉప్పుకరిగిపోయినట్లు కృంగిపోతూ ఉంటారు.. పురుషులు పురుషులతో నీతిబాహ్యమైన పనులకు పాల్పడతారు. స్త్రీలు కూడా స్త్రీలతో అదే పనిలో లీనమైపోతారు. ఒక నవయవ్వనవయసు గల కన్యపై వ్యామోహం చెందే విధంగా ఒక అబ్బాయిపై వ్యామోహం పెరుగుతుంది. దుర్మార్గులు ఇమాములుగా చెలామణి అవుతారు. వారి సలహాదారులు పాపాత్ములై ఉంటారు. నిజాయితీపరులే నమ్మకద్రోహానికి పాల్పడతారు. నమాజులు త్యజిస్తారు. మనోకాంక్షల దాస్యం జరుగుతుంది. అలాంటి సమయాన్ని పొందితే మీరు నమాజు అంత వేళ్ళల్లో నమాజు వేళకు పాటించమని ఆజ్ఞాపిస్తున్నాను. ఆ సమయాన తూర్పు పడమర దిశల నుండి కొందరు వ్యక్తులు వస్తారు. వారు ఆకారం రీత్యా మనుషులు కాని వారి హృదయాలు షైతాన్ లాంటివి. వారు పిన్నలపై వాత్సల్యం కురిపించటంగానీ, పెద్దలను గౌరవించటంగానీ చేయరు. ఆ సమయంలో కూడా హజ్ చేయబడుతుంది. కాని

teluguislam.net



రాజులు చక్రవర్తులు తమ హజ్‌లను విహారయాత్రగా చేస్తారు. వ్యాపారస్థులు తమ వ్యాపార లావాదేవీలు, ప్రయోజనాల కొరకు పేదవారు అడుక్కోటానికి మాత్రమే చేస్తారు. ఖారీలు ఇమాములు హజ్ ప్రదర్శనాబుద్ధితో మాత్రమే చేస్తారు". సల్మాన్ (రజి) ఓపిక పట్టక లేక సంభ్రమాశ్చర్యంతో మళ్ళీ ఇలా ప్రశ్నించారు: 'ప్రవక్తా! ఏమిటి అలాగే జరుగుతుందా! దానికి సమాధానంగా దైవ ప్రవక్త (స), ముహమ్మద్ ప్రాణం ఎవరి చేతిలో ఉందో ఆ దైవ సాక్షి! అలాగే జరిగి తీరుతుంది'. అని బదులిచ్చారు. ఆ సమయాన అసత్యం ప్రబలుతుంది. తోకచుక్క ప్రస్ఫుటమవుతుంది. స్త్రీలు పురుషుల వ్యాపారంలో భాగస్వామ్యులమవుతారు. అంగళ్ళు కోకొల్లలుగా ఉంటాయి. లాభాలు తక్కువ ఉంటాయి. భీభత్సకర తుఫానులు, దుమారాలు చెలరేగుతాయి. ఆ దుమారాలు విషపూరిత సర్పాలను కురిపిస్తాయి. అవి ఆ కాలపు ఇమాములను, నాయ కులకు పెనవేసుకుంటాయి. ఎందుకంటే వారంతా చెడును చూస్తూ వారించలేదు. సల్మాన్ (రజి) ఇలా అన్నారు: ఓ దైవ ప్రవక్త! ఏమిటి అలానే జరుగుతుందా? అపుడు దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: "అవును ప్రళయానికి ముందు ఇవన్ని జరిగి తీరుతాయి, నన్ను సత్య ప్రవక్తగా ప్రభవింపజేసిన ఆ అల్లాహ్ సాక్షిగా"..

**మహాశయులారా..!**

ప్రళయం సంభవించే ముందు ప్రపంచంలో ఎలాంటి పరిస్థితి నెలకొంటుందో ఈ హదీసులో పూర్తిగా చిత్రికరించబడింది. ప్రవక్త (స) తెలిపిన సూచనలన్ని నేడు సాక్షాత్కరించాయి. ఒకటి కూడా మిగిలి పోలేదు. ప్రవక్త పవిత్ర నోటి నుండి జాలువరిన ప్రతి పదం నేడు యదాతథంగా జరుగుతుంది. ఉదాహరణకు మసీదులను తీసుకుందాం. ఈ రోజుల్లో నిర్మించిన, నిర్మించబడుతన్న మస్జిదులన్నీ అత్యంత అందంగా, సుందరంగా తీర్చిదిద్దబడుతున్నాయి. చర్చీలు, ఆలయాలు కూడా ఇంత అద్భుతంగా రూపుదిద్దుకోవటం లేదు. అలాంటి మస్జిద్‌లోకి వెళ్ళి ఒక్కసారి చూసినట్లయితే కొత్త విధానాలు, నవీన ఆరాధన పద్ధతులు జరుగుతున్నాయి. ఇక అనేక మస్జిదుల్లోనే మనకు సమాధులు దర్శనమిస్తాయి. అంటే మస్‌జిద్‌లోనే ఖబరస్తాన్ ఉంటుంది. వాస్తవానికి మస్‌జిదుకు, ఖబరస్తాన్‌కు ఎలాంటి సామీప్యమూ లేదు. ఉండకూడదు. దుర్మార్గులు, త్రాగుబోతులు, దౌర్జన్యపరులు ప్రబలిపోతున్నారు. వారికి భయపడి వారిని పొగుడుతారు, గౌరవిస్తారు. కాని వారి వీపు వెనుక వారిని దుమ్మెత్తి పోస్తారు. శాపనార్థాలు పెడతారు.



ఏది ఏమైనప్పటికీ దైవాజ్ఞతో దైవ ప్రవక్త (స) తెలిపిన ప్రళయ సూచనలన్నీ ఎలాంటి మార్పు లేకుండా జరుగుతున్నాయి. చిన్న చిన్న సూచనలన్నీ జరిగిపోయాయి. ఇక పెద్ద పెద్ద సూచనలు ఉన్నాయి. ఉదాహరణకు: ఇమామ్ మెహ్‌దీ రాక, దజ్జాల్ ఉపద్రవం, ఈసా (అలై) దివి నుంచి భూమికి దిగిరావటం ఇవి మాత్రమే మిగిలి ఉన్నాయి. వాటి వాటి సమయాల్లో అవి కూడా సంభవిస్తాయి. ప్రళయం అకస్మికంగా వచ్చిపడుతుంది.

**మహాశయులారా..!**

అల్లాహ్ అలాంటి ఉపద్రవ కాలంలో విశ్వాసంతో మరణించే భాగ్యాన్ని ప్రసాదించాలన్ని దుఆలు చేస్తూ ఉండాలి. దైవ ప్రవక్త (స) మరో హదీసులో ఇలా ఉద్బోధించారు.

**من مات فقد قامت قيامته "మన్ మాత ఫఖద్ కామత్ ఖియామతుహ్"**

**(సహీహ్ బుఖారీ)**

అంటే మరణించిన వాని ప్రళయం ఆ రోజే సంభవించింది. అంటే అతడు ప్రళయదిన మజిలీలోకి ప్రవేశించాడని అర్థం. ఇక మీదట అతనికి ప్రళయమే ప్రళయం అందుకొరకు మనం ప్రళయదినాన్ని దృష్టిలో ఉంచుకొని ఆ రోజు గురించి భయపడతూ ఉండాలి. మృత్యుదూత మన తలపైనే ఉన్నాడు. అల్లాహ్ ఆజ్ఞ కాగానే ఆదైవ దూత మన ప్రాణాన్ని తీస్తాడు. ఆ రోజు మన ఆత్మ మన దేహాన్ని వీడి సుదీర్ఘ దూరాలకు చేరుకుంటుంది. పిల్లలు అనాథులవుతారు. బందుమిత్రులు దుఃఖ సంద్రంలో మునిగిపోతారు. కాని ఇది సత్యం. ఇది జరిగితీరుతుంది. మరణాన్ని స్మరించుకుంటూ ఉండండి. దైవాజ్ఞలను, ఆదేశాలను పాటిస్తూ ఉండండి. ప్రవక్త ప్రవచనాలను తూచ తప్పకుండా పాటించండి. షిర్క్ బిద్అత్ వంటి అధర్మ కార్యాలకు బహుదూరంగా ఉండండి. అందరి హక్కులను నిర్వర్తించండి. స్వర్గ ప్రవేశం కోసం నిరంతరం సత్కార్యలతో శ్రమిస్తూ ఉండండి.

అల్లాహ్ మనదరికీ స్వర్గంలో ప్రవేశించే భాగ్యాన్ని ప్రసాదించుగాక! ఆమీన్.

teluguislam.net



# 13. పవిత్ర ఖుర్ఆన్ విశిష్టత

قالوا من فعل هذا بآلهتنا إنه لمن الظالمين (59)

**"పర్వదినాన (పోటీ) పెట్టుకుందాం. పొద్దెక్కిన తరువాత ప్రజలంతా గుమిగూడినప్పుడే" అని (మూసా) బదులిచ్చాడు.**

***(అల్ అంబియా 21 : 59)***

**ఇస్లామీయ ప్రియ సోదరులారా..!**

"ఖుత్బ మస్నూన తర్వాత నేను పఠించిన ఆయత్ అర్థాన్ని ముందు తెలుసు కుందాం. అల్లాహ్ పవిత్ర ఖుర్ఆన్ గ్రంథంలో ఇలా సెలవిస్తున్నాడు."

ఈ దైవ వాక్యాలను శ్రద్ధగా అధ్యయనం చేసిన వారికి దివ్యగ్రంథం ఖుర్ఆన్ మజీద్ ప్రాముఖ్యత, విశిష్టత బోధపడుతుంది. ఖుర్ఆన్ మజీద్‌ను సన్మార్గ, సరోవరం, కారుణ్యసమూహారం అల్లాహ్ 'బయ్యినహ్' అనే స్పష్టమైన పదంతో అభివర్ణించటం నిజంగా ఓ అత్యుత్తమ విధానం. 'బయ్యినహ్' అంటే స్పష్టమైన నిదర్శనం, ఆధారం అని అర్థం. ఖుర్ఆన్ మజీద్‌లోని ప్రతి అంశం మానవజాన్నానికి, అతని స్వభావానికి అనుగుణంగా అతి సులభంగా స్పష్టంగా ఉంటుంది. అతనికి అర్థం కాని అంశం అంటూ ఏదీ ఖుర్ఆన్ గ్రంథంలో లేనే లేదు. అందులోని అంశాలు, విషయాలు, దృశ్యాలు, చారిత్రక ఘట్టాలు ప్రకృతి పరిమళాలు అన్ని సహజ సిద్ధంగా ఉన్నాయి. ఇందులో విడమరచి చెప్పిన ప్రతి అంశం పూర్వపు ఆకాశ గ్రంథాల ద్వారా కూడా రుజువుచేయబడ్డాయి. పూర్వపు ఆకాశగ్రంథాలు కూడా ఈ గ్రంథం గురించి శుభ వార్తలను తెలుపుతూ ఎన్నో నిదర్శనాలతో బలపరచాయి. కనుకనే ఖుర్ఆన్ మజీద్ స్పష్టమైన నిదర్శనం. సన్మార్గాన్ని చూపే ఏకైక దైవగ్రంథం. ఈ ఖుర్ఆన్ పూర్వపు జాతులు స్థితిగతులు, జయాపజయాలు, అభివృద్ధి వినాశనం ఇత్యాది విషయాలన్నింటి గురించి స్పష్టంగా బోధిస్తుంది. సన్మార్గాన్ని రుజుమార్గాన్ని, సత్య మార్గాన్ని తెలుపు తుంది. ఆ మార్గాలన్నింటి వరకు మనల్ని చేరుస్తుంది.



ఖుర్ఆన్ మజీద్ కారుణ్య సరోవరం. దీన్ని అవతరింపజేసిన ప్రభువు కరుణా కరుడే. ఏ ప్రవక్త పై అవతరించిందో ఆ ప్రవక్త కారుణ్య మూర్తి. ఏ ధర్మం గురించి ఇది బోధిస్తుందో ఆ ధర్మం కారుణ్య ధర్మం. అందుకే ఖుర్ఆన్ మజీద్ కారుణ్య సరోవరం. ఈ విషయాన్ని తెలుపు అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

وننزل من القرآن ما هو شفاء ورحمة للمؤمنين ولا يزيد الظالمين إلا خسارا ○

**"మేము అవతరింపజేసే ఈ ఖుర్ఆన్ విశ్వాసుల కొరకు ఆసాంతం స్వస్థత, కారుణ్య ప్రదాయిని. అయితే దుర్మార్గులకు (దీనివల్ల) నష్టం కలగటం తప్ప మరే వృద్ధీ జరగదు."** ***(అల్ ఇస్రా 17 : 82)***

لو أنزلنا هذا القرآن على جبل لرأيته خاشعا متصدعا من خشية الله وتلك الأمثال نضربها للناس لعلهم يتفكرون ○

**"ఒకవేళ మేము ఈ ఖుర్ఆనును ఏ పర్వతం మీదనో దింపి ఉంటే అది అల్లాహ్ భీతితో అణగారి, తునాతునకలై పోవటాన్ని నీవు చూసి ఉండేవాడివి. ప్రజలు యోచన చేయగలందులకు గాను మేము ఈ దృష్టాంతాలను వారికి వివరిస్తున్నాము."** ***(అల్ హషర్ 59 : 21)***

ఇది అద్భుతమైన గ్రంథం, దీని రక్షణా భాద్యతను స్వయంగా దీన్ని అవతరింప జేసిన ప్రభువే స్వీకరించాడు. ఆ విషయాన్ని తెలుపుతూ అల్లాహ్ పవిత్ర ఖుర్ఆన్‌లో ఇలా సెలవిస్తున్నాడు:

إنا نحن نزلنا الذكر وإنا له لحافظون ○

**"మేమే ఈ ఖుర్ఆన్‌ను అవతరింపజేశాము. మరి మేమే దీనిని రక్షిస్తాము."**

***(అల్ హిజ్ర్ 15 : 9)***

ఈ వాగ్దాన ఫలితంగానే 1400 సంııక్రితం అవతరించిన గ్రంథం ఈ నాటికి ఎలాంటి మార్పు లేకుండా యదాతథంగా సురక్షితంగా ఉంది. అందులో పదం కాదు కదా అక్షరం తేడా ఉండదు. అక్షరంకాదు కదా జేర్, జబర్, ఒత్తులు కూడా చెక్కు చెదరలేదు.

ఆయత్ తరువాత ఒక హదీసును పఠించాను. అందులో దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు. "శ్రేష్టమైన వస్తువుల్లో అత్యంత శ్రేష్టమైన వస్తువు పవిత్ర ఖుర్ఆన్

teluguislam.net



గ్రంథం. దీనికంటే శ్రేష్టమైన గ్రంథం మరేది లేదు. అత్యంత శ్రేష్టమైన విధానం దైవప్రవక్త (స) విధానం. ఆయన తన కాలంలో ఆచరించి చూపిన పవిత్ర జీవితం. అత్యంత నీచకార్యం బిద్అత్, ఇస్లాంధర్మంలో లేని నవీన పోకడలు. అలాంటి కొత్త పనులన్ని మార్గభ్రష్టత్వం. ప్రతి మార్గభ్రష్టత ఫలితం నరకం.

**మహాశయులారా..!**

భాష, అర్థం, భావ పరంగా ఖుర్ఆన్ మజీద్ అత్యంత అమూల్యమైన గ్రంథం. ఈనాటి వరకు ఎలాంటి విరోధి, బద్ధ శత్రువు కూడా దీన్ని ఎదుర్కొలేదు. ఇందులో ఎలాంటి దోషాన్ని, లోపాన్ని చూపలేదు. ఇలాంటి వేరే గ్రంథాన్ని కూడా రచించనూ లేదు. అరబీ భాషలో ప్రావీణ్యం గల మక్కావాసులే దీన్ని సాధించిలేకపోయారు.

وَإِن كُنتُمْ فِي رَيْبٍ مِّمَّا نَزَّلْنَا عَلَىٰ عَبْدِنَا فَأْتُوا بِسُورَةٍ مِّن مِّثْلِهِ
وَادْعُوا شُهَدَاءَكُم مِّن دُونِ اللَّهِ إِن كُنتُمْ صَادِقِينَ ﴿23﴾

**మేము మా దాసునిపై అవతరింపజేసిన దాని విషయంలో ఒకవేళ మీకే దన్నా అనుమానముంటే, అటువంటిదే ఒక్క సూరానైనా (రచించి) తీసుకు రండి. మీరు సత్యవంతులే అయితే (ఈ పని కోసం) అల్లాహ్‌ను తప్ప మీ సహాయకులందరినీ పిలుచుకోండి.** ***(అల్ బఖర 2 : 23)***

**మహాశయులారా.!**

ఖుర్ఆన్ అవతరించి 1400 సంవత్సరాలు గడిచిపోయాయి. ఈ కాలంలో పెద్ద పెద్ద ఇస్లాం విరోధులు ప్రతి సమాజంలో, వర్గంలో వుంటూనే ఉన్నారు. ఇప్పుడూ ఉన్నారు. వారందరూ ఇస్లాంపై అనేక ఆరోపణలు, విమర్శలు సందిస్తూనే ఉన్నారు. అయినప్పటికీ ఖుర్ఆన్ చేసిన ఛాలెంజ్‌కి వారెవ్వరూ జవాబు ఇవ్వలేక పోయారు. ప్రళయం వరకూ కూడా ఎవ్వరూ ఇవ్వలేరూ! ఇది ఎలాంటి పవిత్ర గ్రంథమంటే దీన్ని భద్రపరచటానికి ఎలాంటి సిబ్బంది అవసరమూ లేదు. దీన్ని లిఖించటానికి లేఖకుల అవసరమూ లేదు. దీని భద్రత కొరకు అల్లాహ్ విశ్వాసుల హృదయాలను ప్రత్యేకించాడు. వారి హృదయాలపై పూర్తిఖుర్ఆన్ ముద్రించ బడింది. ప్రపంచ మతాలలోగానీ, మత గ్రంథలలోగానీ, ఇలాంటి దృష్టాంతం మచ్చుకు కూడా కానరాదు. అందుకే హదీసులో చెప్పబడింది- ఎవరయితే తమ పిల్లలకు



ఖుర్ఆన్‌ని కంఠస్థం చేయిస్తారో, పారాయణం చేయటం నేర్పిస్తారో వారిని ప్రళయ దినాన వజ్రవైఢూర్యాల కుర్చీలపై కూర్చోబెట్టడం జరుగుతుంది. స్వర్గపు వజ్రవైఢూ ర్యాల కిరీటం వారి తలకు తొడిగించటం జరుగుతుంది. మహ్‌షర్‌లో వారు పొందిన స్థానాన్ని చూసి ఇతరులలో ఈర్ష్యానాందానికి లోనవుతారు. ఈ అదృష్టానికి నోచుకున్నా వారు నిజంగా భాగ్యవంతులు.

**ఖుర్ఆన్ గ్రంథ అనుయాయులారా..!**

ఈ హదీసులో దైవ ప్రవక్త (స) ఖుర్ఆన్ గురించి అద్భుతంగా విడమరచి చెప్పారు. అందులోని ప్రతి అక్షరం ఓ సత్యశిఖరం. ప్రతి పదం గురించి వివరించా లంటే ఎంతో సమయం పడుతుంది. కాని విచారించాల్సిన విషయం ఏమిటంటే సంపూర్ణ సన్మార్గపు మార్గదర్శక గ్రంథాన్ని ముస్లింలందరూ ఒక మామూలు గ్రంథంలా భావిస్తూ పఠించటం మినహా దాని గురించి యోచించటం లేదు. ముస్లింలు ఒకవేళ ఖుర్ఆన్ అర్థం చేసుకుంటూ పఠిస్తే నేడు సమాజంలో పేరుకుపోయిన కొత్తపోకడలు, వింత ఆచారాలు ఉండేవికావు. సమాధులు కళకళలాడేవి కావు. వాటిముందు తలలు వంచేవారే కాదు. కాని ఎంత శోచనీయం!? ముస్లింలు నమాజుల్లో **إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِينُ 'ఇయ్యాక నబుదు వ ఇయ్యాక నస్తయీన్"** (అల్ ఫాతిహ 1: 5) "మేము నిన్నే ఆరాధిస్తున్నాము. సహాయంకోసం నిన్ను మాత్రమే అర్థిస్తున్నాము" అని పఠిస్తూనే సమాధుల వెంట ప్రదక్షిణాలు చేస్తూ ఖననం చేయబడిన మృతులను పూజిస్తున్నారు. వారే 'సర్వం' అని విశ్వసిస్తూ, వారిని కోరుతున్నారు. వీటన్నిటికి ఒకే కారణం: ముస్లింలందరూ ఖుర్ఆన్ గ్రంథాన్ని పఠించటం, అర్థాన్ని భావాన్ని, వివరణను గ్రహించటం, సన్మార్గాన్ని గుర్తించి ఆచరించ టాన్ని విస్మరించారు. ఖుర్ఆన్‌తో ఎలాంటి సంబంధం లేకుండా ప్రవర్తిస్తున్నారు అల్లాహ్ కారుణ్యం ఉన్న వారు తప్ప.

తిర్మిజీలోని మరో హదీసులో దైవ ప్రవక్త (స) ఖుర్ఆన్ విశిష్టత గురించి ఇలా ప్రబోధించారు. అబూ సయీద్ ఖుద్రీ (రజి) కథనం ప్రకారం: దైవ ప్రవక్త(స) ఇలా ప్రవచించారు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: ఎవరయితే ఖుర్ఆన్ పారాయ ణంలో, ఖుర్ఆన్‌పై యోచనలో నిమగ్నమైన కారణంగా నన్ను స్మరించలేకపోయారో, నన్ను వేడుకోలేకపోయారో వారికి నేను వేడుకునే వారికన్నా అధికంగా అనుగ్ర

teluguislam.net



హిస్తాను. అల్లాహ్‌కు సమస్త సృష్టిరాశులపై ఎలాంటి ఆధిక్యత ఉన్నదో అలాగే సమస్త వచనాలపై దైవ వచనానికి ఆధిక్యత ఉన్నది.

ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: నిశ్చయంగా అల్లాహ్ ఈ గ్రంథం ప్రకారం నడుచుకున్న ఎన్నో జాతులకు కీర్తి శిఖరాల అంబరాలకు చేరుస్తాడు. మరెన్నో జాతులను ఈ గ్రంథాన్ని విడిచిపెట్టిన కారణంగా అవమానాల అగాథాలలోకి నెట్టేస్తాడు.

దీనిపై ఆచరించేవారికి గౌరవప్రదమైన జీవితం లభిస్తుంది. దీనిపట్ల అజాగ్రత్తగా ఉండే వారు అనుమానాలకు గురి అవుతారు. ప్రపంచంలో ఏ గ్రంథానికి లేని ప్రత్యేకత, గుర్తింపు ఆదరణ ఖుర్‌ఆన్‌కు మాత్రమే ఉంది. అందుకోసమే హదీసులో ఇలా వచ్చింది, తమ సంతనానికి ఖుర్‌ఆన్ గ్రంథాన్ని కంఠస్తం చేయించిన లేదా చదివించినా వారిని ప్రళయదినాన వారికి వజ్రాల కుర్చీల్లో కూర్చుండబెడతారు. స్వర్గంలో వజ్రవైడూర్యాల కిరీటం వారికి తొడిగించబడుతుంది. హష్ర్ మైదానంలో ఆ దేదీప్యమాన దృశ్యాన్ని చూసి గొప్ప గొప్పవాళ్ళంతా ఈర్ష్య చెందుతారు. అల్లాహ్ ప్రతి ముస్లింకూ ఆ మాహాభాగ్యాన్ని ప్రసాదించుగాక.. ఆమీన్..!

**ప్రియ సోదరులారా..!**

నేటి సున్నిత కాలంలో ఖుర్‌ఆన్ గ్రంథ ఆదేశాలను విస్తృతంగా చాటి చెప్పాల్సిన అవసరముంది. ఎక్కడ ముస్లింల నాలుగు నివాసాలున్నాయో అక్కడ వారికి విద్యా సదుపాయం ఏర్పాటు చేయాలి. పవిత్ర ఖుర్‌ఆన్ ఆదేశాలను వారికి బోధించాలి. గ్రామాల్లో మస్జిదుల్లో విద్యా ఏర్పాట్లు చేయాలి. పిల్లలందరికి ఖుర్‌ఆన్ కంఠస్తం చేయించాలి. వారిని హాఫిజె ఖుర్‌ఆన్‌గా తీర్చిదిద్దాలి. అల్లాహ్ ముస్లింల సేవ స్వీకరించుగాక.

దైవ ప్రవక్త (స) నోట జాలువారిన పవిత్ర ప్రవచనాలను ఇపుడు విందాం. హారిస్ బిన్ అవర్ కథనం : నేను ఒకరోజు మస్‌జిద్ గుండా వెళుతున్నాను. అక్కడ కొందరు అప్రయోజన వ్యర్థ విషయాల్లో పడిఉన్నారు. నేను అలీ (రజి) వద్దకు వెళ్ళి ప్రస్తావించాను. వారు, 'ఏమిటి ప్రజలు అలా చేస్తున్నారా?' అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అవునని నేను జవాబిచ్చాను. అప్పుడు అలీ (రజి) ఇలా అన్నారు. "నేను దైవప్రవక్త (స) ఇలా సెలవిస్తుండగా విన్నాను. 'ప్రజలారా! జాగ్రత్త ఉపద్రవాలు రేకెత్తనున్నాయి. అపుడు నేను ఓ దైవ ప్రవక్తా! మరి వాటి నుండి బయట పడే



మార్గమేది? అని ప్రశ్నించాను. దానికాయన, ఖుర్‌ఆన్ గ్రంథం. మీ పూర్వపు వారి విషయాలు మీ తరువాత వారి విషయాలు అందులో ఉన్నాయి. మీ మధ్య రేకెత్తే వివాదాలపై తీర్పుయిచ్చే గ్రంథమది. ఇది హాస్యం కాదు. అహంకారం, అహంభావంతో దీన్ని వదిలిన వ్యక్తిని స్వయంగా అల్లాహ్‌నే పరాభవం పాలుచేస్తాడు. మార్గదర్శక ఖుర్‌ఆన్‌ను వదిలి వేరే గ్రంథంలో సన్మార్గం అన్వేషించిన వానికి అల్లాహ్ మార్గం కష్టం చేస్తాడు. ఇదే పటిష్టమైన దైవబంధం. వివేకంతో కూడిన దైవజ్ఞాపిక. ఈ గ్రంథమే రుజుమార్గంపై నడిపిస్తుంది. దీనిని మనసు పూజారి తన ఇష్టాను సారంగా మలచలేడు. భాషలు వేరైనా పఠించే వారు ఒకే భాషలో ఎలాంటి మార్పు చేర్పులు లేకుండా పఠిస్తారు. ఇస్లామీయ పండితులు, మత గురువులు దీనిని ఎంతగా పఠించినా సేద తీరదు. అది ఎలాంటి గ్రంథమంటే అత్యదికసార్లు పఠించబడిన ఎన్నటికీ పురాతనంగా బోర్ అనిపించదు. అంతేకాకుండా పఠించిన కొద్దీ సరికొత్త మధురానుభూతి కలుగుతుంది. వీటిలో బోధించబడిన అద్భుతాలు మహిమలు గురించి ఇక చెప్పనవసరం లేదు. అంతటి ఆస్వాదన కలుగుతుంది.

teluguislam.net



# 14. హదీస్ విశిష్టత

هُوَ الَّذِي بَعَثَ فِي الْأُمِّيِّينَ رَسُولًا مِّنْهُمْ يَتْلُو عَلَيْهِمْ آيَاتِهِ وَيُزَكِّيهِمْ وَيُعَلِّمُهُمُ
الْكِتَابَ وَالْحِكْمَةَ وَإِن كَانُوا مِن قَبْلُ لَفِي ضَلَالٍ مُّبِينٍ ۝

**ఆయనే నిరక్షరాస్యులైన జనులలో - స్వయంగా వారిలో నుంచే ఒక ప్రవక్తను ప్రభవింప జేశాడు. అతడు వారికి దేవుని వాక్యాలను చదివి వినిపిస్తున్నాడు, వారిని పరిశుద్ధపరుస్తు న్నాడు, వారికి గ్రంథాన్నీ, వివేకాన్ని బోధిస్తున్నాడు. అంతకుముందు వారు స్పష్టమైన మార్గ విహీనతకు లోనై ఉండేవారు.** ***(అల్ జుముఅహ్ 62 : 2)***

**ఇస్లామీయ సోదరులారా..!**

హదీస్ విశిష్టత గురించి ఈ రోజు తెలుసుకుందాం.దైవ ప్రవక్త (స) నోటి నుండి జాలువారిన పవిత్ర ప్రవచనాలను 'హదీస్' అంటారు. దైవప్రవక్త (స) ఆదేశించిన వాటిని, అనుచరులు చేసినపుడు వాటినిధృవీకరించిన విషయాలను కూడా హదీస్ అంటారు. వాస్తవానికి దైవ ప్రవక్త (స) జీవిత విధానాన్ని సున్నత్ అంటారు. దీన్నే ఇస్లాం విద్వాంసులు హదీసుగా అభివర్ణిస్తారు. దైవ ప్రవక్త (స) క్రియాత్మక జీవిత విధానం ఖుర్ఆన్‌కు తాత్పర్యం లాంటిది. ఖుర్ఆన్-హదీసుకు మధ్య అవినాభావ సంబంధం ఉన్నది శరీరానికి -ఆత్మకు ఎలాంటి సంబంధం ఉందో ఖుర్ఆన్-హదీసుల మధ్య సంబంధం కూడా అలాంటిదే. ఈ రోజుల్లో కొందరు ప్రజలు హదీస్‌ను నిరాకరిస్తున్నారు. హదీస్ నిరాకరణ అతిఘోర పాపం. ఖుర్ఆన్ నుండి హదీస్‌ను వేరుచేస్తే ఖుర్ఆన్ మింగుడుపడని ఒక పజిల్‌గా మాత్రమే ఉండిపోతుంది అందువలనే హదీస్ నిరాకరణ ఖుర్ఆన్ నిరాకరణతో సమానం. మరికొందరు హదీసులను పెడచెవిన పెడుతూ తమ ఇమాముల, పీర్ల మాటలను శిరసావహిస్తారు. వారి మాటలు ఫత్వాల ముందు హదీస్‌కు ఎలాంటి ప్రాముఖ్యతా ఇవ్వరు. హదీస్‌లను నిరాకరిస్తారు. వీళ్ళంతా అతిఘోరమైన పొరపాటులో కూరుకు



పోయి ఉన్నారు. వాస్తావానికి ఇమాములు, మత పెద్దలు, పూర్వీకులు ముమ్మాటికి ఇలాంటి బోధనలు చేయలేదు. వారంతా హృదయపూర్వకంగా మనసా వాచా కర్మణా ఖుర్ఆన్, హదీసులకు అత్యధిక ప్రాముఖ్యతను, గౌరవాన్ని ఇచ్చేవారు. తూ.చ తప్పకుండా వాటి ఆదేశాలను ఆచరించేవారు. అబూ హనీఫా (రహ్మ) ఇలా అన్నారు: నా ఫత్వా "దైవ ప్రవక్త (స) హదీసుకు వ్యతిరేకంగా, ఉంటే హదీస్ ను ఆచరించండి, నా ఫత్వాను వదిలిపెట్టండి. హదీసే నా అభిమతం". మిగతా ఇమామ్‌లు, పెద్దలు కూడా ప్రత్యేకంగా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. అల్లాహ్ వారందరకి జన్నతుల్ ఫిర్‌దౌస్ ప్రసాదించు గాక.. ఆమీన్.

**గౌరవనీయ సోదరులారా..!**

ఖుత్బామస్నూన తరువాత పఠించబడిన ఆయత్ సూరె జుమాలోనిది. మొదటి ఆయతుల్లో దైవ ప్రవక్త (స) బాధ్యత గురించి ప్రస్తావించబడింది. ఆ తరువాత ఆయతులో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

وَآخَرِينَ مِنْهُمْ لَمَّا يَلْحَقُوا بِهِمْ ۚ وَهُوَ الْعَزِيزُ الْحَكِيمُ ۝

**ఇంకా, వారితో చేరని ఇతరుల కొరకు కూడా (ఆ ప్రవక్తను ప్రభవింప జేశాడు.) ఆయన గొప్పశక్తిశాలి. వివేచనాశీలి.** ***(అల్ జుముఅహ్ 62 : 3)***

తరువాతి కాలంలో దైవ ప్రవక్త (స) హదీసులను క్రోడీకరించి వాటిని భద్రపరచిన హదీసువేత్తలు, హదీసు విద్యా విద్వాంసుల గురించి ఖుర్ఆన్ మజీద్ ముందుగానే భవిష్యవాణి వివరించింది. ఆ మహానుభావులు, సత్యవంతులు, దైవ ప్రియులు చేసిన బృహత్తర కార్యనిరతిని, కటిన పరిశ్రమను ముస్లిమేతర పండితులు, విద్యావేత్తలు, ప్రముఖులు కూడా కొనియాడారు. హదీసువేత్తలలో బుఖారీ (రహ్మ) గారికి ' అమీరుల్ ముహద్దిసీన్' (హదీసువేత్తల నాయకుడు) అనే బిరుదు లభించింది. అల్లాహ్ ఈ ఆయతులో ఎవరి గురించి ప్రస్తావించాడో ఆ సత్యప్రియుల్ని పుట్టించాడు. వారు ఆ సేవలు చేసి అల్లాహ్‌కు ప్రీతి పాత్రులయ్యారు. సల్మాన్ ఫార్సీ (రజి) గురించి దైవ ప్రవక్త (స) ఇలా భవిష్యవాణి చెప్పారు: ఈయన దేశస్థులు (పారస్ నగరవాసలు) ఒకవేళ ఇస్లామీయ ధార్మిక విద్య సురయ్యా ధృవ నక్షత్రంపై ఉన్నాసరే అక్కడి నుండి పారస్ నగరవాసులు ఆ విద్యను వెతికితెచ్చుకుంటారు. (బుఖారీ)

హదీసువేత్తలు అత్యధికంగా ఫారస్ వంశానికి చెందినవారు. వాస్తవానికి

teluguislam.net



ఆ భవిష్యవాణి వీరి గురించే చెప్పబడింది. వీరే ఆ భవిష్యవాణి హదీసువేత్తలు. మౌలానా హాలీ మర్‌హూమ్ ఇస్లామీయ కవి వారి గురించి కొన్ని కవితాలు కూడా రాశాడు.

వాటి అర్థం: దైవ ప్రవక్త (స) హదీసు విద్యను సంరక్షించే ఒక సమూహం ఉంది. వారు ప్రతి అబద్ధాలకోరును పసిగట్టారు. ఎలాంటి లోపాన్ని వదలలేదు. వితండవాదుల నోర్లు మూయించారు. గత దురాచారాలను పటాపంచలు చేశారు.

**శ్రోతరాలా..!**

దైవ ప్రవక్త (స) దృష్టిలో హదీసు విద్యబోధించే, అభ్యసించే వారికి అత్యుత్తమ స్థానం ఉంది. జనాబ్ అబూ హారూన్ అబ్దీ అనే ఒక ప్రముఖ తాబీ కథనం: మేము అబూ సయీద్ ఖుద్రీ (రజి) వద్దకు వెళ్ళినపుడు వారు సంతోషంతో మమ్మల్ని స్వాగతించేవారు. దైవ ప్రవక్త (స) మీకోసం వసియ్యతు చేశారు. అని సంతోష వార్త చెప్పారు? ఏమిటది: నా తరువాత నా ఉమ్మత్‌లోని నా హదీసు ప్రియులు నా హదీసులను స్వీకరించుటకు మీ వద్దకు వస్తారు. అలాంటివారు వచ్చినపుడు వారిని ప్రేమపూర్వకంగా చూసుకోవాలి. శ్రద్ధతో నా హదీసులను వారికి వినిపించాలి. వారికి అన్నిరకాలుగా తోడ్పడాలి".

మరో హదీసులో ఆయన (స) ఇలా ప్రబోధించారు: "నా ఉమ్మత్‌లోని యువకులు సుదూర ప్రాంతాల నుండి హదీసు విద్య నేర్చుకు నేందుకు మీ వద్దకు వస్తారు. వారు మీవద్దకు వచ్చినపుడు వారికి అన్ని విధాలుగా సహాయం అందించాలి" అయితే అబూ సయీద్ ఖుద్రీ (రజి) హదీసువిద్య నభ్యసించే ఏయువకుణ్ణి చూసినా వెంటనే ఆయన నోట నుండి అప్రయత్నంగా ఈ పదాలు వెలువడేవి:

'ఓ హదీసు పట్ల ప్రేమ గల యువకుల్లారా! దైవ ప్రవక్త (స) చేసిన తాకీదు ప్రకారం నేను మీకు స్వాగతం పలుకుతున్నాను. మిమ్మల్ని మనస్ఫూర్తిగా మా సమావేశాల్లో చేర్చుకుని హదీస్ విద్యను నేర్పించాల్సిందిగా ఆయన(స) మాకు తాకీదు చేశారు. మీరు మా ప్రతినిధులు మా తరువాత మీరే హదీస్ వాళ్ళు.

**ప్రియ సోదరులారా..!**

ఈ హదీసు ద్వారా హదీసు విద్యను అభ్యసించే, బోధించే వారి గౌరవ స్థానం మనకు బోధపడుతుంది. హదీసు విద్యనభ్యసించే వారిని గౌరవించాల్సిందిగా, వారిని ప్రేమగా చూడాల్సిందిగా దైవ ప్రవక్త (స) వసియ్యత్ చేశారు. దైవ ప్రవక్త



సహచరులు సహాబాలు హదీస్ విద్య నేర్చుకొనే వారిని తమ ప్రతినిధులగా అభివర్ణించారు. హదీస్ పట్ల ఆసక్తి ప్రేమ గల ప్రతి ముస్లిం చాలా గౌరవనీయుడు.

దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

**నా ఉమ్మత్‌కు నేర్పించటానికి ఎవరైతే కనీసం 40 హదీసులు కంఠస్తం చేస్తారో వారి గురించి ప్రళయదినాన నేను సిఫారసు చేస్తాను".**

మరో హదీసులో ఆయన (స) ఇలా అన్నారు:

**"తమ ధర్మం గురించి తెలిపే 40 హదీసులను నా ఉమ్మత్‌లో ఎవరు కంఠస్తం చేస్తారో వారిని అల్లాహ్ ప్రళయదినాన ఒక ఆలిం (పండుతుని) ఫకీ (ధర్మవేత్త)గా లేపుతాడు.**

దైవ ప్రవక్త (స) ఇంకా ఇలా అన్నారు:

**"నా హదీసును విని, దాన్ని కంఠస్తం చేసుకొని, దాన్ని ఇతరులకు చేర్చి స్వయంగా దానిపై ఆచరించే వ్యక్తి ముఖాన్ని అల్లాహ్ కళకళలాడేలా చేయాలి".**

**ప్రియ సోదరులారా..!**

దైవ ప్రవక్త (స) చేసిన ఆ శుభకర దుఆ ఫలించింది. ముస్లిం సముదాయం 14 శతాబ్దాలుగా ఈ సేవలో నిమగ్నమైవుంది. ఎవరైతే హదీసు ప్రాధాన్యతను, విశిష్ఠతను, దృష్టిలో ఉంచుకొని హదీసు విద్యలో సేవలందించారో, తమ ధనాన్ని, సమయాన్ని, జీవితాన్ని, దారపోశారో అలాంటి వారందరికీ అల్లాహ్ ప్రపంచంలోనే ఎన్నో అనుగ్రహాలు ప్రసాదించాడు. పరలోక సుఖాల వాగ్దానం చేశాడు.

హదీసు విద్యను పఠించే, బోధించే, లిఖించే వారి ఆయుష్షులో అల్లాహ్ సమృద్ధి శుభాన్ని ప్రసాదిస్తాడు. అలాంటివారు చివరిగడియ వరకు ఎంతో ఆరోగ్యంగా, ఉత్సాహంగా, ఆనందంగా జీవిస్తారు. ఇదంతా దైవ కారుణ్యమూర్తి (స) దుఆ ఫలితం.

అల్లాహ్ ప్రతి ముస్లింకు హదీసు పట్ల ఆసక్తి, ప్రేమను కలిగించి వాటిని కంఠస్తం చేస్తూ, వాటిపై ఆచరించి ఇతరుల వరకు చేర్చే సద్బుద్ధిని సౌభాగ్యాన్ని ప్రసాదించు గాక ఆమీన్.

అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

ప్రళయదినం సంభవించనపుడు హదీసువేత్తలంతా హాజరవుతారు. వారి వెంట సిరాబుడ్లు కూడా ఉంటాయి. అపుడు అల్లాహ్ వారితో ఇలా సెలవిస్తాడు:

teluguislam.net



'మీరంతా హదీసు రక్షకులు (అస్హాబుల్ హదీస్). మీరు ఎల్లప్పుడూ దైవ ప్రవక్త(స) దరూద్ రాసేవారు. ఆ దరూద్ శుభం వల్ల ఈ రోజు స్వర్గంలోకి వెళ్ళండి'.

అల్లాహ్ ప్రతి ముస్లింకు, ప్రతి హదీసు విద్యావేత్తకు ఆ ఉన్నత స్థానాన్ని ప్రసాదించు గాక ఆమీన్.

**وَأَمَّا بِنِعْمَةِ رَبِّكَ فَحَدِّثْ "వ అమ్మా బినేమతి రబ్బిక ఫహద్దిస్"** (అజ్ జుహా 93 : 11) 'ఇంకా, నీ ప్రభువు అనుగ్రహాలను వ్యక్తపరుస్తూ ఉండు' ఈ ఆయత్ వ్యాఖ్యానంలో ఇమామ్ బుఖారీ (రజి) ఇలా పేర్కొన్నారు. ఏ రోజు నుంచి నేను ఈ పవిత్ర హదీస్ సేవలో రేయింబవళ్ళు మునిగిపోయానో అల్‌హమ్దులిల్లాహ్ ఆ రోజు నుండి అల్లాహ్ నా విశ్వాసంలో సమృద్ధిని ప్రసాదించాడు. ప్రియ ప్రవక్త(స) వారి దీవెనల సత్ఫలితాలను నాకు చూపించాడు. నేను నా జీవితంలోని పెద్ద పెద్ద సమస్యల నుండి, ఆపదల నుండి బయటపడ్డాను, ఎన్నో మంచి ఫలితాలు పొందాను. ఇదంతా ఆ దైవప్రవక్త దుఆ ఫలితమే, దైవ ప్రవక్త (స) వారి హదీసు సేవ చేసేవారు, నేర్చుకునే వారు, బోధించే వారు, లిఖించేవారు.. వీరే అసలు సిసలైన దైవప్రవక్త వారసులు, ప్రతినిధులు ఇది మాత్రం అక్షర సత్యం.

దైవప్రవక్త (స) ప్రత్యేకంగా తమ ఖలీఫాల కోసం దుఆలు చేశారు. అలీ (రజి) ఇలా తెలిపారు: ఒక సందర్భంలో దైవ ప్రవక్త (స) నా వద్దకు వచ్చారు. తర్వాత ఇలా ప్రబోధించారు: ఓ అల్లాహ్ నా ఖలీఫాలపై (ప్రతినిధులను) కరుణించు. అపుడు మేము ఓ దైవ ప్రవక్తా! (స) మీ ఖలీఫాలు ఎవరు? అని ప్రశ్నించాము. అపుడాయన "నా తరువాత ప్రళయదినం వరకు పుడుతానే ఉంటారు. నా హదీసులను, సున్నతులను రాబోయేతరాల వారికి అందిస్తూనే ఉల్లేఖిస్తూనే ఉంటారు. ప్రజలకు నేర్పుతూనే ఉండేవారు. వారే నా ఖలీఫాలు.

సుబ్‌హానల్లాహ్! హదీస్ పాఠాలు నేర్పే వారికి, హదీసు మండలాలను నెలకొల్పే వారికి, ఉమ్మత్ నవయువకులకు ఖాలల్లాహ్, ఖలా రసూలుల్లాహ్ "పవిత్ర విద్య నేర్పే వారందరికి శుభకాంక్షలు. హదీసు విద్య కోసం హదీసు సేవ కోసం తమ ధనాన్ని సంపదను దారపోసే సంపన్నులు, నాయకులు, సహృదయులు, సత్య ప్రియులకు కూడా శుభాకాంక్షలు. వారందరు ధన్య జీవులే. హదీసు గ్రంథాలు ప్రచురించే వారు, హదీసు ప్రచారంలో తల మునకలై ఉన్నవారందరికి కూడా సంతోషవార్త, శుభాకాంక్షలు. అల్లాహ్ వీరందరి ఉన్నత సంకల్పాలను కృషిని స్వీకరించి స్వర్గాన్ని ప్రసాదించుగాక ఆమీన్.



ఇలాంటి వర్గం ప్రజల గురించే దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

నా ఉమ్మత్‌లో ఒక వర్గం వారు ఎల్లప్పుడూ అల్లాహ్ అండ కలిగి ఉంటారు. అంటే అల్లాహ్ సహాయం సదా వారితో ఉంటుంది. వారిని వ్యతిరేకించేవారు కూడా చాలా మంది ఉంటారు. కాని వారు ప్రళయదినం వరకు కూడా ఎలాంటి నష్టం చేకూర్చు లేరు.

ఇమామ్ యజీద్ బిన్ హారూన్ కథనం ప్రకారం: ఆ జమాఅత్ (వర్గం) వారు హదీసురక్షకులు అంటే వారు హదీసు వాళ్ళు. అబ్దుల్లాహ్ బిన్ ముబారక్ ఇలా అన్నారు: ఈ హదీసులో తెలుపబడినవారే అహ్లె హదీసులు. అహ్మద్ బిన్ హంబల్ (రజి) గారు ఇలా అన్నారు: "ఈ హదీసులో తెలుపబడిన వారు అహ్లె హదీస్ కాకపోతే మరెవ్వరూ కారు. ఒక వ్యక్తి నఫిల్ నమాజుల్లో, నఫిల్ ఉపవాసాల్లో నిమగ్నమై ఉన్నాడు మరో వ్యక్తి కేవలం హదీస్ పఠించే, లిఖించే పనిలో ఉన్నాడు. వీటిలో ఎవరు ఉత్తములు అని ఒక వ్యక్తి అహ్మద్ బిన్ హంబల్ (రహ) గారిని ప్రశ్నించాడు. అప్పుడు ఆయన హదీస్ షరీఫ్‌ను పఠించి, లిఖించే వ్యక్తే నఫిల్ ఆరాధనలు చేసే వ్యక్తి కన్నా ఉత్తముడు అని అన్నారు. అబూ బకర్ అహ్మద్ బిన్ అలీ (రహ్మ) ఇలా అన్నారు. హదీస్ షరీఫ్ పఠించటం, లిఖించటం అన్ని రకాల నఫిల్ ఆరాధనల కంటే శ్రేష్టం.

**సోదరులారా..!**

ఈ హదీసుల ద్వారా హదీసుకు గల ప్రాముఖ్యత, విశిష్టత హదీసు పాఠకులకు, బోధకులకు గల గౌరవస్థానం మనకు బోధపడుతుంది. అల్లాహ్, ఆయన ప్రవక్త (స) దృష్టిలో అత్యుత్తములు హదీసు సేవకులు. హదీసును గౌరవించటం, ప్రేమించట మంటే దైవప్రవక్తను గౌరవించటం, ప్రేమించటం.

**ప్రియ సోదరులారా!**

దైవ ప్రవక్త (స) ప్రవచనాలను మీరు విన్నారు. హదీసు విశిష్ఠతను ప్రాముఖ్యతను తెలుసుకొన్నారు. కాబట్టి మనం హదీసులను పఠించటం. కంఠస్తం చేయటం ప్రారంభిద్దాం. అల్లాహ్ మనందరికి హదీసు పట్ల, దైవ ప్రవక్త (స)పట్ల ధృడమైన ప్రేమను, ఆత్మతను ప్రసాదించు గాక. ప్రళయదినాన దైవ ప్రవక్త (స) స్వహస్తాల మీదుగా కౌసర్ జలాన్ని పొందే భాగ్యాన్ని ప్రసాదించుగాక. హదీసుపై ఆచరించే భాగ్యాన్ని ప్రసాదించుగాక. ఆమీన్..

teluguislam.net



# 15. హిత బోధనలు

وَمَا يَنطِقُ عَنِ الْهَوَىٰ ۝ إِنْ هُوَ إِلَّا وَحْيٌ يُوحَىٰ ۝

**అతను తన మనోవాంఛల ప్రకారం మాట్లాడటమూ లేదు. అది (అతను మాట్లాడేదంతా) అతని వద్దకు పంపబడే దైవవాణి (వహీ) తప్ప మరేమీ కాదు.** ***(అన్ నజ్మ్ 53 : 3-4)***

ప్రియసోదరులారా.!

దైవప్రవక్త (స) ప్రవచించిన హితోపదేశాల గురించి ఈ రోజు తెలుసుకుందాం. శ్రద్ధగా వినండి పదంపదం గుర్తుంచుకోండి. మరణం తరువాత సంభవించే పరిస్థితులు ఎంత కఠినంగా ఉంటాయో కాస్త ఆలోచించండి అల్లాహ్ మనందరికి ఈ సందేశాన్ని శ్రద్ధగా విని, ఆచరించే భాగ్యాన్ని ప్రసాధించు గాక ఆమీన్..

(హజ్రత్ సమురబిన్ జుందుబ్ (రజి) కథనం: దైవ ప్రవక్త (స) ప్రతీ ఫజర్ నమాజ్ తర్వాత ముఖ్తదీల వైపు తిరిగి కూర్చోటం ఆయన అలవాటు. ఫజర్ నమాజును చీకటిలోనే చదివించేవారు. తర్వాత 'మీలో ఎవరైన రాత్రి కలగన్నారా!' అని ప్రశ్నించేవారు ఆయన. కల చూసినవారు చేప్పేవారు. దానికాయన ఆ కల యొక్క భావార్థాన్ని చేప్పేవారు. ఒక రోజు యధామాదిరిగా ప్రశ్నించారు. కాని ఆ రోజు ఆయన ముఖారావిందం ఖుర్ఆన్ మజీద్ పేజీలాగా ప్రకాశిస్తూ ఉండటం నేను గమనించాను. దైవప్రవక్తా! మాలో ఎవరూ ఈ రాత్రి కల చూడలేదని జవాబిచ్చాము. నేను రాత్రి ఒక కలగన్నానంటూ ఆ కల గురించి వివరించరాయన (స). రాత్రి నేను ఇద్దరు వ్యక్తుల్ని చూశాను. వారు నా వద్దకు వచ్చి నా చేయి పట్టు కుని పవిత్ర స్థలం (షామ్) వైపు తీసుకెళ్ళారు. ఒక వ్యక్తి కూర్చుని ఉన్నాడు. ఒక వ్యక్తి నిలబడి ఉన్నాడు. నిలబడిన ఉన్న వ్యక్తి చేతిలో ఒక ఇనుప కొడవలి ఉంది. దానితో అతను ఆ వ్యక్తి బుగ్గ ఒక భాగం వైపు చీరుతాడు. తరువాత రెండో వైపు చీల్చటం మొదలెడతాడు. ఒక వైపు చీల్చుతున్నపుడు మొదటి భాగం బాగైపోతుంది. మళ్ళి



మొదటిదాన్ని చీరితే రెండవది. ఇలా ఈ శిక్ష జరుగూతూనే ఉంది. అపుడు నేను (స) ఇతనికి ఈ శిక్ష ఎందుకు? అని ప్రశ్నించాను. దానికి సమాధానంగా వారు ఇలా అన్నారు. ఇంకా ముందుకు పదండి. కాస్తా ముందుకు వెళ్ళగానే వెల్లకిలా పడుకొని ఉన్న ఒక వ్యక్తిని చూశాను. అతని తల భాగాన ఉన్న ఒక దైవదూత పెద్ద బండరాయిని ఆ వ్యక్తిపై విసిరేస్తున్నాడు. ఫలితంగా అతని తల నుజ్జునుజ్జయిపోయింది. ఆ దైవదూత బండరాయిని ఎత్తేలోపే మళ్ళీ అతని తల సరిగా కలిసిపోయేది. మళ్ళీ దైవదూత బండరాయి విసిరేయడం తల కలిసిపోవడం జరుగూతూనే ఉంది. ఎందువలన ఈ వ్యక్తికి ఈ శిక్ష జరుగుతుందని? మళ్ళి నేను ప్రశ్నించగా, 'ఇంకా ముందుకు పదండి' అని వారన్నారు. కాస్తా ముందుకెళ్ళగానే ఒక పెద్ద అగ్నిగుండం చూశాను. పై ఉపరితలం చిన్నదిగాను లోపలిభాగం చాలా విశాలంగాను ఉంది. అందులో అగ్ని తీవ్రంగా మండుతుంది. అందులో కొందరు పురుషులు, కొందరు స్త్రీలు నగ్నంగా కాలుతున్నారు. అగ్ని తీవ్రత ఎలా ఉందంటే ఎగిసిపడే అగ్ని జ్వాలాల వల్ల వారు పై భాగానికి చేరేవారు. మళ్ళీ ఆ తీవ్రత వారిని క్రిందికి లాగేది. ఇలా వారు అగ్నిలో మాడుతూ ఉన్నారు.

ఇంతకీ ఇదేంటి! అని నేను ప్రశ్నిస్తే 'ఇంకా ముందుకు పదండ'ని అన్నారు: అక్కడ ఒక రక్తపుటేరు ఉంది. దాని మధ్యలో ఒక వ్యక్తి నిలబడిఉన్నాడు. దాని ఒడ్డున ఒక దూత ఉన్నాడు అతని చేతిలో పెద్ద రాయి ఉంది. ఏరు మధ్యలో ఉన్న వ్యక్తి బయటకు రావాలని అనుకున్నపుడు అతని ముహం మీద ఆ బండ విసిరేవాడు. ఇలా అతడు బయటకు వచ్చిన ప్రతీసారీ ఇలానే జరుగుతుంది. ఇదేమిటని? నేనడిగాను. వారిద్దరు. ముందుకు పదండని అన్నారు. మేము ముందుకు వెళ్ళాము. అక్కడ మేము పచ్చగా నవనవలాడుతున్న ఒక తోటలోకి వెళ్ళాము. అందులో ఒక పెద్ద వృక్షం ఉంది. చెట్టుకింద ఒక వయసు మళ్ళిన వృద్ధుడు కూర్చుని ఉన్నాడు. అతని వద్ద చాలా మంది పిల్లలున్నారు. వారి సమీపంలోనే ఒక వ్యక్తి ఉన్నాడు. అతడు మంట మండిస్తున్నాడు. నన్ను తీసుకువచ్చిన ఇద్దరువ్యక్తులు ఆ వృక్షం మధ్యలో ఒక భవనంలోనికి చేర్చారు. అలాంటి అద్భుతమైన అందమైన భవనాన్ని నేనెప్పుడూ చూడలేదు. అందులో యువకులు ఉన్నాడు, వృద్ధులూ ఉన్నారు, స్త్రీలు ఉన్నారు, పిల్లలూ ఉన్నారు. బయటికి రాగానే మరో వృక్షంపైకి వెళ్ళాము. మరో భవనంలోకి తీసుకువెళ్ళారు. ఆ భవనం మొదటిదాని కంటే సుందరంగా ఉంది. అందులో మాత్రం యువకులు, వృద్ధులైన పురుషులే ఉన్నారు. అపుడు నేను నన్ను తీసుకువచ్చిన వ్యక్తులను ఇలా అడిగాను, "నన్ను రాత్రంతా తీసికెళ్ళి ఎన్నో

teluguislam.net



చూపించారు. వాటి గురించి వివరించి చెప్పండి” ‘అవును వివరిస్తాము’. అని జవాబిచ్చారు.

మొదట దవడలు చీరబడుతున్న వ్యక్తి అబద్ధాలకోరు. ఒక అబద్ధం చెప్పేవాడు అది ప్రపంచమంతా పాకి పోయేది. ఈ శిక్ష ప్రళయం వరకూ జరుగూతూనే ఉంటుంది.

తల పగలగొట్టబడుతూ శిక్ష అనుభవిస్తున్న రెండవ వ్యక్తి అల్లాహ్ ఖుర్ఆన్ నేర్పిన వ్యక్తి. కాని అతడు రాత్రి పడుకునేవాడు, పగలు అమలు చేసేవాడు కాదు. అతనికి ప్రళయము వరకు అదే శిక్ష పడుతూ ఉంటుంది. నగ్నంగా మండుతున్న స్త్రీలు, పురుషులు. వాళ్ళు వ్యభిచారం చేసిన స్త్రీలు, పురుషులు. రక్తపుటేరులలో ఈదుతున్న 4వ వ్యక్తి వడ్డీ తినేవాడు. వృక్షం క్రిందిన చూసిన వృద్ధుడు హజ్రత్ ఇబ్రాహీం (అ) ఆయన చుట్టు ఉన్న పిల్లలు–పిన్న వయుసులో చనిపోయిన పసిపిల్లలు. వారి సమీపంలో మంట మండిస్తూ చూసిన వ్యక్తి నరకభటుడు.

మీరు వెళ్ళిన మొదటి స్వర్గ భవనంలో ఉన్న వారు సాధారణ విశ్వాసులు. అది వారి మొదటి అంతస్తు. మీరు చూసిన 2వ స్వర్గ భవనం అమరవీరులది. నేను జిబ్రాయీల్ దూతను ఈయన నా సహచరుడు మీకాయీల్ దూత. ఇప్పుడు మీరు తలెత్తి అటు చూడండి. తెల్లని మేఘాల్లా, ఒక దానిపై ఒకటి మెరుస్తూ తేజోవంతంగా ప్రకాశవంతంగా ఉన్న భవనం మేఘాల్లో అగుపడింది. వారిలా అన్నారు. “అది మీ స్వర్గ భవనం”. అపుడు నేను ‘మరి నన్ను వదలండి, నేను అందులోకి వెళతాను’ అన్నాను, ఇప్పుడు కాదు. ఇంకా మీది ఇహలోక జీవితం కాస్త ఉంది అది పూర్తి అయిన వెంటనే మీరు మీ స్వర్గంలోకి చేరుతారు”అని వారు బదులిచ్చారు. *(సహీహ్ బుఖారీ)*

**ప్రియ సోదరులారా..!**

దైవప్రవక్త (స) చూసిన కలను విన్నారు. దీన్ని ముస్లిం పండితులు మేరాజ్ అన్నారు. దైవ ప్రవక్త (స) శారీరకంగా మేరాజ్ చేశారు. ఆత్మతోను మేరాజ్ చేశారు. కొందరు మేరాజ్ రూహానీ (ఆత్మ) మేరాజ్ అని శారీరకంగా చేసిన మేరాజ్‌ను నిరాకరిస్తారు. ఇది పెద్ద పొరపాటు. దైవప్రవక్త (స) చూసిన, మనకు చూపించిన ఆ దృశ్యాల మాలికైన నేటి ఖుత్బా మనకు గుణపాఠంగా సరిపోతుంది. ఖుత్బా చిన్నదిగా ఇవ్వటం దైవ ప్రవక్త (స) సంప్రదాయం (సున్నత్). హాఫిజ్ గాని, ఖారీ, మౌలానా, ఆలిమ్ గాని నమాజ్ పట్ల అశ్రద్ధతో పడుకుని వాటి తొలివేళల్లో పాటించ



కుంటే ఖుత్బాలో ఏ శిక్షవిన్నారో అలాంటి శిక్ష గురించి అల్లాహ్‌కు భయపడండి.

అదే విధంగా అబద్ధాలు చెప్పటం, వాటిని ప్రచారం చెయ్యటం చాలా నీతి మాలిన హేయమైన కార్యం, వడ్డీ తినేవారి, వ్యభిచారం చేసేవారి శిక్షలూ విన్నారు. అలాంటి వారికి వాటిని త్యజించాల్సిందిగా ప్రేమతో చెప్పాలి. శిక్షల పట్ల అప్రమత్తం చేయాలి.

**శ్రోతలారా..!**

అల్లాహ్ కృపవల్ల, క్షమా ద్వారాలు తెరువబడే ఉన్నాయి. ఎవరైతే ఘోర పాపాల కోరల్లో చిక్కుకున్నారో వారందరు అల్లాహ్ సమక్షంలో స్వచ్ఛమైన క్షమాభిక్ష, పశ్చాత్తాపం చెందండి. పశ్చాత్తాపం క్షమాభిక్ష చెందడంలో ఎలాంటి ఆలస్యం చేయకూడదు. ఆలస్యం అమృతం విషంలా భావించి వెంటనే పాపాల ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. ఎందుకంటే మరణం ఎప్పుడు వస్తుందో తెలియదు. మరణం సంభవించాక చేసేది ఏమి లేదు – అనుభవించేది తప్ప. ఏద్దైతే విన్నారో వాటి పై ఆచరించండి. ముఖ్యంగా నవయువకులు ఇస్లాం గురించి ఎక్కువగా శ్రద్ధ తీసుకోవాల్సిన, ఆలోచించాల్సిన అవసరం ఎంతో ఉంది. ఉదయం 9.గం॥ల వరకు నిద్రించటం, రాత్రి 11గం॥ల వరకు మేల్కొని ఉండటం, నమాజ్ సమయాల్లో ఆటపాటల్లో వినోదాల్లో ఉండటం – ఇలాంటివన్నీ మానుకొని, పశ్చాత్తాపం చెంది తన బాధ్యతను గుర్తించి ఖుర్ఆన్, హదీస్ ఆదేశాల మేరకు అమలు చేస్తూ ఇస్లాం ధర్మ ప్రచారంలో తమ వంతు పాత్ర పోషించాలి. యువ్వనం శాశ్వతం కాదు. ఈ యవ్వన వయస్సే పరలోక ఏర్పాటుకు దోహదపడేది. యవ్వనాన్ని వృథా చేస్తే శాశ్వత పరలోకంలో చిరకాలం అవమానం భరించవలసి ఉంటుంది. కనుక ఇపుడే మనల్ని మనం సంస్కరించుకొందాం. ఇతరుల్ని సంస్కరించేందుకు ప్రయత్నిద్దాం. ఇస్లామీయ కవి అల్లామా ఇఖ్బాల్ యువకుల్ని ఉద్దేశించి ఇలా అన్నారు:

> **“ఓ ముస్లిం నవయుకుడా! నీవు ఎక్కడిని నుండి రాలి పడ్డ తారవో ఎప్పుడైనా ఆలోచించావా!”**

ముస్లిం స్త్రీలు, మహిళలు కూడా తమ విశ్వాసాన్ని, నడవడికను సంస్కరించుకోవాలి. అబద్ధాలు చెప్పటం వంటి అనేక పాపాలు వారిలో చాలా ఉన్నాయి. వారికి ధార్మిక విద్యనందించటం, నికార్సయిన ముస్లిం స్త్రీగా తీర్చిదిద్దటం మనందరి విధ్యుక్త ధర్మం. అల్లాహ్ మనందరికి సద్బుద్ధిని, సౌభాగ్యాన్ని ప్రసాదించుగాక ఆమీన్.

teluguislam.net



# 16. దుఆ ఘనత

وَاِذَا سَاَلَكَ عِبَادِىْ عَنِّىْ فَاِنِّىْ قَرِيْبٌ ؕ اُجِيْبُ دَعْوَةَ الدَّاعِ اِذَا دَعَانِ ۙ فَلْيَسْتَجِيْبُوْا لِىْ وَلْيُؤْمِنُوْا بِىْ لَعَلَّهُمْ يَرْشُدُوْنَ ۝

**(ఓ ప్రవక్తా!) నా దాసులు నా గురించి నిన్ను అడిగితే, నేను (వారికి) అత్యంత సమీపం లోనే ఉన్నాననీ, పిలిచేవాడు నన్ను ఎప్పుడు పిలిచినా నేను అతని పిలుపును ఆలకించి ఆమోదిస్తానని (నువ్వు వారికి చెప్పు). కాబట్టి వారు కూడా నా ఆదేశాన్ని శిరసావహించాలి, నన్ను విశ్వసించాలి (ఈ విషయం నీవు వారికి తెలియజేయి). తద్వారానే వారు సన్మార్గ భాగ్యం పొందగల్గుతారు.** ***(అల్ బఖర2 : 186)***

**మహాశయులారా..!**

ఖుత్బాలో మీరు ఏ వాక్యం విన్నారో అందులో అల్లాహ్ తన దాసులకు దుఆ చేయాలనే ఆజ్ఞ ఇచ్చాడు. దానితోపాటు మనస్ఫూర్తిగా వేడుకొనే వారి వేడుకోలు ఆమోదించబడుతుందనే శుభవార్తను కూడా వినిపించాడు. నేటి ఆధునిక విజ్ఞాన యుగంలో కూడా ఎందరో నాస్తికులు సైతం సత్యమైన, స్వచ్ఛమైన దృఢ సంకల్పంగల వ్యక్తి దుఆల్లో ప్రభావం ఉంటుందని గాఢంగా విశ్వసిస్తారు. ఒక్కోసారి దుఆల వల్ల అదృష్టాలే మారిపోతాయి. దుఆ విశ్వాసి ఆయుధం లాంటిది. దుఆ ద్వారా దాసుడు అల్లాహ్ ప్రసన్నతను పొందుతాడు. కాబట్టి మనల్ని మనం అల్లాహ్‌ని వేడుకునేందుకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంచుకోవటం మన విధి. ఆయన ముందు చేతులు జాపి దీనంగా వేడుకుంటే ఆయన మన ప్రతి అవసరాన్ని తీరుస్తాడు. సహాయం అందిస్తాడు.

**ప్రియసోదరులారా..!**

ఈ శుభసందర్భంలో ఈ రోజు ఖుత్బాలో దైవ ప్రవక్త (స) సెలవిచ్చిన కొన్ని దుఆలను తెలుసుకుందాం. వాటి ద్వారా సృష్టికర్త అల్లాహ్‌ను గురించి, దైవప్రవక్త(స) మించిన, మరొజ్ఞాని తెలిసినవాడు లేడని కూడా బోధపడుతుంది. ఎంతో వ్యధా



భరిత గడ్డుకాలంలో, కష్ట పరిస్థితిల్లో కూడా దైవ ప్రవక్త (స) మక్కాలో విజయం సాధించారు అంటే అది కేవలం దుఆల ప్రభావమే. కొన్ని సంవత్సరాల వ్యవధిలోనే దైవ ప్రవక్త (స) లక్షల ధన్యజీవులను సన్మార్గం, రుజుమార్గంపై నడిపించి ఒక మహత్తర జనసమూహానికి నాయకునిగా ప్రాణం వెలుగొందారు. అల్లాహ్ ప్రియ ప్రవక్త (స) పై అనంతకోటి శాంతి, శుభాలను కురిపించుగాక. ఆమీన్..!

దైవ ప్రవక్త (స) ప్రతి క్షణం దైవ నామస్మరణలోనే లీనమై ఉండేవారు. దైవ ప్రవక్త (స) చేసిన దుఆలను గనుక పరిశీలించినట్లైతే ఆయనకు అల్లాహ్ పట్ల గల దృఢ విశ్వాసం, ఆయన మనసులో ఉన్న విశ్వాస సరోవరం ఆయన అల్లాహ్‌కు ఎంత సమీపంలో ఉండి దుఆ చేశారో తేటతెల్లమవుతుంది. ఆయన నిత్యం అల్లాహ్ అతి సమీపంలో ఉన్నాడని నమ్మి దుఆ చేసేవారు. కాబట్టి ఇహపరలోకాల్లో అన్నిరకాల సాఫల్యం విజయం కోసం ఆయన అత్యధికంగా ఈ దుఆ పఠించేవారు.

**اللّٰهُمَّ أَصْلِحْ لِي دِينِيَ الَّذِي هُوَ عِصْمَةُ أَمْرِي وَأَصْلِحْ لِي دُنْيَايَ الَّتِي فِيهَا مَعَاشِي وَأَصْلِحْ لِي آخِرَتِي فِيهَا مَعَادِي وَاجْعَلِ الْحَيَاةَ زِيَادَةً لِي فِي كُلِّ خَيْرٍ وَاجْعَلِ الْمَوْتَ رَاحَةً لِي مِنْ كُلِّ شَرٍّ**

**అల్లాహుమ్మ అస్‌లిహ్‌లీ దీనియల్లజీహువ ఇస్‌మతు అమ్రీ వ అస్‌లిహ్లీ దున్యా యల్లతీ ఫీహా మఆషీ వఅస్‌లిహ్లీ ఆఖిరతియల్లతీ ఫీహా మఆదీ వజ్‌అలిల్ హయాత జియాదతల్లీ ఫీకుల్లి ఖైరివ్ వజ్ అలిల్ మౌత రాహతల్లి మిన్ కుల్లి షర్రిన్** (సహీహ్ ముస్లిం)

ఓ అల్లాహ్! నా ప్రతి పనిని చక్కబెట్టు, తీర్చిదిద్దు ప్రతి మంచి పనిని కాపాడే నా ధర్మాన్ని (నా జీవన విధానాన్ని) సంస్కరించు. నా బ్రతుకుతెరువుతో ముడిపడి వున్న నా కుటుంబ పరిస్థితుల్ని చక్కబెట్టు. నేను మరణించి తిరిగి వెళ్ళాల్సిన నా పరలోకాన్ని చక్కదిద్దు. నా జీవితాన్ని నా సమస్త మేళ్ల అభ్యుదయానికి సాధనంగా చెయ్యి. నా మరణాన్ని అన్ని రకాల కీడులనుండి విముక్తికి మూలకారకంగా చెయ్యి.

భయం, పిరికితనం, పిసినారితనం వంటి చెడుల నుండి రక్షణ కోరుతూ దైవ ప్రవక్త (స) ఈ దుఆ చేసేవారు.

**اللهم إني أعوذ بك من العجز والكسل والجبن والهرم والبخل وأعوذ بك من عذاب القبر ومن فتنة المحيا والممات**

teluguislam.net



**అల్లాహుమ్మ ఇన్నీ అవూజుబిక మినల్ అజ్‌జి వల్ కస్లి వల్ జుబ్ని వల్ హర్‌మి వల్ బుఖ్లి వ అఊజుబిక మిన్ అజాబిల్ ఖబ్రి వమిన్ ఫిత్నతిల్ మహ్‌యా వల్ మమాతి. (సహీహ్ ముస్లిం, నసాయీ)**

ఓ అల్లాహ్! బలహీనత, బద్ధకం, పిసినారితనం, పిరికితనం అతివృద్ధాప్యం, సమాధి యాతన నుండి నీ శరణు వేడుతున్నాను.

**మహాశయులారా..!**

దైవ ప్రవక్త (స) ఏ విధంగా అల్లాహ్ సన్నిధిలో దుఆ చేసేవారో గమనించారా? ఎంతటి విశ్వాస , దైవభీతి తో అల్లాహ్‌ను వేడుకుంటూ లీనమయ్యేవారో గ్రహించారా? మనం కూడా దైవ ప్రవక్త (స) మాదిరిగా అల్లాహ్‌తో మనదైన సంబంధాన్ని విశ్వాస దృఢత్వాన్ని మరింత పటిష్టం చేసుకోవాలి. దైవ ప్రవక్త (స) పవిత్ర నోట జాలువారిన ఆ దుఆలను కంఠస్తం చేసి ప్రతి సమయం వేడుకుంటూ ఉండాలి. దుఆల మాధుర్యాన్ని ఆస్వాదించాలి. ఇవేకాకుండా మన నిత్యజీవితంలో పఠించాల్సిన, పాటించాల్సిన మరెన్నో దుఆలు ఉన్నాయి. భోజనమునకు ముందు, తరువాత, ఇంట్లో ప్రవేశించేటప్పుడు, ఇంటి నుండి బయలుదేరేటప్పుడు, ఉదయం, సాయంత్రం చదవాల్సిన దుఆలు... మొదలైనవి ఇలా ప్రతి కార్యానికి ముందు తరువాత చదవాల్సిన ఎన్నో దుఆలను ప్రియ ప్రవక్త (స) మనకు నేర్పించారు. వాటిని తమ దైనందిన జీవితంలో పాటించి తన అనుచర సంఘమైన మనకు తప్పక పాటించాల్సిందిగా తాకీదు చేశారు. దుఆలు పాటించటం వలన కలిగే ప్రయోజనాలు ఇహపరలోక శుభాలను స్పష్టం చేశారు. కాబట్టి దుఆలను కంఠస్తం చేసి వాటిని అర్థం చేసుకొని వాటిని  ఆయా సమయాల్లో పఠిస్తూ ఉండాలి. అల్లాహ్ మనందరికి దుఆ శుభాలను పొందే సద్బుద్ధిని అనుగ్రహించు గాక..ఆమీన్..!

దైవ ప్రవక్త (స) నిద్రకు ఉపక్రమించేముందు ఈ దుఆ చదివేవారు.

**بِاسْمِكَ رَبِّ (رَبِّي) وَضَعْتُ جَنْبِي وَبِكَ أَرْفَعُهُ إِنْ أَمْسَكْتَ نَفْسِي فَارْحَمْهَا وَإِنْ أَرْسَلْتَهَا فَاحْفَظْهَا بِمَا تَحْفَظُ بِهِ عِبَادَكَ الصَّالِحِينَ**

**"బిస్మిక రబ్బీ వజఅతు జన్బీ వబిక అర్ఫఉహూ ఇన్ అమ్‌సక్త నఫ్సీ ఫర్హమహా వ ఇన్ అర్సల్తహా ఫహ్ఫజ్‌హా బిమా తహ్ఫజుబిహి ఇబాదకస్సాలిహీన్ (సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం)**



ఓ అల్లాహ్! నీ శుభ నామంతోనే నా మేను పడకపై వాల్చుతున్నాను.  నీ శుభ నామంతోనే ప్రక్కను ఈ పడక నుండి లేపుతాను. ఓ అల్లాహ్! ఒక వేళ  నా ఆత్మ (ప్రాణం) నిద్రలోనే ఆగిపోతే దానిపై కరుణించు. ఒకవేళ దాన్ని తిరిగి పంపితే నీవు సత్యదాసులను ఎలా కాపాడుతున్నావో అలాగే దాన్ని నీవే కాపాడు.

దైవ ప్రవక్త (స) ఉదయం పడక నుండి లేవగానే ఈ దుఆ పఠించేవారు.

**الحمد لله الذي أحيانا بعد ما أماتنا و إليه النشور**

**"అల్‌హమ్దులిల్లాహిల్లజీ అహ్యానా బాద మా అమాతనా వ ఇలైహిన్నుషూర్ (సహీహ్ బుఖారీ)**

నాకు మరణం తర్వాత తిరిగి జీవనం ప్రసాదించిన అల్లాహ్‌కే సమస్త స్తోత్రములు. కడకు అందరూ తిరిగి వెళ్ళ వలసింది ఆయన వద్దకే.

**ముస్లిం సోదరులారా!**

ఆ ప్రియప్రవక్త, సర్వ ప్రవక్తల నాయకుని పై మనమంతా అర్పింతులవుగాక! ఆయన చేసిన ప్రతి పనిలో దైవప్రేమ వర్షించేది. నిద్రిస్తూ, మేల్కొని, ఇంటా బయట - ఇలా ప్రతి నిమిషం అల్లాహ్ శుభనామస్మరణలో లీనమై ఉండేవారే తప్ప ఏ క్షణమూ ఆయన అలసత్వం వహించలేదు, ఏ పొరపాటూ చేయలేదు.

నేటి ముస్లిం సమాజం తమ సత్య ప్రవక్త (స) గారి  అడుగుజాడల్లో నడిస్తే గాఢ నిద్రలో ఉన్న మన పూర్వ వైభవం గౌరవం తిరిగి మేల్కొనేది. ఇహపరాల్లోను సుస్థిర సాఫల్యం బహుశా పొందేవారు. విజయం వారి పాదాలను చుంబిస్తుంది.

ఓ అల్లాహ్! ముస్లింలకు ఆ ఔన్నత్యాన్ని, స్థానాన్ని అనుగ్రహించు. ఆమీన్.

**ప్రియ సోదరులారా..!**

తాయిఫ్ లో దైవప్రవక్త (స) పై రాళ్ళవర్షం కురిపించబడింది. ఆయన శరీరం రక్తసిక్తమయ్యింది. రక్తం కారుతూ పాదరక్షల్లో గడ్డకట్టి నడవడం ఇబ్బంది అయ్యింది. తిరిగివస్తూ ఒక ద్రాక్షతోటలో సేదతీరి అల్లాహ్ సన్నిధిలో మనందరం చాలా శ్రద్ధగా విని, కంఠస్తం చేయదగ్గ దుఆ చేసారు-

**"ఓ అల్లాహ్! నేను నా శక్తిహీనతను, అసహనాన్ని, ప్రజల మధ్య ఎదురైన పరాభావమును తీసుకుని నీ సన్నిధిలో నివేదించుకుంటున్నాను. నీవే**

teluguislam.net



**కరుణించేవారిలో అత్యంత కరుణ చూపేవాడివి. నా మొహం చూసి చిట్లించుకునే శత్రువు నుండి నీశరణువేడుతున్నాను. నాపై ఆధిపత్యం చూపే మిత్రుని నుండి కూడా." (స్వామీ!) ఒకవేళ ఈ నా పరిస్థితిలో నీకు నాపై కోపం లేకుంటే నాకు అదే చాలు. ఎందుకంటే నా పాలిటి నీ కారుణ్యం ఎంతో విశాలమైనది. నేను నీ సుందర ముఖారవింద తేజస్సులో శరణు పొందాను. ఆ వెలుగులోనే ఆకాశాలు దేదీప్యమైనాయి. చీకటి ప్రకాశవంత మయింది. ఇహలోక కార్యాలు, పరలోక కార్యవ్యవహారాలు చక్కబడ్డాయి. నీ ఆగ్రహాన్ని నాపై దించుట నుండి, నీ అప్రసన్నతకు గురికావటం నుండి నేను నీ శరణుకోరుతున్నాను. ఓ అల్లాహ్! నీవు నాతో ప్రసన్నుడవు అయిపో. ఎందుకంటే నీ సహాయంతోనే నాకు అన్ని విధాల శక్తి, అన్ని రకాల బలం ప్రాప్తిస్తుంది. *(జాదుల్ మఆద్ 3/31)***

అల్లాహ్‌తో అత్యంత దీనంగా వేడుకున్న తర్వాత వెంటనే దైవ దూతలు హాజరై ప్రవక్తా! మీ రక్తం కంట చూసిన ఈ తాయిఫ్ వాళ్ళను ఈ రెండు పర్వతాల మధ్య పిండి చేసెందుకు అనుమతివ్వండి? అని అడిగారు. కాని కారుణ్యమూర్తి శుభ నోటి నుండి ఈ దుఆ జాలువారింది.

**"ఓ అల్లాహ్! నా జాతివారికి సన్మార్గం ప్రసాదించు. వీరు అజ్ఞానులు. వీరికి నా గురించి తెలియదు."**

అంతేకాదు దైవ ప్రవక్త (స) పరస్పర ప్రేమ ఆప్యాయతలు, సన్మార్గ సాఫల్యం కొరకు దుఆ చేసేవారు.

"ఓ అల్లాహ్! మా హృదయాల్లో ఒకరి పట్ల ఒకరికి ప్రేమ కలిగించు. మా వ్యవహారాలను చక్కదిద్దు. శాంతిమార్గాలను చూపించు. అనైతిక లక్షణాల అంధకారం నుండి, నైతిక విలువల్ని వెలుగులోకి తీసుకురా. అన్ని రకాల బాహ్య, అంతర్గత చెడు చేష్టల నుండి నీతిబాహ్యమైన పనుల నుండి కాపాడు. మా చెవుల్లో, కనుల్లో, హృదయాల్లో శుభాన్ని కలిగించు, మా భార్యల్లో, సంతానంలో, వంశంలో శుభాన్ని సమృద్ధిని ప్రసాదించు. మమ్మల్ని క్షమించు. నిస్సందేహంగా నీవు క్షమించే వాడివి, కరుణించేవాడివి. నీ అనుగ్రహాలను గుర్తించి కృతజ్ఞతా భావంతో నీవైపే, మరలి,



వాటిని పొందే భాగ్యాన్ని సద్బుద్ధిని అనుగ్రహించు. నీ సర్వ అనుగ్రహాలన్నింటినీ మాపై సదా కురింపించు.

చెడు ఆలోచనల నుండి, మనోకాంక్షల నుండి అల్లాహ్ శరుణవేడుకొనుటకై సర్వలోక నాయకుడు (స) ఒక మహత్తర దుఆను పఠించేవారు. ఆ దుఆ సర్వరోగ నివారణగా పనిచేస్తుంది. మా గౌరవనీయ గురువు బైహికికాల మౌలానా అబూ సయీద్ షర్ఫుద్దీన్ ముహద్దస్ విహాల్వీ గారు ఈ దుఆను ఎల్లప్పుడు పఠిస్తూ ఉండమని తాకీదు చేసిమరి చెప్పారు.

**"అల్లాహుమ్మ రహ్మతక అర్జూ ఫలాతకిల్నీ ఇలా నఫ్సీ తుర్ఫత ఐనిన్ వఅస్లిహ్లీ షానీ కుల్లహు లాఇలాహ ఇల్లా అన్త" (సునన్ అబూదావూద్)**

"ఓ అల్లాహ్! నేను నీ కారుణ్యాన్ని అర్థిస్తున్నాను. క్షణపాటికైనా నీవు నన్ను నా మనసుకు అప్పగించకు. నీవు నా సర్వకార్యాలను సరిదిద్దు. నీవు తప్ప మరొక ఆరాధ్యుడు లేడు.

**ప్రియసోదరులారా..!**

ఈ దుఆలన్నింటిని కంఠస్తం చేసి నిత్య జీవితంలో ఒకభాగంగా ప్రతి నిమిషం పఠిస్తూ ఇహపరలోక శుభాలను, అనుగ్రహాలను, కారుణ్యాలను పొందండి. అల్లాహ్ కారుణ్య ద్వారాలు ఎల్లప్పుడూ తెరచుకునే ఉంటాయి. సంకల్పశుద్ధితో, స్వచ్ఛమైన మనసుతో దుఆ చేసే ప్రతి అగత్యపరుడు అల్లాహ్ కారుణ్యాన్ని పొందుతాడు.

దైవ ప్రవక్త అడుగుజాడల్లో నడిచే భాగ్యాన్ని అల్లాహ్ మనందరికీ ప్రసాదించు గాక.. ఆమీన్.

teluguislam.net



# 17. హిజ్రత్ తరువాత తొలి చారిత్రక ప్రసంగం

"మీ కొరకు నిషేధించబడిన వస్తువులు ఇవి: మృత పశువు, రక్తం, పంది మాంసం, అల్లాహ్ పేరుగాక వేరితరుల పేరు ఉచ్చరించబడినది, గొంతు పిసకబడటం వల్ల చచ్చిన పశువు, దెబ్బ తగిలి చనిపోయిన పశువు, ఎత్తయిన స్థలం నుంచి క్రిందపడి చనిపోయినది లేక కొమ్ము తగలటం వల్ల చచ్చిపోయి నది, క్రూరమృగాలు చీల్చి తినటం వల్ల చనిపోయిన పశువు (ఇవి మీ కొరకు హరామ్ గావించబడ్డాయి). కాని మీరు ఒకవేళ 'జిబహ్' చేస్తే అది మీ కొరకు నిషిద్ధం కాదు. అలాగే ఆస్థానాల వద్ద బలి ఇచ్చినవి కూడా నిషిద్ధమే. అదే విధంగా బాణాల ప్రయోగం ద్వారా అదృష్టాన్ని పరీక్షించుకోవటం కూడా నిషిద్ధమే. ఇవన్నీ అత్యంత నీచమైన పాప కార్యాలు. ఈ రోజు అవిశ్వాసులు మీ ధర్మం గురించి ఇక ఆశను వదులుకున్నారు. జాగ్రత్త! మీరు భయపడ వలసింది వారికి కాదు, మీరు నాకు భయపడండి. ఈ రోజు మీ కొరకు మీ ధర్మాన్ని పరిపూర్ణం గావించాను. మీపై నా అనుగ్ర హాన్ని పూర్తి చేశాను. ఇంకా, ఇస్లాంను మీ ధర్మంగా సమ్మతించి ఆమోదిం చాను. ఎవడయినా తీవ్రమయిన ఆకలి బాధతో అల్లాడిపోతూ– గత్యంతరం లేని పరిస్థితిలో పాపానికి పాల్పడే ఉద్దేశం లేకుండా ఉండి (పై వాటిలో దేన్నయినా తిన్నట్లయితే) నిస్సందేహంగా అల్లాహ్ క్షమించేవాడు, కనికరిం చేవాడూను."

***(అల్ మాయిద 5 : 3)***

ప్రియసోదరులారా..!

ఇపుడు మీరు విన్న ఈ ఆయత్‌లు సూరె ఫుస్సిలత్‌లోని 30–32 వాక్యాలు. ఈ ఆయతులకు తగ్గ ప్రథమ వ్యక్తి సర్వలోకాల కారుణ్య ప్రవక్త, సర్వ ప్రవక్తల నాయకుడు దైవప్రవక్త ముహమ్మద్ (స). దైవప్రవక్త (స) ప్రదర్శించిన నిలకడ,



స్థిరత్వం సహనం ఆత్మస్థైర్యం, దైవనమ్మకం.. ఇత్యాదివన్నీ ఇతర ప్రవక్తల్లో అగుపిం చవు. ఎందుకంటే దైవప్రవక్త (స)లో గల స్థిరత్వం, నిలకడ ఇత్యాదీ లక్షణాలన్నీ ఇతర ఏ ప్రవక్తకూ అల్లాహ్ అనుగ్రహించలేదు.

దైవ ప్రవక్త (స) వసంతకాలం రబీవుల్ అవ్వల్ మాసం 9వతేది సోమవారం ఉదయం మక్కా నగరంలో జన్మించారు. అంటే క్రి.శ 571 ఎప్రిల్ 22వ తేదిన సూర్యోదయం కాకముందే దైవప్రవక్త (స) ప్రపంచంలోకి అడుగుపెట్టారు. తల్లి ఆమినా, తండ్రి అబ్దుల్లాహ్. మహాప్రవక్త (స) జన్మించక ముందే తండ్రి అబ్దుల్లాహ్ మరణించాడు. తాత అబ్దుల్ ముత్తలిబ్ దైవప్రవక్త జన్మించిన ఏడవ రోజే అకీఖా జరిపించారు. ముహమ్మద్ (స) అని నామకరణం చేశారు. తల్లి ఆమీనా దైవతూతల శుభవార్తను పురస్కరించుకుని అహ్మద్ అని నామకరణం చేశారు. ఆరు సంవత్సరాల ప్రాయంలోనే తల్లి ఆమీనా కాలధర్మం చెందారు. ఎనిమిది సంవత్సరాల ప్రాయంలో తాత అబ్దుల్ ముత్తలిబ్ పరమపదించారు. తరువాత దైవ ప్రవక్త పోషణా బాధ్యతలను పెత్తండ్రి అబూ తాలిబ్ స్వీకరించారు. అబూతాలిబ్ ప్రవక్త గారి తండ్రి అబ్దుల్లా గారి స్వంత సోదరుడు.

యుక్తవయుస్సులో దైవప్రవక్త (స) వ్యాపార నిమిత్తం ప్రయాణాలు చేసేవారు. 25 సంవత్సరాల వయస్సులో మక్కా నగరానికి చెందిన పేరు ప్రఖ్యాతులు గల ఒక ధనిక కుటుంబ స్త్రీ అయిన బీబీ ఖదీజా గారితో దైవప్రవక్త వివాహం జరిగింది. అపుడు ఆమె వయస్సు 40 సంవత్సరాలు. 25 సంవత్సరాలు ఆమె దైవప్రవక్త (స) సహచర్యంలో జీవితం గడిపింది. ఆమె ఎంత చక్కటి సంసార జీవితాన్ని గడిపిందంటే దైవప్రవక్త (స) ఆమె మరణాంతరం జీవితాంతం ఆమెను గుర్తు చేసుకునేవారు. ఆమెను తలచుకునేవారు. హజ్రత్ ఫాతీమా (రజి.అన్హా) హజ్రత్ ఖదీజా (రజి) గర్భం నుండి పుట్టింది మక్కా నగరంలో దైవప్రవక్త (స)కు సంబంధించిన ఆ సమయం ఎంతో మధురమైనది, ఆదర్శప్రాయమైనది. ఖురైష్ వంశంలో ప్రతీ వ్యక్తి దైవ ప్రవక్తను సాదిఖ్ (సచ్ఛీలుడు), అమీన్ (అమానతుదారుడు) అని పిలిచేవారు. 40 సంవత్సరాల వయస్సు సమీపిస్తున్న సమయంలో ఎక్కువగా దైవధ్యానంలో నిమగ్నులైపోయేవారు. నగరాన్ని వదిలి 'హిరా గుహల్లో' ఏకాంతంలో గడిపేవారు.

**మహాశయులారా..!**

అప్పుడు ఆయన వయస్సు 40 సంవత్సరాలు. ఆయన హిరా గుహలోనే

teluguislam.net



ఉండగా ఆయన వద్దకు దైవదూతల నాయకుడు జిబ్రయీల్ (అ.స్స) హాజరయ్యారు. దైవ ప్రవక్త (స) గా నియమితులయ్యారనీ శుభవార్త వినిపించారు. ఆ తర్వాత **اقْرَأْ بِاسْمِ رَبِّكَ الَّذِي خَلَقَ 'ఇఖ్రా.... బిస్మిరబ్బికల్లజీ ఖలఖ్'** ఆయతులు అల్లాహ్ తరుపు నుండి దైవ ప్రవక్త (స) హృదయ ఫలకంపై అవతరించాయి. దైవాజ్ఞతో ప్రవక్త (స) బహుదైవారాధకుల అనాచారాలను, అనైతిక కార్యాలను సంస్కరించటానికి, ఇస్లాం బోధన చేయటానికి నడుము బిగించారు. యుగయుగాలుగా విగ్రహారాధనలో, బహుదైవారాధనలో కూరుకుపోయిన మక్కావాసులంతా దైవ ప్రవక్త (స)కు వ్యతిరేకంగా బద్ధ శత్రువులై నిలిచారు. ధైవధర్మ ప్రచార కార్యాన్ని విజయవంతం చేసే కార్యసాధనలో దైవ ప్రవక్త (స) తలమునకలయ్యారు. 13 సంవత్సరాలు కఠోర పరిశ్రమ కృషి సలిపి నలువైపులా వ్యాపించి ఉన్న మక్కావాసుల విముఖత, వ్యతిరేకులనూ ఎదుర్కొని పవిత్ర కలిమా 'లా ఇలాహ ఇల్లాలాహ్' ప్రచారాన్ని నిర్వహించినారు. నబవీ దశకంలో దైవ ప్రవక్త (స) పెత్తండ్రి అబూ తాలిబ్ గారి మరణం సంభవించింది. సతీమణి మరణించిన మూడు రోజులకే ప్రాణానికి ప్రాణంగా ఇస్లాం ధర్మ ప్రచార రక్షక కవచంగా ఉన్న పెత్తండ్రి మరణం ఆయన్ను (స) కలిచి వేసింది.

ఆ బాధను ఆయన భరించలేక పోయారు. భగ్నహృదయులయ్యారు. అయినప్పటికి ధర్మ ప్రచారంలో ఎలాంటి తేడా రానివ్వలేదు. నిర్విరామంగా ధర్మప్రచారాన్ని చేస్తూ మరింత ఉధృతం చేశారు. దాన్ని అడ్డుకుంటూ మక్కా ఖురైషులు దైవప్రవక్త (స) ఎన్నో బాధలకు కష్టాలకు గురిచేశారు. ఇస్లాంను ఆర్పివేయడానికి శతవిధాలా ప్రయత్నించారు కాని అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

**يُرِيدُونَ أَنْ يُطْفِئُوا نُورَ اللَّهِ بِأَفْوَاهِهِمْ وَيَأْبَى اللَّهُ إِلَّا أَنْ يُتِمَّ نُورَهُ وَلَوْ كَرِهَ الْكَافِرُونَ**

**వారు అల్లాహ్ జ్యోతిని (ఇస్లాంను) తమ నోటితో ఊది, ఆర్పివేయాలనుకుంటున్నారు. కాని సత్యతిరస్కారులకు ఎంత సహించకపోయినా సరే, అల్లాహ్ తన జ్యోతిని వాపింపజేయాలని నిర్ణయించుకున్నాడు**

***(అస్ సఫ్ 61 : 8)***

జరిగింది కూడా అదే. సత్యవిరోధుల ప్రయత్నాలు, పన్నాగాలన్నీ వ్యర్థమైపోయాయి. సత్యం విజయం సాధించింది అసత్యం ఓటమిపాలైపోయింది.



ఇస్లామీయ చరిత్ర దీనికో నిదర్శనం. చివరకు దైవ ప్రవక్త (స) కు హిజ్రత్ అనుమతి లభించింది. దైవప్రవక్త (స) నబవీ శకం 13వ యేట (27 సఫర్), క్రీ.శ 621 సెప్టంబర్ 12వ తేదీన మక్కా వదిలి మదీనాకు పయనమయ్యారు. మూడు పగళ్లు రాత్రుళ్ళు మక్కాకు సమీపంలోని సౌర్ గుహలో గడిపారు. ఆ తరువాత సుదీర్ఘ ప్రయాణం చేస్తూ చివరకు న.శ 13వ యేట రబీవుల్ అవ్వల్ 8వ తేదీ సోమవారం (అంటే క్రీ.శ 622 సెప్టెంబర్ 23వ తేదీ) మదీనా సమీపంలో గల కుబా ప్రాంతానికి చేరారు. అక్కడే బస చేసి తిరిగి 12 రబీవుల్ ఒకటవ హిజ్రీ శకం శుక్రవారం అక్కడ నుంచి పయనమయ్యారు. బనీసాలిమ్ వాడకు చేరేవరకు జుమా సమయం అయ్యింది. అక్కడే దైవ ప్రవక్త (స) వంద మంది అనుచరులతో జుమా ప్రార్థన చేశారు. అదే ఇస్లాంలో మొదటి జుమా.

**ప్రియ సోదరులారా..!**

జుమా సుభదినాన దైవ ప్రవక్త (స) ఇచ్చిన ఆ ప్రసంగం చారిత్రాత్మకంగా చాలా గొప్పస్థానాన్ని కలిగి ఉంది. ఆనాటి ఆ ఖుత్బాను ఈనాటి జుమా ప్రసంగంలో వినిపించాలనుకుంటున్నాను. ఈ చారిత్రక ప్రఖ్యాత ప్రసంగాన్ని చాలా శ్రద్ధగా వినండి అల్లాహ్ ఈ ఖుత్బాను శుభకరంగా చేయుగాక... ఆమీన్.

"సర్వస్తోత్రాలు అల్లాహ్‌కే శోభిస్తాయి. నేను అల్లాహ్‌ను స్తుతిస్తున్నాను, ఆయన సహాయాన్ని కోరుతున్నాను. క్షమాబిక్షకై ఆయన్ను వేడుకొంటున్నాను. నేను అల్లాహ్‌నే విశ్వసించాను. అల్లాహ్ పట్ల అవిధేయత చూపను. ఆయన పట్ల అవిధేయత చూపిన వారితో నేను విరోధిస్తాను. అల్లాహ్ తప్ప మరొక ఆరాధ్యుడు లేడు. ఆయన అద్వితీయుడు. ఆయనకు సాటి ఎవరూ లేరు. ముహమ్మద్ (స) ఆయన ప్రవక్త, దాసుడు అని నేను సాక్ష్యమిస్తున్నాను. అల్లాహ్ ఆయన (స) కు సన్మార్గాన్ని, జ్యోతిని ఇచ్చి యుగాలుగా ప్రవక్తలు లేని కాలంలో, జ్ఞానం విద్య లేని కాలంలో, మార్గభ్రష్టత్వం తాండమాడుతున్న కాలంలో ప్రభవింపజేశాడు. చివరికాలంలో ప్రళయానికి దగ్గరగా, మృత్యువుకు అతి చేరువుగా ప్రభవింపజేశాడు. ఎవరయితే అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను అనుసరిస్తారో వారే సాఫల్యం విజయం పొందుతారు. అవిధేయత చూపేవారు, దైవాజ్ఞలను ఉల్లంఘించేవారు మార్గవిహీనులవుతారు. మార్గభ్రష్టతలో కూరుకుపోతారు.

teluguislam.net



**ముస్లిములారా!**

అల్లాహ్ పట్ల భయభీతిగా ఉండాలనీ తాకీదు చేస్తున్నాను. ఒక ముస్లిం మరొక ముస్లిం సోదరునికి చెయ్యాల్సిన అత్యుత్తమ హితబోధ ఏమిటంటే పరలోకం గురించి ప్రేరేపించాలి. అల్లాహ్‌కు భయపడాలని బోధించాలి. అల్లాహ్ వేటికి దూరంగా ఉండమని ఆజ్ఞాపించాడో, వాటికి బహుదూరంగా ఉండాలి. వాటి జోలికి పోకూడదు. దీన్ని మించిన హితబోధ ఏదీలేదు. దీనిని మించిన జిక్ర్ (నామస్మరణం) లేదు. గుర్తుంచుకోండి! అల్లాహ్‌కు భయపడుతూ పనులు చేసే వ్యక్తికి పరలోకంలో దైవభీతి ఎంతో అత్యుత్తముగా తోడ్పడుతుంది. అల్లాహ్, అతని మధ్యగల అంతర, బాహ్య వ్యవహారాల్లో, విషయాల్లో అతడు ధర్మబద్ధంగా ఉండి ఆయా పనుల్లో అతని సంకల్పశుద్ధి కూఢా అల్లాహ్ కోసమే నిష్కల్మషంగా ఉంటే అతని కొరకు ప్రపంచంలో పేరు ప్రఖ్యాతులు, మృత్యువు తరువాత అతని కొరకు ఆ పనులు ఒక విధిగా మారు తాయి. ఒకవేళ ఎవరయినా అలా చేయకపోతే అలాంటి వారి గురించి అల్లాహ్ సెలవిస్తున్నాడు:

مَا يُبَدَّلُ الْقَوْلُ لَدَيَّ وَمَا أَنَا بِظَلَّامٍ لِلْعَبِيدِ

**నా దగ్గర మాట మార్చడం జరగదు, నేను నా దాసులకు అన్యాయం చేసేవాడను కాను. (ఖాఫ్ 50 : 29)**

కావున అల్లాహ్‌కు భయపడండి. మీ ప్రాపంచిక విషయాల్లోనూ, ధార్మిక విషయాల్లోనూ అంతర విషయాల్లోనూ, బాహ్య వ్యవహారాల్లోనూ దైవభీతి కలిగి ఉండండి. ఎవరయితే అల్లాహ్‌కు భయపడతారో అల్లాహ్ అతన్ని పాపాలన్నింటిని ఆయన తుడిచి వేస్తాడు. వారికి గొప్పపుణ్యఫలితాల్ని అనుగ్రహిస్తాడు. దైవభీతి ఉన్నవారే నిశ్చయంగా గొప్ప విజయం పొందిన వారు. నిశ్చయంగా దైవభీతి అవిధేయత నుండి కాపాడుతుంది. శిక్షలనుండి రక్షిస్తుంది. నిశ్చయంగా దైవభీతి మొహాలను వికసింపజేస్తుంది, దైవ ప్రసన్నతను ప్రసాదిస్తుంది, అంతస్తులను పెంచుతుంది. ప్రపంచంలో ధర్మ సమ్మతమైన పవిత్ర వస్తువుల్ని తినండి, కాని అల్లాహ్ ఆదేశాల నిర్వర్తనలో ఎలాంటి తగ్గింపు చేయకూడదు. అందుకొరకే అల్లాహ్ మీకు గ్రంథాన్ని నేర్పించాడు. దైవ మార్గాలను చూపాడు. దీని ద్వారా అల్లాహ్ సత్యవంతుల్ని, అసత్య వాదుల్ని వేరుచేస్తాడు.



అల్లాహ్ మీపై ఎంతటి అనుగ్రహాన్ని ఉపకారాన్ని కురిపించాడో అలాగే మీరు ప్రజలతో ప్రవర్తించండి. అల్లాహ్ విరోధులను మీ విరోధులుగా భావించండి. అల్లాహ్ మార్గంలో పోరాడవలసిన విధంగా ధర్మపోరాటం చేయండి. ఆయన మిమ్మల్ని ఎన్నుకున్నాడు. మీకు అల్లాహ్ విధేయులు (ముస్లింలు) అని పేరు పెట్టాడు. ఎందుకంటే దైవసందేశం, సూచనలు చూసి కూడా ఇస్లాం స్వీకరించనివాణ్ణి నాశనం చేయడానికి. ఇక ఎవరు దైవసూచనలు చూసి ఇస్లాం స్వీకరిస్తారో వారికి జీవితం ప్రసాదించడానికి, సర్వ పుణ్యాలు అల్లాహ్ ఆజ్ఞతోనే జరుగుతున్నాయి.

అల్లాహ్ నామస్మరణ (జిక్ర్)ను అత్యధికంగా చేస్తూ ఉండండి. పరలోక విజయం కొరకు పుణ్యకార్యాలు చేయండి. ఎవరయితే దైవం మధ్య తమ మధ్య ఉన్న విషయాలను సరిగ్గా పాటిస్తారో అల్లాహ్ అతని మధ్య, ప్రజల మధ్యగల విషయాలను సరిచేస్తాడు.

నిశ్చయంగా అల్లాహ్ దాసులకు ఆజ్ఞలు జారిచేస్తాడు. ఆయనపై ఎవరి ఆజ్ఞా లేదు. అల్లాహ్ దాసుల యజమాని. అల్లాహ్ సన్నిధిలో దాసులకు ఎలాంటి ఆధిపత్యమూ అధికారము లేదు.

**అల్లాహ్ మహోన్నతుడు. పుణ్యకార్యాలు చేసే సద్బుద్ధి, శక్తి ఆ మహోన్న తుని కటాక్షం దయవల్లే కలుగుతుంది. *(రహ్మతుల్లిల్ ఆలమీన్ 1:92-93)***

**ఇస్లామీయ సోదరులారా..!**

ఎంతటి మహత్తర ప్రసంగం! ఎంతటి మహాభాగ్యం!! ఆనాడు ఆరంభమైన ఈ వారంవారం పండుగ ప్రళయం వరకు జారి చేయబడింది. ఇస్లామీయ చరిత్రలోని తొలి ఖుత్బాలో పాల్గొన్న ఆ సహాబాలు ఎంతటి ధన్యజీవులో ఇప్పటికి కూడా బనూ సాలీం వీధి ఖుబాలో ఉంది. అక్కడే ఒక మహోన్నతమైన మస్జిద్ నిర్మించడం జరిగింది గత చరిత్ర వైభవానికి నిదర్శనంగా.

అల్లాహ్ మనందరికి పవిత్ర మక్కా యాత్ర చేసే భాగ్యాన్ని ప్రసాదించుగాక.

దైవప్రవక్త (స) వారి ప్రసంగాన్ని కంఠస్తంచేసి, వాటిపై ఆచరించే భాగ్యాన్ని ప్రసాదించు గాక!. ఆమీన్.

teluguislam.net



# 18. వీడ్కోలు హజ్జ్ ప్రసంగం

**"మీ కొరకు నిషేధించబడిన వస్తువులు ఇవి: మృత పశువు, రక్తం, పంది మాంసం, అల్లాహ్ పేరుగాక వేరితరుల పేరు ఉచ్చరించబడినది, గొంతు పిసకబడటం వల్ల చచ్చిన పశువు, దెబ్బ తగిలి చనిపోయిన పశువు, ఎత్తయిన స్థలం నుంచి క్రిందపడి చనిపోయినది లేక కొమ్ము తగలటం వల్ల చచ్చి పోయినది, క్రూరమృగాలు చీల్చి తినటం వల్ల చనిపోయిన పశువు (ఇవి మీ కొరకు హరామ్ గావించబడ్డాయి). కాని మీరు ఒకవేళ 'జిబహ్' చేస్తే అది మీ కొరకు నిషిద్ధం కాదు. అలాగే అస్థానాల వద్ద బలి ఇచ్చినవి కూడా నిషిద్ధమే. అదే విధంగా బాణాల ప్రయోగం ద్వారా అదృష్టాన్ని పరీక్షించుకోవటం కూడా నిషిద్ధమే. ఇవన్నీ అత్యంత నీచమైన పాప కార్యాలు. ఈ రోజు అవిశ్వాసులు మీ ధర్మం గురించి ఇక ఆశను వదులుకున్నారు. జాగ్రత్త! మీరు భయపడవలసింది వారికి కాదు, మీరు నాకు భయపడండి. ఈ రోజు మీ కొరకు మీ ధర్మాన్ని పరిపూర్ణం గావించాను. మీపై నా అనుగ్రహాన్ని పూర్తి చేశాను. ఇంకా, ఇస్లాంను మీ ధర్మంగా సమ్మతించి ఆమోదించాను. ఎవడయినా తీవ్రమయిన ఆకలి బాధతో అల్లాడిపోతూ-గత్యంతరం లేని పరిస్థితిలో పాపానికి పాల్పడే ఉద్దేశం లేకుండా ఉండి (పై వాటిలో దేన్నయినా తిన్నట్లయితే) నిస్సందేహంగా అల్లాహ్ క్షమించేవాడు, కనికరించే వాడూను."** ***(అల్ మాయిద 5 : 3)***

**ముస్లిం సోదరులారా...!**

దైవప్రవక్త (స) వీడ్కోలు హజ్జ్‌లో ఒక లక్షా 44 వేల మంది ముస్లిం సమూహాన్ని చూసి ఆనందంతో ప్రసంగం చేసి విరమించుకుంటున్న సమయంలో ఈ ఆయత్ అవతరించింది. వీడ్కోలు హజ్జ్ (హజ్జతుల్ వదా) అంటే దైవ ప్రవక్త(స) తన వయసు చివరి భాగంలో చేసిన హజ్జ్ అని అర్థం, అంటే హజ్జ్ తరువాత దైవ ప్రవక్త (స) ఆయుష్షు పూర్తవుతుంది. అల్లాహ్ ఆజ్ఞతో అల్లాహ్ వైపుకు మరలిపోయారు. అదే



విధంగా ఈ హజ్జ్‌లోనే ఆయన (స) ఇస్లాం ప్రియులనుద్దేశించి చివరి ప్రసంగం చేశారు. ఈ హజ్జ్ హిజ్రీ శకం పదవ ఏట జరిగింది. మదీనానగర నలువైపులా దైవప్రవక్త తో హజ్జ్‌కై అత్యధిక సంఖ్యలో పాల్గొనవల్సిందిగా ప్రకటించటం జరిగింది. అందుకే ముస్లింలు పెద్ద ఎత్తున వచ్చి ఆయనతో పాల్గొన్నారు. మదీనా నుండి బయలుదేరిన బృందం మార్గంలో వచ్చి చేరిన అనేక బృందాలతో కలిసి తక్బీర్ నినాదాన్ని ముక్తకంఠంతో ఆలపిస్తూ మక్కా సమీపానికి చేరుకున్నారు. వారందరితో ఆయన మక్కా ఎగువ భాగం నుండి మక్కాలో ప్రవేశించారు. కాబతుల్లాహ్ ప్రదక్షిణ చేశారు. సఫా మర్వా కొండల మధ్యన సయీ చేశారు. ఆ పర్వతాల ఎత్తులపై ఎక్కి కాబా

لاَ إِلَهَ إِلاَّ اللهُ وَحْدَهُ لاَ شَرِيكَ لَهُ لَهُ الْمُلْكُ وَلَهُ الْحَمْدُ وَهُوَ عَلَى كُلِّ شَيْءٍ قَدِيرٌ
لاَ إِلَهَ إِلاَّ اللهُ وَحْدَهُ أَنْجَزَ وَعْدَهُ وَنَصَرَ عَبْدَهُ وَهَزَمَ الأَحْزَابَ وَحْدَهُ

**"లా ఇలాహ ఇల్లల్లాహు వహ్‌దహు లా షరీకలహు లహుల్ ముల్కు వలహుల్ హమ్దు. వహువ అలా కుల్లి షైయిన్ ఖదీర్. లా ఇలాహ ఇల్లల్లాహు వహ్‌దహు వఅన్‌జజ వాదహు వనసర అబ్దహు వ హజమల్ అహ్జాబ వహ్‌దహు"**

(సహీహ్ ముస్లిం)

అల్లాహ్ తప్ప మరొక ఆరాధ్యుడు లేడు. ఆయన ఏకేశ్వరుడు. ఆయనకు సాటి ఎవరులేరు. సామ్రాజ్యం ఆయనదే. సర్వ పొగడ్తలు ఆయనకే ఆయన ప్రతీ వస్తువుపై అధికారము కలవాడు. అల్లాహ్ తప్ప మరొక ఆరాధ్యుడు లేడు. ఆయన ఒక్కడే. ఆయన తన వాగ్దానాన్ని పూర్తి చేశాడు. తన దాసునికి సహాయం అందించాడు. ఆయనే స్వయంగా శత్రు సైన్యాలను ఓడించాడు.

ప్రియసోదరులారా..!

చరిత్రలో ఒక అపూర్వ సంఘటన ఇది. ఒకప్పుడు మక్కాలో జీవితం గడపడం దుర్భరంగా ఉండేది. కాని ఇప్పుడు ఆ రోజు రానే వచ్చింది. ఆయన(స) పై ప్రాణాలు అర్పించేందుకు ఒకటిన్నర లక్షల మంది అనుచరులు సిద్ధంగా ఉన్నారు. తక్బీర్ నినాదాలతో మక్కా నగరమంతా మారుమోగిపోయింది. అతి స్వల్ప కాలవ్యవధిలో అనూహ్యమైన విప్లవం దైవ ప్రవక్త (స) సత్య దైవదౌత్యానికి నిలువెత్తు నిదర్శనం.

దైవ ప్రవక్త (స) జుల్ హిజ్జ 9న అరఫాత్ మైదానం చేరారు. పొద్దువాలిన తరువాత ప్రవక్తతోపాటు ఆయన ఒక లక్ష 44 వేల మంది అనుచరులంతా దుఆలో లీనమైపోయారు.

teluguislam.net



ఈ మహత్తర శుభ సందర్భంలో ఆయన (స) ఒక గొప్ప ప్రసంగం చేశారు. ఈ ప్రసంగం ఆయన చివరి మహోన్నత ప్రసంగం. వాటిలోని ప్రతి పదం ఎల్లప్పుడు మనకు అనుసరణీయమే.

దైవ ప్రవక్త (స) పర్వతం ఎక్కి ఒంటె ఖస్వా మీద స్వారి అయి అల్లాహ్‌ను స్తుతించి ఇలా హితోపదేశం చేశారు-

1) ఓ ప్రజలారా! నేను ప్రస్తుతం చూస్తున్నాను. కాని ఈ స్థలంలో నేను మీతో మళ్ళీ ఎన్నటికీ సమావేశం కాలేను. అంటే ఈ ప్రవచనాల ద్వారా ఆయన తన పరలోక పయనం గురించి ప్రకటించారు. ఆ సందర్భంలోనే ఇజజా నస్రుల్లాహి వల్ ఫత్హ్ సూరా అవతరించింది. అందులో అల్లాహ్ ఈ విషయాన్ని ప్రస్తావించాడు. ఓ ప్రవక్తా! ఇస్లాం ధర్మానికి సంబంధిన మా వాగ్దానం నెరవేరింది. ఇపుడు ఇస్లాం అరబ్‌దేశం నలుమూలల వ్యాపించింది. మీ మిషన్ పూర్తయిపోయింది. ఇక పరలోక పయనానికి సంసిద్ధులు కండి.

దైవ ప్రవక్త (స) ప్రకటించిన విధంగానే అల్లాహ్ నిర్ణయం పూర్తయింది. కొన్ని రోజులకే ప్రవక్త (స) ఇహలోకాన్ని వీడిపోయారు.

2) నిశ్చయంగా మీ రక్తం, ధనం, మీ మానమర్యాదలు అత్యంత పవిత్రమైనవి. నేటి ఈ దినానికి, ఈ మాసానికి ఈ మక్కా నగరానికి ఎంత గౌరవముందో అంతే గౌరవం వాటికి ఉంది. అతి త్వరలోనే మీరు మీ ప్రభువును కలుస్తారు ఆయన మీ ఆచరణ గురించి లెక్క అడుగుతాడు జాగ్రత! నా తరువాత ఒకరు మెడలు ఒకరి నరక్కుంటూ సత్యం మార్గం నుండి తప్పి మార్గభ్రష్టులు కావద్దు.

"దైవ ప్రవక్త (స) ఈ ప్రవచనాల ద్వారా ముస్లిం సమాజం ఎలా ఐకమత్యంగా పవిత్రంగా గౌరవంగా ఉండాలో సూచించారు. కాని కొద్ది కాలంలోనే ముస్లింలు ఆయన ప్రియ ప్రవచనాలను విస్మరించారు. చరిత్రలో చోటుచేసుకున్న ముస్లిం యుద్ధాల గురించి చదివితే చాలా విచారం కలుగుతుంది. హృదయం చలిస్తుంది. ముస్లింలు ఈ విధంగా ఇంత త్వరగా తమ ప్రియ ప్రవక్త ప్రవచనాలను విస్మరించడం కడువిచారం, బాధాకరం.

సత్యవిరోధులు ముస్లింల మధ్య కలహాలు, విభేదాలు రేపి వారి మధ్య యుద్ధాలు చేయిస్తూ ముస్లింలపై అధికారం చెలాయిస్తున్నారు. బైతుల్ మఖ్దిస్ యూదుల ఆధీనంలో ఉంది. కాని ముస్లింలు పరస్పర విభేదాల్లో మునిగి ఉన్నారు.

అల్లాహ్ ! ముస్లింలందరికీ సద్బుద్ధిని, జ్ఞానాన్ని అనుగ్రహించు. ఆమీన్.."



3) జాగ్రత్తగా వినండి!అజ్ఞానకాలంలోని ప్రతి చెడు విషయం నా రెండు పాదాల క్రింద నలిపివేయడం జరిగింది. అజ్ఞాన కాలంలో మన మధ్య జరిగిన రక్తపాతం అంతా ఉపేక్షించటం జరిగింది. వారిలో మొదట రక్తం ఇబ్నె రబీఅ బిన్ హరీస్ రక్తం ఇతను బనూ సాద్ తెగకు చెందిన ఒక దాయి వద్ద పాలు తాగిన హుజైల్ చేతిలో హతమయ్యాడు. ఇప్పుడు నేను అతని రక్తానికి గల పరిహారాన్ని మన్నించేస్తున్నాను. అజ్ఞాన కాలంలో ప్రజల మధ్య తీవ్రంగా ప్రబలిన వడ్డీనీ కూడా నిర్మూలిస్తున్నాను. వారిలో మొదట వడ్డీ హజ్రత్ అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్‌ది. నేను దాన్ని కూడా నా పాదాల క్రింద పడేసి నలిపివేశాను.

4) ఓ ప్రజలారా! స్త్రీల విషయంలో అల్లాహ్‌కు భయపడతూ ఉండండి. అల్లాహ్ సాక్షిగా నీవు ఆమెను భార్యగా స్వీకరించావు. ఆ ఒప్పందంపైనే మీరు వారిని భార్యలుగా స్వీకరించారు. వారిని ఇంట్లోకి తీసుకువెళ్ళారు. అల్లాహ్ వచనాలను పఠించి మీరు వారిని ధర్మ సమ్మతం చేసుకున్నారు. వారిపై మీకు గల హక్కు ఏమిటంటే మీరు లేని సమయంలో ఏ పరపురుషుణ్ణి వారు మీ ఇంట్లో అడుగుపెట్టనివ్వరాదు. ఎందుకంటే, వారు మీ ఇంటినీ, వారి శీలాన్ని, ఇంటి పరువును పరిరక్షించేవారు. ఈ విషయంలో ఒకవేళ వారు మీ మాట వినక మీ ఇష్టానికి వ్యతిరేకంగా చేస్తే వారిని హెచ్చరించే కొట్టే అనుమతి మీకుంది. కాని చిన్నగా కాని ఆమెపై చేయిచేసుకున్న విషయం గడప దాట కూడదు. గుర్తుంచుకోండి! మీపై ఆమెకూ హక్కు ఉంది. అన్న వస్త్రాల విషయాలలో పూర్తి భాధ్యత వహించండి. ఆమెను ఆకలితో ఉంచకూడదు. నగ్నంగా ఉంచకూడదు.

5) మీ మధ్యలో అల్లాహ్ గ్రంథం ఖుర్‌ఆన్ ను వదిలి వెళ్తున్నాను. దాన్ని ధృడంగా పట్టుకున్నంత కాలం మీరు మార్గభ్రష్టులు కాలేరు. మరో రివాయత్ (ఉల్లేఖన)లో ఇలా ఉంది: నేను మీ మధ్య రెండు వస్తువుల్ని వదిలి వెళ్తున్నాను. వాటిని ధృడంగా పట్టుకున్నంత వరకు మీరు దారి తప్పరు. అవే అల్లాహ్ గ్రంథం ఖుర్‌ఆన్, నా విధానం (సున్నత్)

అల్లాహ్ తరపు నుండి వచ్చినది ఖుర్‌ఆన్, దాని తాత్పర్యం హదీసు ఈ రెండింటిపై ఆచరిస్తేనే సన్మార్గం సాఫల్యం ప్రాప్తమవుతాయి. ముస్లింలు అల్లాహ్ విధేయులుగానే ఉంటూ ఖుర్‌ఆన్, సున్నత్‌లపై ఆచరిస్తూ ప్రపంచంలో వెల్లువలా విస్తరించారు. ఎప్పుడైతే వాటినుండి దారి తప్పారో అప్పటి నుండి విభిన్న వర్గాలుగా, బృందాలుగా విడిపోయారు. తమ తమ వర్గానికి ఇమాములను నియమించుకొని

teluguislam.net



ముక్కలుగా విడిపోయారు వారిలోని ఐకమత్యం క్షీణించింది. తత్ఫలితంగా 14 సం॥ చరిత్ర గల ఈ సంఘం పరభవాన్ని, అగౌరవాన్ని చవిచూస్తుంది. అంధానుకరణ రోగం కొందరి నరనరాల్లో ఎలా తిష్టవేసిందంటే బయటపడే మార్గమే చూడరు.

6) ఓ మానవులారా! నిశ్చయంగా నా తరువాత ఇక ఏ ప్రవక్తా రాడు. మీ తరువాత వేరే ఉమ్మతూ సంఘాలూ లేవు. జాగ్రత్త! మీ ప్రభువైన అల్లాహ్‌నే ఆరాధించండి. ఐదు వేళలు నమాజును స్థాపించండి. మీపైగల రమజాన్ ఉపవాసాలను విధిగా పాటించండి. మీ మిగులు ధనం నుండి జకాత్ చెల్లించండి దాని ద్వారా మీ ఆత్మలను పరిశుద్ధం చేసుకోండి. మీ ప్రభువు గృహం కాబాను సందర్శించండి. మీ నాయుకుల పట్ల విధేయత చూపండి. ఉమ్మత్‌లో అరాచకాన్ని సృష్టించకండి. మీరు గనక ఈ హేతువులను పాటిస్తే మరణానంతరం స్వర్గంలో ప్రవేశిస్తారు.

7) ప్రళయ దినాన నా గురించి మిమ్మల్ని అడగబడుతుంది. అపుడు నా గురించి మీరేమిచెబుతారు? సమాధానంగా ఒకలక్ష 44 వేల మంది సహబాలు ముక్తకంఠంతో ఇలా పలికారు. నిశ్చయంగా మీరు ఇస్లాంను మా వరకు పూర్తిగా చేర్చారని మేము సాక్ష్యమిస్తున్నాము. మీరు మాకు మా శ్రేయస్సు కోరడంలో ఎలాంటి లోటూ చేయలేదు. ప్రళయ దినాన కూడా మేమంతా చెబుతాం. ఇది విన్న దైవ ప్రవక్త (స) ఆకాశం వైపుకు చూపుడు వేలు ఎత్తి సహాబాల సమూహం వైపుకు చూసి బిగ్గరగా ఇలా అన్నారు: ఓ అల్లాహ్ నీవే సాక్షివి. నీవే సాక్ష్యంగా ఉండు. నీవే సాక్ష్యంగా ఉండు.

8) చివరిగా దైవ ప్రవక్త (స) తాకీదు చేసి ఇలా అన్నారు: ఇక్కడ హాజరైన వారందరిపై ఇక్కడ హాజరుకానివారికి ఈ విషయాలన్నింటిని చేరేవేసే భాధ్యత విధిగా ఉంది. ఒక్కోసారి హాజరైన వారికంటే, హాజరుకాని వారు విని బాగా గుర్తుంచుకోవచ్చు.

ప్రళయదినం వరకు వచ్చే వంశాలన్నిటికి నా బోధనలు ఆదేశాలు చేరవేయడం మీ అవశ్యం అని తాకీదు చేశారు.

ఈ మహోన్నత ప్రసంగం లో ప్రతి విషయాన్ని ప్రత్యేకంగా ఒక అంశంగా ప్రసంగంగా చెప్పవచ్చు. కాని వివరంగా చెబుతూ పోతే ఒక గ్రంథం రాయవచ్చు అందుకనే సమయాన్ని దృష్టిలో పెట్టుకొని విషయాన్ని క్లుప్తంగా మీ ముందు ఉంచడానికి ప్రయత్నించాను.

అలాహ్ మనందర్కి వీటిని అర్థం చేసుకొని నిజజీవితంలో ఆచరించి, పరలోక విజయం పొందే భాగ్యాన్ని ప్రసాదించు గాక ఆమీన్..



# 19. సఫర్ మాస నవీన పోకడలు

**ముస్లిం సోదరులారా, యువకులారా..!**

ఖుత్బాలో తర్జమాతో పాటు మీరు విన్న ఖుర్‌ఆన్ ఆయత్ షూరా సూరా లోనిది. ఆ సూరా మక్కాలో అవతరించింది. హిజ్రత్ కంటె ముందు అవతరించిన సూరాలను మక్కీ సూరాలంటారు. హిజ్రత్ తరువాత అవతరించిన సూరాలను మదనీ సూరాలుగా వ్యవహరిస్తారు. మక్కావాళ్ళు ఇబ్రాహీమ్ షరీఅత్ పేరుతో రకరకాల నూతన పద్ధతులే కాకుండా బహుదైవారాధన, సత్యతిరస్కారానికి సంబంధించిన ఎన్నో విషయాలను కూడా అందులో జొప్పించారు. అంతటి పాపానికి ఒడిగట్టిన మక్కావాళ్ళని అల్లాహ్ తీవ్రంగా హెచ్చరించాడు. వారు తలపెట్టిన కార్యం ఎంత ఘోరమైనదంటే ఒకవేళ అల్లాహ్ ప్రళయదినాన్ని తీర్పుదినంగా నిర్ణయించి వుండకపోతే వారికి ప్రపంచంలో ఆక్షణమే శిక్ష విధించబడేది. అలాంటి పాపకార్యాల్లో ఒకటి తమ స్వప్రయోజనాలకోసం అలాహ్ నిర్ణయించిన మాసాలను కూడా మార్పు చేర్పులు చేసేవారు. ముహర్రమ్ మాసంలో యుద్ధాలు చేయటం నిషిద్ధం. కాని వారు చేయాల్సి ఉంటే ఆ నెలను సఫర్ నెలగా ప్రకటించుకుని యుద్ధం చేసేవారు. ఇలాంటి సాకులతో, మాటలలో ఇబ్రాహీమ్ ధర్మాన్ని వీరంతా కలగాపులగం చేసి దాని రూపురూఖలనే మార్చివేశారు.

**మహాశయులారా..!**

హిజ్రీ సంవత్సరకాలమానం ప్రకారం సఫర్ మాసం ముహర్రం మాసం తరువాత వచ్చే 2వ మాసం. సఫర్ అంటే శూన్యం అని అర్థం. ఈ పదాన్నే ఉర్దూ భాషలో సిఫర్ అని అంటారు. ఈ మాసం శుభ, సమృద్ధితో ఖాళీగా ఉంటుందన్నది ముష్రిక్కుల నమ్మకం. అందుకే ఈ మాసాన్ని సఫర్‌గా దారిద్ర్యానికి ప్రతీకగా భావించే వారు. వివాహకార్యాలు ఇతర శుభకార్యాలు ఈ మాసంలో చేసేవారు కాదు. కాని దైవ ప్రవక్త(స) స్పష్టమైన పదాలతో ఇలా ప్రవచించారు:

అల్లాహ్ ఆజ్ఞ లేకుండా ఒకరి వ్యాధి ఇంకొకరికి సోకదు. అపశకునాలు

teluguislam.net



చూడటం సరియైన పద్ధతి కాదు. సఫర్ మాసం దారిద్రపు మాసం కాదు.

మక్కావాసులు సఫర్ మాసంలో దోపిడి, దొంగతనానికి, దొమ్మీలకు బయలు దేరి ఇళ్ళను ఖాళీగా వదిలేసి సఫరల్ మకాన్ అనేవారు. అంటే సఫర్ మాసం వచ్చింది ఇళ్లు ఖాళీ అయ్యాయి. అని అర్థం.

దైవ ప్రవక్త (స) ఇలాంటి అనాచార, దూరాచారాల మూఢ నమ్మకాలన్నింటిని ఖండించారు. వారించారు. సఫర్ మాసాన్ని దరిద్రపు మాసంగా భావించడం పాపం అని హెచ్చరించారు.

కాని చాలా విచారకర విషయం ఏమిటంటే నామమాత్ర ముస్లింలు కొందరు ఇలాంటి ఎన్నో దురాచార, అనాచార, మూఢ నమ్మకాలను విశ్వసిస్తారు. సఫర్ మాసాన్ని తేరాతేజీ పేరుతో పాటిస్తారు. అంటే సఫర్ మాసంలో మొదటి 13 రోజులు మరి చెడ్డవని అర్థం. ఈ కాలంలో ఎలాంటి మంచి పనులు శుభకార్యాలు చేయరు. అంతేకాక ఈ కాలంలోని దారిద్ర్యాన్ని దూరం చెయ్యటానికి శనగ గింజలను ఉడకబెట్టి పంచుతారు. ఈ విధంగా మొదటి 13 రోజులు చేస్తారు. దైవధర్మంలో కొత్తపుంతల నుండి అల్లాహ్ శరణుకోరుతున్నాను.

**సోదరులారా..!**

తమను తాము ముస్లింలుగా చెప్పుకునే వారి పరిస్థితి ఇది! ఈ మాసంలోని చివరి బుధవారం కుండలు నింపే పండుగ జరుపుకుంటారు. ఇదే చివరి బుధవారం దైవ ప్రవక్త (స) అనారోగ్యం నుండి స్వస్థత పొంది బయటకువచ్చారనీ, అందుకే ఆ సంతోషంలో ఈ పండుగ జరుపుకుంటామని భావిస్తారు. వాస్తవానికి ఇస్లామీయ షరీఅత్ ప్రకారం ఇవన్నీ దురాచారాలు, తప్పుడు అభిప్రాయాలు, నవీన పోకడలు. దైవ ప్రవక్త (స) జీవిత చరిత్ర కనుక అధ్యయనం చేస్తే వారి ఆ నమ్మకం పొరపాటని బోధపడుతుంది. వాస్తవానికి దైవ ప్రవక్త (స) సఫర్ మాసంలోని చివరి వారంలోనే అస్వస్థత ప్రారంభమైంది. కుండలు వంటి వారి ఈ నవీన కార్యం చరిత్ర ప్రకారం పెద్ద పొరపాటే కాదు. ఇదొక కల్పితం. దైవ ప్రవక్త (స) మీద అభాండం. అబద్ధం, షరీఅత్‌లోలేని ఇలాంటి కొత్త పనులనే, కొత్త నమ్మకాలనే బిద్అత్ (నవీన పోకడ) అంటారు. సఫర్ మాసాన్ని చెడు మాసంగా భావించటం మొదటి 13 రోజులను తేరాతేదీగా జరపటం, చివర్లో కుండలు వండటం ఇవన్నీ బిద్అత్ పనులు,



బిద్అత్‌లకు ఇస్లాంలో ఎలాంటి స్థానం లేదు. కాబట్టి ఈ అక్షర సత్యాన్ని గ్రహించి షరీఅత్‌కు విరుద్ధంగా నడుచుకుంటున్న సోదరులు ఇస్లాం వైపుకు, దైవ ప్రవక్త విధానం సున్నత్ వైపుకు మరలాలి. అల్లాహ్ మనందరిని బిద్ అత్ పనుల నుండి రక్షించుగాక..

**సోదరులారా..!**

మీరు విన్నట్లుగానే ముస్లిం సమాజంలో ప్రతి మాసం ఎన్నో బిద్అత్‌లు చెలామణిలో ఉన్నాయి. ఆచరణలో ఉన్నాయి. ఫంజా, ఫాతిహా, చహ్‌లుమ్, చిల్లా, ముహర్రమ్ తాజియా, షబెబరాత్, మీలాదున్నబీ, ఉర్సులు ఇలాంటి ఎన్నో ముస్లిం సమాజంలో తిష్టవేసి ఉన్నాయి. ఇలాంటి కార్యాలన్ని బిద్అత్ కార్యాలే దైవ ప్రవక్త(స) తన అనుచరసంఘానికి బిద్అత్‌లకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. బిద్అత్ చాలా చెడ్డది. బిద్అత్ ఎంత చెడ్డదో నీచమైందో దైవ ప్రవక్త (స) ఖుత్బా వింటే తెలుస్తుంది. ప్రతి ఖుత్బాలో దైవప్రవక్త (స) ఇలా హెచ్చరించేవారూ వారించే వారు:

> **“ప్రజలారా గుర్తుంచుకోండి! మీకోసం అత్యుత్తమ గ్రంథం అల్లాహ్ గ్రంథం ఖుర్ఆన్ మజీద్. మీకోసం అత్యుత్తమ విధానం దైవ ప్రవక్త (స) ముహమ్మద్ (స) విధానం షరీఅత్‌లో కొత్త పనులు చేయటం అత్యంత చెడ్డపని. ప్రతి కొత్త పని బిద్అత్ ప్రతి బిద్అత్ (నవీన పోకడలు) మార్గభ్రష్టం ప్రతి మార్గభ్రష్టత నరకానికి దారి తీస్తుంది.”**

బిద్అత్ కార్యం నరకానికి మూలకారణమని దైవ ప్రవక్త (స) ప్రవచనం ద్వారా స్పష్టంగా బోధపడుతుంది. కాబట్టి ముస్లిం సోదరులు బిద్అత్ కార్యాలకు బహుదూరంగా ఉండాలి. అలాంటి కార్యాలను విడనాడాలి. బిద్అత్ గురించి దైవ ప్రవక్త (స) మరో సందర్భంలో ఇలా ప్రవచించారు:

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం ప్రకారం దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: అల్లాహ్ దృష్టిలో 3 రకాల వ్యక్తులు చాలా చెడ్డవారు, శాపగ్రస్తులు, వారిపై అల్లాహ్ ఆగ్రహం విరుచుకుపడుతుంది.

1) అల్లాహ్ గృహం కాబాలో దౌర్జన్యం చేసేవాడు అధర్మానికి పాల్పడేవాడు.

2) ఇస్లాం ధర్మంలో అజ్ఞానకాల సంప్రదాయాలను, దురాచారాలను అంటే బిద్అత్‌లను ప్రవేశపెట్టేవాడు.

teluguislam.net



3) అన్యాయంగా, దౌర్జన్యంగా తన ముస్లిం సోదరున్ని హతమార్చినవాడు

(సహీహ్ బుఖారీ)

ఈ హదీసు ద్వారా ఇస్లామీయ షరీఅత్‌లో లేని కొత్త విషయాలను చేర్చేవాడు అల్లాహ్ దృష్టిలో అతి నికృష్టుడు పాపాత్ముడని బోధపడుతుంది.

**సోదరులారా..!**

సఫర్ మాసపు దురాచారాలు గాని, మిగతా మాసాల బిద్అత్‌లు గాని పూర్తి ముస్లిం సమాజాన్ని సామాజికంగా ఆర్థికంగా నాశనం చేస్తాయి. ఎందుకంటే ఈ నవీన పోకడల కోసం ఎంతో ధనాన్ని ఖర్చు చేస్తున్నారు. సందల్, ఉర్సు, గ్యార్వీ, సత్తర్వి అని ఇలా ప్రతి బిద్అత్‌కు ఎంతో ధనాన్ని ఖర్చు చేస్తున్నారు. ఒక వేళ ఆ డబ్బునే ముస్లింల విద్యకు, ధర్మ ప్రచార కార్యాలకు వెచ్చిస్తే ఎంత బాగుండు! కాని ముస్లింలు తమ కళ్ళపై తెర వేసుకొని (లకీర్ కీ ఫకీర్) అయి ఏది నచ్చితే అదే చేసుకుంటూ పోతున్నారు. అత్యంత విచారకర విషయం ఏమిటంటే అలాంటి వారికి ఆ కార్యాలను గురించి, బిద్అత్ గురించి ప్రేమగా తెలుపుతున్నా అర్థం చేసుకోవడం లేదు. పైగా చెప్పేవారినే దూషిస్తారు.

నేడు ముస్లిం సమాజం అజ్ఞానం అపమార్గంలో మునిగితేలుతుంది. ఎంత వైద్యం చేస్తున్నా రోగం పెరుగుతూనే ఉంది. అన్నట్టు ఎంత వారిస్తున్నా, బోధ చేస్తున్నా వారుతమ వ్యాధిని గుర్తించటం లేదు. కాని దైవ ప్రవక్త (స) అన్ని రకాల వ్యాధులకు, విభేదాలకు ఒక మంచి మార్గాన్ని వైద్యాన్ని చూపారు. దైవ ప్రవక్త (స) తన జీవిత చివరి కాలంలో చేసిన వీడ్కోలు హజ్‌లో దాదాపు ఒకటిన్నర లక్షల అనుచర సంఘాన్ని ఉద్దేశించి చేసిన వసియ్యత్ అది ఆయన (స) ఇలా సెలవిచ్చారు.

**అనుచరులారా..!**

మీ మధ్య నేను మీకోసం రెండు వస్తువులను విడిచివెళ్తున్నాను. ఆ రెండింటిని దృడంగా పట్టుకున్నంతవరకు మీరు ఎట్టి పరిస్థితుల్లోనూ మార్గభ్రష్టులు కాలేరు. అవి దైవగ్రంథం ఖుర్ఆన్ నా విధానం-సున్నత్.

**ధార్మిక సోదరులారా..!**

సఫర్ మాసమే కాకుండా రబీవుల్ అవ్వల్‌లో ఈదె మీలాదున్నబీ, బారా వఫాత్, గ్యారవీ పేరుతో హజ్రత్ ఖాజా బగ్దాదీ పేర సత్తర్వా చేయటం ఇత్యాది



వన్నింటికీ ఇస్లామీయ షరిఅత్ లో ఎలాంటి స్థానం లేదు. సత్యవంతుల కాలంలో ఇలాంటి ఆచారాలు, నమ్మకాలు, పండుగలు లేవు. ఇలాంటి కార్యాలతో దైవ ప్రవక్త (స) వారి అనుచరులు, వారి శిష్యులు, నలుగురు ఇమాములకు ఎలాంటి సంబంధము లేదు. ఇస్లామీయ షరిఅత్‌తో సంబంధంలేని కొత్తకొత్త పనులు చేయటం షరీఅత్‌తో చెలగాటం, పరిహాసం అవుతుంది. షరీఅత్‌ను ఎగతాళి చేసే వ్యక్తి స్వర్గానికి అర్హత పొందగలడా అన్నది ఆలోచించాల్సిన విషయం.

అంతిమ దైవ ప్రవక్త (స) విధానం సున్నత్ స్వర్గానికి చేరుస్తుంది. ఆయనతో సంబంధంలేని విషయాలు, బిద్అత్‌లు నరకంలో నెట్టివేస్తాయి.

**సోదరులారా!**

కాబట్టి ఇతరులకు ధర్మాన్ని బోధించే ముందు మన ఇంటిని ప్రవక్త (స) విధానానికి అనుగుణంగా తీర్చి దిద్దుకుందాం. బిద్అత్ లకు బహుదూరంగా ఉందాం. ఇతరులకు ఈ విషయాలు చెప్పి సున్నత్‌కు ప్రాణం పోద్దాం. దైవ ప్రవక్త (స) అడుగుజాడల్లోనే సదా నడుద్దాం.

అల్లాహ్ మనందరికి బిద్అత్ నుండి కాపాడుకునే సద్బుద్ధిని అనుగ్రహించు గాక ఆమీన్..

teluguislam.net



# 20. ఐక్యత - సోదరత్వం

وَاعْتَصِمُوا بِحَبْلِ اللَّهِ جَمِيعًا وَلَا تَفَرَّقُوا ۚ وَاذْكُرُوا نِعْمَتَ اللَّهِ عَلَيْكُمْ إِذْ كُنْتُمْ
أَعْدَاءً فَأَلَّفَ بَيْنَ قُلُوبِكُمْ فَأَصْبَحْتُمْ بِنِعْمَتِهِ إِخْوَانًا وَكُنْتُمْ عَلَىٰ شَفَا حُفْرَةٍ
مِنَ النَّارِ فَأَنْقَذَكُمْ مِنْهَا ۗ كَذَٰلِكَ يُبَيِّنُ اللَّهُ لَكُمْ آيَاتِهِ لَعَلَّكُمْ تَهْتَدُونَ ○

**అల్లాహ్ త్రాడును అందరూ కలసి గట్టిగా పట్టుకోండి. చీలిపోకండి. అల్లాహ్ మీపై కురిపించిన దయానుగ్రహాన్ని జ్ఞప్తికి తెచ్చుకోండి – అప్పుడు మీరు ఒండొకరికి శత్రువులుగా ఉండేవారు. ఆయన మీ హృదయాలలో పరస్పరం ప్రేమానురాగాలను సృజించాడు. దాంతో ఆయన అనుగ్రహం వల్ల మీరు ఒకరి కొకరు అన్నదమ్ములుగా మారారు. మీరు అగ్నిగుండం ఆఖరి అంచులకు చేరుకోగా, ఆయన మిమ్మల్ని దాన్నుంచి కాపాడాడు. మీరు సన్మార్గం పొందాలని ఈ విధంగా అల్లాహ్ మీకు తన సూచనలను విశదపరుస్తున్నాడు.** ***(ఆలి ఇమ్రాన్ 3 : 103)***

**సోదరులారా..!**

ఈ రోజు ప్రసంగంలో ఐకమత్య ఆవశ్యకత గురించి తెలుసుకుందాం. ఖుత్బా లో పఠించిన ఆయత్ మదీనా నగర ఔస్ ఖజ్‌రజ్ తెగలనేపథ్యంలో అవతరించింది. ఇస్లాంకు పూర్వం ఆ రెండు తెగల మధ్య వైరం వైషమ్యం ఉండేది. కలహాలు యుద్ధాలు జరిగేవి. ఆ యుద్ధాల్లో ఎంతోమంది అశువులు బాసారు. అల్లాహ్ ఆ రెండు తెగలకు ఇస్లాం సౌభాగ్యాన్ని ప్రసాదించి వారిని సోదరులుగా చేశాడు. ఈ తెగవారే ఇస్లాంలో అన్సార్లు అనే పేరుతో ప్రఖ్యాతిగాంచారు. ముహాజిర్లకు సోదరులుగా అండగా నిలిచి చరిత్రలో ఐకమత్యానికి సరికొత్త నిర్వచనం ఇచ్చారు. ముస్లింల మధ్య పరస్పర ఐకమత్యం కలుపుగొలు తనం చాలా అవసరం. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి సహృదయ ముస్లిం దీని లోటును, ఆవశ్యకతను అవసరాన్ని గుర్తిస్తూనే ఉంటాడు. ఖుర్ఆన్



హదీసులో ముస్లింలు పరస్పరం ఐకమత్యంగాకలసిమెలసి ఉండాల్సిందిగా తాకీదు చేయబడింది. ఇస్లాం పరస్పర విభేదాలను, కలహాలను నివారించింది. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

وَأَطِيعُوا اللَّهَ وَرَسُولَهُ وَلَا تَنَازَعُوا فَتَفْشَلُوا وَتَذْهَبَ رِيحُكُمْ ۖ وَاصْبِرُوا ۚ
إِنَّ اللَّهَ مَعَ الصَّابِرِينَ ○

**"అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తకు విధేయులై ఉండండి. పరస్పర కలహాలకు గురి కాకండి, అలా చేస్తే మీరు బలహీనులవుతారు. మీ బలసాహసాలు తగ్గిపోతాయి. సహనం వహించండి. అల్లాహ్ సహనం వహించే వారితో ఉంటాడు."** ***(అల్ అన్‌ఫాల్ 8 : 46)***

సహనం ద్వారానే ఐకమత్యం సాధ్యమవుతుంది. ఒకరు అజ్ఞానంతో తొందర పాటు వలన పొరపాటు చేసినపుడు ఎదుటివారు సహనం వహిస్తే సమస్య తలెత్తదు. అందుకే అజ్ఞాన చేష్టకు బదులుగా మృదువైఖరి, దయ, కరుణ కురిపిస్తే ఎంతటి కఠిన హృదయుడైనా అతడు మెత్తబడతాడు. అందుకే అల్లాహ్ ముస్లింలందరినీ ఇలా ఆజ్ఞాపించాడు:

وَلَا تَسْتَوِي الْحَسَنَةُ وَلَا السَّيِّئَةُ ۚ ادْفَعْ بِالَّتِي هِيَ أَحْسَنُ فَإِذَا الَّذِي بَيْنَكَ وَبَيْنَهُ عَدَاوَةٌ
كَأَنَّهُ وَلِيٌّ حَمِيمٌ (34)

**"చెడును మంచితో తొలగించు. అప్పుడు నీతో విరోధమున్న వాడు కూడా తప్పక నీ ప్రాణస్నేహితుడు అవుతాడు."** ***(హామీమ్ అస్ సజ్దా 41 : 34)***

సూరె బఖరలో ఇలా ఆదేశించారు:

**"మీరు మీ పరస్పర వ్యవహారాలలో ఔదార్యం చూపటం మరచి పోవద్దు. నిశ్చయంగా అల్లాహ్ మీరు చేసేదంతా చూస్తున్నాడు."**

***(అల్ బఖర 2 :237)***

ఉపకారాన్ని మరచి అపకారం తలపెట్టిన దానికి బదులుగా ఉపకారమే చేస్తూ ఉండాలి. ఎందుకంటే అల్లాహ్ దాసుని ఆచరణలను చూస్తూ ఉంటాడు. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

وَلَا تَنسَوُا الْفَضْلَ بَيْنَكُمْ ۚ إِنَّ اللَّهَ بِمَا تَعْمَلُونَ بَصِيرٌ ﴿237﴾

**"ఇది కేవలం సహనవంతులకు తప్ప ఇతరులకు లభించదు. ఇది గొప్ప అదృష్టవంతులకు తప్ప ఇతరులకు లభించదు.**

***(హామీమ్ అస్ సజ్దా 41 : 35)***

దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

**"పరస్పర ప్రేమ, శ్రేయోభిలాష విషయంలో విశ్వాసులంతా ఒకే శరీరం లాంటి వారు. ఏ విధంగా శరీరంలోని ఒక భాగానికి బాధ కలిగితే శరీరమంతా నొప్పిగా ఉంటుందో అదే విధంగా ఒక విశ్వాసికి బాధకలిగితే విశ్వాసులందరికీ బాధ కలుగుతుంది." *(సహీహ్ బుఖారీ సహీహ్ ముస్లిం)***

మరో సందర్భంలో దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు:

నా ప్రాణం ఎవరి చేతిలో ఉందో ఆ దైవం సాక్షి! తన కోసం దేనిని ఇష్టపడతాడో దానినే ఇతరుల కొరకు కూడా ఇష్టపడనంతవరకు ఏ దాసుడూ నిజమైన విశ్వాసికాలేదు. *(సునన్ తిర్మిజీ)*

దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: నఫిల్ ఉపవాసం సదఖా, నమాజ్ కంటే కూడా అత్యుత్తమమైన విషయమేదో నేను మీకు చెప్పనా? ఇలా అన్నారు. పరస్పర వ్యవహారాలలో సత్ప్రవర్తనతో మెలగటం. పరస్పర కలహాలు, విభేదాలు మహమ్మారి వంటివి. అది మీ సదాచరణను సర్వనాశనం చేస్తుంది. ఏ విధంగానయితే మంగలి కత్తి వెంట్రుకలను క్షవరం చేస్తుందో అలాగే అనైక్యత మీ మంచిని హరిస్తుంది."

*(మిష్కాత్)*

**ధార్మిక సోదరులారా..!**

అల్లాహ్ ఖుర్ఆన్ గ్రంథంలో సూరే ఫతహ్‌లో నిజమైన విశ్వాసుల లక్షణాలను తెలుపుతూ ఇలా సెలవిస్తున్నాడు.

مُّحَمَّدٌ رَّسُولُ اللَّهِ ۚ وَالَّذِينَ مَعَهُ أَشِدَّاءُ عَلَى الْكُفَّارِ رُحَمَاءُ بَيْنَهُمْ

**"ముహమ్మద్ అల్లాహ్ సందేశహరుడు. ఆయన వెంట ఉన్నవారు సత్య తిరస్కారుల పట్ల కఠినులు, పరస్పరందయార్ద్రహృదయులు.**

***(అల్ ఫతహ్ 48 :29)***



teluguislam.net

పరస్పర ధార్మిక ప్రేమ ఒక నిజవిశ్వాసి గొప్ప లక్షణమని మనకు తెలుస్తుంది.

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: కొంతమంది అల్లాహ్ దాసులు ఎలాంటి స్థానం కలవారంటే వారు ప్రవక్తలు కారు. అమరవీరులూ కారు. కాని పుణ్యఫలం, అంతస్తుల రీత్యా ప్రళయదినాన ప్రవక్తలు, అమరవీరులు సయితం వారిని చూసి ఈర్ష్య చెందుతారు. అల్లాహ్ సమక్షంలో వారికి గొప్ప స్థానం ప్రాప్తమవుతుంది. అప్పుడు ప్రజలు, 'దైవ ప్రవక్తా! (స) ఆ ధన్యజీవులెవరో తెలుపండి' అని అన్నారు. దానికాయన బదులిస్తూ ఇలా ప్రవచించారు: వారు ఎవరంటే "వారు కేవలం అల్లాహ్ ప్రేమలో మునిగి ఉంటారు. ఇతర దైవ ప్రియులతోను స్వచ్ఛమైన ప్రేమ సంబంధం పెంచుకుంటారు. మరి చూడబోతే వారి మధ్య ఎలాంటి రక్తసంబంధం బంధు సంబందమూ ఉండదు. వ్యవహారాల సంబంధమూ ఉండదు. అయినప్పటికీ పరస్పరం ప్రేమ ఆప్యాయత గల దాసులువాళ్ళు నిశ్చయంగా వారి ముహాలపై వెలుగు విరజిమ్ముతుంది. ప్రజలందరు భయాందోళనలో మునిగి ఉంటే వీరిపై మాత్రం ఎలాంటి భయచ్ఛాయలూ ఉండవు. ప్రజలందరు బాధల్లో ఉంటే వీరికి ఎలాంటి భీతి, దుఃఖం ఉండదు." తరువాత దైవప్రవక్త (స) ఈ ఆయత్ పఠించారు:

ధార్మిక ప్రేమ, సోదరత్వంతో పరస్పర సంబంధాలు పెంపొందించుకోవటం అల్లాహ్ దృష్టిలో గొప్ప పుణ్యకార్యం. ఇస్లాం పేరు చెప్పుకుంటూనే పరస్పర అసూయ ఈర్ష్య ద్వేషం, కలహాలు, విభేదాలు కలిగి ఉండటం గురించి దైవ ప్రవక్త (స) ఇలా చెప్పారు:

**అబూ హురైరా (రజి) కథనం: దైవ ప్రవక్త(స) ప్రవచనం: ప్రతి సోమ వారం, గురువారం స్వర్గద్వారాలు తెరవబడతాయి. అల్లాహ్‌కు సాటి కల్పించని ప్రతి దాసుడు క్షమించబడతాడు. కాని తమ సోదరుని పట్ల అసూయతో ఉన్న వారు క్షమించబడరు. వారిద్దరూ ఒక అంగీకారానికి రానంతవరకూ వారిని వదలిపెట్టండి అని సెలవీయబడుతుంది.**

***(సహీహ్ ముస్లిం)***

ప్రియ సోదరులారా..!

ఖుర్ఆన్ ఆయతులు, దైవ ప్రవక్త(స) ప్రవచనాల వెలుగులో మనం ఆలోచించాల్సిన విషయం ఏమిటంటే మన మధ్య పరస్పర ప్రేమానురాగాలు ఎంత

teluguislam.net



అవసరమో ఐకమత్యం అంతే అవసరం. ప్రపంచమంతా నేడు ముస్లింల పరిస్థితి చాలా సంక్లిష్టంగా ఉంది. ఇస్లాం విరోధులు నలువైపుల నుంచీ ముస్లింలను ముట్ట డించి ఉన్నారు. సరికొత్త ఆయుధాలతో, సన్నాగాలతో, కుతంత్రాలతో ఇస్లాంను, ముస్లింలను తొలగించే యత్నంలో తలమునకలై ఉన్నారు. ముస్లింలంతా ఏకమైన ప్పుడే వారిని ఎదిరించగలం, ఓడించగలం. పరస్పర విభేధాలను, కలహాలను విస్మరించి అల్లాహ్ కొరకు దైవధర్మ సంరక్షణకు, ముస్లింలంతా ఏకమవ్వాలి. ముస్లింలు. తమ కర్తవ్యాన్ని, లక్ష్యాన్ని గుర్తించి పరస్పర సోదర భావంతో ఐకమత్యంతో మెలగాలి. అపుడే మరో చరిత్రను తిరిగిరాయగలము. ఇస్లాం కీర్తిని నిలబెట్టగలం అల్లాహ్ ఆశించేది, ఆదేశించేది అదే.

**ప్రియ సోదరులారా..!**

ఇస్లాం మనల్ని అడుగడుగునా సంఘటితశక్తిగా, క్రమశిక్షణగల సమూహంగా చూడాలను కుంటుంది. అందుకే సాముహిక నమాజ్ స్థాపనను విధిగా చేసింది. ప్రతిరోజు ఐదువేళల ముస్లింలు ఒకరికొకరు పలుకరించుకొని పరస్పర సత్ సంబంధాలను ఏర్పరచుకునే ప్రక్రియ ప్రణాళిక మస్జిద్ నుండి ప్రారంభమవుతుంది. అందుకే అహ్లె సున్నత్ నిర్ణయం ప్రకారం షిర్క్ చేయని ప్రతి ఇమామ్ వెనుక నమాజ్ పాటించవచ్చు. ఒకవేళ అతడు పెద్ద పాపాలు చేసినా సరే. కాబట్టి నమాజ్‌ల విషయంలో విభేధాలు, విభజనలు చాలా తప్పు. ఈ ఏర్పాటు ఇస్లామీయ వ్యవస్థ పాలిట విషప్రయోగం. ఐదు వేళల సాముహిక ప్రార్థనల తర్వాత ఇస్లామీయ ఐక్యత వారం వారం జరిగేపండుగ జుమాలో కనపడుతుంది. చుట్ట ప్రక్కల పరిసర ప్రాంతాల వారంతా ఒకే మస్జిద్‌లో సమావేశమై తమ ఐకత్యను చాటుతారు. ఇదే ప్రదర్శన రెండు పండుగల్లోను మనకు ధర్మనమిస్తుంది. తరువాత అంతర్జాతీయ ఐక్యత హజ్జ్ సందర్భంగా కానవస్తుంది. హజ్‌లో ప్రపంచ మారుమూలల నుండి తరలి వచ్చిన ముస్లింలందరు ఒకే మైదానంలోసమావేశమై తమ విశ్వాసాన్ని, ఐకమత్యాన్ని జగతికి తెలియజేస్తాయి. ఇస్లామీయ ఐక్యత ప్రపంచంలోగల ఏ మతంలోనూ మనకు అగుపిం చదు. ఇలాంటి ఒక గొప్ప ప్రణాళికాబద్ధమైన ఐక్యత చరిత్ర గల ముస్లిం ఒకే కలిమా చదువుతూ ఒకే అల్లాహ్‌ను ఆరాధిస్తూ పరస్పరం అసూయా ద్వేషాలతో విభేదాలు కలహాలతో ఉండడం చాలా విచారకరం.



**సోదరులారా..!**

ఆ తరుణం వచ్చింది. కాలం మిమ్మల్ని పిలుస్తుంది. పరస్పరం ఐక్యంగా, ప్రేమగా మెలగండి. మీరందరి దివ్యగ్రంథం, దైవ గ్రంథం ఖుర్ఆన్ చెపుతుంది.

**"వాస్తవానికి విశ్వాసులు పరస్పరం సహోదరులు"**

***(అల్ హుజురాత్ 49 : 16)***

దైవ ప్రవక్త (స) ఆదేశిస్తున్నారు:

ఈ ఖుత్బా సందేశాన్ని అర్థం చేసుకొని కూడా ఒకవేళ ఏకం కాకపోతే ఇక అల్లాహ్‌యే రక్షించాలి–

ఓ అల్లాహ్! ముస్లింల మధ్య పరస్పర విభేదాలను తొలగించి ప్రేమను సృజించు ఖుర్ఆన్, కాబా, కలిమా, ఆధారంగా ఏకం చేయి. విరోధులను ఎదుర్కొ నడంలో మాకు సహాయాన్ని ప్రసాదించు. (ఆమీన్)

# 21. ప్రవక్త (స) వారి నమాజ్

اتْلُ مَا أُوحِيَ إِلَيْكَ مِنَ الْكِتَابِ وَأَقِمِ الصَّلَاةَ ۖ إِنَّ الصَّلَاةَ تَنْهَىٰ عَنِ الْفَحْشَاءِ وَالْمُنكَرِ ۗ
وَلَذِكْرُ اللَّهِ أَكْبَرُ ۗ وَاللَّهُ يَعْلَمُ مَا تَصْنَعُونَ ۝

**(ఓ ప్రవక్తా!) నీ వైపుకు పంపబడిన (వహీ చేయబడిన) గ్రంథాన్ని పారాయణం చేస్తూ ఉండు. నమాజును నెలకొల్పు. నిశ్చయంగా నమాజ్ సిగ్గుమాలినతనం నుంచి, చెడు విషయాల నుంచి ఆపుతుంది. నిశ్చయంగా అల్లాహ్ స్మరణ చాలా గొప్ప విషయం (అన్న సంగతిని మరువరాదు). మీరు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు.**

***(అల్ అన్‌కబూత్ 29: 45)***

**సోదరులారా!**

నమాజ్ ఇస్లామీయ ప్రాథమిక అంశాలలో అతి ముఖ్యమైన రెండవ అంశం. ఇది ఇస్లాం పునాది, మొదటి స్తంభం. దీని మీదే ఇస్లాం ధర్మం నిర్మించబడి ఉంది. ఇది ఎలాంటి ఆచరణ అంటే దీని గురించే ప్రళయ దినాన మొట్టమొదట లెక్క తీసుకోబడుతుంది. కాబట్టి నమాజ్ పట్ల పూర్తి శ్రద్ధ వహించి అన్ని నమాజులను ఆయా వేళల్లో అన్ని నిబంధనలలో, షరతులతో స్థాపించటం చాలా అవసరం. నమాజుల పట్ల అజాగ్రత్తగా ఉండేవారిని గురించి ఖుర్‌ఆన్ ఇలా తెలిపింది:

فَوَيْلٌ لِّلْمُصَلِّينَ (4) الَّذِينَ هُمْ عَن صَلَاتِهِمْ سَاهُونَ (5) الَّذِينَ هُمْ يُرَاءُونَ (6)
وَيَمْنَعُونَ الْمَاعُونَ (7)

**ఆ నమాజీలకు వినాశం తప్పదు ('వైల్' అనే నరక స్థానం వారి కొరకు ఉన్నది). (ఎందుకంటే) వారు తమ నమాజుల పట్ల అశ్రద్ధ వహిస్తారు. వారు (ఒకవేళ నమాజు చేసినా)పరులకు చూపటానికి చేస్తారు. అతి సామాన్యమైన వాడుక వస్తువులు సయితం ఇవ్వటానికి వారు నిరాకరిస్తారు.** ***(అల్ మాఊన్ 107 :4-7)***

teluguislam.net



కొంతమంది నమాజీల కొరకు నరకంలో ఒక లోయ ఉంది. దానిని వైల్ అంటారు. దాని అగ్ని నుండి ఇతరులు (రోజుకు) డెబ్బయి సార్లు చొప్పున శరణు కోరుతూ ఉంటారు. ప్రదర్శనాబుద్ధితో, ఇతరుల కొరకు నమాజ్ పాటించే వారి కొరకు అది తయారు చేయబడింది. నమాజ్ వాస్తవికతను, దాని ప్రాధాన్యతను విస్మరించిన వారు కూడా అందులో వేయబడుతారు.

అత్యంత వినమ్రత, చిత్తశుద్ధి తో పాటించబడే నమాజ్ మాత్రమే దైవసన్నిధిలో స్వీకరించబడతుందని మనకు తెలుస్తుంది.

**సోదరులారా..!**

నమాజ్ అంతర్, బాహ్య విధానాలను దైవ ప్రవక్త (స) విధానాల కనుగుణంగా పాటించాలి. అపుడే అది ఆమోదయోగ్యం అవుతుంది. అంటే నమాజ్‌ను వినమ్రత, విధేయతతో పాటించాలి. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు.

قَدْ أَفْلَحَ الْمُؤْمِنُونَ ۝ الَّذِينَ هُمْ فِي صَلَاتِهِمْ خَاشِعُونَ ۝

**"నిశ్చయంగా విశ్వాసులు సాఫల్యం పొందుతారు. వారెలాంటివారెంటే తమ నమాజులో వినమ్రత పాటిస్తారు."** ***(అల్ మూమినూన్ 23:1-2)***

**'ఇహ్సాన్'** గురించి దైవ ప్రవక్త (స)ను అడిగినపుడు ఆయన ఇలా జవాబిచ్చారు: ఇహ్సాన్ అంటే నీవు నీ ప్రభువైన అల్లాహ్‌ను చూస్తున్నట్లుగా ఆరాధించుట ఒకవేళ ఆ భావం నీలో కలుగకుంటే ఇది మాత్రం వాస్తవం ఆయన నిన్ను చూస్తున్నాడని ఆరాధించు. ఇహ్సాన్ భావనతో అత్యంత అణకువతో, విధేయతతో నమాజ్ పాటించాలి. అల్లాహ్ మనందరికీ ఆ విశ్వాస స్థితిని, వినమ్రతను అనుగ్రహించుగాక ఆమీన్.

నేను ఖుత్బాలో పఠించిన ఆయత్ అర్థం ఏమిటంటే :

اتْلُ مَا أُوحِيَ إِلَيْكَ مِنَ الْكِتَابِ وَأَقِمِ الصَّلَاةَ ۖ إِنَّ الصَّلَاةَ تَنْهَىٰ عَنِ الْفَحْشَاءِ وَالْمُنكَرِ ۗ
وَلَذِكْرُ اللَّهِ أَكْبَرُ ۗ وَاللَّهُ يَعْلَمُ مَا تَصْنَعُونَ ۝

**"నీపై దివ్య జ్ఞానం(వహీ) ద్వారా అవతరింపజేయబడిన గ్రంథాన్ని చదివి వినిపించు, నమాజ్‌ను స్థాపించు. నిశ్చయంగా నమాజ్ నీతిమాలిన పనుల నుండి, అధర్మ పనుల నుండి నివారిస్తుంది. అల్లాహ్ ధ్యానం అన్నిటికంటే గొప్పది."**

***(ఖఅల్ అన్ కబూత్ 29 : 45)***

teluguislam.net



కాని కొందరు నమాజ్‌లో రుకూ, సజ్‌దాలను నింపాదిగా, నిదానంగా పాటించరు. వాటిపట్ల శ్రద్ధ వహించరు. ఒకే నిమిషంలో వ్యాయామంలా చేసి నమాజ్ పూర్తి చేస్తారు. అలా రుకూ సజ్‌దాలను తొందరగా తొందరగా, చేసే వారిని నమాజ్ దొంగలని దైవ ప్రవక్త (స) సెలవిచ్చారు. నమాజ్‌ను నింపాదిగా, రుకూ, సజ్‌దాలను నిదానంగా పెద్దవిగా పొడవుగా పాటించాలి. ప్రతి అంశం నిదానంగా పూర్తి చేయాలి.

**సహోదరులారా?**

హ్రజత్ అనస్ (రజి) కథనం దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: ఏ వ్యక్తి అయితే ప్రతి నమాజ్ తొలివేళ పాటిస్తాడో దాని కొరకు సజావుగా వుజూ చేస్తాడో చక్కగా ఖియామ్, రుకూ, సజ్‌దాలను వినమ్రతతో, విధేయతతో పూర్తి చేస్తాడో అట్టి నమాజ్ ఆ వ్యక్తి నుండి సెలవు తీసుకుంటున్నప్పుడు దేదీప్యమానంగా మెరిసి పోతూ ఉంటుంది. ఆ వ్యక్తితో ఇలా అంటుంది: "అల్లాహ్ నిన్ను కాపాడుగాక! నీవు నన్ను కాపాడినట్లే కాపాడుగాక!" ఇక ఎవరయితే వేళకి నమాజ్ పాటించలేదో, దాని కొరకు వుజూ చేయలేదో, ఖియామ్‌ను, రూకూను, సజ్‌దాను నిదానంగా వినమ్రతతో పాటించలేదో, మనసును నమాజ్‌లో లగ్నం చేయలేదో, అలాంటి వ్యక్తి నుండి నమాజ్ నిష్క్రమించేటప్పుడు నలుపు ఆవరించి ఉంటుంది. అందులో కాంతి ఉండదు. అది ఆ వ్యక్తితో ఇలా అంటుంది: "నీవు నన్ను నాశనం చేసినట్లే అల్లాహ్ నిన్ను నాశనంచేయుగాక!" అది ఎప్పుడైతే అల్లాహ్ ఆశించినంత పైకి పోతుందో అప్పుడు పాత చినిగిన వస్త్రంతో ఎలా విసురుతామో అలా దానిని అతని ముహంపై విసిరి కొట్టడం జరుగుతుంది *(తబ్రానీ)*

సహీ బుఖారీ గ్రంథంలో హ్రజత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం: నమాజ్ ఘనతను తెలుపుతూ దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: ఆలోచించి చెప్పండి ఒక వ్యక్తి గుమ్మంవద్ద ఒక నీటిసెలయేరు పారుతూ ఉంది అతను అందులో ఐదు వేళలా స్నానం చేస్తాడు. అలాంటప్పుడు అతని శరీరంపై ఏమైన మలినం ఉంటుందా?" ఐదు పూటల నమాజు చేసేవాని ఉపమానం కూడా ఇలాంటిదే. వాటి ద్వారా అల్లాహ్ అతని పాపాలను ప్రక్షాళనం చేస్తాడు. *(సహీహ్ బుఖారీ)*

హ్రజత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: నిశ్చయంగా అల్లాహ్ ఒక దూతను నియమించాడు. అతడు ప్రతి నమాజువేళ ఇలా పిలుపునిస్తాడు. ఓ ఆదం సంతానమా! పాపాల ద్వారా నీవు మండించుకున్న ఆ అగ్ని ఆర్పేందుకు నమాజ్ కోసం ఉపక్రమించు *(తబ్రానీ)*



అంటే మానవుడు పాపాలు చేసినప్పుడల్లా నరకాగ్ని మండించబడుతుంది. అది తీవ్రంగా దహించే అగ్ని. ఎందుకంటే అది అల్లాహ్ ఆగ్రహోదగ్ర నిలయం. నమాజ్ సమయం రాగానే కారుణ్య దూతలు, "మానవులారా! క్షమాభిక్ష, కారుణ్యాల సమయం వచ్చేసింది. నమాజ్ ను పాటించి, అల్లాహ్ మన్నింపు వేడుకొని పాపాల ప్రక్షాళన చేసుకొని నరకాగ్నిని చల్లార్చుకోండి." అని పిలుస్తూ ఉంటారు.

నమాజ్ ఎలాంటి వస్తువంటే దైవ ప్రవక్త (స) మరణ సమయంలో తన శుభ నోటతో తాకీదు చేసి మరీ మరీ చెప్పినారు. ఆ సంగతిని విశ్వాసుల మాత హ్రజత్ ఉమ్మె సలమా (ర.అన్హా) ఇలా తెలియజేస్తున్నారు: "నమాజులను రక్షించండి. మీ అధీనంలో ఉన్న బానిసల పట్ల, బానిసరాళ్ళ పట్ల సడలింపుల వైఖరిని అవలంబించండి." అంటే వారి పట్ల కఠినంగా, దురుసుగా ప్రవర్తించకండి. తుది శ్వాస వరకూ ఆయన (సఅసం) నోట ఈ మాటలే వెలువడ్డాయి.

ఉబాదాహ్ బిన్ సామిత్ (రజి) కథనం ప్రకారం దైవ ప్రవక్త (స) ప్రవచించారు: అల్లాహ్ ఐదు నమాజులను విధిగా చేశాడు. ఎవరయితే వాటితొలివేళలో వుజూ చేసుకొని నమాజును పూర్తి వినమ్రతతో నింపాదిగా రుకూతో పాటిస్తారో అలాంటి వారిని క్షమించే బాధ్యత అల్లాహ్‌పై ఉంది. ఇంకెవరయితే అలాచేయరో వారి బాధ్యత అల్లాహ్‌పై లేదు. అల్లాహ్ కోరితే క్షమించవచ్చు లేదా శిక్షించవచ్చు. (సునన్ అబూదావూద్)

అంటే క్రమం తప్పకుండా ఐదు నమాజులను వాటి సమయాన్ని పాటిస్తేనే ఈ క్షమాభిక్ష వాగ్దానం వర్తిస్తుంది. ఇక అలా చేయనివారికి ఎలాంటి వాగ్దానము లేదు.

వుజూ చేసుకొని మస్జిద్‌కు నడుచుకుంటూ ఎన్ని అడుగులు వేశాడో అన్ని పాపాలు తుడిచివేస్తాడు. పుణ్యాలు లిఖిస్తాడు. సామూహిక నమాజ్ కొరకు వేచిఉన్నంత వరకు. అది నమాజ్ స్థితిలోనే పరిగణించబడి పుణ్యాలు లిఖించబడతాయి. నమాజ్ పూర్తిఅయిన తరువాత. ఎంతవరకైతే దైవధ్యానములో గడుపుతాడో అవన్నీ పుణ్యాలుగా అతని కర్మపత్రంలో లిఖించబడతాయి.

చాలా మంది చాలా సంవత్సరాలుగా నమాజును పాటిస్తూనే ఉంటారు. అయినప్పటికీ వారిలో ఉన్న దురలవాట్లు అలాగే ఉంటాయి. అంటే అతడు తన నమాజ్‌ను సరిదిద్దుకోవాల్సి ఉంది. నమాజులో ఏదో లోపం ఉంది కాబట్టి ప్రభావం చూపడం లేదు. ఖుర్‌ఆన్ హదీసు ప్రకారం నమాజ్ నీతిబాహ్యమైన దురలవాట్ల

teluguislam.net



నుండి నివారిస్తుందని స్పష్టంగా తెలుస్తుంది. ఒకవేళ అలా జరగటం లేదంటే అది అతని నమాజులో లోపం ఉందన్న మాట.

నమాజ్ అతని పాపకార్యాల నుండి, అధర్మ కార్యాల నుండి నివారించటం లేదంటే అతను అల్లాహ్‌కు ఎంతో దూరంలో ఉన్నాడని అర్థం.

అతను నమాజ్ అయితే చేస్తాడు. కాని అది అల్లాహ్ దృష్టిలో నమాజ్‌కాదు. నమాజ్ దాసుణ్ణి అల్లాహ్‌కు చాలా దగ్గర చేస్తుంది. కాని కొందరు చేసే నమాజ్‌లో ఎలాంటి పుణ్యఫలితమూ ఉండదు.

> **"దొంగల్లో అతి నీచమైన దొంగ నమాజులో దొంగతనం చేసేవాడు" అని మహనీయ ముహమ్మద్ (స) చెప్పారు. 'నమాజులో ఎలా దొంగతనం చేస్తారు' అని అనుచరులు ప్రశ్నించగా దైవప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు, "అతను రుకూ, సజ్‌దాలు పూర్తిగా చేయడు."**
>
> ***(ముస్నద్ అహ్మద్)***

తలఖ్‌బిన్ అలీ (రజి) కథనం ప్రకారం, దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: నమాజులో "రుకూ, సజ్‌దాలో తమ నడుమును సరిగ్గా ఉంచని వాని నమాజు వైపుకు అల్లాహ్ స్వీకృతి దృష్టితో చూడడు."

ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: అజాన్ విన్న వ్యక్తి ఏదైనా ధర్మ సమ్మత కారణం చేత ఇంట్లోనే నమాజ్ పాటిస్తే అతని నమాజ్ స్వీకరించబడుంది. ధర్మసమ్మత కార్యం అంటే ఏమిటని అనుచరులు ప్రశ్నించగా 'ప్రాణభయం లేదా నడువలేని స్థితిగల ఏదైనా వ్యాధి సంభవించినప్పుడు' అని దైవ ప్రవక్త సెలవిచ్చారు. (సునన్ అబూదావూద్)

> **అబూ హురైరా (రజి) కథనం దైవ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: "కట్టెలను జమచేసి నా స్థానంలో మరొకర్ని నమాజ్‌కు నాయకత్వం కొరకు నియమించి ప్రతి ఇంట్లోకి వెళ్ళి అకారణంగా ఇంట్లోనే నమాజ్ పాటిస్తున్న వారి ఇళ్ళు తగలబెట్టాలనే ఆలోచన వస్తుంది. కాని స్త్రీలు పిల్లలు గురించి ఆలోచించి ఆ ఆలోచన విరమించు కుంటున్నాను.**
>
> ***(సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం)***

**ప్రియ సోదరులారా..!**

ఎలాంటి కారణం లేకుండా ఇళ్ళలో నమాజ్ పాటించడం వల్ల అట్టి నమాజ్



స్వీకారయోగ్యం కాదని హదీసుల ద్వారా మనకు స్పష్టంగా తెలుస్తుంది. స్త్రీలు మాత్రం తమ ఇళ్ళల్లోనే నమాజ్ పాటించటం. ఉత్తమం అయితే ఈ హదీసు స్త్రీల కోసం కాదు.

> **హజ్రత్ ఇబ్నె మస్ ఊద్ కథనం ప్రకారం: దైవ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: స్త్రీ నమాజు విషయంలో ఆమె ఇంటి ఆవరణలో చేసే నమాజ్ కంటే ఆమె ఇంటి లోపల చేసే నమాజ్ ఉత్తమం. ఇక ఇంట్లో అన్నిటికంటే లోపల చేసే నమాజ్ మొదటిదాని కంటే కూడా ఉత్తమం.**
>
> ***(సునన్ అబూదావూద్)***

ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం, మస్‌జిద్‌లో పాటించే నమాజ్ కంటే ఇంట్లో పాటించే నమాజ్ స్త్రీల కొరకు ఉత్తమం. ఒకవేళ స్త్రీలు పూర్తి పరదాతో మస్‌జిద్‌లో నమాజ్ పాటించదలుచుకుంటే వారిని వారించకూడదు. జుమా నమాజులకు దైవ ప్రవక్త (స) కాలంలో స్త్రీలు మస్‌జిద్‌లోనే నమాజ్ పాటించేవారు. అలాగే పండుగ నమాజ్‌లలో కూడా స్త్రీలు పాల్గొనేవారు. దైవ ప్రవక్త (స) గారు వారిని పాల్గొనవలసిందిగా ఆదేశించారు. అదేవిధంగా ప్రవక్త (స) తమ అనుచర సంఘ పురుషులను ఇలా ఆదేశించారు: "మస్‌జిద్‌లో నమాజ్ పాటించాలను కునే దైవ దాసీలను దైవగృహాలకు రాకుండా ఆపకండి.

**ధార్మిక సోదరులారా..!**

చివర్లో మీకు ఒక హదీసు వినిపించాలనుకుంటున్నాను. అందులో పదిమంది అనుచరుల మధ్య దైవ ప్రవక్త (స) నమాజు పద్ధతిని చేసి చూపించారు, సరైన నమాజ్ పద్ధతిని తమ అనుచర సంఘానికి నేర్పించారు. అంతర్ బాహ్య స్థితిగతులు, విధానం ఎలా ఉండాలో నేర్పించారు. శ్రద్ధగా వినండి లోపాలను సరిదిద్దుకుంటూ సరిగ్గా ప్రవక్త విధానం ప్రకారం నమాజ్ ను స్థాపించటానికి ప్రయత్నించండి. అల్లాహ్ ముస్లిలందరికి నమాజులోని అంతర్ బాహ్య స్థితులను దైవ ప్రవక్త (స) విధానంగా పాటించే సద్బుద్ధి, అనుగ్రహాన్ని ప్రసాదించు గాక, లోపాలను, బలహీనతలను, దూరంగా చేయుగాక, ఆమీన్..

హజ్రత్ అబూ హుమైద్ సాయిదీ (రజి) కథనం: మేము పదిమంది అనుచరులం దైవ ప్రవక్త (స) సమక్షంలో ఉన్నాము. దైవప్రవక్త (స) నమాజ్ గురించి వారందరిలోకెల్లా నాకు బాగా తెలుసు. వారంతా, "మా ముందు కూడా వివరించు"

teluguislam.net



అని కోరారు. అపుడు నేను ఇలా వివరించాను. దైవ ప్రవక్త (స) నమాజు కొరకు నిలబడినప్పుడు రెండు చేతులను తమ రెండు భుజాలకు సమానంగా ఎత్తేవారు. తరువాత తక్బీర్ అల్లాహు అక్బర్ పఠించారు. ఖిరాత్ పఠించి మళ్ళీ తక్బీర్ పలికారు. తమ చేతులను రెండు భుజాలకు సమానంగా ఎత్తారు. తరువాత రుకూ చేశారు. రుకూలో రెండు చేతులను రెండు మోకాళ్ళపై అదిమిపెట్టారు. తరువాత నిదానంగా అలానే ఉన్నారు. తలను మరీ క్రిందికి వంచటంగానీ, ఎత్తటం గానీ చేయకుండా మధ్యస్థంగా ఉండేవారు.

తరువాత తలఎత్తి సమియల్లాహులిమన్ హమిద, అనేవారు. తరువాత రెండు చేతులను తమ రెండు భుజాలకు సమానంగా ఎత్తారు. నిటారుగా నిలుచునే వారు. మళ్ళీ 'అల్లాహ్అక్బర్' పలికి సజ్దా చేసేవారు. సజ్దా సమయంలో తమ రెండు చేతులను ప్రక్కలనుంచి వేరుగా ఉంచారు. కాలి పాదాలను విడదీసి ఉంచారు. తరువాత తలఎత్తి కుడి పాదాన్ని నిలబెట్టి ఎడమ పాదంపై కూర్చునేవారు. తర్వాత నింపాదిగా ప్రతి భాగం తమ స్థానాల్లోకి వచ్చేంతవరకు ఉన్నారు. తరువాత సజ్దా చేసి మళ్ళీ 'అల్లాహ్ అక్బర్' పలికి మళ్ళీ కుడికాలు నిలబెట్టి పిరుదులపై కూర్చున్నారు. ప్రతీ అవయం వాటి స్థానాల్లోకి వచ్చేంతవరకు. తరువాత లేచి నిలబడి 2వ రకాతు మొదటిదాని మాదిరిగానే పాటించారు. 2వ రకాతు నుండి లేచి నిలబడినప్పుడు తక్బీర్ పలికి రెండు చేతుల్ని భుజాల వరకు సమానంగా ఎత్తినారు. ఆ తరువాత మిగతా నమాజు పూర్తిచేసేవారు. సలామ్ త్రిప్పి సజ్దా తరువాత తన కుడికాలు నిలబెట్టి ఎడమ కాలుని పరండ బెట్టి పిరుదులపై కూర్చోనేవారు. తరువాత సలామ్ త్రిప్పేవారు. ఇదంతా విన్న 9 మంది సహాబాలు 'సరిగ్గా చెప్పావు. దైవ ప్రవక్త (స) ఈ విధంగానే నమాజ్ పాటించేవారు' అని ధృవీకరించారు. (హదీస్)

**సోదరులారా..!**

దైవ ప్రవక్త (స) నమాజ్ పద్ధతిని తెలుసుకున్నాం. ఇక ఆయన పద్ధతిలోనే మనం నమాజ్ పద్ధతిని పాటిద్దాం.

అల్లాహ్ ముస్లిందరికి దైవ ప్రవక్త (స) పద్ధతిలో నమాజ్ పాటించే అనుగ్రహాన్ని ప్రసాదించుగాక! ఏవైనా లోపాలుంటే ఓ అల్లాహ్ వాటిని దూరం చేసి ప్రళయదినాన 'కౌసర్' అమృతాన్ని సేవించే మహద్భాగ్యాన్ని ప్రసాదించు.. ఆమీన్.



# 22. దురాచారాలను త్యజించండి

مَا جَعَلَ اللَّهُ مِن بَحِيرَةٍ وَلَا سَائِبَةٍ وَلَا وَصِيلَةٍ وَلَا حَامٍ ۙ وَلَٰكِنَّ الَّذِينَ كَفَرُوا يَفْتَرُونَ عَلَى
اللَّهِ الْكَذِبَ ۖ وَأَكْثَرُهُمْ لَا يَعْقِلُونَ ○

**అల్లాహ్ 'బహీరా'నుగానీ, 'సాయిబా' నుగానీ, 'వసీలా'ను గానీ, 'హామ్'ను గానీ ఏర్పరచలేదు. అయినప్పటికీ అవిశ్వాసులు అల్లాహ్‌కు అబద్ధాన్ని అంటగడు తున్నారు. వారిలో చాలా మంది అవివేకులు.**

***(అల్ మాయిద 5 : 103)***

ప్రియసోదరులారా..!

మీ ముందు పఠించబడిన ఈ ఆయతును మీరు విన్నారు. దైవ ప్రవక్త (స) సత్య దైవదౌత్యం గురించి, ఆయన ప్రభువాజ్ఞ గురించి ఇందులో ప్రత్యేకత గురించి ప్రస్తావించబడింది. దైవ ప్రవక్త (స) దైవ దౌత్యంలో ఎన్నో విశిష్ట సత్యాలు ఇమిడి ఉన్నాయి. సర్వమానవాళి మార్గదర్శకం కొరకు దైవ ప్రవక్త (స) ప్రకాశించబడే కాంతిగా చేసి పంపబడ్డారు. ఇది ఎంతటి నిరాకరించరాని సత్యమంటే 1400 సంవత్సరాలు గడిచిపోయినప్పటికీ ప్రియ ప్రవక్త (స) పేరు ఆయన ప్రభోధనలు సముద్రాలలోనూ, భూమిలోనూ, గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ 14వ రాత్రి నిండు చంద్రునిలా విరజిల్లుతూనే ఉన్నాయి. ఎక్కడ ముస్లింల సముదాయం ఉందో ఆ ప్రాంతంలో అష్హదు అన్న ముహమ్మదర్రసూలుల్లాహ్ నినాదాలతో మారు మోగు తుంది. ఈ ఆచరణ క్రమం తప్పకుండా ప్రతీ రోజు రాత్రిపగలు ఐదు పూటలు జరుగుతూనే ఉంటుంది. సిరాజమ్ మునీరా భావం ఇదే. ప్రపంచంలో ఎన్నో మతాలు, వర్గాలు ఉన్నాయి. సంఖ్యాపరంగా ఏ మతస్తులు అత్యధికంగా ఉన్నా కూడా ఇలాంటి గౌరవం ఆ మత వ్యవస్థాపకునికి లభించనేలేదు. కాని దైవ ప్రవక్త (స) వెలుగే కాంతిలా ప్రభవింపజేయబడిన ముహమ్మద్ (స) కు మాత్రమే ఈ అత్యున్నత గౌరవం కీర్తి ప్రాప్తమయింది. ఈ కీర్తి ఘనతలు ప్రళయం వరకు వర్ధిల్లుతూనే ఉంటాయి.

teluguislam.net



**మహాశయులారా..!**

దైవ ప్రవక్త (స) జీవిత చరిత్ర, ఆయన వ్యక్తిత్వ గుణవిశేషాలు మీ ముందు క్లుప్తంగా వివరించబడతాయి. శ్రద్ధగా వినండి – మనసులో పదిలపరచుకోండి. గ్రహించిన దాని ప్రకారంగా ఆచరించడానికి ప్రయత్నించండి. దైవప్రవక్త (స) పట్ల సిసలైన ప్రేమను, విధేయతను చాటుకోండి.

హజ్రత్ అనస్ (రజి) ఇలా అన్నారు: నేను పది సంవత్సరాలు దైవప్రవక్త (స) సేవలో ఉన్నాను. ఎప్పుడుకూడా ఆయన నాపై విసుక్కోలేదు. ఈ పని ఎందుకు చేయలేదు అనికూడా మందలించలేదు.

దైవ ప్రవక్త (స) తమ సేవకుల పట్ల ఎప్పుడు కూడా ఆగ్రహం చెందలేదు. ఎవరికి రవ్వంత కూడా బాధ కలిగించలేదు. ఆయన వ్యక్తిత్వం ఉత్తమ నైతికతకు నిలువెత్తు సాక్ష్యం. తమ వద్ద పని చేసే వారి పట్ల కఠినంగా వ్యవహరించేవారుకాదు. ప్రియ ప్రవక్త (స) జీవితం నుండి గుణపాఠం నేర్చుకోవాలి. సేవకుల పట్ల మృదువుగా సహృదయంతో ప్రవర్తించాలి. వారిని దూషించకూడదు, మందలించకూడదు. పని వారి పట్ల కరకుగా ఉంటూ వారిని బాధిస్తూ తిడుతూ కొడుతూ ఓ వైపు "మేము దైవ ప్రవక్త (స) అనుచరులం, విధేయులం" అని చెప్పుకోవటంలో అర్థం లేదు. అలాంటి వారు దైవ ప్రవక్త (స) ప్రేమలో అసత్యవాదులు.

**అబూహురైరా (రజి) కథనం ప్రకారం "ముష్రిక్కులను శపించండి" అని దైవ ప్రవక్త (స)ను ప్రజలు కోరారు అప్పుడు ఆయన ఇలా అన్నారు, "నేను శపించే వాణ్ణిగా చేసి పంపబడలేదు, నిస్సందేహంగా నేను కారుణ్యంగా చేసి పంపబడ్డాను."** ***(సహీహ్ ముస్లిం)***

ఖుర్ఆన్ గ్రంథంలో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

وَمَآ أَرْسَلْنَٰكَ إِلَّا رَحْمَةً لِّلْعَٰلَمِينَ

**(ఓ ముహమ్మద్!) మేము నిన్ను సమస్త లోకవాసుల కోసం కారుణ్యంగా చేసి పంపాము.** ***(అల్ అంబియా 21 : 107)***

**ప్రియసోదరులారా..!**

మన దైవప్రవక్త (స) వారి ఈ విశిష్ఠ గుణగుణాలు మనందరికి ఆదర్శప్రాయం.



మనం ముస్లింలము కూడా పరస్పరం ప్రేమగా, దయార్ద్రతతో ఉంటూ, ముస్లిమేతర సోదరుల పట్ల సత్ప్రవర్తనతో వారి హృదయాలను గెలిస్తే అప్పుడు మనం దైవ ప్రవక్త (స) ప్రియులం, విధేయులం అనే వాదన అక్షర రూపం దాలుస్తుంది. కాని చాలా బాధాకర విషయం ఏమిటంటే ముస్లింలు దైవప్రవక్త (స) ఆదేశించిన ప్రభోధనలను, జీవన ఆదేశాలను విస్మరిస్తున్నారు. ఆచరణలో క్రియాత్మక పాత్రను త్యజించారు. దైవప్రవక్త (స) ఎంత చక్కటి ఆదేశాలను మనకు అందించారు! వాటిని ఆచరించినపుడే మనం నికార్సయిన ముస్లింలము అవుతాము.

దైవప్రవక్త(స) ఇలా ప్రవచించారు:

**మనలోని పెద్దవారిని గౌరవించనివాడు, మన చిన్నారులను ప్రేమించని వాడు మనవారిలోని వాడు కాదు** ***(ముస్నద్ అహ్మద్)***

అందుకొరకే పిన్నలు, పెద్దలు తమతమ భాద్యతలను, హక్కులను నెరవేర్చుతూ ప్రవక్త (స) వారి ఆచరణను లోకానికి చాటాలి.

హజ్రత్ ఆయిషా సిద్దీఖా (రజి) కథనం: దైవ ప్రవక్త (స) చెడుపలికేవారు కాదు. ఎవరినీ దూషించే వారుకాదు, బజార్లలో అనవసర కేకలు వేసేవారు కాదు. చెడు తలపెట్టిన వాడిపై ప్రతికారం తీర్చుకునేవారు కాదు అంతేకాదు, ప్రతి వేళ క్షమించేవారు, మన్నించేవారు (ముస్నద్ అహ్మద్).

ఈ అమూల్య గుణగుణాలు, నైతిక విలువలతోనే ఆయన కఠిన విరోధుల హృదయాలను జయించారు. కఠినాతి కఠిన బద్ద విరోదులు హృదయాలను జయించారు. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

فَبِمَا رَحْمَةٍ مِّنَ ٱللَّهِ لِنتَ لَهُمْ ۖ وَلَوْ كُنتَ فَظًّا غَلِيظَ ٱلْقَلْبِ لَٱنفَضُّوا۟ مِنْ حَوْلِكَ ۖ
فَٱعْفُ عَنْهُمْ وَٱسْتَغْفِرْ لَهُمْ وَشَاوِرْهُمْ فِى ٱلْأَمْرِ ۖ فَإِذَا عَزَمْتَ فَتَوَكَّلْ عَلَى ٱللَّهِ ۚ إِنَّ
ٱللَّهَ يُحِبُّ ٱلْمُتَوَكِّلِينَ (159)

**"(ఓ ప్రవక్తా!) అల్లాహ్ దయవల్లనే నీవు వారి యెడల మృదు మనస్కుడ వయ్యావు. ఒకవేళ నువ్వే గనక కర్కశుడవు, కఠిన మనస్కుడవు అయి వుంటే వారంతా నీ దగ్గరి నుంచి వెళ్ళిపోయే వారు. కనుక నువ్వు వారి పట్ల మన్నింపుల వైఖరిని అవలంబించు, వారి క్షమాపణ కోసం (దైవాన్ని)**

teluguislam.net



**వేడుకో. కార్య నిర్వహణలో వారిని సంప్రదిస్తూ ఉండు. ఏదైనా పని గురించి తుది నిర్ణయానికి వచ్చినప్పుడు, అల్లాహ్‌పై భారం మోపు. నిశ్చయంగా అల్లాహ్ తనను నమ్ముకున్న వారిని ప్రేమిస్తాడు."**

***(ఆలి ఇమ్రాన్ 3 : 159)***

**ప్రియసోదరులారా..!**

దైవ ప్రవక్త (స) నైతిక విలువలను గుణగుణాలను మనం అలవర్చుకుని ఇతరులకు ఆదర్శప్రాయంగా నిలవాలి. ముస్లింలు పరస్పరం ఒక హృదయం, ఒక దేహంలాంటి వారు గనక ఇలాంటి బృహత్తర నమూనాను ప్రదర్శిస్తే ఈ నాటి ప్రపంచ రూపురేఖలు మరోలా ఉండేవి. నేటి ముస్లింలు దైవప్రవక్త (స) వారి అమూల్యమైన ఆదేశాల ఆచరణను పూర్తిగా విస్మరించారు. పైగా దైవ ప్రవక్త (స) తీసుకువచ్చిన షరీఅత్‌కు ఎలాంటి సంబంధమూ లేని, ఆయన ఆదేశించని నవీన కల్పనలను అల్లుకొని ఆచరిస్తున్నారు. స్వచ్ఛమైన ఇస్లాంకు దూరమవుతూ కల్పిత కార్యాలలో మునిగి తేలుతున్నారు. వాటిలోని ఒక కల్పిత కార్యమే 'మీలాదున్నబీ' దైవప్రవక్త (స) జన్మదిన వేడుకలు. దానిని స్మరించుకుని కొత్తపుంతలు తొక్కుతున్నారు. ధర్మంలో లేని దురాచారాలను ప్రవేశపెడుతున్నారు.

ఆ సభల్లో సమావేశాల్లో దైవ ప్రవక్త (స) పుట్టిన రోజు గురించి ప్రశంసిస్తారు. ఆయన బాల్యం నాటి తీపిగుర్తులను కొనియాడుతారు.

అంతవరకు జరిగితే బాగానే ఉండేది. కాని వారు ఆ సభలు, సమావేశాలు జరుపుతూ వాటిలో పాల్గొనటానికి దైవ ప్రవక్త (స) ఆత్మ కూడా హాజరవుతుందని వారు నమ్ముతారు. అందుకొరకే ఆ సమావేశంలో అందరూ నిలబడి గౌరవవందనాన్ని చాటుతారు. ఇది ఎంతటి అమాయకపు విషయం? దైవ ప్రవక్త (స) శుభప్రదమైన ఆత్మ ఎక్కడ? ఈ సమావేశాలు, సభలు ఎక్కడ? నింగి, నేలకున్నంత వ్యత్యాసం ఉంది.

మీలాద్ సభలు, సమావేశాలు ఎప్పటి నుండి ప్రారంభమయ్యాయి, వాటిలో జరిగే అసమ్మత కార్యాలు ఏమిటి? వీటి గురించి వివరాల కొరకు మౌలానా అబ్దుస్సలామ్ బస్తవీ గారి ఒక వివరణాత్మక సందేశం ఉపయుక్తంగా నేను భావిస్తున్నాను.



దైవ ప్రవక్త (స) తమ దైవదౌత్యం పొందిన తరువాత 23 సంవత్సరాలు జీవించారు. ఆయన(స) శుభ జీవితంలో ప్రతి ఏటా రబీఉల్ అవ్వల్ వచ్చేది. ప్రతీ రబీఉల్ అవ్వల్‌లో 12వ తేది కూడా వస్తూనే ఉండేది. కాని ఆయన ఈ సందర్భంగా ఏ సంప్రదాయ సమావేశమూ ఏర్పాటు చేయలేదు. అలా చేయమని ఎవరిని ఆజ్ఞాపించనూ లేదు. పైగా మరణానికి ముందు ఇలా తాకీదు చేశారు: నా తరువాత ఈ ధర్మంలో ఏ కొత్తపోకడ వచ్చినా దాంతో నాకు ఎలాంటి సంబంధమూ లేదు. ఆ పనిని చేసేవాడు, ఆ పని రెండూ ధిక్కరించబడతాయి. (సహీహ్ బుఖారీ).

ఈ మీలాదు సమావేశాలు సభలు 7వ శతాబ్దం హి.శ. 604 యేట ఆవిర్భవించాయి. పండితులలోని ఒక ముల్లా అయిన షేఖ్ అమ్ర్ బిన్ ముహమ్మద్ అనే ఒక అనామక వ్యక్తి దీనిని సృష్టించాడు. అతను హదీసువేత్తలలోని వాడూ కాదు. తత్వవేత్తలలోని వాడూ కాదు. విద్యా నిపుణులలోని వాడు కూడా కాదు. ఇక దానిని సంప్రదాయబద్ధంగా చేసిన చక్రవర్తులలో ఒక చక్రవర్తి అబూ సయీద్ కోక్ బోరీ బిన్ అబుల్ హసన్ అదీ. ముల్కుల్ ముఅజ్జమ్ ముజఫ్ఫరుద్దీన్ అతని బిరుదు. హిజ్రీ శకం 586వ యేట సుల్తాన్ సలాహుద్దీన్ అతన్ని బాల్ నగరానికి గవర్నరుగా నియమించారు. అతని మరణం 630 హిజ్రీలో సంభవించింది.

ఇదంతా దైవ ప్రవక్త (స) తరువాత జరిగిన విషయం. దీనిని ధార్మిక కార్యంగా భావించటం జరుగుతుంది. అందుకే ఇది కొత్తపోకడ (బిద్అత్). సుప్రసిద్ధ సహచరులు అనుచరులు, వారి శిష్యులు, సంతానం నుండి కూడా దైవ ప్రవక్త మరణం తరువాత ఇలాంటి సమావేశాలు సభలు జరిపారని ఎక్కడా రుజువులేదు. ఎందుకనీ? ఎందుకంటే ఏటేటా రబీవుల్ అవ్వల్ మాసం రాదేమోనని వారు తలపోసి ఉండాలి. ఒకవేళ ఆ మాసం వచ్చినా 12వ తేదీ రాదేమో! అని వారు అనుకుని ఉండాలి. ఒకవేళ వచ్చినా దైవప్రవక్త (స) పై మనకున్నంత ప్రేమ ఆ మహానుబావులకు లేకపోయి ఉండాలి. లేదా పిసినారితనం మూలంగా ఆ మహానుభావులు మీలాదున్నబీ సంబరాలు జరపలేదనుకోవాలి. లేదా ఈ మీలాద్ పండుగను జరుపుకునే తీరు తెన్నులు బహుశా వారికి తెలియకపోవటంచేత వారు ఈ అదృష్టానికి నోచుకోలేదేమో! లేదా అన్నీ తెలిసి కూడా వారు ఉద్దేశ్యపూర్వకంగా 'మీలాదున్నబీ' ఉత్సవాన్ని బహిష్కరించారేమో! అనుకోవాలి. ఎంత విడ్డూరం!?

teluguislam.net



ఒక్కమాటలో చెప్పాలంటే–మనం అలనాటి ఆ పుణ్యపురుషులను ధర్మావలంబన విషయంలో అసమర్థులుగా భావించి ఈ ఆచారాన్ని ప్రవేశపెట్టామన్న మాట! కడుశోచనీయం కదూ!

భువిలోని అత్యంత శ్రేష్టజీవులైన సహచరులు దైవ ప్రవక్త (స) నోట స్వర్గస్తులుగా వారి వారి జీవితకాలంలోనే ప్రకటింపబడి ప్రపంచ చరిత్రలోనే ప్రేమ, విధేయతకు అర్థం తెలిపిన ఆ ధన్యజీవులు ఈ కార్యం జరపలేదంటే అది ఖచ్చితంగా ధర్మంలో కొత్తపోకడే అవుతుంది. అదే బిద్అత్.

సహాబాల శిష్యులైన తాబయీలు వారి శిష్యులైన తబెతాబయీలు, ప్రసిద్ధిగాంచిన నల్గురు ఇమాములు కూడా గడిచిపోయారు. కాని వారు కూడా ఈ కార్యం చేశారని ఎక్కడా దాఖలాలు లేవు. అంతేగాక వారి రచనలు, ఆదేశాలు కూడా ఈ కార్యాలతో ఖాళీగా పడి ఉన్నాయి. అంటే ఈ పని చేయకూడదని ఆ కాలపు పండితులు, ధర్మవేత్తలందరి మధ్య ఏకాభిప్రాయం ఉండేది. ఏది ఏమైనా నల్గురు పండితుల వద్ద ఈ మీలాద్ సమావేశాలు జరపటం అధర్మం. అందుకొరకు ఇమామ్ అహ్మద్ బసరీ తన పుస్తకం 'ఖౌలే మోతమద్'లో ఇలా పేర్కొన్నారు. మీలాద్ సమావేశాలు అనుచితం అన్న విషయంలో నాలుగు వర్గాల పండితుల మధ్య ఏకాభిప్రాయం ఉంది.

ఈ కార్యాలకు సంబంధించిన ఎలాంటి ఆధారాలూ, ఆదేశాలు, ప్రవచనాలు లేవు, కాబట్టి ఈ సంప్రదాయం, సమావేశాలను సుప్రసిద్ధ పండితులు, సత్య ప్రియులు దీనిని బిద్అత్‌గా పరిగణించారు. నిషేధించారు. కావున ప్రసిద్ధ ధర్మవేత్తల అభిప్రాయాలను తెలుసుకుందాం. షేఖ్ తాజుద్దీన్ ఫాకిహానీ తమ పుస్తకంలో ఇలా పేర్కొన్నారు: ఈ కార్యం బిద్అత్. నవీన కల్పనలు చేసే అసమ్మతి వాదుల రూపకల్పన ఇది. పొట్ట పూజారులు తమ మనోవాంఛల కొరకు దీని పుట్టించారు.

తోహఫతుల్ ఖజాలో ఇలా ఉంది: మీలాద్ సభలు ఏర్పాటు చేయకూడదు. ఎందుకంటే ఇది ధర్మం (దీన్)లో ఓ కల్పిత కార్యం. ప్రతి నవీన కల్పన మార్గభ్రష్టత ప్రతి మార్గభ్రష్టత నరకాగ్నికి తీసుకుపోతుంది.



# 23. కృతజ్ఞతా భావం : దాని శుభాలు

وَإِذْ تَأَذَّنَ رَبُّكُمْ لَئِن شَكَرْتُمْ لَأَزِيدَنَّكُمْ ۖ وَلَئِن كَفَرْتُمْ إِنَّ عَذَابِي لَشَدِيدٌ ۝

**"మీరు గనక కృతజ్ఞులుగా మెలిగితే, నేను మీకు మరింత అధికంగా అనుగ్ర హిస్తాను. ఒకవేళ మీరు గనక (చేసిన) మేలును మరచిపోతే నిశ్చయంగా నా శిక్ష చాలా కఠినమైనది (అని మరువకండి)" అని మీ ప్రభువు మిమ్మల్ని సావధానపరచిన విషయాన్ని జ్ఞాపకం ఉంచుకోండి!**
***(అల్ ఇబ్రాహీమ్ 14 : 7)***

**ప్రియసోదరులారా..!**

దేవుని పట్ల కృతజ్ఞతా భావం : దాని శుభాల గురించి ఈ రోజు ఖుత్బాలో తెలుసుకుందాం. మనం నోటితో, ఆచరణతో అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ఉండటం తప్పనిసరి. నోటితో అల్‌హమ్దులిల్లాహ్ పలకటం, ఆ అనుగ్రహాన్ని ఆచరణతో కాపాడుకోవటం, గుర్తించటం. దీనినే షుక్ర్ (కృతజ్ఞత) అంటారు. కృతజ్ఞతలు తెలుపుకునే వారికి అల్లాహ్ సమృద్ధిని, శుభాలను ప్రసాదిస్తూ ఉంటాడు. ఖుత్బాలో పఠించిన వాక్యం అర్థం అదే అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

**"మీరు గనక కృతజ్ఞులుగా మెలిగితే, నేను మీకు మరింత అధికంగా అనుగ్ర హిస్తాను. ఒకవేళ మీరు గనక (చేసిన) మేలును మరచిపోతే నిశ్చయంగా నా శిక్ష చాలా కఠినమైనది(అని మరువకండి)" అని మీ ప్రభువు మిమ్మల్ని సావధానపరచిన విషయాన్ని జ్ఞాపకం ఉంచుకోండి!** ***(అల్ ఇబ్రాహీమ్ 14 : 07)***

ఈ ఆయత్ హజ్రత్ మూసా (స)కు సంబంధించినది. మూసా (అలై) తమజాతి వారితో ఇలా అన్నారు: "ఓ ప్రజలారా! అల్లాహ్ మీకు ఎన్నో అనుగ్రహాలను ప్రసాదించాడు. ఇప్పుడు మీ ప్రభువు ఇలా ప్రకటించాడు. ఒకవేళ మీరు అల్లాహ్ అనుగ్రహాల పట్ల కృతజ్ఞతలు తెలుపుతూ ఉంటే అల్లాహ్ మరింత సమృద్ధిని, శుభాలను ప్రసాదిస్తూ ఉంటాడు. కాని ఒకవేళ మీరు అనుగ్రహాల పట్ల ఏమరుపాటుగా ఉంటే, అశ్రద్ధ చేస్తే మరి అల్లాహ్ ఆజ్ఞ ఇలా ఉంది: "నా శిక్ష కూడా చాలా వ్యథా భరితంగా

teluguislam.net



ఉంటుంది". స్పష్టంగా బోధపడేదేమిటంటే అనుగ్రహాలను అల్లాహ్ తిరిగి తీసేసు కుంటాడు. శిక్షలకు గురి చేస్తాడు. ఉదాహరణకు: ఎవరయితే ఆరోగ్యాన్ని, స్వస్థతను కాపాడుకుంటాడో, శ్రద్ధ వహిస్తారో కీడు వ్యాధులు కలిగించే వాటినుండి దూరంగా ఉంటారో అలాంటి వారికి అల్లాహ్ మరింత స్వస్థతను, ఆరోగ్యాన్ని, మనశ్శాంతిని శక్తిని ప్రసాదిస్తాడు. ఇక మరెవరయితే ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహిస్తూ, ఆరోగ్యాన్ని కాపాడుకోరో అలాంటి వారిని అల్లాహ్ రోగాల పాలు చేస్తాడు. రోగాలు, వ్యాధులు అల్లాహ్ శిక్షలు. అల్లాహ్ ప్రసాదించిన అనుగ్రహాలన్ని అలాగే కృతజ్ఞతాభావంతో మోకరిల్లితే అల్లాహ్ సంతోషించి మరిన్ని శుభాలను కురిపిస్తాడు. ఇక, అల్లాహ్ చేసిన మేళ్లను మరచి విర్రవీగితే అల్లాహ్ శిక్ష కొరడాను ఝులిపిస్తాడు. అల్లాహ్ అనుగ్రహాలు కోకొల్లలు లెక్కకు మించినవి. ఇస్లామ్, విశ్వాసం, ఆరోగ్యం, ఖుర్ఆన్ ఇలా లెక్కలేని అనుగ్రహాలను ప్రసాదిస్తాడు అల్లాహ్, వాటికి ఎవరయితే విలువిచ్చి శ్రద్ధ వహిస్తారో, అల్లాహ్ ఆదేశాలను శిరసావహిస్తారో వారే ధన్యజీవులు. అలాంటి వారినే అల్లాహ్ ప్రేమిస్తాడు. గౌరవాన్ని కీర్తి ప్రతిష్ఠలను, సమృద్ధిని అనుగ్రహిస్తాడు. ఇక తిరస్కరించేవారికి అహంకారులకు కఠిన శిక్షకు గురిచేస్తాడు.

**మహాశయులారా..!**

ఇస్రాయీల్ సంతతి లోని ముగ్గురు వ్యక్తులకు సంబంధించిన ఒక విషయం గురించి దైవ ప్రవక్త (స) తమ సహచరులకు వినిపించారు. వారిలో ఇద్దరు దైవానుగ్రహాలను గౌరవించలేదు, కాపాడుకోలేదు. అందుకే అల్లాహ్ వారినుండి అనుగ్రహాలను వెనక్కి తీసుకున్నాడు. ఒక వ్యక్తి మాత్రం అల్లాహ్ అనుగ్రహాలను గౌరవించి కృతజ్ఞతలు చాటుకున్నాడు. అందుకే అల్లాహ్ ఆ ధన్యజీవికి మరింత అనుగ్రహాలు, అభివృద్ధి ప్రసాదించాడు. దైవ చట్టం సంప్రదాయం నేడు ఆచరణలో ఉంది ఉంటే ఈ చట్టం ప్రకారమే. ఈ సూత్రం ప్రకారమే మానవుడు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తాడు లేదా అధఃపాళానికి తొక్కబడతాడు.

దైవానుగ్రహాలను గౌరవించి కృతజ్ఞతలు చాటుకునే భాగ్యాన్ని అల్లాహ్ మనందరికి ప్రసాదించుగాక, ఏమరుపాటు నుండి, అజాగ్రత్త నుండి అల్లాహ్ కాపాడు గాక. ఆమీన్..

ఇపుడు దైవ ప్రవక్త (స) శుభనోటి నుండి జాలువారిన బనీ ఇస్రాయీల్‌కు



చెందిన ముగ్గురు వ్యక్తుల గురించి తెలుసుకుందాం:

అబూ హురైరా (రజి) గారు ఇలా తెలుపారు. నేను దైవ ప్రవక్త (స) ఇలా సెలవిస్తుండగా విన్నాను. నిస్సందేహంగా బనీ ఇస్రాయీల్‌లో ముగ్గురు వ్యక్తులు ఉండేవారు మొదటి వానికి కుష్టు వ్యాధి ఉండేది. రెండవ వానికి బట్టతల ఉండేది. మూడవ వాడు అంధుడు. అల్లాహ్ వారిని పరీక్షించదలచి వారి వద్దకు ఒక దూతను పంపాడు. ఆ దూత మొదట కుష్టు రోగి వద్దకు వచ్చి నీకు అత్యంత ప్రియమైన వస్తువు ఏది? అని అడిగాడు. నాకు మంచి రంగు, మంచి చర్మం కావాలి. ఎందుకంటే ప్రజలంతా నన్ను ఈ స్థితిలో చూసి అసహ్యించుకొంటున్నారు." అని అతను తన కోరికను వెలిబుచ్చాడు. అతనిపై దూత చేయి త్రిప్పగానే అతని వ్యాధి దూరమై పోయింది. అతని రంగు, చర్మం అందంగా అయిపోయింది. ఆ దైవదూత 'నీవు ఎలాంటి సంపదను ఇష్టపడతావ'ని ప్రశ్నించాడు. 'ఒంటె లేదా ఆవు' అని అతను జవాబిచ్చాడు. అతనికి సూడి ఒంటెను ఇవ్వటం జరిగింది. దూత ఇలా అన్నాడు: అల్లాహ్ మీ కొరకు ఇందులో శుభాన్ని, సమృద్ధిని ఇస్తాడు."

ఆ తరువాత దైవదూత తలవెంట్రుకలు మొలవని వ్యక్తి దగ్గరకు వస్తాడు. 'నీకు చాలా ఇష్టమైన వస్తువేది?' అని ప్రశ్నిస్తాడు. ఈ లోపం దూరమై నాకు దట్ట మైన అందమైన వెంట్రుకలు రావాలి?' అని అతను అంటాడు. దైవదూత అతని తలపై చేతిని తిప్పాడు. అతని లోపం దూరమై అందమైన వెంట్రుకలు వస్తాయి. "నీవు ఎలాంటి సంపదను ఇష్టపడతావని ఆ దూత అతన్ని ప్రశ్నిస్తాడు.' 'ఆవులు' అని అతను జవాబిస్తాడు. దైవదూత అతనికి సూడి ఆవును ఇచ్చి అల్లాహ్ ఇందులో నీకు శుభాన్ని ఇస్తాడని చేప్తాడు. ఆ తరువాత గ్రుడ్డివాని వద్దకు వస్తాడు: నీకు అమితంగా ఇష్టపడే వస్తువేదని అడుగుతాడు. దానికి అతను, నేను చూడడానికి అల్లాహ్ నాకు కంటిచూపు ఇవ్వాల'ని అంటాడు. దైవదూత అతని కంటి పై చేతితో నిమురుతాడు. అతని లోపం దూరమైపోయి అతనికి కంటి చూపు వస్తుంది. నీవు ఎలాంటి సంపదను ఇష్టపడతావని దైవదూత ప్రశ్నిస్తాడు. అతను 'మేకలు' అన్నాడు దైవదూత అతనికి సూడి మేకలు ఇచ్చాడు. ఆ తరువాత ఆ ముగ్గురి పశువులు ఈనాయి. కుష్టు రోగికి ఇచ్చిన ఒంటెలతో అతని లోయ అంతా నిండిపోయింది. అదే విధంగా బట్టతల వ్యక్తికిచ్చిన ఆవులతో అతని లోయ నిండిపోయింది. గ్రుడ్డి వానికిచ్చిన మేకలతో అతని లోయ నిండిపోయింది. మళ్ళీ ఆ దైవదూత మొదట

teluguislam.net



వచ్చిన రూపంలో మరోసారి కుష్ఠు రోగి వద్దకు వస్తాడు. నేను చాలా ఆపదలో ఉన్నాను. ప్రయాణ సామగ్రి అంతా అయిపోయింది. అల్లాహ్ తప్ప మరెవరూ నా అవసరం తీర్చరు అని సెలవిచ్చాడు. కాని నేను నీకు మంచి రంగును, చర్మాన్ని, ధనాన్ని ప్రసాదించిన ఆ అల్లాహ్ పేరుతో ఒక ఒంటెను అడుగుతున్నాను. ఒంటె ద్వారా నేను నా ప్రయాణాన్ని పూర్తి చేస్తాను. ఆ వ్యక్తి దైవదూతతో ఇలా అంటాడు: "నాకు మరెన్నో బాధ్యతలు, హక్కులూ ఉన్నాయి". దానికి దైవదూత ఇలా అంటాడు: నాకు తెలుసు ఒకప్పుడు నీకు కుష్ఠ వ్యాధి ఉండేది కదా? దాని వల్ల ప్రజలందరు నిన్ను చీదరించుకునేవారు నీవు ఒక నిరుపేదగా, అవసరం కలవాడిగా ఉండేవాడివి. మళ్ళీ అల్లాహ్ వాటిని దూరంచేసి నీకు ఇవన్నీ ప్రసాదించాడు." అని గుర్తు చేస్తాడు. దానికి ఆ వ్యక్తి "ఈ ఆస్తిపాస్తులన్నీ మా తాతముత్తాతల నుండి వచ్చినవి" అని అంటాడు. "ఒకవేళ నీవు చెప్పేది అబద్ధమయితే అల్లాహ్ నిన్ను పూర్వపు స్థితికే చేరుస్తాడు" అని చెప్పి మళ్ళీ ఆ దైవదూత తన మొదటి రూపంలో బట్టతల వ్యక్తి వద్దకు వస్తాడు. వచ్చి కుష్ఠు రోగి వద్ద ఏమి ఆశించాడో అదే ఆశిస్తాడు. కుష్ఠు రోగి చెప్పిన విధంగానే బట్టతల వ్యక్తి కూడా అంటాడు. దైవదూత ఇలా అంటాడు: ఒకవేళ నీవు అబద్ధాలకోరువైతే అల్లాహ్ నిన్ను నీ మొదటి స్థితికి మారుస్తాడు. ఆ దైవదూత మళ్ళీ గ్రుడ్డి వ్యక్తి వద్దకు వస్తాడు. బట్టతల వానితో, కుష్ఠు రోగితో అడిగిన విషయాలనే అడుగుతాడు. కాని ఆ గ్రుడ్డివాడు వారిద్దరికంటే భిన్నంగా సమాధానమిస్తాడు. నిజానికి నేను ఒకప్పుడు గ్రుడ్డివాణ్ణి అల్లాహ్ తన దయతో నాకు కంటి చూపును ప్రసాదించాడు. వాస్తవానికి నేను ఒక అవసరం గల నిరుపేదగా ఉండేవాణ్ణి' అల్లాహ్ నాకు ధనం ఇచ్చి ధనవంతుణ్ణి చేసాడు. నీకు అవసరం ఉన్న మేకలను సంతోషంగా తీసుకువెళ్ళు. అల్లాహ్ పేరుతో (వాస్తాతో) నీవు అడగావు కాబట్టి నీకు ఇష్టమున్న వాటిని తీసుకెళ్ళు. నేను నిన్ను ఎట్టి పరిస్థితిల్లోనూ ఆపను." దైవదూత ఇలా అంటాడు: నీ ధనాన్ని నీవు నీ దగ్గరే ఉంచుకో. ఇది పరీక్ష మాత్రమే. ఈ పరీక్షలో నీవు నెగ్గావు అల్లాహ్ నీ పట్ల ప్రసన్నుడయ్యాడు. నీ మిగతా ఇద్దరు మిత్రుల పట్ల అప్రసన్నుడయ్యాడు."

**ప్రియసోదరులారా..!**

మీరు ఏదైతే విన్నారో ఇది ఒక కథ కాదు. ఓ యదార్థ సంఘటన. దైవ ప్రవక్త (స) నోటి నుండి జాలు వారిన ఓ అక్షర సత్యమాల. అల్లాహ్ ప్రతి వస్తువును



లెక్కిస్తుంటాడు. గమనిస్తూ ఉంటాడు. అల్లాహ్ మానవులను ఆపదల్లో నెట్టేస్తాడు. దానర్థం ఆయన మానవులను కష్టపెట్టాలని కోరుకోడు. వారిని పరీక్షించటమే ఆయన ధ్యేయం. వాస్తవంగా ఎవరు అల్లాహ్ పట్ల కృతజ్ఞతాభావంతో ప్రవర్తిస్తున్నారో. ఎవరు దైవానుగ్రహాలను మరచిపోయి, గర్వంతో వ్యవహరిస్తారో వారిని అల్లాహ్ పరీక్షిస్తాడు. అల్లాహ్ ఖుర్ఆన్ గ్రంధంలో ఇలా సెలవిచ్చాడు:

وَإِذْ تَأَذَّنَ رَبُّكُمْ لَئِن شَكَرْتُمْ لَأَزِيدَنَّكُمْ وَلَئِن كَفَرْتُمْ إِنَّ عَذَابِي لَشَدِيدٌ ۝

**"ఒకవేళ మీరు గనక మేము చేసిన మేలును మరచిపోతే నిశ్చయంగా నా శిక్ష చాలా కఠినమయిందన్న సంగతిని మరువకండి."**

***(అల్ ఇబ్రాహీమ్ 14 : 07)***

జరిగింది కూడా అదే.

మొదటి ఇద్దరు వ్యక్తులు అల్లాహ్ ప్రసాధించిన అనుగ్రహాల పట్ల కృతఘ్నతా భావాన్ని ప్రదర్శించారు. దానికి పర్యవసానంగా అల్లాహ్ వారికి ప్రసాదించిన అనుగ్రహాలను తీసుకోవటమేకాక, వారిని వారి వారి మొదటి పరిస్థితుల్లోనే మరల్చాడు. అల్లాహ్ శిక్షకు వారిద్దరు గురయ్యారు.

వాస్తవానికి జీవన్మరణాలను పరీక్ష నిమిత్తమే అల్లాహ్ సృష్టించాడు. అదే విషయాన్ని అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

الَّذِي خَلَقَ الْمَوْتَ وَالْحَيَاةَ لِيَبْلُوَكُمْ أَيُّكُمْ أَحْسَنُ عَمَلًا ۚ وَهُوَ الْعَزِيزُ الْغَفُورُ ۝2

**"మీలో మంచి పనులు చేసేవారెవరో పరీక్షించే నిమిత్తం ఆయన చావు బతుకులను సృష్టించాడు. ఆయన శక్తిశాలి, క్షమాశీలి కూడాను.**

***(అల్ ముల్క్ 67 : 2)***

teluguislam.net



# 24. మద్యపానం, జూదం, వ్యభిచారం ఖండన

إِنَّمَا يُرِيدُ الشَّيْطَانُ أَن يُوقِعَ بَيْنَكُمُ الْعَدَاوَةَ وَالْبَغْضَاءَ فِي الْخَمْرِ وَالْمَيْسِرِ وَيَصُدَّكُمْ عَن ذِكْرِ اللَّهِ وَعَنِ الصَّلَاةِ ۖ فَهَلْ أَنتُم مُّنتَهُونَ ﴿٩١﴾

సారాయి, జూదాల ద్వారా మీ మధ్య విరోధాన్ని, ద్వేషాన్ని సృజించాలనీ, అల్లాహ్ స్మరణ నుంచీ, నమాజు నుంచీ మిమ్మల్ని దూరంగా ఉంచాలని షైతాను కోరుకుంటున్నాడు. కనుక ఇకనయినా వాటిని మానుకోండి.

***(అల్ మాయిద 5 : 91)***

وَلَا تَقْرَبُوا الزِّنَىٰ ۖ إِنَّهُ كَانَ فَاحِشَةً وَسَاءَ سَبِيلًا ﴿٣٢﴾

వ్యభిచారం దరిదాపులకు కూడా పోకూడదు సుమా! ఎందుకంటే అది నీతి బాహ్యమైన చేష్ట. మహా చెడ్డమార్గం. ***(బనీ ఇస్రాయీల్ 17 : 32)***

ప్రియసోదరులారా..!

ఈ రోజు జుమా ప్రసంగంలో మద్యపానం, జూదం, వ్యభిచారం లాంటి నీతి బాహ్యమైన చేష్టలు: వాటి ఖండన గురించి తెలుసుకుందాం 'త్రాగుడు ఎంతో ప్రమాదకరమయిన, నికృష్టమయిన చేష్ట. అందుకోసమే అల్లాహ్ మద్యపానాన్ని నిషేదించాడు. దీని నిషేదంపై సజ్జనులైన పూర్వీకులందరి, ఇస్లాం పండితులందరి మధ్య ఏకాభిప్రాయం ఉంది. ప్రపంచంలో ఉన్న మతాలన్ని ఈ వ్యసనాన్ని ఖండిస్తాయి. దీని పర్యవసానాన్ని సయితం ప్రభుత్వ చట్టాలు, వర్గాలు అంగీకరిస్తాయి అది మనిషిని పశువుగా చేస్తుంది.

అలాంటి చెడ్డవ్యసనాన్ని తీవ్రంగా వారిస్తూ ఖుర్ఆన్ గ్రంథంలో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:



يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا إِنَّمَا الْخَمْرُ وَالْمَيْسِرُ وَالْأَنصَابُ وَالْأَزْلَامُ رِجْسٌ مِّنْ عَمَلِ الشَّيْطَانِ فَاجْتَنِبُوهُ لَعَلَّكُمْ تُفْلِحُونَ ﴿٩٠﴾

ఓ విశ్వసించిన వారలారా! సారాయి, జూదం, బలిపీఠాలు, జోస్యం కోసం వాడే బాణాలు- ఇవన్నీ పరమ జుగుప్సాకరమైన విషయాలు, షైతాన్ చేష్టలు. కాబట్టి వాటికి దూరంగా ఉండండి. మీరలా చేస్తే సాఫల్యం పొందవచ్చు. ***(అల్ మాయి 5 : 90)***

మక్కా ముష్రిక్కులు కాబాలో ఉన్న విగ్రహాల చేతుల్లో బాణాలు ఉంచేవారు వాటిలో చేయండి, చేయకండి అనే పదాలు రాయబడి ఉండేవి. ఏదైనా పనిని ప్రారంబించే ముందే అక్కడికి వెళ్ళి వాటి చేతిలో ఉన్న ఒక బాణాన్ని తీసి చూసేవారు పని చేయమని ఉంటే ఆ పని చేసేవారు. దానికి భిన్నంగా వస్తే ఆ పనిని మాను కునేవారు. ఇలాంటి చేష్టనుండి వారిని వారించటం జరిగింది. ఇక తాగుడూ, జూదం గురించి తెలుపుతూ అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**సారాయి, జూదాల ద్వారా మీ మధ్య విరోధాన్ని, ద్వేషాన్ని సృజిం చాలనీ, అల్లాహ్ స్మరణ నుంచీ, నమాజు నుంచీ మిమ్మల్ని దూరంగా ఉంచాలని షైతాను కోరుకుంటున్నాడు. కనుక ఇకనయినా వాటిని మానుకోండి.**

***(అల్ మాయిద 5 : 91)***

తాగుడూ, జూదం ఎలాంటి అల్లకల్లోలాలనూ, ఉపద్రవాలను రేకెత్తిస్తుందో మనందరికి బాగా తెలుసు ఒక్కోసారి దీని పర్యవసానం హత్యలు ఆత్మహత్యల వరకు చేరుకుంటుంది. సమాజాన్ని నైతిక విలువలను నిలువున నేలమట్టం చేసే ఈ చేష్టల ఉపద్రవాలను గురించి ప్రతి వివేకవంతునికి తెలుసు.

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ రజి కథనం ప్రకారం దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: ఎవరైనా ముస్లిం ఒకసారి మద్యపానం సేవిస్తే వారం రోజుల వరకు అల్లాహ్ అతడి నమాజులను స్వీకరించడు ఒకవేళ అతడు పశ్చాత్తాపం చెందితే అతన్ని మన్నిస్తాడు అతడి తౌబాను స్వీకరిస్తాడు. ఆ తరువాత మళ్ళీ తాగితే అల్లాహ్ 40 రోజుల వరకు నమాజును స్వీకరించడు. ఒకవేళ అతడు మళ్ళి తౌబా చేసుకుంటే మాత్రం అతన్ని అల్లాహ్ తప్పకుండా క్షమిస్తాడు. ఆ తరువాత మళ్ళీ 3వ సారి

teluguislam.net



అతడు తాగి మళ్ళీ తౌబా చేసుకుంటే కూడా అల్లాహ్ క్షమిస్తాడు. ఆ పిదప గనక అతడు మళ్ళీ వాగ్దానభంగం చేస్తూ తాగి, మళ్ళీ తౌబా చేసుకుంటే మాత్రం అల్లాహ్ ఎట్టి పరిస్థితిల్లోనూ అతని తౌబాను స్వీకరించడు. పైగా అతనికి నరకంలోని నహ్రెఖబాల్ నుండి చీము త్రాగించబడుతుంది.

నహ్రె ఖబాల్ అంటే అందులో నరకవాసుల రక్తం చీము కలపబడి కుళ్ళి పోయిన, మురిగి పోయిన ఆ చెడ్డ దుర్వాసన గల చీమును తాగుబోతుకు త్రాపించటం జరుగుతుంది. వ్యభిచారులకు జూదగాళ్ళకు కూడా చాలా వ్యధాభరితమైన శిక్షలు ఉన్నాయి.

**ప్రియ సోదరులారా..!**

తాగుడు ఎంతటి మహాపాతకమో మీరు గ్రహించే ఉంటారు. ఒక ముస్లిం విషయంలో ఎంతటి ఘోర పాపమో, దాని పర్యవసానము కూడా మీరు విన్నారు. తాగుడు మానకపోతే అది ఒక ముస్లింను చివరకు నరకాగ్నిలో నెట్టేస్తుంది. చీము వారికి త్రాపించబడుతుంది. నరకశిక్ష శుభవార్తను చెవులారావిని కూడా దీనినుండి వైదొలగని ముస్లిం కోసం మరెలాంటి శిక్షలున్నాయో దైవ ప్రవక్త నోట వినండి. మరి అది ఎంతటి మహాపాతకమో తెలుసుకోండి.

దైలమ్ అల్‌హిమీరీ అనే సహచరుడు (రజి) ఇలా తెలియజేస్తున్నారు: నేను ఒకసారి దైవ ప్రవక్త (స)తో ఇలా అన్నాను. ఓ దైవ ప్రవక్తా(స)! మేము చాలా శీతల ప్రదేశానికి చెందినవారము అక్కడ చికిత్స చేయటం, పొందటం అవసరం పడుతూ ఉంటుంది. మేము మా పనుల శక్తి కోసం వాడే గోధుమల నుండి సారాయి తయారు చేసుకుంటాం. చలి నుండి రక్షించుకునేందుకు ఆ సారాయిని తాగుతాము'. అప్పుడు దైవ ప్రవక్త(స), "ఏమిటి, దాని వలన (నిషా) మత్తు వస్తుందా?" అని ప్రశ్నించారు. 'అవును' అని నేను జవాబిచ్చాను. అప్పుడు దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "దానికి బహుదూరంగా ఉండండి, త్యజించండి." ప్రజలు దాన్ని వదలిపెట్టలేర'ని నేను అన్నాను. దానికి దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు:"అయితే అలాంటి వారితో పోరాడు" *(సునన్ అబూదావూద్)*

**సోదరులారా..!**

సారాయి, మద్యం తాగడం ఎంతటి మహాపాతకమో దైవ ప్రవక్త (స) ప్రవచనాల ద్వారా మనకు బోధపడుతుంది. 'పోరాడటం అనేది మంచిది కాదు. అయినప్పటికి దైవ ప్రవక్త (స) మద్యం మానని వారితో పోరాడమని అన్నారు. దీనిని బట్టి అది దాని నిషేదతీవ్రత అర్థం అవుతుంది. ఈ త్రాగుడు ఒక త్రాగుబోతునే కాదు, మొత్తం సమాజాన్ని సర్వనాశనం చేస్తుంది. సాధారణంగా మధుప్రియులంతా సిగ్గులేని వారై ఉంటారు, దుబారా ఖర్చులు చేస్తారు. ఒక్కోసారి దొంగతనం, వ్యభిచారం చేస్తారు. హత్యల వరకు తెగిస్తారు. ఒక్క సారా చుక్క వల్ల ఇత్యాధి అనర్థాలు, అరాచకాలు సంభవిస్తాయి అందుకే దైవ ప్రవక్త (స) వారితో పోరాడమని బోధించారు. చెడును ఆదిలోనే త్రుంచి సభ్యసమాజాన్ని పరిరక్షించటమే ఆయన బోధనల పరమార్థం. అందుకే మధువును ఉమ్ముల్ ఖబాయిస్ (చెడుల పుట్ట) చెడుల మూలం అంటారు. ఇది అన్ని పాపకార్యాలకు తల్లివేరులాంటిది మీకు మరొక హదీసు వినిపించబోతున్నాను శ్రద్ధగా వినండి, మదిలో భద్రపరచుకోండి:



> **అబ్దుల్లాహ్‌కథనం ప్రకారం దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "తల్లిదండ్రులపట్ల అవిధేయత చూపేవాడు, జూదం ఆడేవాడు, చేసిన ఉపకారాన్ని పలుసార్లు చెప్పుకునేవాడు, బంధుత్వ సంబంధాలను త్రెంచే వాడు సారాయిలో మునిగి తేలేవాడు స్వర్గంలో ప్రవేశించలేడు."**
>
> ***(సునన్ దారిమి)***

ఈ పాపాలకు ఒడిగట్టినవారు స్వర్గసుఖాలను కూడా పొందలేరు.

**మహాశయులారా..!**

యదార్థానికి ఈ రోజు ప్రపంచంలో ఇలాంటి దుష్టవ్యక్తుల సంఖ్యే ఎక్కువగా ఉంది. అత్యధిక సంతానం తమ తల్లిదండ్రుల పట్ల అవిధేయతకు, అమర్యాదకు పాల్పడుతున్నారు. జూదం ఓ వ్యాపారంలా సాగుతోంది. లాటరీలు, రేసులు పందాలు ఇవన్నీ జూదం రకాలే. వీటి వలన ఎన్నో జీవితాలు కుప్పకూలి పోతున్నాయి. మహా మహులు సైతం ఈ జూదశాపానికి బలైపోతున్నారు. కుబేరుల్లాంటి సంపన్నులెందరో ఈ మహాపాతకానికి తాళలేక రోడ్డునపడ్డారు. సారాయి తాగే అలవాటు ముస్లింలలోనే అధికంగా ఉంటే ఇక ముస్లిమేతరుల ప్రస్తావన ఎంతటిది.ఎందుకు బాధాకరం!

సయ్యద్, పఠాన్, షేఖులుగా చెప్పుకునే నామమాత్ర ముస్లింలందరు సారాయి ప్రియులే. వారు జూదం లాటరీ వంటి నిషిద్ధ కార్యాలలో మునిగిఉన్నారు. ఇలాంటి

teluguislam.net



వారికి ఇస్లాం గురించి ఏ మాత్రం తెలియదు. ధార్మికంగా పరిణతి చెందటానికి తమ ప్రాణ, ధన పరిరక్షణకు అలాంటి దుశ్చేష్టలను విడనాడి అల్లాహ్ సన్నిధిలో పశ్చాత్తాపం చెందాలి. అల్లాహ్ కారుణ్యద్వారాలు ఇలాంటి వారి పశ్చాత్తాపం కొరకే తెరువబడి ఉన్నాయి. కనుక ముస్లింలు ఎవరైతే ఇలాంటి పాపకార్యాల్లో మునిగి ఉన్నారో వారంతా అల్లాహ్‌కు భయపడాలి లేదా మరణం తరువాత చుట్టుముట్టే దైవశిక్షలకు సిద్ధంగా ఉండాలి. ఇలాంటి పాపకార్యాలకు యధేశ్చగా పాల్పడే వారికి ప్రపంచ జీవితం నరకప్రాయం అవుతుంది. అనారోగ్యానికి, అశాంతికి, బీదరికానికి, రుణాలకు గురి అవుతారు. అభాసుపాలవుతారు. మంచి వ్యక్తుల దృష్టిలో నీచులుగా గుర్తింపబడతారు. ఇది శిక్షకంటే తక్కువ కాదు కదా!

అబూ ఉమామా (రజి) కథనం ప్రకారం దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: నిశ్చయంగా అల్లాహ్ నన్ను సర్వలోకాలకు కారుణ్యమూర్తిగా, సర్వలోకాల మార్గదర్శకునిగా చేసి పంపాడు. సంగీతానికి, నాట్యానికి సంబంధించిన అన్ని పరికరాలను నిషేధించాల్సిందిగా, విగ్రహాలు, శిలువలను, ఆజ్ఞాతకాల సర్వ కార్యాలను నిర్మూలించాల్సిందిగా నా ప్రభువైన అల్లాహ్ ఆజ్ఞాపించాడు. నా ప్రభువైన అల్లాహ్ ఇలా శపథం చేశాడు: "నా గౌరవోన్నతుల సాక్షి! నా దాసుల్లోని ఏ దాసుడైనా సారాయి యొక్క ఒక్క బొట్టు త్రాగినా అతనికి నరకంలో నరకవాసుల రక్తం, చీముల బొట్లు త్రాగిస్తాను. మరెవరైనా దాసుడు నాకు భయపడి ప్రపంచంలో సారాయి త్రాగటం వదిలేస్తే అతనికి పరలోకంలో కౌసర్ పానీయం త్రాగిస్తాను."

(ముస్నదె అహ్మద్)

**మహాశయులారా..!**

కరుణామయుడైన అల్లాహ్ బోధనలు విని కూడా పాటలు, సంగీతం వినే ముస్లిం స్త్రీ, పురుషులు, మద్యం సేవించే సోదర సోదరీమణులు తమ పాపకార్యాలను విడనాడి అల్లాహ్ సమక్షంలో క్షమాభిక్ష వేడుకొంటూ పశ్చాత్తాపం చెందాలి. అపుడే పరలోకంలో దైవప్రవక్త (స) శుభహస్తాల మీదుగా కౌసర్ పానీయం సేవించే భాగ్యం ప్రాప్తమవుతుంది. అలా మనందరికి అల్లాహ్ ఆ మహద్భాగ్యాన్ని ప్రసాదించుగాక ఆమీన్..

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు ముగ్గురు వ్యక్తులపై అల్లాహ్ స్వర్గాన్ని నిషేధించాడు. 1.అత్య



ధికంగా మద్యం తాగేవాడు. 2. తల్లిదండ్రుల అవిధేయుడు 3. దయ్యూస్ అంటే తన ఇంట్లోని చెడుకార్యాలను రూపుమాపనివాడు.

(ముస్నద్ అహ్మద్, సునన్ నసాయీ)

హజ్రత్ అబూ మూసా అష్అరీ (రజి) కథనం ప్రకారం దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: ముగ్గురు వ్యక్తులు స్వర్గంలో ప్రవేశించలేరు. 1. ఎల్లప్పుడూ (సారాయి) మద్యం సేవించేవాడు 2. బంధుత్వాలను త్రెంచేవాడు 3. చేతబడి లాంటి క్షుద్ర విద్యలను నమ్ముకున్న వ్యక్తి.

అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవ ప్రవక్త (స) ఇలా తెలియజేశారు: మద్యం తాగి అదే స్థితిలో మరణించిన వ్యక్తి ఒక హీనమైన విగ్రహారాధకుడి మాదిరిగా అల్లాహ్‌తో కలుస్తాడు. (ముస్నద్ అహ్మద్)

మద్యం సేవించటం బహుదైవారాధన, ప్రతిమ, విగ్రహారాధనతో సమానం సారాయి తాగటం ఎంతటి మహాపాతకమో మరి మనకు స్పష్టంగా బోధపడుతుంది. మరణించిన తరువాత విగ్రహారాధకుని స్థితిలో అల్లాహ్‌తో కలుస్తాడు. ఎందుకంటే అతడు తన మనస్సును దైవంగా భావించి జీవితం గడిపాడు. మరణించేంత వరకు మనోవాంఛకనుగుణంగా మద్యం త్రాగుతూనే ఉండేవాడు. మనోవాంఛ పూజ్యునిగా మరణించాడు.

సారాయి త్రాగటం వలన అనేక నష్టాలు జరుగుతాయి. అనేక రోగాలు వస్తాయి. త్రాగుబోతు తాగిన మైకంలో వ్యభిచారానికి కూడా ఒడిగడతాడు. సారాయికి వ్యభిచారానికి చాలా దగ్గర సంబంధం ఉంది. తాగిన వ్యక్తి మైకంలో చేసే వ్యభిచారానికి ఇస్లామీయ శిక్ష కఠినమైనది. ఒకవేళ వ్యభిచారానికి పాల్పడిన స్త్రీ, పురుషులు వివాహితులైతే వారిని రాళ్ళు రువ్వి శిక్షించబడును.

వ్యభిచారానికి సంభందించిన ఒక హదీసు ఇప్పుడు మీకు వినిపించబోతున్నాను. సోదరసోదరీమణులు శ్రద్ధగా ఆలకించి గుణపాఠం నేర్చుకోగలరు:-

హజ్రత్ ఉమర్ (రజి) ఇలా అన్నారు: నిశ్చయంగా అల్లాహ్ ముహమ్మద్ (స)ను సత్యంతో పంపాడు ఆయనపై గ్రంథాన్ని అవతరింపజేశాడు. అందులో రజమ్ (రాళ్ళు రువ్వటం) ఆయతులను కూడా అవతరింపజేశాడు. దైవ ప్రవక్త(స) తను జీవితంలో వ్యభిచారిపై రాళ్ళురువ్వారు. ఆయన తరువాత మేము కూడా (రజమ్) రాళ్ళతో కొట్టాము. అల్లాహ్ గ్రంథంలో రాళ్ళతో కొట్టి వధించటం సత్యం.

వివాహిత స్త్రీ అయినా పురుషుడు అయిన వ్యభిచారం చేస్తే దానికి నలుగురు సాక్షమిస్తే లేదా నేరం చేసిన వారు ఒప్పుకుంటే ఇస్లామీయ షరీఅత్ ప్రకారం వారిని రాళ్ళతో కొట్టి చంపటం తప్పనిసరి.

ఈ శిక్షలను ఇస్లామీయ ప్రభుత్వం మాత్రమే అమలు పరుస్తుంది. ఖుర్‌ఆన్ న్యాయ స్థానంలో నల్గురు ముస్లిం తమ కళ్ళతో ఆ పాపకార్యాన్ని చూసిన వారై ఉండి సాక్షమివ్వాలి. నల్గురిలో ఒక్కరు తక్కువగా ఉన్న ఖుర్‌ఆన్ న్యాయస్థానం ఆ కేసును కొట్టిపారేస్తుంది. ఎందుకంటే ఇంతటి కఠోర శిక్షను అమలుపర్చటానికి కీలక సాక్ష్యాలు,(ఆధారాలు) చాలా అవసరం

**ప్రియసోదరులారా...!**

అధర్మం, మితిమీరిన ఉదారవాదం ప్రబలిన ఈ రోజుల్లో కూడా ఒకే ఒక ప్రభుత్వం ఇస్లామీయ షరీఅత్ న్యాయస్థానం ఖుర్‌ఆన్ శిక్షలను తూ.చ. తప్పకుండా అమలుపరుస్తుంది. ఆ ప్రభుత్వం, ఆ దేశం మరేదో కాదు, సౌదీ అరేబియా. ప్రపంచంలో ఒక్క సౌదీలోనే ఇస్లామీయ షరీఅత్ న్యాయస్థానం నడుస్తోంది. అల్లాహ్ ఎల్లప్పుడు ఆ వ్యవస్థను కొనసాగించాలి. ధార్మిక శిక్షలపై నిలకడగా స్థిరత్వాన్ని ప్రసాదించాలి.

**ముస్లిం యువకులారా!**

నేటి నికృష్టమైన పరిస్థితుల్లో చెడు అలవాట్లను సరిదిద్దుకోవటం చాలా ముఖ్యం. ఈ రోజుల్లో ఈ సంస్కరణే పెద్ద జిహాద్. ఈ జిహాద్ కోసం ఆయుధాలు, అవసరం లేదు. పట్టుదల, కృతనిశ్చయం, అచంచల దృఢ, ఆత్మవిశ్వాసం కావాలి. మద్యపానం, వ్యభిచారం మొదలగు మహాపాతకాలను అరికట్టేందుకు కొందరు యువకులు నడుం బిగించాలి. ఇలాంటి బృహత్తర కార్య సాధనకై అంకితమవ్వాలి. చెడు జరిగే ప్రాంతంలో వెళ్ళి ముస్లింలను ఆపాలి, అడ్డుకోవాలి. వారికి వాటి పర్యవసానాన్ని, శిక్షలను గురించి విడమరచి చెప్పాలి. దైవ శిక్ష గురించి భయపెట్టాలి. నోటితో, కలంతో గనక శ్రమిస్తే మంచి ఫలితాలు ఉత్పన్నమవుతాయి. మీ శ్రమ, కృషి వలన ఒకవేళ ఒక్క వ్యక్తి అయిన చెడు కార్యం నుండి రక్షింపబడితే అదీ మీ పరలోక మోక్షం, సాఫల్యం విజయం కోసం సాధనం అవుతుంది. అల్లాహ్ ముస్లిందరికీ సన్మార్గాన్ని అనుసరించే భాగ్యాన్ని ప్రసాదించు గాక! (ఆమీన్)



teluguislam.net

# 25. షఫాఅతే కుబ్రా

وَبَشِّرِ الَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ أَنَّ لَهُمْ جَنَّاتٍ تَجْرِي مِن تَحْتِهَا الْأَنْهَارُ ۖ كُلَّمَا رُزِقُوا
مِنْهَا مِن ثَمَرَةٍ رِّزْقًا ۙ قَالُوا هَٰذَا الَّذِي رُزِقْنَا مِن قَبْلُ ۖ وَأُتُوا بِهِ مُتَشَابِهًا ۖ وَلَهُمْ
فِيهَا أَزْوَاجٌ مُّطَهَّرَةٌ ۖ وَهُمْ فِيهَا خَالِدُونَ (25)

**అల్లాహ్ (మాత్రమే నిజానికి ఆరాధ్య దైవం). ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేనేలేడు. ఆయన సజీవుడు అన్నింటికీ మూలాధారం. ఆయనకు కునుకు గానీ, నిద్రగానీ పట్టదు. భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ ఆయన అధీనంలో ఉంది. ఆయన అనుమతి లేకుండా ఆయన సమక్షంలో సిఫారసు చేయగలవాడెవడు? వారికి ముందు ఉన్న దానినీ, వెనుక ఉన్నదానిని కూడా ఆయన ఎరుగు. ఆయన కోరినది తప్ప ఆయనకున్న జ్ఞానంలోని ఏ విషయమూ వారి గ్రాహ్యపరిధిలోకి రాదు. ఆయన కుర్సీ వైశాల్యం భూమ్యాకాశాలను చుట్టుముట్టి ఉంది. వాటిని రక్షించటానికి ఆయన ఎన్నడూ అలసిపోడు. ఆయన సర్వోన్నతుడు, గొప్పవాడు.** ***(అల్ బఖర 2 : 25)***

**ధార్మిక సోదరులారా..!**

‘షఫాఅతే కుబ్రా’ గురించి ఈ రోజు జుమా ప్రసంగంలో తెలుసుకుందాం. అల్లాహ్ స్వర్గాన్ని విశ్వాసులు, సత్యవంతులు, అమరవీరులు, దైవభీతిపరులకొరకు సృష్టించాడు. మరణించిన తరువాత పరలోకంలో ధన్య జీవులైన విశ్వాసులు అందులో చిరకాలం నివాసముంటారు. స్వర్గం అనేది సత్యం. స్వర్గం ఉందో లేదో అని అనుమానించే వారి విశ్వాసం క్షీణించిపోతుంది. అల్లాహ్ పంపిన ప్రవక్తలందరు స్వర్గనరకాల సత్యవార్తను తెలిపారు. ప్రత్యేకంగా దివ్యఖుర్‌ఆన్ అనేక ఆయతుల్లో స్వర్గం, స్వర్గవనాలు గురించి ఎంతో చక్కగా వివరించింది. పేరుకు ముస్లిం అని చెప్పుకుని, స్వర్గనరకం గురించి ఊహాత్మకంగా విశ్వసించిన వారు అసలుసిసలైన స్వచ్ఛమైన విశ్వాస మాధుర్యాన్ని ఆస్వాదించలేరు. విశ్వాస మాధుర్యం, రుచి వారికి ప్రాప్తమవదు.

teluguislam.net



స్వర్గవనాలు, పూతోటలు, సెలయేర్లు ఇలా అన్నింటి గురించి సూరె రహ్మాన్‌లో క్షుణ్ణంగా వివరించబడింది. స్వర్గస్తులు స్వర్గంలో ప్రవేశించిన తరువాత ఎలా స్పందిస్తారో ఖుర్‌ఆన్ ఇలా తెలుపుతుంది.

وَقَالُوا الْحَمْدُ لِلَّهِ الَّذِي صَدَقَنَا وَعْدَهُ وَأَوْرَثَنَا الْأَرْضَ نَتَبَوَّأُ مِنَ الْجَنَّةِ حَيْثُ نَشَاءُ ۖ فَنِعْمَ أَجْرُ الْعَامِلِينَ ﴿٧٤﴾

**"వారంటారు, మాకు చేసిన వాగ్దానాన్ని నిజంచేసి చూపిన అల్లాహ్‌యే సర్వస్తోత్రాలకు అర్హుడు, ఆయనే మమ్మల్ని ఈ నేలకు వారసులుగా చేశాడు. స్వర్గంలో మేము కోరినచోట స్థిర నివాసం ఏర్పరచు కోగలము. సత్కార్యాలు చేసే వారి ప్రతిఫలం ఎంత ఉత్తమమైనది.**

***(అజ్ జుమర్ 39 : 74)***

స్వర్గం అంటే ఊహలు, కలలు కావని అదో అక్షర సత్యమని ఈ దైవ వాక్యం ద్వారా మనకు తెలుస్తుంది. ఏ విధంగా ఈ ప్రపంచం ఉనికిలో ఉందో అదే విధంగా స్వర్గలోకం ఉనికిలో ఉంది. అల్లాహ్ పుణ్యకార్యాలు, సత్కార్యాలు చేసిన తన దాసులకు అందులో అన్ని రకాల అనుగ్రహాలను ప్రసాదిస్తాడు. స్వర్గం మొదటి నుండి ఉంది. అంతం లేనిది. ఖుర్‌ఆన్ గ్రంథంలో స్వర్గస్తులపై ఆధిక్యాన్ని ప్రసాదించాడు. కాబట్టి ప్రస్తావన వచ్చినప్పుడల్లా 'ఖాలిదీన ఫీహ' అనే పదం వచ్చింది. అంటే వారు శాశ్వతంగా చిరకాలం అందులోనే ఉంటారు. అల్లాహ్ మనకు కూడా స్వర్గాన్ని ప్రసాదించు గాక. ఆమీన్.

**మహాశయులారా!**

'స్వర్గం' గురించి తెలుపుతూ దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

**స్వర్గం ఎలాంటి ప్రదేశం, అనుగ్రహం అంటే దానిని ఏ కన్నూ చూడలేదు. దాని గురించి ఏ చెవీ వినలేదు. మానవుల ఏ హృదయం దానిని ఊహించ నయినాలేదు. (సహీహ్ బుఖారీ)**

హజ్రత్ అబూ బకర్ సిద్దీఖ్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఒకరోజు అందరినీ సమావేశపరచి ఈ విధంగా ప్రసంగించారు:

"ఈ రోజు ప్రపంచం పరలోకంలో ఉన్న సమస్తాన్ని నాకు చూపించటం జరిగింది. ఒక విశాలమైన మైదానంలో తొలి చివరి మానవులందర్ని జమచేయడం జరిగింది. కాని వారందరూ తమ ముఖాల వరకు చెమటలో మునిగి ఉన్నారు. పూర్తిగా మునగటానికి దగ్గర్లో ఉన్నారు. ఆ బాధ నుండి తప్పించమని వారంతా



ఆదం (అలై) దగ్గరకు వెళ్ళి ఇలా అన్నారు: "ఓ ఆదం నీవు మానవుల తండ్రివి. అల్లాహ్ నిన్ను ప్రవక్తగా నియమించాడు. కనుక నీవు నీ ప్రభువుతో మావిషయమై సిఫారసు చెయ్యి." దానికి ఆదం (అలై) ఇలా జవాబిస్తారు: "మీకెలాంటి ఆపద ఉందో నాకు అలాంటిదే ఉంది. కనుక మీరు మీ తండ్రి అయిన నూహ్ వద్దకు వెళ్ళండి. నిశ్చయంగా అల్లాహ్ ఆదముకు, నూహుకు, ఇబ్రాహీమ్ సంతతికి, ఇమ్రాన్ సంతతికి సర్వలోకాలపై ఆధిక్యాన్ని ప్రసాదించాడు." కాబట్టి కావున వారంతా నూహ్ (అలై) వద్దకు వస్తారు. నూహ్ (అలై)తో ఇలా అంటారు. మీ ప్రభువుతో మా విషయమై సిఫారసు చెయ్యండి. మీరు అల్లాహ్‌కు ప్రియతములు. మీ దుఆలను ఆమోదించి సత్యతిరస్కారులలో ఒక్కరిని కూడా వదలకుండా ముంచేశాడు." అప్పుడు ఆయన ఇలా అంటారు: .సిఫారసు చేసే అర్హత నాకు లేదు. మీరు ఇబ్రాహీమ్(అలై) వద్దకు వెళ్ళండి. నిశ్చయంగా అల్లాహ్ అతన్ని తన మిత్రునిగా చేసుకున్నాడు" అని జవాబిచ్చారు నూహ్ (అలై) వారందరూ ఇబ్రాహీమ్(అ) వద్దకు వెళ్తారు. ఆయన కూడా తనకు ఆ అర్హత లేదని అంటారు. "మీరు మూసా వద్దకు వెళ్ళండి. నిశ్చయంగా అల్లాహ్ ఆయనతో ప్రత్యక్షంగా మాట్లాడాడు." వారందరు మూసా వద్దకు వెళితే కూడా అదే విధంగా జవాబిచ్చి, ఈసా(అలై) వద్దకు వెళ్ళండి. నిశ్చయంగా ఆయన పుట్టుగ్రుడ్డిని, కుష్టురోగిని దైవాజ్ఞతో నయం చేసేవారు. చనిపోయిన వారిని బ్రతికించేవారు. కాని ఈసా(అ) కూడా "నాకు సిఫారసు చేసే అర్హత లేదు, మీరు ఆదం సంతతి నాయకుని వద్దకు వెళ్ళండి. ఆయన (స) ప్రళయదినాన అందరికన్నా ముందు భూమి నుండి లేపబడ్డారు" అంటారు. అంటే ముహమ్మద్ (సఅసం) వెళ్ళండి అని అంటారు. వారందరు నా వద్దకు వచ్చి విన్నవించుకుంటారు. జిబ్రయీల్ వద్దకు వెళ్తాను. జిబ్రయీల్‌అల్లాహ్ వద్దకు వెళ్తారు. అతనికి అనుమతి ఇవ్వండి స్వర్గ శుభవార్త తెలుపండని అల్లాహ్ సెలవిస్తాడు. జిబ్రయీల్ ద్వారా శుభవార్త విన్న వెంటనే నేను సజ్‌దాలో పడిపోతాను. ఒక వారం రోజుల వరకు సజ్దాలోనే ఉంటాను. అపుడు అల్లాహ్ నాతో ఇలా సెలవిస్తాడు: ఓ ముహమ్మద్ (స)! తల ఎత్తండి, సిఫారసు చేయండి ఈ రోజు సిఫారసు ఆమోదించబడుతుంది. అప్పుడు తల ఎత్తి ప్రభువువైపు చూసి మళ్ళి సజ్‌దాలో పడిపోతాను ఒకవారం నుండి మరో వారం అలానే ఉంటాను. అల్లాహ్ ఇలా సెలవిస్తాడు: "ఓ ముహమ్మద్! తల ఎత్తండి మీ విజ్ఞప్తి ఆలకించబడుతుంది. సిఫారసు చేయండి అని ఆదేశించబడింది. నేను ఆ కృతాజ్ఞతాభావంతో సజ్‌దా చేస్తాను. కాని జిబ్రయీల్ (అ) నా భుజం పట్టు కుంటారు. అపుడు అల్లాహ్ నాకు దుఆ నేర్పుతాడు. దానిని ఏ మానవునికి నేర్పించడు.

teluguislam.net



నా ఓ ప్రభువా! నీవు ఆదం సంతానానికి నాయకుడిని చేశావు. నేను గర్వపడడం లేదు. నన్ను అందరికంటే ముందు సమాధి నుండి లేపావు నాకంటూ గర్వం లేదు. సిఫారసు చేస్తాను. అపుడు ప్రజలందరు సెలయేరు (హౌజ్) వద్దకు తరలివస్తారు. ఆ స్థలం సన్అ నుండి ఈలా వరకు ఎంత వెడల్పుగా విశాలంగా ఉందో అంతే విశాలంగా ఉంటుంది. తరువాత సిద్దీఖీన్ సత్యవంతులను పిలవండి వారు కూడా సిఫారసు చేస్తారని సెలవీయడం జరుగుతుంది. ఆ తరువాత ప్రవక్తలను పిలవండని ఆజ్ఞ అవుతుంది. ప్రవక్తలు సిఫారసు చేయటం మొదలెడతారు. ఒక ప్రవక్తతో 40 మంది ఉంటారు మరొక ప్రవక్త 5 గురు ఉంటారు. మరో ప్రవక్తతో ఒకే వ్యక్తి ఉంటారు. మరొక ప్రవక్తతో ఎవరూ ఉండరు. మళ్ళీ అమరవీరులను సిఫారసు కోసం ఆదేశించబడుతుంది. ఆ తరువాత అల్లాహ్ ఇలా సెలవిస్తాడు. నేను కరుణించేవారిలో చాలా కరుణించేవాడని. ఎవరైతే నాతో పాటు సాటి కల్పించలేదో వారందర్నీ స్వర్గంలోకి తీసుకెళ్ళండి అని ఆజ్ఞాపిస్తాడు.

నరకంలో ఒకసారి చూడండి. సత్కార్యాలే చేయనివాడు ఎవడైన ఒక్కడైనా ఉన్నాడా అని అల్లాహ్ సెలవిస్తాడు. ఆ నరకంలో ఒక్కడుంటాడు. మీరు ఏ మంచి పనులు చేశారు? అని అతన్ని ప్రశ్నించబడుతుంది. నేను వ్యాపారంలో చాలా మెత్తగా సున్నితంగా వ్యవహరించేవాణ్ణి ప్రజలతో మెత్తగా ఉండేవాడిని అది తప్ప వేరే సత్కార్యం నేను చేయలేదు. అప్పుడు అల్లాహ్ ఇలా ఆదేశిస్తాడు. నా దాసులతో ఎలాగైతే మృదువుగా ప్రవర్తించారో అలాగే ఈ నా దాసుల్ని కూడా మీరు మృధువుగా వ్యవహరించండి.

అతన్ని నరకంలో నుండి బయటికి తీసి స్వర్గంలోకి పంపుతారు నరకంలో ఉన్న మరో వ్యక్తిని ఎప్పుడైన మంచిపనులు చేశావా అని అడగబడుతుంది. నేను నా సంతానానికి నేను చనిపోయిన తరువాత అగ్నిలో కాల్చి ఆ బూడిదను సముద్రపు తీరమున తీసుకుని వెళ్ళి గాలిలో ఎగరవేయమని వసియ్యత్ చేశాను. ఇది తప్ప ఇంకేమీ చేయలేదు. అలా ఎందుకు చేశావని? అల్లాహ్ అతన్ని ప్రశ్నిస్తాడు. నీ భయం వల్లె అని అతడు జవాబిస్తాడు.



# 26. రమజాన్ ఆదేశాలు

**ప్రియ ముస్లిం సోదరులారా..!**

శుభాల మాసమైన రమజాన్ అల్లాహ్ కృపవలన మన జీవితంలోకి మరోసారి ప్రవేశించింది. ఇది మనందరి అదృష్టం. రమజాన్ మాసంలో లభించే పుణ్యఫలాలు ఏ మాసంలోనూ లభించవు. అల్లాహ్ తరపున ముస్లిందరికి లభించిన ఓ ప్రత్యేక కారుణ్యం మహాదానుగ్రహం ఇది. ఈ కారుణ్యాల, శుభాల మాసం ఇస్లాం ధర్మం మూల స్తంభాలలో నాల్గవది. ఉపవాసాలు పాటించటం ప్రతి ముస్లిం విధి. దీనిని నిరాకరించేవాడు ఇస్లాం పరిధినుండి బహిష్కరించబడతాడు.

అల్లాహ్ పవిత్ర ఖుర్ఆన్ లో పవిత్ర రమజాన్ మాస ఉపవాసాల గురించి ఆదేశిస్తూ ఇలా సెలవిస్తున్నాడు:

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا كُتِبَ عَلَيْكُمُ الصِّيَامُ كَمَا كُتِبَ عَلَى الَّذِينَ مِن قَبْلِكُمْ لَعَلَّكُمْ تَتَّقُونَ (183)
أَيَّامًا مَّعْدُودَاتٍ ۚ فَمَن كَانَ مِنكُم مَّرِيضًا أَوْ عَلَىٰ سَفَرٍ فَعِدَّةٌ مِّنْ أَيَّامٍ أُخَرَ ۚ وَعَلَى الَّذِينَ
يُطِيقُونَهُ فِدْيَةٌ طَعَامُ مِسْكِينٍ ۖ فَمَن تَطَوَّعَ خَيْرًا فَهُوَ خَيْرٌ لَّهُ ۚ وَأَن تَصُومُوا خَيْرٌ لَّكُمْ
إِن كُنتُمْ تَعْلَمُونَ (184)

**"ఓ విశ్వసించిన వారలారా! ఉపవాసాలుండటం మీపై విధిగా నిర్ణయించ బడింది. మీపూర్వీకులపై కూడా ఇదే విధంగా ఉపవాసం విధించబడింది. దీనివల్ల మీలో భయభక్తులు పెంపొందే అవకాశం ఉంది. అదీ లెక్కించదగిన కొన్ని రోజులు మాత్రమే అయితే మీలో వ్యాధిగ్రస్తులుగానో, ప్రయాణీకులుగానో ఉన్నవారు ఆ ఉపవాసాల లెక్క ఇతర దినాలలో పూర్తి చేసుకోవాలి. స్తోమత ఉన్నవారు ఉపవాసం పాటించకపోయి నందుకు పరిహారంగా ఒక నిరుపేదకు అన్నం పెట్టాలి. కాని ఎవరైనా స్వచ్ఛందంగా ఇంకా ఎక్కువ పుణ్యం చేస్తే అది వారికే మేలు. మీరు గ్రహించగలిగితే ఉపవాసం ఉండటమే మీ కొరకు శ్రేయస్కరం."**

***(అల్ బఖర 2 : 183-184)***

teluguislam.net



**మహాశయులారా..!**

సియామ్, సౌమ్ అంటే ఉపవాసం అని అర్థం. షరీఅత్ పరిభాషలో ఉషోదయం నుంచి సూర్యాస్తమయం వరకు అన్నపానీయాలకు, సంభోగానికి దూరంగా ఉండటం అని అర్థం. ఈ వ్రతం కేవలం దైవ ప్రసన్నత కొరకే పాటించాలి. ఆత్మ శుద్ధికి దోహదపడే ఈ ముఖ్యారాధన పూర్వసమాజాలపై కూడా విధిగా నిర్ణయించబడింది. మనసులో భయభక్తులు జనించటం, ఓపిక, నిగ్రహం అలవర్చుకోవటం దీని అసలు ఉద్దేశ్యం. అయితే ఇందులో వ్యాధిగ్రస్తులకు, ప్రయాణీకులకు సౌలభ్యం ఉంది. శక్తి కలిగిన ప్రతి ముస్లిం ఉపవాసవ్రతం పాటించాల్సిందే. విపరీతమైన ముసలితనంతో బాధపడేవారు, నయంకాని దీర్ఘకాలిక రోగాలతో కాలం వెళ్ళదీసే వారు మాత్రం తమ తరుపున ఫిదియా పరిహారం ఇవ్వాలి.

గర్భవతులకు, బాలింతలకు కూడా ఇందులో మినహాయింపుఉంది. వారు విడిచిపెట్టిన ఆ ఉపవాసాలను తరువాత పూర్తి చేయవలసి ఉంటుంది. దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: నిశ్చయంగా అల్లాహ్ ప్రయాణీకుల నుండి సగం నమాజును, గర్భవతులు, బాలింతలనుండి ఉపవాసాలను మినహాయించాడు." (సునన్ తిర్మిజి)

ముందు మనం రమజాన్ మాస విశిష్టతను గురించి తెలుసుకుందాం. దీని గురించి దైవ ప్రవక్త (స) ప్రవచించారు. "మీపై ఒక శుభప్రదమైన మాసం అవతరించనున్నది ఆ నెలలో అల్లాహ్ మీపై ఉపవాసాన్ని విధిగా చేశాడు. ఆ నెలలో స్వర్గద్వారాలు తెరవబడతాయి. నరకద్వారాలు మూసివేయబడతాయి. షైతానుల్ని బంధించటం జరుగుతుంది. వెయ్యినెలల కంటే ఘనమైన రేయి ఈ నెలలోనే ఉంది. దాని శుభాలను కోల్పోయినవాడు ఎంతో గౌర్భాగ్యుడు." (ముస్నద్ అహ్మద్)

మరో హదీసులో దైవ ప్రవక్త (స) ఇలా తెలిపారు: అల్లాహ్ సెలవిచ్చాడు- మనిషి చేసే ఆచరణలన్నీ స్వయంగా అతనికి సంబంధిచినవే కాని ఉపవాసం ప్రత్యేకంగా నా కోసం పాటించబడుతుంది. ఆ ఆచరణ నాది. స్వయంగా నేనే దానికి ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాను. ఉపవాసం పాపాల నుండి రక్షించే డాలు వంటిది. ఉపవాసి నోటి నుండి వెలువడే వాసన ప్రళయదినాన దైవ సన్నిధిలో ముష్క్ (కస్తూరీ) కన్నా ఎక్కువ సువాసన కలిగి ఉంటుంది. ఉపవాసికి రెండు ఘడియల్లో అమితానందం కలుగుతుంది. ఒకటి ఇఫ్తార్ సమయంలో రెండు: తన ప్రభువును కలుసుకొని తన పుణ్యాలన్నీ చూసుకున్నపుడు (సహీహ్ బుఖారీ)



మరో విశిష్ఠఘనత ఏమిటంటే సర్వమానవాళికి మార్గదర్శక గ్రంథం అయిన పవిత్ర ఖుర్ఆన్ ఈ పవిత్ర మాసంలోనే అవతరింపజేయబడింది. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

**شَهْرُ رَمَضَانَ الَّذِيٓ أُنْزِلَ فِيْهِ الْقُرْاٰنُ هُدًى لِّلنَّاسِ وَبَيِّنٰتٍ مِّنَ الْهُدٰى وَالْفُرْقَانِ**

**"రమజాన్ మాసం ఖుర్ఆన్ అవతరింపజేయబడిన మాసం. అది మానవులందరికీ మార్గదర్శకం"** ***(అల్ బఖర 2 : 185)***

**దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు; అల్లాహ్ పై సంపూర్ణ విశ్వాసంతో పుణ్యాన్ని ఆశిస్తూ రమజాన్‌నెల ఉపవాసాలు పాటించే వారి పూర్వ పాపాలన్ని మన్నించబడతాయి.** ***(సునన్ అబూదావూద్)***

ఉపవాసం పాటించే ప్రతి ఒక్కరు సహ్రీ భుజించాలి. సహ్రీ భుజించటంలో ఎంతో శుభం ఉంది. యూదులు, క్రైస్తవుల ఉపవాసాలకు – ముస్లింల ఉపవాసాలకు మధ్య వ్యత్యాసం సహ్రీ. సహ్రీ ఆలస్యంగా చేయాలి. సహ్రీలో అన్నం తినకపోతే కనీసం మంచినీరైనా త్రాగాలి.

సూర్యాస్తమయం అవగానే వెంటనే ఇఫ్తార్ చేయాలి. ఇఫ్తార్ చేయటంలో ఎలాంటి ఆలస్యం, అశ్రద్ధ తగదు. ఇఫ్తార్ సమయంలో చేసే ప్రతి దుఆ దైవామోదితమవుతుంది. కాబట్టి ఇఫ్తార్‌కు ముందు పాపాల మన్నింపుకై ఎక్కువ దుఆలు చెయ్యాలి.

రాత్రిపూట ఖియామ్ తప్పకుండా చేయ్యాలి. ఖియామ్ అంటే దైవారాధనలో రాత్రుళ్ళు గడపటం. అంటే తరావీహ్ నమాజులో పాల్గొనటం. సంపూర్ణ విశ్వాసంతో, పుణ్యాన్ని ఆశిస్తూ, ఖియాం చేస్తే పూర్వ పాపాలన్నీ మన్నించబడతాయి అని దైవ ప్రవక్త గారు ప్రవచించారు.

దైవప్రవక్త(స) ఉపవాసం డాలు వంటిదని అన్నారు. కాబట్టి పాపాకార్యాల నుండి, చెడు పనుల నుండి దూరంగా ఉండాలి. ఆత్మ పరిశుద్ధతను పాటిస్తూ దైవభీతిని అలవర్చుకోవాలి. దైవ ప్రవక్త (స) ఇలా హెచ్చరించారు: ఎవరు అబద్ధాలాడటం త్యజించలేదో, చెడు పనులు చేయటం వదలి పెట్టలేదో అతను అన్నపానీయాలు వదలి పెట్టడం అల్లాహ్‌కు ఏమాత్రం అవసరంలేదు (సహీహ్ బుఖారీ).

వెయ్యి నెలల కంటే శ్రేష్టమైన గొప్పదైన రేయి, ఈ మాసంలోనే ఉంది. చివరి పది రోజుల్లోని ఐదు బేసి రాత్రుల్లో దీన్ని వెదకాలని దైవ ప్రవక్త (స) ఉప

teluguislam.net



దేశించారు. ఈ రాత్రి చేసే ఆరాధన 83 సంవత్సరాల ఆరాధన కంటే శ్రేష్టమైనది. లైలతుల్ ఖద్ర్‌లో దైవారాధన చేసిన వ్యక్తి వెనుకటి పాపాలన్నీ మన్నించబడతాయి. (సహీహ్ బుఖారీ).

దైవ ప్రవక్త(స) రమజాన్ చివరి దశకంలోని రాత్రుళ్ళలో అత్యధికంగా దైవారాధనలు చేసేవారు. తమ ఇంటివారిని కూడా విపరీతంగా ప్రోత్సహించేవారు.

రమజ్రాన్ చివరిదశక్రంలోనే పాటించే మరో మహత్తర ఆరాధన ఏతెకాఫ్ వ్రతం. దైవ ప్రసన్నతా సంకల్పంతో మస్జిద్‌లో ఉంటూ నిత్యం దైవధాన్యంలో లీనమై ఉండటాన్ని ఏతిక్రాఫ్ అంటారు.

దైవ ప్రవక్త చివరి పది రోజులూ ఏతికాఫ్ పాటించేవారు. ఏతికాఫ్ సంకల్పం చేసుకొని ఫజర్ నమాజ్ తరువాత పాటించే చోటులో ప్రవేశించాలి. స్త్రీలు కూడా మస్జిద్‌లో ఏతికాఫ్ పాటించవచ్చు. దైవ ప్రవక్తతో పాటు ఆయన సతీమణులు కూడా ఏతికాఫ్ పాటించేవారు. ఏతికాఫ్ పాటించేవారు సంభోగానికి దూరంగా ఉండాలి. రమజాన్ మాసంలో ఖుర్‌ఆన్ పారాయణం చెయ్యాలి.

ఉపవాస స్థితిలో జరిగిన పొరపాట్లకు ప్రాయశ్చిత్తంగా ఫిత్రా దానం చెయ్యాలి. ఈ ఫిత్రా దానం చేయటం ప్రతి ముస్లింపై విధిగా ఉంది. ఈద్గాహ్‌కు బయలుదేరక ముందే ఫిత్రా దానం ఇవ్వాలి. మనం ఉపయోగించే ఆహారధాన్యాలు బియ్యం, గోధుమల నుండి ఫిత్రా ఒక 'సా' చెల్లించాలి. ఒక సా అంటే 2 కిలోల 600 గ్రాములు.

అల్లాహ్ మనందిరికి పవిత్ర రమజాన్ శుభాలను సమృద్ధిగా ప్రసాదించి, ఉపవాసాలు, దుఆలను ఆమోదించుగాక..! ఆమీన్.



# 27. రమజాన్ మాస విశిష్టత

**మిత్రులారా.!**

నేటి ఈ ఖుత్బాలో పవిత్ర రమజాన్ మాసం శుభాలు, వరాల గురించి తెలుసుకుందాం.

పవిత్ర రమజాన్ మాసానికి విశ్వాసుల్లో ఎనలేని ప్రాముఖ్యత ఉంది. ఆ మాసం సమీపిస్తే చాలు వారిలో తెలియని ఆత్రుత, అల్లాహ్ మార్గంలో అంకితమవ్వాలని, అల్లాహ్, ప్రవక్త (స) ఆజ్ఞలను శిరసావహించాలని ప్రతి ఒక్కరూ తాపత్రయ పడుతుంటారు. రమజాన్ మాసం విశ్వాసులకు దైవం ప్రసాదించిన పవిత్ర శిక్షణా శిబిరం. దీనిలో ఒక మాసం పూర్తి శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. తద్వారా మిగతా మాసాల్లో అతని జీవితం దైవధ్యానంలో ప్రశాంతంగా,సజావుగా గడవాలని ఆశించడం జరుగుతుంది. పవిత్ర రమజాన్ మాసానికి సంబంధించి అనేక ఆదేశాలు, ఉల్లేఖనాలున్నాయి. వాటిలో కొన్ని మనం తెలుసుకుందాం. దైవ ప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు:

**రమజాన్ మాసం అవతరించినపుడు స్వర్గద్వారాలు తెరవబడతాయి. నరక ద్వారాలు మూసివేయబడతాయి. షైతాన్‌లు సంకెళ్ళతో బంధించ వేయబడ తారు,** *(సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం)*

మరో హదీసులో ఇలా సెలవిచ్చారు:

**రమజాన్ మాసం ప్రారంభం కాగానే ఆకాశం నుండి దైవ దూత ఇలా పిలుపు నిస్తాడు : "ఓ మంచిని కోరేవాడా! త్వరపడు. ఓ చెడుని కోరేవాడా! చెడును త్యజించు". ఆ తరువాత అల్లాహ్ కొందరిని నరకం నుండి విముక్తి కల్పిస్తాడు, ఇలా ప్రతి రాత్రి జరుగుతుంది.** *(సునన్ తిర్మిజీ)*

రమజాన్ శుభాలను, కారుణ్యాలను, సమృద్ధులను తెలుపుతూ దైవప్రవక్త(స) ఇలా తెలిపారు. "రమజాన్ మాసం మీ కోసం శుభాలను తీసుకొచ్చింది. అల్లాహ్ మిమ్మల్ని ఆ శుభాలలో ముంచెత్తుతాడు. తన కారుణ్యాన్ని కురిపిస్తాడు. పాపాలను

teluguislam.net



మన్నిస్తాడు, మీ దుఆలను అంగీకరిస్తాడు. ఈ రమజాన్ మాసంలో అల్లాహ్ మీ మధ్య పోటీ తత్వాన్ని చూస్తాడు. దైవదూతల ముందు మీ పై గర్వపడతాడు. అల్లాహ్ ప్రసన్నత కోసం సత్కార్యాలు చేయండి. ఈ పవిత్ర మాసం కారుణ్యాలను కోల్పో యినవాడే అసలైన దౌర్భాగ్యుడు" (హాకిం).

పవిత్ర రమజాన్ మాసం వస్తూ వస్తూ తనతో శుభాల సరోవరాన్ని తీసుకు వస్తుంది. ఈ మాసం రాగానే ప్రతి విశ్వాసి మేను పులకిస్తుంది. ఆనందాల్లో విహరి స్తాడు. ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలుపుతాడు. ఇది విశ్వప్రభువు అల్లాహ్ తరుపు నుండి ముస్లింలకు ప్రసాదించబడిన ఓ అపురూప కానుక, ఓ ప్రత్యేక అనుగ్రహం. ఇలాంటి పవిత్ర మాసంలో ప్రతి ఒక్కరూ సత్కార్యాల్లో పోటీపడాలి, సదాచరణ పెంపొందించు కోవటానికి ముందుకు రావాలి. సమాధుల్లో (బర్జఖ్ వ్యవస్థలో) ఉన్న మృతులు కూడా సత్కార్యాలు, దానధర్మాలు, ఖుర్ఆన్ పారాయణం చేసే భాగ్యం తమకు లభిస్తే ఎంత బాగుంటుందని తపిస్తూ ఉంటారు.

حَتَّىٰٓ إِذَا جَآءَ أَحَدَهُمُ ٱلْمَوْتُ قَالَ رَبِّ ٱرْجِعُونِ ﴿٩٩﴾

**తమ నిత్య జీవితంలో సత్కార్యాలు చేయని వారి ఆత్మలు ఇలా అంటూ దుఃఖిస్తాయి. "ఓ మా ప్రభూ! మేము చేయకుండా వచ్చిన సత్కార్యాలు చేయ టానికి" మమ్మల్ని తిరిగి (భూ లోకానికి) పంపు.**

***(అల్ మూమినూన్ 23 : 99)***

కాని వారికి ఎలాంటి జవాబు లభించదు. వారికీ, వారి సత్కార్యాలకి మధ్య వారధి ఏర్పడుతుంది. వారు ఆశించిన వాటిని చేయలేకపోతారు. సత్కార్యాలు చేయని వారికి స్వర్గ ప్రవేశం లభించదు.

ఈ పవిత్ర మాసం కారుణ్యాల మహా సాగరం. ఈ శుభాల మాసంలో సత్కార్యాల్లో, దైవ ధ్యాస్యంలో, ఖుర్ఆన్ పారాయణంలో లీనమై ఉండాలి. అనాధులు, అభాగ్యులు నిరుపేదలను నిండు మనసుతో ఆదరిస్తూ, వారి అవసరాలను తీర్చాలి. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలి.

దైవప్రవక్త (స) ప్రతి రమజాన్ మాసంలో దైవదూతల నాయకులు జిబ్రయీల్ (అలై) కు పూర్తి ఖుర్ఆన్ వినిపించేవారు. రమజానేతర మాసాల్లో కంటే ఎక్కువగా ఈ మాసంలో అత్యధికంగా ధానధర్మాలు చేసేవారు. ఈ మాసం విశ్వాసుల పాలిట



వరం. అమూల్యమైనది. రమజాన్ మాసంకంటే శ్రేష్టమైన, ఘనమైన, శుభదాయకమైన మాసం మరొకటి లేదని దైవప్రవక్త (స) తెలిపారు.

**సహ్రీ అవశ్యకత-ఘనత**

సహ్రీ అవశ్యకతను, ఘనతను తెలుపుతూ దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

**"సహ్రీని భుజించండి, అందులో ఎంతో శుభం ఉంది".**

***(సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం)***

మరో హదీసులో ఇలా ప్రస్తావించారు:

**"మన (ముస్లిం) ఉపవాసాలకు, వారి (యూదులు, క్రైస్తవులు) ఉపవాసా లకు మధ్యగల వ్యత్యాసమే సహ్రీ భుజించటం"**

***(సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం)***

మరో హదీసులో ఇలా ప్రబోధించారు: ఇర్బాజ్ బిన్ సారియా (రజి) ఇలా తెలిపారు: ఒక సారి దైవప్రవక్త (స) సహ్రీ కోసం ఆహ్వానించారు. అపుడు ఆయన ఇలా అన్నారు: "విచ్చేయండి, ఉదయపు శుభప్రద భోజనం కోసం".

*(సునన్ అబూదావుద్, సునన్ నసాయి).*

హజ్రత్ అనస్ రజియల్లాహు అన్హు కథనం: దైవ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు:

**"అల్లాహ్, ఆయన దూతలు సహ్రీ భుజించేవారిపై శాంతి శుభాలను (సలాత్) కురిపిస్తారు".** ***(సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం)***

రమజాన్ మాసంలో ఖియామ్ విశిష్ఠతను తెలుపుతూ దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు:

**"ఎవరైతే విశ్వాసంతో, పుణ్యఫలాపేక్షతో రమజాన్ మాసంలో 'ఖియామ్' చేస్తారో (రాత్రుళ్ళు దైవారాధనలో గడుపుతారో) అతని పూర్వ పాపాలు మన్నించబడతాయి".** ***(సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం)***

**ప్రళయదినాన అల్లాహ్ సమక్షంలో అది (ఉపవాసం) ఉపవాసి మన్నింపు కోసం సిఫారసు చేస్తుంది. ఈ పవిత్ర మాసంలో ఉమ్రా చేయటం హజ్ చేయటంతో సమానం.** ***(సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం)***

ఈ పవిత్ర మాసంలో ఒక ఘనమైన రాత్రి ఉంది. దాన్ని ఎవరైనా పొందితే వెయ్యి మాసాల ఆరాధనకు లభించే పుణ్యం ఆ ఒక్కరాత్రిలో చేసే ప్రార్థనకు లభిస్తుంది. ఆ రాత్రి దైవదూతలు ఆకాశం నుండి భూమిపై సమూహంగా వస్తారు. దైవారాధన, అల్లాహ్ స్మరణ జరుగుతున్న ప్రదేశాల్లో వాలిపోతారు. వారి కొరకు అల్లాహ్‌తో దూతలు దుఆ చేస్తారు.

ఇలాంటి సందర్భాన్ని కోల్పోయేవాడు పరమ దౌర్భాగ్యుడు. అతడు అన్ని శుభాలు కోల్పోయినవాడే.

విశ్వాసి తన అన్ని కార్యాల్లో ఏకాగ్రత కలిగివుండాలి.చేసే ప్రతి ఒక్క మంచి కార్యాన్ని అల్లాహ్ కొరకే చేయాలి. అల్లాహ్ కొరకు చేసే ప్రతి సత్కార్యంలో కించిత్ కూడా స్వార్థం, ప్రదర్శనాబుద్ధి వుండరాదు. దానివల్ల పుణ్యాలు పూర్తిగా వృధా అయిపోతాయి. ఎందుకంటే రమజాన్ మాసం పూర్తయ్యాక దాసుడు అల్లాహ్ సమక్షంలో తన పాపాల మన్నింపుకై, నరకం నుండి విముక్తికై, చేసిన సదాచారాల ప్రతిఫలాన్ని ఆశిస్తూ తన చేతులను దుఆలకై చాపుతాడు. అతనిలో ఏకాగ్రత ఉంటే, కేవలం అల్లాహ్ కోసమే పుణ్యాకార్యాలు చేసివుంటే అల్లాహ్ ఆ దాసుడిని మెచ్చుకొని అతని పాపాలను మన్నిస్తాడు. అతనికి స్వర్గాన్ని ప్రసాదిస్తాడు. దానిపై దూతలను సాక్ష్యంగా నిలుపుతాడు. అదే ఒక విశ్వాసికి అసలు సిసలైన ఆనందం. అదే అన్నింటికంటే విలువైన ధనం.

అందుకే అలాంటి సందర్భాలను చేజారకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తపడుతూ ఉండాలి. విలువైన పవిత్ర రమజాన్ మాసాన్ని గ్రహించి దానిలో తన పాపాల మన్నింపుకై అల్లాహ్‌తో వేడుకుంటూ ఉండాలి. ఎల్లప్పుడు దుఆల్లో పవిత్ర ఖుర్‌ఆన్ పారాయణంలో, సదాచారాల్లో నిమగ్నమైవుండాలి.

అల్లాహ్ విశ్వాసులందరికి పవిత్ర మాసాన్ని గుర్తించి, పుణ్యాలు చేసుకుని, పాపాల మన్నింపుకై వేడుకునే అనుగ్రహాన్ని ప్రసాదించుగాక.... ఆమీన్.!

teluguislam.net



# 28. లైలతుల్ ఖద్ర్ ఘనత

సకల చరాచర సృష్టికి ప్రభువు, పాలకుడు అయిన అల్లాహ్ సర్వమానవాళి మార్గదర్శకత్వం కోసం అవతరింపజేసిన అతి అమూల్యమైన, ప్రధానమైన అనుగ్రహం ఆయన గ్రంథం పవిత్ర ఖుర్‌ఆన్. మానవ జాతి సాఫల్యం, విజయం, రుజుమార్గం ఈ గ్రంథంలోనే నిబిడీకృతమై ఉన్నాయి. అలాంటి మహత్తర గ్రంథాన్ని పరమ పవిత్రుడైన అల్లాహ్ పవిత్ర రమజాన్ మాసంలో తన ప్రియ ప్రవక్త (స) పై ఓ ఘనమైన రేయిలో అవతరింపజేశాడు. ఆ ఘనమైన రాత్రినే 'లైలతుల్ ఖద్ర్' అంటారు. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

إِنَّا أَنزَلْنَاهُ فِي لَيْلَةِ الْقَدْرِ (1) وَمَا أَدْرَاكَ مَا لَيْلَةُ الْقَدْرِ (2) لَيْلَةُ الْقَدْرِ
خَيْرٌ مِّنْ أَلْفِ شَهْرٍ (3) تَنَزَّلُ الْمَلَائِكَةُ وَالرُّوحُ فِيهَا بِإِذْنِ رَبِّهِم مِّن كُلِّ أَمْرٍ (4)
سَلَامٌ هِيَ حَتَّىٰ مَطْلَعِ الْفَجْرِ (5)

**“నిశ్చయంగా మేము దీనిని (ఖుర్‌ఆనును) ఘనమైన రాత్రియందు అవతరిం పజేశాము. ఆ ఘనమైన రాత్రి గురించి మీకేమి తెలుసు? ఘనమైన రాత్రి వెయ్యి నెలలకంటే కూడా శ్రేష్టమైనది. ఆ రాత్రి యందు దైవదూతలు, ఆత్మ (జిబ్రీల్) తమ ప్రభువు ఉత్తర్వుపై సమస్త విషయాల ఆజ్ఞను తీసుకొని దిగి వస్తారు. ఆ రాత్రి ఆసాంతం తెల్లవారే వరకూ శాంతియుతంగా ఉంటుంది.** ***(అల్ ఖద్ర్ 97 : 1-5)***

లౌహె మహ్‌ఫూజ్ నుండి పవిత్ర ఖుర్‌ఆన్‌ను అల్లాహ్ ఆ ఘనరాత్రిలోనే విశ్వ ఆకాశం పై దింపాడు. అక్కడి నుండే ఆ అవతరణ 23 సంవత్సరాల వ్యవధిలో సందర్భానుసారంగా అవతరించి పూర్తిగావించబడింది.

'ఖద్ర్' అనే పదానికి మూడు అర్థాలున్నాయి. ఖద్ర్ అంటే విలువైనది, అమూల్యమైనది అని అర్థం. ఆ రాత్రికి అంతటి విలువ ఎలా వచ్చింది? పవిత్ర ఖుర్‌ఆన్ ఆ రేయిలోనే అవతరించబడింది. అందుకే ఆ రాత్రికి ఆ ఘనత. ఖద్ర్‌కు మరో అర్థం

teluguislam.net



శక్తి. అంటే ఆ రాత్రి ఎంతో శక్తిగలది. ఆ రాత్రి దైవధ్యానంలో ఆరాధనలో నిమగ్నమైన వారికి అమూల్యమైన విశ్వాసం, శక్తి ప్రాప్తమవుతుంది. అది దైవ ప్రసన్నతకు చేరువ చేస్తుంది.

ఇక మూడో అర్థం విధివ్రాత. అల్లాహ్ ఆ ఘనమైన రాత్రిలోనే ఆ సంవత్సరంలో జరగబోయే నిర్ణయాలను దైవదూతలకు అప్పజెప్పాడు. అల్లాహ్ పవిత్ర ఖుర్ఆన్‌లో ఇలా సెలవిచ్చాడు:

إِنَّآ أَنزَلْنَٰهُ فِى لَيْلَةٍ مُّبَٰرَكَةٍ ۚ إِنَّا كُنَّا مُنذِرِينَ ③ فِيهَا يُفْرَقُ كُلُّ أَمْرٍ حَكِيمٍ ④

**"నిశ్చయంగా మేము దీనిని శుభప్రదమైన రాత్రియందు అవతరింప జేశాము. నిస్సందేహంగా మేము హెచ్చరిక చేసేవాళ్ళము. ఆ రాత్రియందే కీలకమైన ప్రతి ఉత్తర్వు జారీ చేయబడుతుంది.** ***(అద్దుఖాన్ 44 :3-4)***

ఖద్ర్ సూరాలో అల్లాహ్ ఇలా ప్రస్తావించాడు:

لَيْلَةُ ٱلْقَدْرِ خَيْرٌ مِّنْ أَلْفِ شَهْرٍ ③

**"ఆ ఘనమైన రాత్రి వెయ్యి నెలల కంటే ఎంతో శ్రేష్ఠమైనది".**

***(అల్ ఖద్ర్ 97 : 3)***

అంటే ఆ ఒక్క రేయిలో అల్లాహ్ స్మరణ దైవ ప్రవక్త (స) సూచించిన విధంగా చేస్తే వెయ్యి రాత్రుల ఆరాధనల పుణ్యఫలం లభిస్తుంది. వెయ్యి నెలలు ఎనభైమూడు సంవత్సరాల నాలుగు నెలలకు సమానం. 83 సంవత్సరాలు క్రమంగా ఆరాధన చేసినంత గొప్పపుణ్యం ఒక్క రాత్రిలోనే ప్రాప్తమవుతుంది.

దైవప్రవక్త (స) ఒక యూదుని గురించి చెబుతూ ఇలా ప్రవచించారు:

**బనీ ఇస్రాయీల్‌కు చెందిన ఓ వ్యక్తి ఎడతెగకుండా దైవధ్యానంలో 83 సంవత్స రాలు నిమగ్నమై ఉన్నాడు.** ***(సునన్ ఇబ్నె అబీహాతిమ్)***

"ఇస్రాయీల్ సంతతికి చెందిన ఓ వ్యక్తి రాత్రివేళ దైవధ్యానంలో గడుపుతూ పగలంతా అల్లాహ్ మార్గంలో శ్రమిస్తూ, పోరాడుతూ 83 సంవత్సరాలు గడిపాడు".

అల్లాహ్ ఎంతటి కరుణామయుడో పై హదీసు ద్వారా మనం గ్రహించగలం. 83 సంవత్సరాలు ఎడతెగకుండా చేసిన ఆరాధనా ఫలితం కేవలం కొన్ని గంటల్లో పొందే ఒక మహత్తర కారుణ్యాన్ని, అనుగ్రహాన్ని అల్లాహ్ ముస్లిం సమాజానికి



ప్రసాదించాడు. ఘనతగల ఆ రాత్రి అద్వితీయమైనది. కాబట్టి విశిష్టతగల ఆ రాత్రివేళ దానికి తగినట్లే ఆరాధన చేయాలి. ఇది కారుణ్య ప్రభువైన అల్లాహ్ తరుపున ఈ సమాజానికి (ఉమ్మత్) లభించిన ఓ మహదానుగ్రహం, ప్రత్యేక కారుణ్యం.

ఈ రేయికి మరో ప్రత్యేకత కూడా ఉంది. ఈ ఘనమైన రాత్రిలోనే దైవదూతల సర్దారు (రూహ్ ఆత్మ) జిబ్రీల్ (అలై) ఇతర దైవదూతలతో భువిపైకి దిగివచ్చి ఆ రాత్రి కూర్చుని లేదా నిలబడి దైవారాధనలో లీనమై ఉండేవారి మన్నింపుకోసం దైవాన్ని వేడుకుంటారు. ఆ ఘనమైన రాత్రి పూర్తిగా శాంతి శుభాలు కలిగి ఉండే రాత్రి. ఇలా అది తెల్లవారే (ఫజర్) వరకూ ఉంటుంది.

మరి ఈ ఘనమైన రాత్రి ఏ రోజు వస్తుంది? ఘనమైన రాత్రి రమజాను నెలలో ఏదో ఒక రాత్రి సంభవించవచ్చు. ఆ విషయం గురించి దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ఘనమైన రాత్రి ని రమజాను చివరిరోజుల్లో వెదకండి".

*(సహీహ్ బుఖారీ).*

రమజాన్ నెల 27వ రాత్రి ఈ ఘనమైన రేయి వస్తుందని కొందరు భావిస్తారు. కాని దీన్ని ఖచ్చితమని ఎలా చెప్పగలం? దైవప్రవక్త (స) ప్రవచనం మేరకు చివరి పదిరాత్రులల్లోని బేసి రేత్రిల్లో వెదకడమే మనకు శుభదాయకం. అల్లాహ్ మనపై చూపిన ప్రత్యేక కటాక్షమిది.

మామూలు రాత్రిని వేయి నెలలకంటే గొప్ప రాత్రిగా, ఘనమైన రేయిగా మార్చివేసిన అద్భుత గ్రంథం ఖుర్ఆన్, ఈ గ్రంథం అరబ్బుల కోసమో దాన్ని విశ్వసించే ముస్లింల కోసమో రాలేదు. ఇది సకల మానవాళి మార్గదర్శకం కోసం సత్యసత్యాలను వేరుపరచి రుజుమార్గాన్ని చూపేగ్రంథం. కాబట్టి ఈ ఘనమైన రేయిన ఖుర్ఆన్ పారాయణం ఎక్కువగా చేయాలి.

హజ్రత్ ఆయిషా (రజి) దైవప్రవక్త (స)ను "ప్రవక్తా! లైలతుల్ ఖద్ర్ ను గనుక నేను పొందితే అందులో ఏంచేయాలి?" అన్ని ప్రశ్నించగా దానికి ముహమ్మద్ (స)ఈ దుఆ చేయమని ఉపదేశించారు: "అల్లాహుమ్మ ఇన్నక అఫువ్వున్ తుహిబ్బుల్ అఫ్వ ఫాఫు అన్ని". (ఓ అల్లాహ్ ! నిశ్చయంగా నీవే క్షమించేవాడవు. క్షమించడాన్ని నీవు ఎంతో ఇష్టపడతావు కనుక నన్ను కూడా క్షమించు.)

teluguislam.net



# 29. జకాత్ విశిష్టత

**ముస్లిం సోదరులారా..!**

ఈ రోజు ఖుత్బా (ప్రసంగం)లో జకాత్ ఆదేశాలు, విశిష్టత గురించి తెలుసుకుందాం. ఇస్లామీయ ప్రాథమిక విధుల్లో ఎంతో విశిష్టత ప్రాముఖ్యత గల నాల్గవ మూలాంశం జకాత్. ఖుర్ఆన్ గ్రంథంలో ఎక్కడైతే నమాజ్ స్థాపించమని అల్లాహ్ ఆజ్ఞాపించాడో అక్కడే జకాత్ (విధి దానం) చెల్లించమని కూడా నొక్కి చెప్పాడు. ఇలాంటి ఆయతులు ఖుర్ఆన్ కరీంలో 82 కు పైగా ఉన్నాయి. అందుకే జకాత్ విధిని ధిక్కరించేవాడు కాఫిర్ (సత్య తిరస్కారి) జకాత్ చెల్లించని వానికి కఠిన శిక్ష ఉంది.

**అబూ హురైర (రజి) కథనం ప్రకారం, అల్లాహ్ ఎవరికయితే ధన సంపదలను ఇచ్చాడో అతడు ఆ ధనంపై జకాత్ చెల్లించనట్లయితే ఆ ధనం పరలోక దినాన తీవ్ర విషపూరిత భయంకర ఆకారం గల ఒక పెద్ద సర్పంగా చేయబడుతుంది. ఆ సర్పాన్ని అతని మెడలో సంకెళ్ళుగా చేసి వేయబడుతుంది. అది అతని మొహాన్ని హృదయాన్ని కాటేస్తూ నేను నీ ధనాన్ని నేను నీ నిధిని ఇక ఇప్పుడు రుచి చూడు" అని అంటుంది. తరువాత దైవ ప్రవక్త(స) ఈ ఆయత్‌ను పఠించారు.**

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا إِنَّ كَثِيرًا مِّنَ الْأَحْبَارِ وَالرُّهْبَانِ لَيَأْكُلُونَ أَمْوَالَ النَّاسِ بِالْبَاطِلِ وَيَصُدُّونَ عَن سَبِيلِ اللَّهِ ۗ وَالَّذِينَ يَكْنِزُونَ الذَّهَبَ وَالْفِضَّةَ وَلَا يُنفِقُونَهَا فِي سَبِيلِ اللَّهِ فَبَشِّرْهُم بِعَذَابٍ أَلِيمٍ (34)

**విశ్వసించిన ఓ ప్రజలారా! (యూదులు, క్రైస్తవులలోని) ఎందరో పండితులు, సన్యాసులు అధర్మంగా ప్రజల సొమ్మును స్వాహా చేస్తున్నారు. ప్రజలను అల్లాహ్ మార్గం నుండి ఆపుతున్నారు. ఎవరయితే వెండీ బంగారాల ఖజానాను ప్రోగుచేసి ఉంచి, దైవమార్గంలో**



**ఖర్చుచేయరో, వారికి వ్యధాభరితమయిన యాతన ఉంటుందన్న సమాచారం వినిపించు.** ***(అత్ తౌబా 9 : 34)***

అందుకోసమే ముస్లింలు ధన వ్యామోహంలోపడి పరలోకాన్ని విస్మరించ కూడదు. పరలోక పరాభావం, అవమానం నుండి రక్షణ పొందటానికి ఇహలోకంలోనే శతవిధాలా ప్రయత్నించాలి. డబ్బు ఖర్చు చేస్తే పేదరికం వాటిల్లుతుందని షైతాన్ మనసులో ప్రేరేపిస్తాడు. అలాంటి సమయంలో మదిని ఇలా సముదాయించాలి. నీవు ఇష్టపడే ఈ ధనం, డబ్బు ఎలాగైనా, ఎప్పుడైనా చేతిలోనించి చేజారిపోయేదే. నేనైనా దాన్ని వదిలిపెట్టి పోతాను లేదా అదే నన్ను వదిలిపెట్టి వెళ్ళిపోతుంది. నశించిపోయే, జారిపోయే ఈ డబ్బును ఎప్పటికీ అంతం కాని ఎల్లప్పుడు ఉపయోగపడే మంచి కార్యాలు దానధర్మాలకు ఎందుకు ఖర్చు చేయకూడదు?"

జకాత్ చెల్లించేవారికి, దానధర్మాలు చేసేవారికి అపూర్వమైన పుణ్యఫలం, ఉన్నత స్థానం ఉంది. అల్లాహ్ సూరెబఖరాలో ఇలా సెలవిచ్చాడు:

مَّثَلُ الَّذِينَ يُنفِقُونَ أَمْوَالَهُمْ فِي سَبِيلِ اللَّهِ كَمَثَلِ حَبَّةٍ أَنبَتَتْ سَبْعَ سَنَابِلَ فِي كُلِّ سُنبُلَةٍ مِّائَةُ حَبَّةٍ ۗ وَاللَّهُ يُضَاعِفُ لِمَن يَشَاءُ ۗ وَاللَّهُ وَاسِعٌ عَلِيمٌ (261)

**అల్లాహ్ మార్గంలో తమ ధనాన్ని ఖర్చుపెట్టేవారి ఉపమానం ఏడు వెన్నులను మొలకెత్తించే విత్తనం లాంటిది. ప్రతి వెన్నులో నూరు ధాన్యపు గింజలుంటాయి. అల్లాహ్ తాను కోరిన వారికి(ఇంత కన్నా) పెంచుతాడు. అల్లాహ్ మహా విశాలుడు. మహా జ్ఞాని.** ***(అల్ బఖర 2 : 261)***

హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు. ఖర్జూరం దానికి సమానమైన మంచి వస్తువును ఎవరయితే అల్లాహ్ మార్గంలో ఖర్చు చేస్తారో, ఆ ధనాన్ని అల్లాహ్ ఎంతో గౌరవంగా స్వీకరిస్తాడు. దాన్ని ఆ వ్యక్తి కోసం పోషిస్తాడు ఎలాగయితే వ్యక్తి దూడను పోషిస్తాడో. చివరికి ఆ ఖర్జూర పరిమాణం పెరుగుతూ పెరుగుతూ కొండంత అవుతుంది. (సహీహ్ బుఖారీ)

అంటే ప్రళయదినాన మంచి చెడులను తూచేటపుడు ఆ ఖర్జూర పరిమాణం (దానం) పర్వతం పరిమాణానికి సమానంగా త్రాసులో పెట్టబడుతుంది.

హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రబోధించారు నిశ్చయంగా దానధర్మాలు అల్లాహ్ ఆగ్రహాన్ని చల్లబరుస్తాయి. మృత్యుసమయ యాతనలను తగ్గిస్తాయి. (సునన్ తిర్మిజీ).

teluguislam.net
1/2 తులాలు



**మహాశయులారా..!**

కొంత మంది సంవత్సరకాలంలో మంచి కార్యాల్లో జకాత్ మూలధనం ఎంత వుందో అంతవరకే ఖర్చు చేస్తారు. అంటే జకాత్ మాత్రమే చెల్లిస్తారు. జకాత్ మాత్రమే విధి అని భావిస్తారు. మిగితా ఐచ్ఛిక దాన ధర్మాలు కూడా చేయాలని ఆలోచించరు. ఈ ఆలోచనా ధోరణి సరైనదికాదు. జకాతే కాకుండా మిగతా ధన సంపదల్లో వస్తువుల్లో కూడా నిరుపేదల, బీద జనుల హక్కు ఉంది. వారికి దానధర్మాలు చేయాలి.

తఫ్సీరుల్ జామీ లో లైసల్ బిర్ర అన్ తువల్లు వుజూహకుం ఆయత్ వ్యాఖ్యానంలో ఇబ్నె అబీ హాతిం ఇలా పేర్కొన్నారు: దైవప్రవక్త (స) ఈ ఆయతులో ఇలా అన్నారు: "ధనంలో జకాత్ కాక ఇతర విధులు కూడా ఉన్నాయి".

ఉదాహరణకు ఒకరి వద్ద ఆవులు, గేదెలు వంటి పాలిచ్చే జంతువులున్నాయి. వ్యవసాయానికి తోడ్పడే పశువులు, పరికరాలు, సాధనాలు వంటివి ఉన్నాయి. అలాంటప్పుడు అవసర రీత్యా వాటిని ఇతరులకు సహాయం కోసం, వారి ప్రయోజనం కోసం ఉపయోగిస్తూనే ఉండాలి. ప్రతి డబ్బున్న వ్యక్తిపై ఏ విధంగా జకాత్ విధిగా ఉందో అలాగే ఈ సాధనం, పరికరాలున్న వ్యక్తిపై ఈ పని విధిగా ఉంది. దీనిని నిర్వర్తించకపోతే పరలోక దినాన అల్లాహ్ సమక్షంలో పట్టు బడిపోతాం. మరొకొందరు జకాత్ చెల్లిస్తారు. కాని తాము ఉపకారం చేశామని దెప్పి పొడుస్తారు. దీని వలన కూడా పుణ్యం క్షీణిస్తూ పోతుంది. ఇదే విషయాన్ని అల్లాహ్ ఇలా తెలుపుతున్నాడు:

يَآيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا لَا تُبْطِلُوْا صَدَقٰتِكُمْ بِالْمَنِّ وَالْاَذٰى

**"దెప్పి పొడుపులతో, గ్రహీత మనస్సును నొప్పించే చేష్టలతో మీరు మీ దాన ధర్మాలను నాశనం చేసుకోకండి"** ***(అల్ బఖర 2 : 264)***

**అబూ హురైర (రజి) కథనం ప్రకారం దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: మీరు జకాత్ చెల్లించేటపుడు దాని పుణ్యఫలాన్ని మరవకండి. ఇలా వేడుకోండి-ఓదేవా! ఈ ధనాన్ని పుణ్యఫలంగా చెయ్యి (భారంగా చేయకు)"**

***(సునన్ ఇబ్నెమాజ).***

ధనం ఖర్చుపెట్టడం మనసుకు చాలా బాధపెట్టే విషయం మనసుకు కష్టమైన పని. అందుకొరకే దానం చేసేటపుడు మనసులో కొంత బాధ కలుగవచ్చు లేదా



ఏదైనా షైతాన్ ప్రేరణ కలుగవచ్చు అందుకే దైవప్రవక్త (స) ఈ దుఆ నేర్పించారు. దీనివలన ధార్మిక పుణ్యకార్యాల్లో ఖర్చు చేయటం కష్టతరం కాదు, ధర్మం పై ఆచరించటం సులభతరం అవుతుంది.

మరికొందరు జీవితాంతం లెక్కపెట్టి మరీ సంపాదిస్తారు, కూడబెడతారు. మరణ సమయంలో మాత్రం "అక్కడ అంత దానం చేయండి" "ఫలానా వారికి ఇంత ఇవ్వండి" అని మరణ శాసనం వ్రాస్తారు. మరణ సమయంలో ఖర్చుపెట్టడం కన్నా ఆరోగ్య స్థితిలో, కూడబెడుతున్న సంపదలో నుంచి ఖర్చు పెట్టడం ఉత్తమం.

జామెవుల్ బయాన్‌లో దానధర్మాలకు సంబంధించిన ఆయతుకు వ్యాఖ్యానంగా ప్రవక్త (స) వారి ఈ ప్రవచనం గమనించదగినది. ఆయన (స) ఇలా అన్నారు: "దేవుని ప్రీతి కోసం ఖర్చుపెట్టడమంటే భావం-నీవు ఆరోగ్యంగా, కుశలంగా ఉన్నప్పుడు ఖర్చు పెట్టాలి. బ్రతుకుపై ఆశ ఉన్నప్పుడు, దారిద్ర్య భయం ఉన్నప్పుడు ఖర్చుపెట్టాలి."

**అబూ సయీద్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: "ఆరోగ్యస్థితిలో ఒక రూపాయి దానం చేయటం మరణ సమయంలో నూరు రూపాయలు దానం చేయటం కన్నా ఉత్తమం."**

***(సునన్ అబూదావూద్)***

**ప్రియసోదరులారా..!**

జకాత్ ఎవరికి చెల్లించాలి అనేది కూడా అల్లాహ్‌నే సెలవిచ్చాడు:

إِنَّمَا الصَّدَقٰتُ لِلْفُقَرَآءِ وَالْمَسٰكِيْنِ وَالْعٰمِلِيْنَ عَلَيْهَا وَالْمُؤَلَّفَةِ قُلُوْبُهُمْ وَفِي الرِّقَابِ
وَالْغٰرِمِيْنَ وَفِيْ سَبِيْلِ اللّٰهِ وَابْنِ السَّبِيْلِ ؕ فَرِيْضَةً مِّنَ اللّٰهِ ؕ وَاللّٰهُ عَلِيْمٌ حَكِيْمٌ ﴿60﴾

**"దానాలను కేవలం నిరుపేదల కొరకూ, అభాగ్య జీవుల కొరకు, వాటి వసూళ్ల కోసం నియమితులైన వారికొరకు, హృదయాలను ఆకట్టుకోవలసి ఉన్నవారి కొరకు, మెడలను విడిపించటానికీ, రుణగ్రస్తుల కొరకూ, దైవ మార్గం కొరకూ, బాటసారుల కొరకూ వెచ్చించాలి. ఇది అల్లాహ్ తరపున నిర్ణయించబడిన ఒక విధి. అల్లాహ్ మహాజ్ఞాని, మహావివేకి."**

***(తౌబా 9 : 60)***

teluguislam.net



# 30. ఇస్లామీయ జీవనశైలి

**ఓ ఆదం సంతతివారలారా! మీరు మస్జిదుకు హాజరైన ప్రతిసారీ వస్త్రాలంకరణ పట్ల శ్రద్ధ వహించండి. తినండి, త్రాగండి. కాని మితిమీరకండి. మితిమీరిపోయే వారిని ఆయన (అల్లాహ్) ఇష్టపడడు.**

***(అల్ ఆరాఫ్ 7 : 31)***

ప్రియసోదరసోదరీమణులారా..!

ఇస్లాంకు పూర్వం అరబ్ దేశంలో అనేక అనాచారాలు, దురాచారాలు, మూఢ నమ్మకాలు చెలామణిలో ఉండేవి. వాటితో పాటు వస్త్రధారణ సంబంధించిన దురాచారాలు కూడా ఉండేవి. చాలామంది అరబ్బులు హజ్‌యాత్ర చేయటానికి కాబాను సందర్శించినపుడు నగ్నంగా ప్రదక్షిణ చేసేవారు. పుట్టినప్పుడు ఎలాంటి వస్త్రాలతో పుట్టము, ఇక దైనందన జీవితంలో ధరించే వస్త్రాలు మసిబారి, మురికగాఉంటాయి. అలాంటి స్థితిలో ప్రదక్షిణ చేయటం కన్నా నగ్నంగా, ఎలాంటి వస్త్రాలు లేకుండా ప్రదక్షిణ చేయటం శ్రేష్ఠం అనేది వారి అభిప్రాయం. ఈ దుష్టపోకడను ఖండిస్తూ అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**ఓ ఆదం సంతతివారలారా! మీరు మస్జిదుకు హాజరైన ప్రతిసారీ వస్త్రాలంకరణ పట్ల శ్రద్ధ వహించండి. తినండి, త్రాగండి. కాని మితిమీరకండి. మితిమీరిపోయే వారిని ఆయన (అల్లాహ్) ఇష్టపడడు.**

***(అల్ ఆరాఫ్ 7:31)***

**దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: ఎలాంటి పరిస్థితుల్లోను నగ్నంగా ఉండకండి. నిస్సందేహంగా మీతో ఎల్లప్పుడూ మీకు కానరాని జీవులు ఉంటారు. వారే దైవదూతలు. కాలకృత్యాలు తీర్చుకునేటపుడు, భార్యతో సంభోగించేటపుడు తప్ప వారు మిమ్మల్ని విడిపోరు. కాబట్టి మీరు వారి పట్ల లజ్జను పాటించండి. నగ్నంగా ఉండకండి.** ***(సునన్ తిర్మిజీ)***



చొక్కా, పైజామా, ప్యాంట్, టోపి పురుషులకు తగిన దుస్తులు. చొక్కా క్రింద ధరించే వస్త్రమైనా చీలమండకు పైకి ఉండాలి. చీలమండలకు క్రింద ధరించటం గర్వానికి అహంకారానికి చిహ్నం. ఏ వ్యక్తి హృదయంలో రవ్వంత గర్వమున్నా ఆ వ్యక్తి స్వర్గసువాసనను కూడా పొందలేడు. పురుషులు బంగారం వస్తువులు, పట్టు వస్త్రాలు ధరించటం నిషిద్ధం. స్త్రీలు పూర్తిగా పరదాలో ఉండాలి. శరీరపు ఒక్క భాగం కూడా అగుపించకూడదు. తలవెంట్రుకల నుండి పాదాల వరకు స్త్రీపరదాలో ఉండాలి. శరీరం అగుపించే విధంగా పల్చని వస్త్రాలు ధరించే స్త్రీ ప్రళయ దినాన దిగంబరంగా లేపబడుతుంది. అలాంటి స్త్రీలు నరకంలో భగభగమండే అగ్నికి ఆహుతి అవుతారు.

**మహాశయులారా..!**

**పురుషుల అందం, అలంకరణలో గడ్డం పెంచటం, మీసాలు కత్తిరించటం కూడా భాగమే, గడ్డం పెంచటం ప్రవక్తలందరి సాంప్రదాయం. దైవ ప్రవక్త (స) గడ్డం చాలా దట్టంగా ఉండేది. *(సహీహ్ ముస్లిం)***

మరో సందర్భంలో దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: నేను నా గడ్డాన్ని పెంచాలని, నా మీసాలను కత్తిరించాలని నా ప్రభువు నన్ను ఆజ్ఞాపించాడు. మరో హదీసులో ఇలా ప్రవచించారు: మీసాలను కత్తిరించండి, గడ్డాన్ని పెంచండి, యూదులను అనుసరించకండి. *(షర్‌హు మానీల్ ఆసార్ 2/333)*

మీసాలు కత్తిరించటం, గడ్డం పెంచటం దైవ ప్రవక్త (స) సంప్రదాయం, ఇస్లామీయ చిహ్నమని, పురుషాలంకారమని మనకు పై హదీసువెలుగులో బోధపడుతుంది. షేవింగ్ చేసేవాళ్ళు, గడ్డాన్ని కత్తిరించేవాళ్ళు దైవప్రవక్త (స) సున్నత్‌కు వ్యతిరేకంగా చేస్తున్నారు. వారు కాస్త, ఆలోచించాలి ముస్లింలమని చెప్పుకుంటూ దైవప్రవక్త (స) ప్రభోధనలకు విరుద్ధంగా ఆచరిస్తే సాఫల్యం ఎలా కలుగుతుంది? పురుషుని హుందాతనానికి చిహ్నమైన గడ్డాన్ని తీసేసి స్త్రీల మాదిరిగా ముఖాలు సరిచేసుకోవటం ఎంతటి నికృష్ట చర్య? అలాంటి వారిపై అల్లాహ్ శాపం కురుస్తుంది.

తలవెంట్రుక అందానికి పురుషులు గోరింటాకు తైలం వాడుక సరైనదే. లూత్ జాతి వారి గురించి ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా ప్రస్తావించాడు:

**మేము లూతు (అలైహిస్సలాం)కు నిర్ణయం గైకొనే శక్తినీ, జ్ఞానాన్నీ ప్రసాదించాము. నీతిమాలిన పనులకులోనై ఉన్న జనవాసం బారి**

teluguislam.net



**నుంచి అతనికి విముక్తిని కల్పించాము. ఆ జాతి వారు పరమ నీచులు, అవిధేయులు.** ***(అల్ అంబియా 21 : 74)***

లూత్ జాతి ప్రజల్లో 18 చెడుచేష్టలు ఉండేవి. బానిసల పందెం, పావురాల పందెం, గడ్డం తీయటం వంటివి అల్లాహ్ శిక్షకు గురైన వారి అలవాట్లలో ఒక చెడు అలవాటు గడ్డం పూర్తిగా తీసేయటం కాబట్టి షేవింగ్ చేయటాన్ని విడనాడాలి. గడ్డాన్ని పెంచాలి.

ఇవిగాక తలవెంట్రుకలు దువ్వుకోవటం, నూనె రాసుకోవటం, సుర్మా పెట్టు కోవటం, గోళ్ళు కత్తిరించడం, చంకలోని వెంట్రుకలు, నాభి క్రింది వెంట్రుకలు తొలగించుకోవటం లాంటివి స్త్రీలు, పురుషులు చేయొచ్చు. స్త్రీలు గోరింటాకు వాడుకోవచ్చు ఇవన్నీ కూడా ఇస్లామీయ వ్యక్తిత్వం క్రిందకు వస్తాయి.

**ప్రియసోదరులారా..!**

ఇస్లామీయ బాహ్య స్వరూపం తరువాత ఇక అంతర్గత స్వరూపం, శీలం నడవడిక, క్రమశిక్షణ గురించి తెలుసుకుందాం. అసూయ, ఈర్ష, ద్వేషం, అబద్ధాలు, అపనిందలు, పరోక్ష నిందలు, పాటలు, సంగీతం వినటం, ఇత్యాది అంతర్ రుగ్మత లకు దూరంగా మనకు ఆదర్శప్రాయమే. ఆ విధంగా మనము కూడా ప్రవర్తించాలి. పండితుడైనా, పామరుడైనా అన్ని విషయాల్లోనూ, వ్యవహారాల్లోనూ ఇస్లామీయ ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటించాలి. నమాజ్, ఉపవాసాలుపాటిస్తూ, జకాత్, హజ్ పాటిస్తూ ఇతర మానసిక రుగ్మతలైన అబద్ధాలు, అసూయ, మోసం వంచనకు పాల్పడితే అతని ఆరాధనల్లో ప్రభావమూ, ప్రయోజనము ఉండదు. ఉపవాసం విషయంలో దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: ఎవరయితే అబద్ధాలాడడం మానరో, అధర్మ కార్యాలు మానరో అలాంటి వారు అన్నపానీయాలను మానుకోవలసిన అవసరం అల్లాహ్‌కు లేదు (సహీహ్ బుఖారీ).

సత్యవంతులు, ఏకదైవారాధకులైన వారి ద్వారా ఇలాంటి పాపకార్యాలు దొర్లటం చాలా చెడ్డచేష్ట. అందుకే అలాంటివాటిని త్యజించి సత్కార్యాలు చేస్తూనే ఉండాలి. ఇందులో చాడీలు చెప్పటం ఘోరమైన పాపం. కాని ఇందులో అందరూ మునిగి ఉన్నారు. ఖుర్‌ఆన్ దీనిని తీవ్రంగా ఖండిస్తూ ఇలా ప్రబోధించింది:

**మీలో ఎవరూ ఇంకొకరి గురించి వీపు వెనుక చెడుగా చాడీలు చెప్పు**



**కోకూడదు. ఏమిటి మీలో ఎవరయినా చచ్చిపోయిన మీ సోదరుని మాంసం తినటానికి ఇష్టపడతారా? చూడండి, మీరు స్వయంగా దీన్ని ఏవగించు కుంటున్నారు? అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. నిశ్చయంగా అల్లాహ్ పశ్చాత్తాపాన్ని స్వీకరించేవాడు, కరుణించేవాడూను.**

***(అల్ హుజురాత్ 49 : 12)***

చాడీలు చెప్పటం మృతసోదరుని మాంసం తినటంతో సమానమని ఖుర్‌ఆన్ వివరిస్తుంది. దైవ ప్రవక్త (స) మేరాజ్ (ఆకాశ) ప్రయాణంలో చూసిన ఒక వింత సంఘటనను ఇలా వివరించారు: నేను నా సంఘంలోని ఒక సమూహం ను చూశాను వారి గోళ్ళు రాగి గోళ్ళు. గోళ్ళతో వారు తమ ముఖాలను, గుండెలను రక్కుకుంటున్నారు. వారు ఎవరని నేను జిబ్రయీల్ దూతను ప్రశ్నించాను. “వాళ్ళంతా ప్రజల మాంసం తినేవారు. చాడీలు చెబుతూ ప్రజల గౌరవ మర్యాదలను కించపరిచేవారు” ఆయన జవాబిచ్చారు.

ఒకరి విషయాలు ఒకరికి చెప్పుతూ వారి మధ్య విభేదాలు సృష్టిస్తూ ఉండే వారి గురించి దైవప్రవక్త(స) ఇలా అన్నారు:

**“చాడీలు చెప్పి చిచ్చుపెట్టేవాడు స్వర్గంలో ప్రవేశించడు”**

**(సునన్ అబూదావూద్)**

అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

**“నువ్వు అదే పనిగా ప్రమాణాలు చేసే తుచ్ఛుని మాట వినకు. వాడు (ఎంత సేపటికీ) చులకనగా మాట్లాడతాడు, చాడీలు చెబుతాడు.”**

***(అల్ ఖలమ్ 68 :10,11)***

మరోచోట (మునాఫిఖ్) కపట విశ్వాసుల గురించి ఇలా తెలుపటం జరిగింది:

**విశ్వాసులను కలుసుకున్నప్పుడు వారు,“మేమూ విశ్వసించిన వారమే” అని అంటారు. కాని తమ షైతానుల (అంటే తమ పెద్దల లేక సర్దారుల) వద్దకు పోయినప్పుడు, “మేము మీతోనే ఉన్నామండీ. కాకపోతే వాళ్ళతో పరిహాస మాడుతున్నామంతే” అని పలుకుతారు.** ***(అల్ బఖర 2:14)***

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

**అతి చెడ్డ వ్యక్తులైన రెండు నాలుకలవారిని మీరు చూస్తారు. వారు ఒక మొహంతో కొందరి దగ్గరికి వెళ్తారు మరో మొహంతో మరికొందరి**

teluguislam.net



**దగ్గరికి వెళ్తారు. (సహీహ్ బుఖారీ)**

మరో సందర్భంలో దైవప్రవక్త (స) ఇలా అన్నారు: రెండు నాలుకల వ్యక్తి ప్రళయదినాన రెండు అగ్ని నాలుకల ముఖంతో వస్తాడు (సునన్ అబూదావూద్).

**ప్రియసోదరులారా..!**

మనిషి వ్యక్తిత్వానికి నడవడికకు మచ్చగా మార్చే చెడు కార్యాలు, పాపకార్యాలు చాలా ఉన్నాయి. వాటిన్నిటి నుండి బహుదూరంగా ఉండటం తప్పనిసరి. ఇతరులను అల్పులుగా, చులకనగా చూస్తూ తమను తాము గొప్పవారుగా భావించుకునే వారు కూడా నరకంలోకి పోతారు. తాము చేసేది సరైనది, ఇతరులు చేసేది తప్పు అని భావించేవారు లేకపోలేదు. ఇలాంటి వారు చాలా నీచులు.

హ్రజత్ జాబిర్ బిన్ సలీం (రజి) ఇలా తెలిపారు: 'నాకు ఏదన్నా ఉపదేశించండి' అని నేను దైవప్రవక్త (స)కు విన్నవించుకున్నప్పుడు, దైవప్రవక్త (స) ఇలా ప్రభోదించారు:

**"ఎవరినీ దూషించకు".**

**ఆ తరువాత నేను ఏ స్వేచ్ఛాపరుణ్ణి, బానిసను, ఒంటెను, మేకను దూషించలేదు." సత్కార్యాల్లోని ఏ పనిని తక్కువగా అంచనా వేయకు. చివరకు చిరుమందహాసంతో నీ సోదరుణ్ణి పలకరించు. పిక్కల వరకూ నీ ఇజారు (లేక లుంగీ) ఉండేలా చూసుకో. లేదా చీలమండల వరకు మాత్రం నీ వస్త్రం ఉండాలి. చీలమండల క్రిందికి వస్త్రం వ్రేలాడకుండా జాగ్రత్త పడు. ఎందుకంటే ఇది అహంకారానికి నిదర్శనం. నిశ్చయంగా గర్వపడే వారిని అల్లాహ్ ఇష్టపడడు. ఒకవేళ నిన్నెవరైనా రెచ్చగొట్టిన, దూషించినా నీ వద్ద గల జ్ఞానంతో వారినీ రెచ్చగొట్టకు, దూషించకు. ఎందుకంటే అతని పైత్యం అతన్నే చుట్టుకుంటుంది. (సునన్ అబూదావూద్)**

**మహాశయులారా..!**

ఇస్లామీయ నడవడిక, సత్ప్రవర్తన అమూల్యమైన సంపద. ఇహపరలోకాల్లో విజయం, సాఫల్యం వీటి ద్వారానే సాధ్యం అల్లాహ్ మనందరికి ఇస్లాం ఆదేశాల ప్రకారం జీవితం గడిపే భాగ్యాన్ని ప్రసాదించుగాక ఆమీన్..!



# 31. ఇస్రా - మేరాజ్

**"తన దాసుణ్ణి రాత్రికి రాత్రే మస్జిదె హరామ్ నుండి మస్జిదె అక్సా వరకు తీసుకుపోయిన అల్లాహ్ పరిశుద్ధుడు. దాని పరిసరాలను మేము శుభవంతం చేశాము. ఎందుకంటే మేమతనికి మా (శక్తిసామర్థ్యాలకు సంబంధించిన) కొన్ని సూచనలను చూపదలిచాము. నిశ్చయంగా అల్లాహ్ మాత్రమే బాగా వినేవాడు, చూసేవాడు."** ***(అల్ ఇస్రా : 01)***

**సోదర సోదరీమణులారా..!**

ఈ వాక్యంలో దైవప్రవక్త (స) జీవితంలోని ఒక మహోన్నత సంఘటనను గురించి అల్లాహ్ ప్రస్తావించాడు. దీనిని మేరాజ్ (గగన ప్రయాణం) అని అంటారు. దైవప్రవక్త (స) మస్జిదె హరాం (మక్కా) నుండి చాలా దూరాన ఉన్న మస్జిదె అక్సా (జెరూసలేం) వరకు చేసిన ప్రయాణాన్ని "ఇస్రా" అంటారు మస్జిదె అక్సా నుండి నుండి దివికి వెళ్ళటం, పరలోకంలో విహరించటం, స్వర్గం – నరకంను చూడటాన్ని 'మేరాజ్' అంటారు. ఏ ప్రవక్తకూ ప్రసాదించబడని అద్భుత మహిమ దైవప్రవక్త (స) కు మాత్రమే ప్రసాదించబడింది. తన ప్రియప్రవక్త (స) ను అల్లాహ్ ఆకాశం పైకి పిలుపించుకుని, అక్కడే అనేక అనుగ్రహాలతో సత్కరించాడు.

మేరాజ్ శరీరంతో సహా మెలకువ ఉన్న స్థితిలోనే జరిగింది. ఆకాశ ప్రయాణం కోసం అల్లాహ్ బుర్రాఖ్ వాహనాన్ని పంపాడు. దానిపై ప్రయాణించి ప్రవక్త (స) మక్కా నుండి బైతుల్ మఖ్దిస్ చేరారు. అక్కడ ఆయన (స) ప్రవక్తలందరికి నమాజ్‌కు నాయకత్వం వహించారు. ఆ తరువాత ఆకాశ ప్రయాణం ప్రారంభమైంది. మేరాజ్ కు సంబంధించిన హదీసులు చాలా ఉన్నాయి.

సూరె నజ్మ్‌లో అల్లాహ్ ఇలా తెలియజేశాడు:

**క్రింద పడేటప్పటి నక్షత్రం సాక్షిగా! మీ సహచరుడు (అయిన ముహమ్మద్– స) దారి తప్పనూ లేదు, పెడదారి పట్టనూ లేదు. అతను తన మనోవాంఛల ప్రకారం మాట్లాడటమూ లేదు. అది (అతను**

teluguislam.net



**మాట్లాడేదంతా) అతని వద్దకు పంపబడే దైవవాణి (వహీ) తప్ప మరేమీ కాదు. అసాధారణ శక్తిగల దైవదూత (జిబ్రయీల్) అతనికి (ఖుర్ఆన్) నేర్పాడు. అతడు గొప్ప శక్తిసంపన్నుడు. మరి అతను తిన్నగా నిలబడ్డాడు. అతడు ఎత్తయిన ఆకాశపుటంచులపై ఉన్నాడు. మరి అతను సమీపించ సాగాడు.... అలా అలా వాలుతూ వచ్చాడు. చివరికి అతను రెండు ధనస్సులంత దూరాన లేక అంత కన్నా తక్కువ దూరాన ఉండిపోయాడు. తరువాత అతడు దైవదాసునికి అందజేయవలసిన సందేశాన్ని అంద జేశాడు.** ***(అన్ నజ్మ్ 53:1-10)***

**ప్రియసోదరులారా..!**

సూరె నజ్మ్ మొదటి రుకూ వాక్యాలలో మేరాజ్ విషయాలను అల్లాహ్ తెలియ జేశాడు. వాటిని అర్థం చేసుకోవటం చాలా ముఖ్యం. అందుకే బుఖారీ లోని ఒక సుదీర్ఘ హదీసును వినిపించబోతున్నాను. ఆయన ఆత్మ మాత్రమే మేరాజ్ చేసింది. కాని ఆయన శరీరం ఇక్కడే ఉంది అని కొందరి అభిప్రాయం. కాని ఇది సరైన అభిప్రాయం కాదు. ఆయన (స) దేహం, ఆత్మ రెండింటితో గగనవిహారం చేశారు. ఇది ఖుర్ఆన్ హదీసుల ద్వారా నిరూపితమైనది.

మాలిక్ బిన్ సాసా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "నేను ఒకసారి నిద్ర మెలుకువ మధ్య స్థితిలో ఉన్నాను. పిదప ఆయన ఇద్దరి మధ్య పడుకొని మూడవ వ్యక్తి గురించి ప్రస్తావించారు. నా వద్దకు ఓ బంగారు పళ్ళెం తేబడింది. అది వివేకంతో, విశ్వాసంతో నిండి ఉన్నది. తరువాత నా రొమ్ము ఉదర భాగం వరకు చీల్చి జమ్‌జమ్ నీటితో శుభ్రపరచి వివేకం విశ్వాసంతో నింపబడింది. ఆ తరువాత తెల్లని కంచరగాడిద కంటె చిన్నది, గాడిద కన్నా పెద్దదిగా గల బుర్రాక్ వాహనం తీసుకురాబడింది. దానిపై పయనించి నేను జిబ్రయీల్‌తో ఆకాశం చేరాము. మొదటి ఆకాశం చేరినపుడు ఎవరు?' అని ప్రశ్నించటం జరిగింది. 'జిబ్రయీల్' అని సమాధానమిచ్చారు. 'మీతోపాటు ఎవరున్నారు?' 'నాతో ముహమ్మద్ (స) ఉన్నారు అని చెప్పారు. ఈయన్ని తీసుకురావటానికి నిన్ను పంపడం జరిగిందా?" అని ప్రశ్నించటం జరిగింది. అవును అన్నారాయన. విశాలప్రాంతానికి వచ్చి వారికి శుభాకాంక్షలు! అని స్వాగతం పలికారు మొదటి ఆకాశదూతలు. మేము ఆదం (అస) సమక్షంలో హాజరయ్యాము. సలాం చేశాము. "విచ్చేయుము



నా కుమారుడా! శుభప్రవక్తా!" అని వారు స్వాగతించారు. ఆ తరువాత మేము రెండవ ఆకాశం చేరాము అక్కడా అలాగే ప్రశ్నించారు. జిబ్రయీల్ మొదటిలాగే సమాధాన మిచ్చారు.

అక్కడ మొదటి లాగే ఈసా మరియు యహ్యాతో కలిశాం. వారు తమ సోదరుడు, ప్రవక్త అయిన నాకు స్వాగతం పలికారు. ఆ తరువాత 3వ ఆకాశం చేరాము. అక్కడ కూడా మొదటిలాగే మీరెవరు మీ వెంట ఉన్న వారు ఎవరని జిబ్రయీల్‌ను ప్రశ్నించటం జరిగింది. నేను జిబ్రయీల్ అని సమాధానం ఇచ్చాను. మీతో ఎవరున్నారు? అని అడగటం జరిగింది. దానికి సమాధానంగా జిబ్రయీల్ నాతో ముహమ్మద్ (స) ఉన్నారని చెప్పారు. మీరు ఆయన్ని తీసుకురాటం కోసం పంపబడ్డారా? అని అడిగితే అవును అని జిబ్రయీల్ అన్నారు. అక్కడ యూసుఫ్ (అ)ను కలిశాం. సలాము చేశాము. వారుకూడా స్వాగతించారు. నాల్గవ ఆకాశం చేరుకున్నాము. అక్కడ అవే ప్రశ్న జవాబుల తరువాత అక్కడ మేము ఇద్రీస్ (అలై) ను కలిశాము, సలాం చేశాము. వారు స్వాగతించారు. మళ్ళీ 5వ ఆకాశం చేరాం. అక్కడా అలాగే జరిగింది. అక్కడ మేము హారూన్ (అలై)ను కలిశాం, సలాం చేశాము. ఆయన విశాల ప్రాంతానికి విచ్చేసిన సోదరుడు, ప్రవక్తకు సుస్వాగతం అని అన్నారు. అక్కడి నుండి 6వ ఆకాశం చేరాము. అక్కడ కూడా ఇలానే ప్రశ్నించబడింది మీరెవరూ? నేను జిబ్రయీల్‌ను మీవెంటఎవరున్నారు? నా వెంట ముహమ్మద్ (స) ఉన్నారు. ఆయన్ని తీసుకురావాటానికి మీరు పంపబడ్డారా? అవును అయితే విశాల ప్రాంతాలకు విచ్చేసేవారికి సుస్వాగతం, శుభాకాంక్షలు అక్కడు మేము మూసా (అలై) ను కలిశాం, సలాం చేసాము సోదరుడు, ప్రవక్త (స)ను స్వాగతం అన్నారు. మేము కాస్తా ముందుకు వెళ్ళాము అంతే ఆయన ఏడ్వసాగారు? ఎవరు అడగ్గా? నా తరువాత పంపబడిన ఈ నవయువకుడైన (ప్రవక్త ఉమ్మత్‌లోని వారు నా ఉమ్మత్ వారి కంటే అధికంగా స్వర్గంలో ప్రవేశిస్తారని చెప్పారు. మేము 7వ ఆకాశం చేరుకున్నాం. అక్కడ కూడా ప్రశ్నలు జరిగాయి. మీరెవరు? జిబ్రయీల్‌ను మీ వెంట ఎవరున్నారు? నా వెంట ఎవరున్నారు? నా వెంట ముహమ్మద్(స)ఉన్నారా. అవును తీసుకురావటం కోసం మీరు పంపబడ్డారా అవును అయితే విశాలకాశాలకు విచ్చేసినవారికి శుభకాంక్షలు సుస్వాగతం అక్కడ మేము ఇబ్రాహీమ్ (అలై)ను కలిశాం, సలాం చేశాము. నా కుమారా మంచి విశాల ప్రాంతానికి వచ్చావు అన్నారు. ఆ

teluguislam.net



తరువాత నాకు బైతుల్‌మామూర్ చూపించటం జరిగింది. దానిగురించి నేను జిబ్రయీల్‌ను అడగాను. అది బైతుల్‌మామూర్ చోటు, దానిలో ప్రతి రోజు 70 వేల మంది దైవదూతలు నమాజ్ పాటిస్తారు. ఒకసారి నమాజ్ పాటించిన దైవదూత వంతు మళ్ళీ ప్రళయం వరకు రాదు" అని ఆయన వివరించారు.

ఆ తరువాత సిద్రతుల్ మున్తహా చూపించబడింది. హిజర్ ప్రదేశం కుండల మాదిరిగా ఆ చెట్ల ఫలాలున్నాయి. ఏనుగు చేవుల్లా వాటి ఆకులున్నాయి. దాని వేళ్ళనుండి నాలుగు సెలయేళ్ళు ప్రవహిస్తాయి. రెండు బయటికి అగుపిస్తాయి. రెండు భూగర్భంలో ప్రవహిస్తాయి. వాటి గురించి జిబ్రయీల్‌ను ప్రశ్నించాను. జిబ్రయీల్ ఈ విధంగా తెలియజేశారు. బయటకు అగుపించే నదులు నైలు, యూఫ్రెట్స్. ఆ తరువాత ప్రవక్త (స) వారు సిద్రతుల్ మున్తహాను దాటి ముందు కెళ్ళారు. అక్కడ అల్లాహ్ సంభాషించారు. అక్కడ 5 పూటల నమాజు విధిగా చేయబడింది. ఈ విధంగా మేరాజ్ యాత్ర జరిగింది. కానీ మేరాజ్ సంఘటన జరిగిన తేదీ యొక్క వాస్తవికత ఎవరికీ తెలియదు. కానీ ఒక మాట వాస్తవం. హిజ్రత్ ముందే శారీరకంగా మేరాజ్ యాత్ర జరిగింది. అల్లాహ్ యొక్క అనుగ్రహాలను కృతజ్ఞతలు తెలుపుతూ జీవితం గడిపే భాగ్యాన్ని ప్రసాదించుగాక!

**మహాశయులారా..!**

మేరాజ్ ప్రయాణం కాబా గృహ ప్రాంగణంలోని హతీం నుండి ప్రారంభమైంది ఆ ప్రాంతంలోనే ఆయన (స) అమీరె హమ్జా (రజి) జాఫర్‌ల మధ్య పడుకుని ఉన్నారు అక్కడ నుండే బుర్రాఖ్ ద్వారా ప్రయాణం మొదలయ్యింది. ఆయన (స) దేహాత్మలతో మేరాజ్ చేయటం సత్యం. దీన్ని కాదన్నవాడు మార్గభ్రష్టుడు.

సత్యాన్ని రుజువు చేయటానికి తన ప్రియ ప్రవక్తను ఆకాశ ప్రయాణం గావించాడు అల్లాహ్. అంతరిక్ష ప్రయాణం నేటితో ప్రారంభమైంది కాదు. అల్లాహ్ 1400 సంవత్సరాల పూర్వమే తన దాసుని ద్వారా చేసి చూపాడు. ఈ అద్భుత మహత్తర కార్యం అంతిమ ప్రవక్త (స) మాత్రమే అల్లాహ్ శక్తి వలన చేసిచూపారు. దేహంతో సహా ఆకాశవిహారం చేయటాన్ని నమ్మనివారు అల్లాహ్ తలచుకుంటే దాసుని ద్వారా తన శక్తి సామర్థ్యాలతో ఏదైన చేయగలడని మరవకూడదు. చూడ్డానికి అసాధ్యంగా ఉన్నా ఆ కార్యాలన్ని అల్లాహ్ శక్తి ముందు దిగదిడుపే కదా! దేహంతో



సహా వెళ్ళారని తెలుపుటకే అల్లాహ్ అని 'అస్రా' అనే పదాన్ని ఉపయోగించాడు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**తన దాసుణ్ణి రాత్రికి రాత్రే మస్జిదె హరామ్ నుండి మస్జిదె అక్సా వరకు తీసుకుపోయిన అల్లాహ్ పరిశుద్ధుడు. దాని పరిసరాలను మేము శుభ వంతం చేశాము. ఎందుకంటే మేమతనికి మా (శక్తి సామర్థ్యాలకు సంబంధించిన) కొన్ని సూచనలను చూపదలిచాము. నిశ్చయంగా అల్లాహ్ మాత్రమే బాగా వినేవాడు, చూసేవాడు.** ***(బనీ ఇస్రాయీల్ 17 : 1)***

teluguislam.net



# 32. తబూక్ యుద్ధం

**అల్లాహ్ ప్రేమించేది సీసం పోసి నిర్మింపబడిన గోడలాగా వరుస తీరి స్థిరంగా అతని మార్గంలో పోరాడేవారినే సుమా!** ***(అస్ సఫ్ 61 : 4)***

**ముస్లిం సోదరులారా..!**

ఖుత్బాలో పఠించబడిన ఆయత్ అనువాదం విన్నారు. తన ప్రియదాసుల స్థితిని అల్లాహ్ ఈ ఆయత్‌లో ప్రస్తావించాడు. వారందరు దైవధర్మ పురోగతి కొరకు దైవమార్గంలో కఠోరపరిశ్రమ చేసేవారు. వారి పరస్పర ప్రేమాప్యయత ఐకమత్యం అల్లాహ్ ప్రసన్నత, చిత్తశుద్ధి కొరకే ఉండేది. తొలి కాలపు ముస్లింల పరిస్థితి ఇది. ప్రత్యేకంగా దైవ ప్రవక్త (స) కాలంలోను సహచరులు, అనుచరులు ఇస్లాం ధర్మం ప్రగతి కొరకే జీవితాలు ధారపోశారు. స్వంత సోదరుల్లా చూడ చక్కగా, ప్రేమగా, ఐకమత్యంగా ఉండేవారు. ఈ ప్రేమ, విధేయత, ఐకమత్యం కారణంగానే అల్లాహ్ వారికి ప్రతి రంగంలోనూ, ప్రతి మైదానంలోను విజయాలను ప్రసాదించాడు. వారు స్వల్పకాలంలోనే విజయ శిఖరాలకు, చేరుకున్నారు. వారి బృహత్తర కార్యాలను చదివిన ముస్లింలే కాదు, కనీస జ్ఞానం గల సాధారణ ప్రజలు కూడా ఆశ్చర్యం వ్యక్తం చేస్తారు. వారు ఎంతటి విశిష్ఠవ్యక్తులు, శ్రేష్టజీవులు! ఐకమత్యానికి, సమైక్యతకు ప్రతిబింబం వారు.

అలాంటి ఐకమత్యాన్ని, ప్రేమను నేటి ముస్లింలకు అల్లాహ్ ప్రసాదించుగాక. ఆమీన్..

దైవప్రవక్త (స) కాలంలో జరిగిన ఒక ప్రయాణం తబూక్ యుద్ధంగా ప్రసిద్ధిగాంచింది. ఆ యుద్ధ స్థితిగతులను దైవప్రవక్త (స) ప్రవచించిన ఒక ప్రసంగం ఆధారంగా ఈ రోజు మీకు వినిపించబోతున్నాను. శ్రద్ధగా విని అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను.

**ప్రియ సోదరులారా..!**

హిజ్రీ శకం 9వ యేట రోమ్ దేశచక్రవర్తి ఖైసర్ మదీనాపై దాడికి సన్నాహాలు



చేస్తున్నాడనే వార్త మదీనాలో ముస్లింలకు చేరింది. అరబ్‌లో నివసించే క్రైస్తవులు అత్యధిక సంఖ్యలో వారికి తోడ్పడసాగారు. కొద్దిరోజుల క్రితమే మూతా ప్రాంతంలో జరిగిన పరాజయానికి ప్రతీకారం తీర్చుకోవాలని ఉవ్విళ్ళురుతూ యుద్ధ ఏర్పాట్లలో తలమునకలయిపోయారు.

దైవప్రవక్త (స) ఈ వార్త విన్నపుడు తమ అభిప్రాయాన్ని ఇలా వెలిబుచ్చారు: "ఆ విరోధుల్ని నగర సరిహద్దుల్లోనే ఎదుర్కొనాలి. లేదంటే నగరంలో ప్రవేశించి అల్లకల్లోలం సృష్టిస్తారు."

శాసిస్తున్న మహా సామ్రాజ్యంతో జరిగే యుద్ధం అది. ఈరాన్‌ని మట్టి కరిపించిన బలసైన్యం అది. ఇటుచూస్తే ముస్లింల పరిస్థితి మరి సున్నితంగా ఉంది. ధనాగారం లేదు. యుద్ధ సామగ్రిలేదు. పైగా ప్రయాణం బహుదూరం. తీవ్రంగా ఎండలు మండుతున్న గడ్డు కాలమది. తీరా ఖర్జూర తోటలు కోతకు వచ్చాయి. మదీనావాసులు తోటలు కోయటం తప్పనిసరి. ఇత్యాది క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నారు వారంతా.

దైవప్రవక్త (స) యుద్ధ ప్రకటన చేశారు. దానితో సహా యుద్ధ సామగ్రికి ఆర్థిక వనరులు సమకూర్చాలని ఆజ్ఞాపించారు. హజ్రత్ ఉస్మాన్ (రజి) వంద ఒంటెలను, వంద గుర్రాలను, వెయ్యి దీనార్లను అల్లాహ్ మార్గంలో ఇచ్చేశారు. కృతజ్ఞతగా దైవప్రవక్త (స) అతనికి "ముజ్‌హిజుల్ జైషిల్ ఉస్రా" (కష్టకాలంలో ఉన్న సైన్యానికి ఆయుదాలు సమకూర్చేవాడు) అనే ఖితాబు నిచ్చారు.

అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) 40 వేల దిర్హములు సమర్పించారు. హజ్రత్ ఉమర్ (రజి) ఇంట్లో ఉన్న మొత్తం నుండి సగం సమర్పించగా, అబూ బకర్ సిద్దీఖ్ (రజి) ఇంట్లో ఉన్నదంతా తెచ్చి సమర్పించారు. ఇంటివారి కోసం ఏం వదిలి పెట్టావు? అని ప్రశ్నించగా ఇలా అన్నారు: "అల్లాహ్‌ను ఆయన ప్రవక్త (స) ప్రేమను" ఇంట్లో వదిలాను." అని జవాబిచ్చారు.

అబూ అఖీల్ అనే ఒక అన్సారీ యువకుడు రెండు సేర్లు ఎండిన ఖర్జూరపు పండ్లు సమర్పించారు. రాత్రంతా కూడా పొలానికి నీరు పెట్టిస్తే వచ్చిన కూలీ అది ఆయన ఇలా అన్నారు: "దైవప్రవక్తా(స)! కూలి పనిలో నాలుగుసేర్లు ఎండిన ఖర్జూర

teluguislam.net



పండ్లు సంపాదించి తీసుకువచ్చాను. సగం పిల్లల కోసంపెట్టి మిగతా సగం సమర్పించుకున్నాను". అతని త్యాగానికి దైవప్రవక్త (స) చాలా సంతోషించారు. ఆ రెండు సేర్లు ఎండిన ఖర్జూరాలను ఆ ధనరాశిపై ప్రశంసాపూర్వకంగా వెదజల్లారు.

ఒకవైపు స్వచ్ఛమైన అసలు సిసలు విశ్వాసులు పోటాపోటీగా ఇక్కడ సమర్పించుకుంటూ ఉంటే మరోవైపు నామమాత్రపు ముస్లిం కపట విశ్వాసులు వారికి వ్యతిరేకంగా దుష్ప్రచారం మొదలెట్టారు. కపటుల నాయకుడు అబ్దుల్లా బిన్ ఉబై ఇలా వాగుతూ ఉండేవాడు. ఈ యుద్ధంలో ముహమ్మద్ (స) ఆయన సహచరులంతా మదీనా తిరిగి రాలేరు. అందరికందరూ అక్కడే అంతమైపోతారు." ఈ ప్రయాణం నుండి తప్పించుకోవటానికి కపటులు రకరకాల సాకులు, వెతకసాగారు.

ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో 30 వేల సైన్యాన్ని తీసుకుని దైవప్రకవ్త(స) క్రైస్తవ సేనలను ప్రతిఘటించటానికి బయలు దేరారు.

**ప్రియసోదరులారా..!**

సైన్యంలో ఒంటెలు చాలా తక్కువగా ఉన్నాయి. 18 మంది మధ్యలో కేవలం ఒకే ఒక ఒంటె ఉండేది. ఆహారం కూడా లేకపోయేది. కొన్ని సార్లు చెట్లఆకులు తినేవారు. నీళ్ళు కూడా లేవు. అందుకే ఈ సైన్యాన్ని 'జైషుల్ ఉస్రా' అని (కష్టకాల సైన్యం) అంటారు. మార్గమధ్యలో సైన్యం వివిధ కష్టాలు, భాదలు ఎదుర్కొంది. కాని ఆ అల్లాహ్ వీరులు వాటన్నింటిని ఆనందంగా భరించారు. ముస్లింలలోని ఈ అసాధారణ త్యాగాలను, పోరాట పటిమను గురించి విని సిరియాకు చెందిన శత్రుసేనల్లో దడపుట్టింది. తత్కారణంగా ముస్లిం రాజ్యంపై దండెత్తాలనే ఆలోచనను (వెనక్కితీసుకుంది). దైవప్రవక్త (స) నెలరోజులు అక్కడే ఉన్నారు. పరిసరాల ప్రాంతాల వారు దైవప్రవక్త (స) వారి సహచరుల నడవడికకు ప్రభావితులయ్యారు. అక్కడి చిట్టిపొట్టి రాజ్యాల వారు ఆయనతో శాంతి ఒప్పందం కుదుర్చుకున్నారు. తబూక్‌లో ఉన్నప్పుడు దైవప్రవక్త (స) సహచరులనుద్దేశించి ఒక ప్రసంగం చేశారు. ప్రతీ ప్రవచనాన్ని మీరు శ్రద్ధగా వినండి, వాటిని అర్థం చేసుకొని విశ్వాసాన్ని సత్కర్మలను పరిశుద్ధపంచుకోండి. దైవ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు:

1. నిశ్చయంగా అత్యంత సత్యవంతమైన మాట అల్లాహ్ మాట అంటే ఖుర్ఆన్ గ్రంథం.



2. అత్యంత దృఢమైన విషయం దైవభీతితో కూడిన వచనం (లా ఇలాహ ఇల్లల్లాహ్)
3. అత్యంత శ్రేష్ఠమైన మిల్లత్ ఇబ్రాహీమ్ మిల్లత్.
4. అత్యంత శ్రేష్టమైన విధానం ముహమ్మద్ (స) విధానం
5. విషయములలోకెల్లా శ్రేష్ఠమైనది అల్లాహ్ నామస్మరణ (జిక్ర్).
6. అత్యంత శ్రేష్టమైన సత్య గాధలు ఈ ఖుర్ఆన్ గాధలు.
7. అత్యంత శ్రేష్ఠకార్యము ధృడనిశ్చయంగల కార్యం.
8. అత్యంత నీచమైన కార్యాలు ధర్మంలో లేనిపోని కొత్త పోకడలు.
9. అత్యంత శ్రేష్టమైన సన్మార్గం ప్రవక్తల సన్మార్గం.
10. అత్యంత శ్రేష్టమైన మరణం వీరమరణం.
11. అత్యంత అంధకారం, మార్గభ్రష్టత్వము, సన్మార్గంతరువాత మనిషి మార్గభ్రష్టుడవటం
12. ప్రయోజనకరమైన ధనమే శ్రేష్ఠమైనది.
13. అనుసరణీయమైన జ్ఞానమే మేలైనది.
14. మనసు అంధకారమే అత్యంతా చెడ్డ చీకటి.
15. దానం చేసే చెయ్యి దానం తీసుకునే చెయ్యి కంటే శ్రేష్టమైనది.
16. పరధ్యానంలో పడవేసే పుష్కల సంపద కన్నా కృతజ్ఞతాభావం కలిగించే పరిమిత సంపద మిన్న.
17. అత్యంత నికృష్టమైన క్షమాభిక్ష మరణ ఘడియల్లో వేడుకునే క్షమాభిక్ష.
18. అత్యంత హీనమైన సిగ్గు ప్రళయదినాన పాపాత్ములకు చెందే సిగ్గు.
19. మనుషుల్లో కొందరు జుమా నమాజుకైతే వస్తారు గాని వారి మనసంతా ఇండ్లల్లోనే ఉంటుంది.
20. మరికొంతమంది అల్లాహ్‌ను స్మరిస్తారు కాని అప్పుడప్పుడూ, అదీ నిర్లక్ష్యంగా!
21. అత్యంత ఘోర పాపం నోటితో చెప్పే అబద్ధం.
22. అత్యంత మేలైన సంపద నిరపేక్షాభావంగల మనసు.

teluguislam.net



23. అత్యంత శ్రేష్టమైన సామగ్రి దైవభీతి.
24. అసలు వివేకం అల్లాహ్‌కు భయపడుట.
25. హృదయాల్లో దిగిపోయేది అత్యంత శ్రేష్టమైనదీ అల్లాహ్ పట్ల సంపూర్ణ విశ్వాసం.
26. ఇస్లాం ధర్మం విషయంలో అనుమానాలు అపోహలు రేకిత్తించటం సత్యతిరస్కారానికి గుర్తు.
27. మృతునిపై ఆర్తనాదాలు చేస్తూ సంతాపం తెలుపటం అజ్ఞాన చేష్ట.
28. నమ్మకద్రోహం, అపహరణ నరక తాపానికి మూలం.
29. మైకంలో పడినవాడు ఏరికోరి నరకంలో పడినట్లే.
30. షరీఅత్‌కు వ్యతిరేకంగా కవితలు రాయటం ఇబ్లీస్ పనుల్లోనివి.
31. మద్యపానం పాపాలన్నింటికీ మూలం.
32. అత్యంత నీచమైన తిండి అనాధల సొమ్ము తినటం.
33. ఇతరుల నుండి ఉపదేశాన్ని, గుణపాఠాన్ని గ్రహించిన వాడే భాగ్యవంతుడు.
34. పుట్టుకతోనే (మాతృ గర్భం నుండి) దౌర్భాగ్యునిగా పుట్టినవాడే మహా దౌర్భాగ్యుడు
35. ఆఖరిగడియలు సత్కార్యాలతో ముగియటమే అత్యంత శ్రేష్ట ముగింపు.
36. అతి చెడ్డ కల అబద్ధపు కల.
37. రానున్న ప్రతి గడియా చాలా సమీపంలోనే ఉంది.
38. విశ్వాసులను దూషించటం అపరాధం.
39. (విశ్వాసిని) వధించటం అవిశ్వాసానికి ఆనవాలు.
40. విశ్వాసుల (మృతదేహాన్ని) భుజించటం అంటే చాడీలు చెప్పటం అల్లాహ్‌కు అవిధేయ చూపటంతో సమానం.
41. విశ్వాసి (ప్రాణం) ఎలా నిషేధించబడిందో అలాగే ధనం కూడా పరస్పరం నిషేదించబడింది.
42. అల్లాహ్ పట్ల అజాగ్రత్తగా ఉండేవాణ్ణి అల్లాహ్ అవమానపరుస్తాడు.



43. ఇతరులను క్షమించేవారిని అల్లాహ్ క్షమిస్తాడు.
44. ఇతరుల లోపాలను దాచేవారి లోపాలను అల్లాహ్ దాస్తాడు.
45. కోపాన్ని దిగమ్రింగేవానికి అల్లాహ్ ఉత్తమ పుణ్యఫలం వొసగుతాడు.
46. నష్టం వాటిల్లినపుడు సహనం పాటించేవానికి అల్లాహ్ ప్రతిఫలం ఇస్తాడు
47. చాడీలు చెబుతూ, అపనిందలు వేసేవారిని అల్లాహ్ శిక్షిస్తాడు.
48. సహనం పాటించేవారికి అల్లాహ్ శుభాన్నిస్తాడు.
49. తన పట్ల అవిధేయత చూపేవాణ్ణి అల్లాహ్ ఏదో ఒక ఆపదకు లోను చేస్తాడు.
50. తరువాత దైవప్రవక్త (స) మూడు సార్లు "అస్తగ్ఫిరుల్లాహ్" పఠించి తమ ప్రసంగాన్ని ముగించారు.

**మహాశయులారా..!**

దైవప్రవక్త (స)మహితోక్తుల్లోని ఒక్కొక్క పలుకును అర్థం చేసుకుని వాటిపై ఆచరించేవ్యక్తి ఇహపరలోకాల్లో సాఫల్యం విజయం పొందుతాడు. మనందరికి అదృష్టాన్ని సద్బుద్ధిని అల్లాహ్ ప్రసాదించాలని వేడుకుంటున్నాను. ఆమీన్..!

teluguislam.net



# 33. వివాహ విధానం

దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: **النكاح من سنتي అన్‌నికాహు మిన్ సున్నతీ** "వివాహం నా విధానం."

ఆయన (స) ఇలా అన్నారు: **فَمَنْ رَغِبَ عَنْ سُنَّتِي فَلَيْسَ مِنِّي ఫమన్ రగిబ అన్ సున్నతీ ఫలైస మిన్నీ** "ఎవరయితే నా విధానాన్ని పాటించరో వారు నా అనుచర సంఘంలోని వారు కారు."

ఆయన (స) ఇంకా ఇలా ప్రవచించారు: తన భర్తను అత్యధికంగా ప్రేమించే, అధిక పిల్లల్ని కనే స్త్రీని వివాహమాడండి. నిశ్చయంగా నేను ప్రళయ దినాన నా అనుచర సంఘం అత్యధికంగా ఉండటం చూసి గర్వపడుతాను.

**ముస్లిం సోదరులారా..!**

ఈరోజు మనం ఒక శుభకర సమావేశంలో కూర్చొని ఉన్నాము. దీనిని వివాహ మహోత్సవ సమ్మేళనం అంటారు. ఇలాంటి శుభకార్యాలలో ఎంత అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొంటారో అంత మంచిది. ఎందుకంటే ఇది జీవితంలో ఒక మధుర ఘట్టం. అల్లాహ్ సన్నిధిలో వధూవరులను ఆశీర్వదించటానికి ఆ పవిత్ర బంధానికి సాక్షులుగా నిలువటానికి ఇది దోహద పడుతుంది. కాబట్టి అలాంటి శుభకార్యాలలో సంకల్పశుద్ధితో పాల్గొనటం శుభకరం, ఉత్తమం. వివాహంలో "పరస్పర ఆమోదం, అంగీకారం" చాలా ముఖ్యం. రెండు కుటుంబాల ఇష్టాలు ముఖ్యంగా వధువు ఇష్టం, సాక్షులుండటం, మెహర్ నిర్ణయించటం, ఇవీ వివాహం నెరవేరటానికి నిబంధనలు. వధువు అంగీకారాన్ని తెలుసుకోవటం చాలా ముఖ్యం. వధువును ఇలా ప్రశ్నించాలి:

"అమ్మా! నీ వివాహం ఫలానా వ్యక్తి కుమారుడైన ఫలానా వ్యక్తితో ఇంత మెహర్‌తో జరిపించటం జరుగుతుంది. ఇదంతా నీఇష్ట ప్రకారమే జరుగుతుందా? వధువు మౌనం వహిస్తే అదే ఆమె అంగీకారం. ఒకవేళ వధువు భర్త చనిపోయిన స్త్రీ అయితే నోటితో తన అంగీకారాన్ని తెలుపటం ఉత్తమం.



వివాహం అయిన తరువాత ప్రసంగం ఇవ్వటం ప్రవక్త సంప్రదాయం.

ప్రసంగం అనంతరం ఖాజి గారు వరుని ముందు కాస్తా బిగ్గరగా నేను ఫలానా వ్యక్తి కూతురైన ఫలాన అమ్మాయిని, ఫలానా ఫలానా సాక్షులుగా ఫలానా వ్యక్తి పర్యవేక్షణలో ఇంత 'మహర్'కు ప్రతిగా నీ 'నికాహ్' (పవిత్ర వివాహబంధం)లో ఇస్తున్నాను. ఇది నీకు సమ్మతమేనా? అని అడుగుతారు. దానికి జవాబుగా వరుడు పెద్దగా అవును, నాకు సమ్మతమే నేను ఆమెను నా దాంపత్యంలోకి స్వీకరించాను" అని పలకాలి. ఆ తరువాత ఖాజీ గారు సభికులందరి సమక్షంలో వధూవరులకై ఈ పలుకులతో దుఆ చేయాలి. శుభాకాంక్షలు తెలుపాలి.

**" بَارَكَ اللهُ لَكَ، وَبَارَكَ عَلَيْكَ، وَجَمَعَ بَيْنَكُمَا فِي خَيْرٍ**

**బారకల్లాహు లక వ బారక అలైక వ జమఅ బైనకుమ ఫీ ఖైర్.**

వివాహంలో వరుడు వధువుకు మెహర్ చెల్లించటం విధి. మెహర్ వరుడు తన శక్తి, స్తోమతల ప్రకారం ఎంతైనా చెల్లించవచ్చు. వివాహం అనంతరం వెంటనే ఇవ్వటం ఉత్తమం.

teluguislam.net



# 34. వసీలా వాస్తవికత

**"విశ్వసించిన ఓ ప్రజలారా! అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. ఆయన సామీప్యాన్ని పొందే సాధనం వెతకండి. ఆయన మార్గంలో (యుద్ధ ప్రాతిపదికన) కృషి సలపండి. తద్వారా మీకు సాఫల్యం పొందవచ్చు."**

***(అల్ మాయిద 5 : 35)***

**ప్రియ సోదరులారా..!**

దైవప్రసన్నత చూరగోనే కార్యాలను, సాధనాలను అన్వేషించాల్సిందిగానేను మీ ముందు పఠించిన ఆయతులో అల్లాహ్ సెలవిచ్చాడు. ఏ విధంగా దైవప్రసన్నతను పొందాలో కూడా తెలియజేశాడు. ఆ సాధనమే **'జిహాద్ ఫి సబీలిల్లాహ్'** అంటే అల్లాహ్ మార్గంలో కఠోర శ్రమ చేయటం. దీనిద్వారానే పరలోక సాఫల్యం, విజయం ప్రాప్తమవుతుంది. ఈ ఆయత్‌లో వసీలా అనే పదం ఉపయోగించబడింది. ఈ పదం దగ్గరే చాలా మంది పప్పులో కాలేస్తారు. దీనిని తప్పుగా అర్థం చేసుకుంటారు. వసీలా అంటే ఫాతిహా ఇవ్వటం, నజరానాలు, మొక్కుబడులు, ముడుపులు దర్గాల వద్ద చెల్లించటం, ఉరుసులు, ఖవ్వాలి నిర్వహించటం అని అనుకుంటారు. దీని ద్వారానే పరలోక సిఫారసు ప్రాప్తిస్తుందని, తద్వారా సాఫల్యం మోక్షం అవుతుందని భావిస్తారు. వాస్తవానికి ఇలా భావించటం చాలా పెద్ద పొరపాటు. మరికొందరు ఇమాములు, ముర్షిద్‌లను తమ ధర్మపెద్దలుగా భావించటమే వసీలాగా భావిస్తారు. అలాంటి వారు ఆ తప్పుడు భ్రమలను, భావాలను దూరం చేసి వసీలా వాస్తవికతను గ్రహించటం అత్యంత అవసరం.

వాస్తవానికి 'వసీలా' అంటే కొందరు నిర్ణీత వ్యక్తులు కారు, కొన్ని సత్కార్యాలు సత్క్రియలు. ఒక దుకాణుదారుడు ఎవరైనా ఒక వ్యక్తిని వసీలాగ భావించి తన దుకాణమును తెరిస్తే వసీలా ద్వారా తనకు లాభం వస్తుందని సామాగ్రి అమ్ముడు పోతుందని భావిస్తే అది అతని భ్రమే గాని వాస్తవం ముమ్మాటికి కాలేదు. ఎందుకంటే



దుకాణం తెరవకుంటే సామగ్రి అమ్ముడుపోదు. మళ్లీ డబ్బెలా లభిస్తుంది? ఉపాధి ఎలా సమకూరుతుంది?

పరలోకంలో మోక్షం, సాఫల్యం, విజయం, దైవప్రసన్నత కేవలం విశ్వాసం, సత్కర్యాలే వల్లనే ప్రాప్తమవుతాయి. ఖుర్‌ఆన్ గ్రంథంలో విశ్వాసం సత్కార్యాల గురించే పదేపదే తాకీదు చేయటం జరిగింది. ప్రవక్తను, దైవ సందేశహరుణ్ణి, వలీని, పుణ్యపరుషుల్ని 'వసీలా'గా భావించాలని ఖుర్‌ఆన్ గ్రంథంలో ఎలాంటి సంకేతం కూడా లేదు. దైవప్రవక్త (స) అరబ్ దేశంలో ప్రభవించినపుడు ఆయన (స) కాలంలో యూదులు, క్రైస్తవులు, మక్కా ముష్రిక్కులు ఉండేవారు. వారందరూ తమకు తాము హజ్రత్ ఇబ్రాహీమ్, ఇస్మాయీల్, మూసా, ఈసా (అ) వైపుకు సంబంధాన్ని జోడించుకునే వారు.

ఒకవేళ ప్రవక్తల, వలీల వసీలా సరైనదే అయితే దైవప్రవక్త (స) ను వసీలాగా ఆశ్రయించి ఉండేవారు. కాని దైవప్రవక్త (స) పవిత్ర చరిత్రను అధ్యయనం చేస్తే ఎక్కడా ఇలాంటి 'వసీలా' మచ్చుకు కానరాదు. ఆ తరువాత కాలంలో కూడా ప్రజలు ప్రవక్త (స)ను గాని, సహాబాలనుగాని వసీలాగా ఉపయోగించలేదు. దైవప్రవక్త (స) సహాబాల, తాబయీల కాలంలో వసీలా లేనప్పుడు నేడు ఒక ఇమామ్, ముర్షిద్, మౌలానాకు ప్రజలకు వసీలా గురించి నూరిపోసే హక్కు ఎక్కడుంది? ప్రజలను విశ్వాసానికి, సత్కార్యాలకు బహుదూరం చేసి వ్యక్తిత్వ వసీలాలో వారిని ముంచేసి ఆచరణల నుండి వారిని అసమర్ధులుగా చేయటం ఎంతవరకు సమంజసం?

యదార్థానికి వసీలా అంటే అల్లాహ్ మార్గంలో అల్లాహ్ ప్రసన్నతను సత్కార్యాల ద్వారా అన్వేషించటం ఇదే ప్రవక్త అనుచరుల, ఇస్లాం విద్యావేత్తల అభిమతం. ఇలాంటి అభిప్రాయాలను సరైన బోధనలను వారు ప్రపంచ నలుములలా వ్యాపింపజేశారు. అలాంటి కార్యాలలోనే అల్లాహ్ వారికి పూర్తి సహాయాన్ని కారుణ్యాన్ని ప్రసాదించాడు. నేటి ముస్లింలు సమాధులు, దర్గాలు, బజార్లలలో ఉరుసులు, సేవలు, చేస్తూ వలీనే తమకు వసీలాగా సరిపోతాడని భావిస్తున్నారు. వలీని గౌరవించటం అంటే సేవలు చేయటం కాదు. వసీలాగా భావించటం ఎంత మాత్రం కాదు. ఇలాంటి అనాచారాలు, అపవచనాలు, మూఢనమ్మకాలు, ముస్లిం సమాజాన్ని ముక్కలు ముక్కలుగా చేస్తున్నాయి.

teluguislam.net



**మహాశయులారా..!**

వాస్తవానికి 'వసీలా' అంటే పుణ్యకార్యాలు, సత్కార్యాలు. సత్కర్మలు లేకుండా ఇహపరలోకాల్లో విజయం సాధించటం అసంభవం. మీరు ఇంతకుముందు వినే ఉంటారు.... దైవప్రవక్త (స) ఒక సందర్భంలో తమ ప్రియ పుత్రిక అయిన ఫాతిమా (రజి.అన్హా) నుద్దేశించి స్పష్టంగా ఇలా అన్నారు: "నా ప్రియపుత్రిక ప్రపంచంలో నీకు ఇష్టమైన దానిని అడుగు, కాని పరలోకంలో నేను నీకు ఏ విధంగాను ఉప యోగపడలేను. కేవలం మనిషి చేసుకున్న పుణ్యకార్యాలే ఉపయోగపడతాయి." ఇదే విషయాన్ని దైవప్రవక్త (స) ఇతర తమ కుటుంబ సభ్యులు, బంధువులతో కూడా చెప్పారు. విశ్వాసం, సత్కార్యాలే పరలోక విజయానికి సోపానాలు.

ఒకవేళ 'వసీలా' అనేది ఉంటే ఇబ్రాహీమ్ (అ) తన కన్న తండ్రిని నరకానికి ఆహుతి అవ్వనిచ్చేవారుకాదు. నూహ్(అ) తన కన్నకొడుకును నీటి వరదలో మునగ నిచ్చే వారే కాదు. వారిద్దరు వారిని నరకాగ్ని నుండి కాపాడుకునేవారు.

ఈ సందర్భంగా బనీ ఇస్రాయీల్‌లోని ముగ్గురు వ్యక్తుల గురించి మీకు వినిపించటం జరుగుతుంది. ఆ ముగ్గురు ఒక భయంకర ఆపదలో చిక్కుకుంటారు. అపుడు వారి ఆపదలనుండి ముక్తికి ఏ కార్యాలు వసీలాగా ఉపయోగపడ్డాయో తెలుసుకుందాం.

ఈ సంఘటన ద్వారా గుణపాఠం నేర్చుకునే అవకాశం, సద్బుద్ధిని అల్లాహ్ మనందరికి ప్రసాదించుగాక... ఆమీన్..

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా తెలిపారు. ముగ్గురు వ్యక్తులు బయటకు బయలుదేరారు. వర్షంలో చిక్కుకున్నారు. వెంటనే ఓ పర్వత గుహలో దూరారు. ఆ గుహ ముఖ ద్వారంలో ఒక పెద్ద బండరాయి వచ్చి పడింది. వెంటనే ఒకరినొకరు పరస్పరం ఇలా అనుకున్నారు. మీరు చేసిన ఉత్తమ సత్కార్యాలతో అల్లాహ్‌ను వేడుకోండి. వారిలోని మొదటి వ్యక్తి ఇలా వేడుకున్నాడు. ఓ అల్లాహ్ నాకు వృద్ధ తల్లిదండ్రులు ఉన్నారు. నేను మేకలు మేపటానికి వెళ్ళివాణ్ణి. తరువాత ఇంటికివచ్చి పాలు పితికే వాన్ని.

ఆ తరువాత పాల పాత్రను నా తల్లిదండ్రులకు ఇచ్చేవాడిని. వారిద్దరు త్రాగే వారు. మళ్ళీ నేను నా భార్యా పిల్లలకు పాలు త్రాగించేవాడిని, ఒకరోజు నేను ఇంటికి చేరేసరికి నా తల్లిదండ్రులిద్దరు నిద్రలోకి వెళ్ళారు. వారిని నిద్ర నుండి



లేపటం నాకు ఇష్టం లేదు. నా పిల్లలు ఆకలి కేకలతో నా కాళ్ళవద్దే ఊగుతున్నారు. ఇదే విధంగా ఈ నా స్థితి నా పిల్లల స్థితి తెల్లవారే వరకు సాగింది. ఓ అల్లాహ్ నీవే సరిగా ఎరుగుదువు. అయితే ఈ రాయిని గుహ నుండి తప్పించు. నేను నీ ప్రసన్నత కోసమే నీ పని చేశాను అయితే అది కొంత తప్పించబడింది. ఒక వ్యక్తి ఇలా అన్నారు. ఓ అల్లాహ్ నీవే సరిగ్గా ఎరుగుదువు. ఒక్క వ్యక్తి ఏదైనా స్త్రీని ఎంతగా ప్రేమిస్తాడో నాకు నా అంటే అంతే ఇష్టం, ప్రేమ నీవునాకు వంద దీనారు ఇచ్చినంతవరకు నేను నీ కోరిక తీర్చను. నేను ఆమెతో సంభోగిం చటానికి ప్రయత్నించాను. అల్లాహ్‌కు భయపడు అంది ఆమె. నేను ఆమెను వదిలివెళ్ళాను. ఓ దేవా! నీవే ఎరుగుదువు. నేను నీ ప్రసన్నత కోసమే ఈ పని చేశాను. ఈ ఆపద నుండి రక్షించు. రాయి ఒక వంతుభాగం తప్పించబడింది. ఇక మూడవ వ్యక్తి ఇలా వేడుకున్నాడు. ఓ దేవా నీవే సరిగ్గా ఎరుగుదువు. ఒక వ్యక్తిని కొన్ని సేర్ల గోధుమలపై పనిమనిషిగా నియమించుకున్నాను. అతను కూలి తీసుకోకుండా వెళ్ళిపోయాడు. నేను ఆ గొధుమలను నాటి వ్యవసాయం చేసి వాటితో గొర్రెలను కొన్నాను. చివరికి ఒక రోజు అతను తన కూలి వేతనం తీసుకువెళ్ళడానికి వచ్చి ఇలా అడిగాడు, ఓ దైవదాసుడా! నా సామాగ్రి నాకు ఇచ్చేయి. ఈ గొర్రెలు నీవే వాటిని తీసుకుని వెళ్ళు అని అతనికి చెప్పాను. అతను ఏమిటి, నాతో పరిహాసం చేస్తున్నావా అని అన్నాడు. దానికి నేను లేదు, నేను ఆ గొధుమలను నాటి వ్యవసాయం చేసి వాటిని కొన్నాను. వీటి యజమానివి నీవే నీ వెంట వీటిని తీసుకెళ్ళ అని బదులిచ్చాను. ఓ అల్లాహ్ నీవే ఎరుగుదువు ఈ పనిని నేను నీప్రసన్నత కోసమే చేస్తే ఈ ఆపద నుండి నన్ను రక్షించు. ఆ రాయి గృహం నుండి పూర్తిగా తొలగిపోతుంది. ఆ ముగ్గురు బయటికి వెళ్ళారు. (సహీహ్ బుఖారీ).

teluguislam.net



# 35. జనాజా నమాజ్ ఆదేశాలు

**మీరు అంతా అల్లాహ్ వైపుకు మరలింపబడే రోజుకు భయపడండి. ఆ తర్వాత ప్రతి ఒక్కరికీ తాను చేసుకున్న కర్మలకు పూర్తి ప్రతిఫలం నొసగ బడుతుంది. ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగదు. *(అల్ బఖర 2:281)***

**ధార్మిక సోదరులారా..!**

ఈ రోజు జుమా ప్రసంగంలో జనాజా నమాజ్ ఘనత, ఆదేశాల గురించి తెలుసుకుందాం. ఇది ఎలాంటి గమ్యం అంటే ఏదో ఒకరోజు పుట్టిన ప్రతి ఒక్కరూ ఈ గమ్యానికే చేరుకోవాలి. అల్లాహ్ కూడా ఆ దినం గురించే ఇలా భయపెడు తున్నాడు: మీరు తిరిగి అల్లాహ్ సమక్షానికి చేరుకోబోయే ఆ దినానికి భయపడండి. అప్పుడు ప్రతి వ్యక్తికి తన కర్మల ప్రతిఫలం ఇవ్వబడుతుంది. వారికెలాంటి అన్యాయం జరగదు. *(అల్ బఖర 2 : 287)*

**ప్రియసోదరులారా..**

జనాజా పూర్తిగా తయారయిన తర్వాత ఖనన విషయంలో ఎలాంటి ఆలస్యమూ చేయకూడదు. ఒకవేళ మంచి వ్యక్తి అయితే తన నివాసాన్ని చేరుకోవటంలో త్వరగా విజయం పొందుతాడు. ఒకవేళ చెడ్డవాడైతే అతని బరువును మోయటం నుండి మీ భుజాల త్వరగా బరువు తగ్గించుకుంటాయి. జనాజా వెంట వెళ్ళడంలోనే అధిక పుణ్యాలు ఉన్నాయి. అకారణంగా జనాజా కంటే ముందు వాహనం మీద వెళ్ళటం మంచిది కాదు. జనాజాను మోస్తూ వెంట వెంటనే వెళ్ళటం ఉత్తమం. దగ్గరగా ఉంటూ మూడు సార్లు మోస్తే అతని భాధ్యత పూర్తయినట్లే ఇక ఎన్ని సార్లు మోస్తే అన్ని పుణ్యాలు ఎక్కువగా లభిస్తాయి. జనాజా ఎవరిదైనా కూడా దాన్ని చూసి నిలబడటం ఉత్తమం. జనాజా నమాజ్ అయ్యేంత వరకు మృతుని వద్ద ఉండే వానికి ఉహద్ పర్వతం మాదిరిగా ఒక రాశి పుణ్యఫలం పొందుతారు. ఖనన సంస్కారం అయ్యేంత వరకు వేచి ఉన్న వానికి రెండు రాశుల పుణ్యఫలం



పొందుతారు. శవపేటికను నేలపై ఉంచే వరకూ ఎవరూ కూర్చోకూడదు.

దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: 40 మంది తౌహీద్ ఏకదైవారాధకులు, ఎవరి జనాజాలోనయినా పాల్గొని నమాజ్ పాటిస్తే ఆ మృతుడు క్షమించబడతాడు. అదే విధంగా ఎవరి జనాజాలోనయినా మూడు పంక్తుల సత్య విశ్వాసులు పాల్గొంటే అలాంటి మృతుడికి స్వర్గం ప్రవేశం తప్పక లభిస్తుందని దైవ ప్రవక్త (స) ప్రవచించారు.

జనాజా నమాజ్ చేయటం ముస్లింలపై తప్పనిసరి (వాజిబ్). ఒకవేళ మృతుడి ఖననం అయిన తరువాత చేరినవారు సమాధి వద్ద జనాజా నమాజ్ చేయవచ్చు ఒకవేళ పురుషుని జనాజా అయితే ఇమామ్ అతని తల భాగాన నిలబడి నమాజ్ పాటించాలి, ఒకవేళ స్త్రీ జనాజా అయితే నడుమ భాగంలో నిలబడాలి.

దైవప్రవక్త (స) బైజా గారి ఇద్దరు పుత్రుల జనాజా నమాజ్ మసీదులో చేయించారు. అంటే మసీదులో కూడా జనాజా నమాజ్ పాటించవచ్చు. లేదా మసీదు బయట కూడా ఎక్కడైనా శుభ్రమైన స్థలంలో చదవచ్చు.

మరో ప్రాంతంలో ఉన్నవారు ఎవరి మరణవార్త అయినా అందినట్లయితే వాళ్ళు ఆ రోజే గాయిబానా జనాజా నమాజ్‌ను అంటే పరోక్షంగా చేయవచ్చు.

ఆత్మహత్య చేసుకున్న వారి జనాజా నమాజును దైవప్రవక్త (స) చదివించేవారు కాదు. అదే విధంగా రుణగ్రస్తుని జనాజా నమాజ్ కూడా చేయించేవారు కాదు. ఎవరైనా ఆ రుణగ్రస్తుని రుణభార భాధ్యత తీసుకుంటే అపుడు జనాజా నమాజ్ చేయించేవారు.

అప్పు తీసుకున్న కారణంగా ముస్లిం మృతుని ఆత్మ మధ్యలోనే వేలాడుతూ ఉంటుంది. అప్పు తీర్చిన తరువాత అది పైకి వెళ్ళిపోతుందని దైవప్రవక్త (స) సెలవిచ్చారు.

స్త్రీలు బహిష్టు (హైజ్) స్థితిలో మరణించినా లేక పురిటిరక్త స్రావ (నిఫాస్) స్థితిలో మరణించినా లేక శిలాశిక్ష వల్ల మరణించినా – వారి జనాజా నమాజ్‌ను తప్పక చేయించాల్సిందే. అయితే యుద్ధంలో అమరగతి నొందిన వారి జనాజా నమాజ్ చేయించనవసరం లేదు. జనాజా నమాజులో 4 తక్బీర్లు ఉంటాయి. ఇందులో రుకూ, సజ్దాలు ఉండవు. మొదటి తక్బీరులో ఫాతిహ సూరహ్ దానితోపాటు మరేదైనా సూరా పఠించాలి. 2వ తక్బీరులో దరూద్, 3వ తక్బీరులో మృతుని

teluguislam.net



మన్నింపు వేడుకోలు చేయాలి. 4వ తక్బీరు పలికి సలాము చేయాలి. మృతుని సమీప బంధువు జనాజా నమాజ్ చదివించటం ఉత్తమం. లేదా మృతుని సమీప బంధువులు ఎవరినైనా నియమించుకోవచ్చు. ఒకవేళ ఏదైనా ప్రాంతంలో లేదా అడవిలో చాలా మృతదేహాలు లభిస్తే అందులో కొందరు ముస్లింలుగాను మరి కొందరు ముస్లిమేతరులుగా నిర్ధారణ అయితే ముస్లింల జనాజా నమాజ్ తప్పక పాటించాలి. ఒకవేళ మిగిలినవారు ముస్లిం లో కారో తెలియకుంటే అందరిని ముస్లింలుగా భావించి నమాజ్ పాటించాలి.

హ్రజత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: "మృతుని జనాజ నమాజ్ చేస్తున్నప్పుడు అతని కోసం మనస్పూర్తిగా దుఆ చేయండి. (సునన్ ఇబ్నెమాజా, సునన్ అబూదావూద్)

3వ తక్బీర్‌లో మృతుని కోసం ప్రత్యేకంగా మనస్పూర్తిగా ఇలా వేడుకోవాలి.

**اللَّهُمَّ اغْفِرْ لِحَيِّنَا وَمَيِّتِنَا، وَشَاهِدِنَا (2) وَغَائِبِنَا، وَصَغِيرِنَا وَكَبِيرِنَا، وَذَكَرِنَا وَأُنْثَانَا،**
**اللَّهُمَّ مَنْ أَحْيَيْتَهُ مِنَّا فَأَحْيِهِ عَلَى الْإِسْلَامِ، وَمَنْ تَوَفَّيْتَهُ مِنَّا فَتَوَفَّهُ عَلَى الْإِيمَانِ**

**అల్లాహుమ్మగ్ఫిర్ లిహయ్యినా వమయ్యితినా వషాహిదినా వగాయిబినా వసగీరినా వకబీరినా వజకరినా వ ఉన్‌సాన అల్లాహుమ్మ మన్ అహ్‌యైతహూ మిన్నా ఫఅహ్‌ఇహీ అలల్ ఇస్లామ్ వమన్ తవఫ్ఫైతహూ మిన్నా ఫతవఫ్ఫహు అలల్ ఈమాన్.**

కొందరు అనుచరులు (రజి) పిల్లల జనాజా నమాజ్‌లో ఇతర దుఆలను చేసి తరువాత ఈ దుఆ కూడా చేసేవారు.

**اللَّهُمَّ اجْعَلْهُ لَنَا فَرَطًا وَسَلَفًا وَأَجْرًا**

**"ఓ అల్లాహ్ ఈ పిల్లవాడిని మా కొరకు సాక్షిగా, ముందు వాడిగా పుణ్యఫలంగా చెయ్యి."**

హ్రజత్ అబూ హురైరా (రజి) చిన్నపిల్లల జనాజా నమాజ్‌లో ఇతర దుఆల తరువాత ఈ దుఆ కూడా చేసేవారు.

**"ఓ అల్లాహ్ ఇతన్ని సమాధి యాతల నుండి రక్షించు."**

ప్రతీ తక్బీర్ పలుకుతూ చేతులు ఎత్తటం (రఫ్ యదైన్ చేయటం) ఉత్తమం



నమాజ్‌ను ఖిరాత్‌తో బిగ్గరగా చదవటం ఉత్తమం ఖిరాత్ తో కాక మెల్లగా కూడా చదవవచ్చు. హ్రజత్ ఔఫ్ బిన్ మాలిక్ (రజి) ఇలా తెలిపారు: దైవప్రవక్త (స) ఒక అనుచరుని జనాజలో బిగ్గరగా అతని మన్నింపుకొరకు దుఆ చేశారు. అప్పుడు నేను బహుశా ఈ జనాజా నాదే అయితే ఎంత బాగుండునని అనుకున్నాను.

జనాజా పురుషులదైనా, స్త్రీలదైనా, లేదా పిల్లలదైనా అందరికి ఇవే దుఆలు చేయటం సహీహ్ హదీసుల ద్వారా రూఢీ అవుతుంది.

జనాజా నమాజ్ ముగిసిన తరువాత శవపేటిక వద్ద నిలబడి ఇతరత్రా సూరాలు పఠించటంగానీ, దుఆలు చేయటంగాని సరికాదు.

**గౌరవ సోదరులారా..!**

సూర్యాస్తమయ సమయంలోను సూర్యోదయ సమయంలోను, మిట్ట మధ్యాహ్న సమయంలోనూ జనాజా నమాజ్ చేయటం, ఖననం చేయటాన్ని తీవ్రంగా వారించబడింది. మిగతా సమయాల్లో ఎప్పుడైనా నమాజ్ పాటించవచ్చు. ఖనన సంస్కారాలు చేయవచ్చు పగటిపూట మృతుని ఖనన సంస్కారాలు చేయటం ఉత్తమం. అనివార్యమైతే రాత్రిపూట అంత్యక్రియలు జరపటంలో కూడా తప్పులేదు.

హ్రజత్ అబూ బకర్ సిద్దీఖ్ (రజి) ఖననం రాత్రివేళలోనే జరిగింది.

సమాధి వెడల్పుగా, లోతుగా, పరిశుభ్రంగా ఉండాలి. బగ్‌లీ సమాధి తవ్వటం, దైవప్రవక్త (స) సంప్రదాయం. సందూఖ్ పెట్టి ఆకార సమాధి కూడా తవ్వవచ్చు. కాని దైవప్రవక్త (స) బగ్‌లీ సమాధిలోనే ఖనన సంస్కారాలు చేశారు.

సమాధిలో జనాజా దించుతూ "బిస్మిల్లాహి వ అలామిల్లతి రసూలిల్లాహ్" (అల్లాహ్ పేరుతో, దైవప్రవక్త(స) సంప్రదాయ పద్ధతిపై దించుతున్నాం) అని పలుకాలి.

సమాధి పూడ్చిన తరువాత పైభాగాన్ని ఎత్తుగా గోపురం లాగా చేయకూడదు. ఒక జానెడు ఎత్తుకంటే ఎక్కువగా ఉండకూడదు. తరువాత కొన్ని నీళ్ళు చల్లాలి. ఆ తరువాత ముస్లిలందరూ కలసి అతని మన్నింపుకై సమాధిలో స్థిరత్వంకై వేడుకోవాలి. చాలా సేపు అతని మన్నింపు, వేడుకోలు స్థితిలోనే నిమగ్నమై ఉండాలి. ఎందుకంటే సమాధి మొదటి మజిలి. కఠినమైన మజిలి. సమాధిలో జరిగే ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇస్తేనే అతడు మిగతా భాగాల్లోనూ రక్షించబడతాడు, విజయం సాధిస్తాడు.

teluguislam.net



మొదటి గమ్యంలోనే అతడు విఫలమైతే ఇక నరకయాతన అనుభవించాల్సిందే. అల్లాహ్! మనందరిని సమాధి శిక్షల నుండి, నరకయాతనల నుండి రక్షించుగాక, సమాధిలో ప్రశ్నాపరీక్షల సమయంలో స్థిరత్వాన్ని నిలకడను ప్రసాదించుగాక ఆమీన్.

సమాధులపై గోరీలు భవనాలు, ఇల్లు నిర్మంచటం, వాటిపై దీపాలు, జ్యోతులు, అగరఒత్తులు, కొవ్వత్తులు వెలిగించటం, పూలు, పుష్పాలు పెట్టడం, వాటితో అలంకరించటం ఇత్యాదీ విషయాలన్ని నిషిద్ధం (హరాం). సమాధి వద్ద కూర్చొని ఖుర్ఆన్ మజీద్ పారాయణం చేయటం, చేయించటం సమాధిపై మృతుని పేరు, జనన మరణ తేదీలు రాయటం, ఫలకాలు, బోర్డులు తలిగించటం వంటి పనులన్నీ అవాంఛనీయం.

వీటన్నింటినీ ప్రియ ప్రవక్త (స) ఖండించారు. నిషిద్ధమైనవిగా ప్రకటించారు. కాబట్టి ఇస్లామీయ షరీఅత్ లో ఇలాంటి కొత్తపనులకు, షైతాన్ పనులకు ఎలాంటి తావు లేదు. ఎలాంటి సంబంధమూ లేదు. ఇలాంటి కార్యాల్లో చిక్కుకున్న వారు వెంటనే అల్లాహ్‌తో పశ్చాత్తాపంలో క్షమాభిక్ష వేడుకుని దైవప్రవక్త విధానం వైపుకు మరలుతూ వాటన్నింటినీ విస్మరించాలి విడనాడాలి.

సమాధి వైపు తిరిగి నమాజ్ పాటించడాన్ని దైవప్రవక్త (స) తీవ్రంగా ఖండించారు. సమాధిపై కూర్చోవటం, అగ్నిపై కూర్చోవటంతో సమానమని హెచ్చరించారు. సమాధి తల భాగాన ఏదైనా చిన్నరాయి. బండని గుర్తుగా ఉంచటం సున్నత్, పుణ్యాత్ముల, మంచివారి దగ్గర మృతుణ్ణి ఖననం చేయటం ఉత్తమం.

పరస్త్రీ జనాజాను పరపురుషుడు సమాధిలో దించవచ్చు. అయితే ఆ మృతురాలి భర్తగానీ, తండ్రిగానీ అక్కడ ఉన్నప్పుడే ఇలా చేయాలి.

మృతుని కుటుంబీకులు, బంధువులు శోకంతో విలపిస్తూ ఉంటారు కాబట్టి ఇరుగు పొరుగువారు వారికి ఆహార భోజన ఏర్పాట్లు చేసి వారికి తినిపించాలని దైవప్రవక్త (స) తాకీదు చేశారు.

మృతులు చెప్పుల సవ్వడి కూడా వింటాయని దైవప్రవక్త (స) సెలవిచ్చారు. మృతుణ్ణి సమాధి చేసి తిరిగి వెళ్తున్నపుడు వచ్చే పాదరక్షల చప్పుడును మృతులు వింటారు. ఆ సమయంలో ఆత్మ అతని దేహంలో వేయబడుతుంది. కూర్చోబెట్టి



అతన్ని ప్రశ్నించటం జరుగుతుంది. ఆ తరువాత ఆ ఆత్మను దాని బర్‌జఖ్ అవస్థలోని నివాసంలో చేర్చబడుతుంది. ప్రళయం వరకు కూడా ఇక ఆ మృతుడు వినలేడు. పాదరక్షలు ధరించి స్మశానవాటిక (ఖబరస్తాన్) వెళ్ళటంలో ఎలాంటి అభ్యంతరం లేదని మనకు ఈ హదీసు ద్వారా తెలుస్తుంది. మంచి వ్యక్తి దైవదూతల ప్రశ్నలన్నింటికి సరైన సమాధానం ఇస్తాడు. అపుడు అతనికి నరకం చూపించబడుతుంది. చూడూ అల్లాహ్ నీకు ఆ నరకానికి బదులుగా స్వర్గాన్ని అనుగ్రహించాడు. తరువాత స్వర్గం చూపించబడుతుంది. దాన్ని చూస్తూనే ఉండిపోతాడు.

అదేవిధంగా చెడ్డవ్యక్తికి మొదట స్వర్గం చూపించబడుతుంది. తరువాత వారు వారికోసం వాగ్దానం చేయబడిన శాశ్వత నరకంలో నెట్టివేయబతారు. నరకశిక్షలను అనుభవిస్తూ ఉంటారు.

సమాధులపై పూలు పెట్టడం, చాదర్లు సమర్పించటం, రొట్టెలు మిఠాయిలు తీయ్యని తినుబండరాలు పెట్టడం, పంచడం వంటివి బిద్అత్ (క్రొత్త పనులు) మృతుని ప్రయోజనార్థమని అజాన్ ఇవ్వటం 40 అడుగుల దూరం నుండి దుఆ చేయటం వంటి పనులన్ని బిద్అత్ (కొత్త) పనులే. కొన్ని ప్రాంతాల్లో సమాధి చేసే ముందు ఖబరస్తాన్ లో మిఠాయిలు, డబ్బులు, వడ్లు పంచుతారు. లేదా షర్బత్ వంటి చల్లని పానీయాలు త్రాగిస్తారు. ఇలాంటి అధర్మ కార్యాలనుండి, బిద్అత్ పనుల నుండి బహు దూరంగా ఉండటం తప్పనిసరి.

**పెద్దలారా, మిత్రులారా..!**

సమాధుల సందర్శన గురించి దైవప్రవక్త (స) ఇలా బోధించారు: మొదట నేను సమాధుల సందర్శనను వారించాను. కాని ఇపుడు అనుమతిస్తున్నాను. సమాధుల సందర్శన వలన పరలోక భీతి, చింతన కలుగుతుంది. ప్రపంచ వ్యామోహం తగ్గుతుంది. దైవప్రవక్త (స) పరలోకచింతనను తాజా చేసుకోవటం కోసం, మృత్యువుని తలచుకొని పరలోక ఏర్పాట్లు చేసుకోవటం కోసం మాత్రమే అనుమతించారు. ఇలాంటి పరిస్థితి, చింతన కూడా మామూలు సమాధుల వల్లే కలుగుతుంది. కాని ఈ రోజుల్లో మనం దర్గాలుగా, మజార్లులుగా చెప్పుకునే సమాధుల వలన ఆ చింతన, భీతి కలిగే ప్రసక్తే లేదు. ఎందుకంటే మసీదుల కంటే కూడా ఎక్కువగా అందంగా అద్భుతంగా కళాత్మకంగా, నిర్మాణాత్మకంగా నేడు సమాధుల నిర్మాణాలు జరుగుతున్నాయి.

teluguislam.net



పెద్దపెద్ద భవనాలు, గోపురాలు, రంగురంగుల చాదర్లు, జెండాలు మొదలుగనవి ఉన్న వాటిని సందర్శించటంలో అర్థం లేదు.

దూరదూర ప్రాంతాల నుండి ప్రత్యేకంగా సమాధుల సందర్శన కోసమే ప్రయాణం చేయటం వాటికి చాదర్లు సమర్పించటం, మొక్కుబడులు, వేడుకోలు చేయటం, వసీలాగా భావించటం – ఇలాంటివన్నీ ఈ రోజుల్లో సర్వసాధారణంగా జరుగుతున్నాయి. దైవప్రవక్త (స) బోధనలు ఎంతవరకు అమలులో ఉన్నాయో ఆలోచించాలి మరి?

దైవప్రవక్త (స) సమాధుల సందర్శన పద్ధతిని గురించి ఇలా తెలిపారు: మీరు సమాధుల వద్దకు వెళ్ళినపుడు ఇలా పలకండి.

ఓ ముస్లిం, విశ్వాసుల ఇంటివారాలారా! మీపై శాంతి కలుగుగాక! మేము మిమ్మల్ని కలువనున్నాము ఇన్షా అల్లాహ్ మేము మాకోసం, మీ కోసం అల్లాహ్‌ను మేలును అభ్యర్థిస్తున్నాము.

ఖబర్‌స్తాన్‌లో ఉన్నంతవరకు వారి మన్నింపుకు క్షమాభిక్ష వేడుకుంటూ ఉండాలి.

నేను కూడా ఇక్కడికి చేరేవాణ్ణే అని తన మృత్యువును స్మరించుకోవాలి. స్త్రీలు వెళ్ళినా కూడా ఇలానే చేయాలి.

ధార్మిక జ్ఞానం లేని కొందరు స్త్రీలు దైవప్రవక్త (స) విధానానికి వ్యతిరేకంగా శోకం పాటిస్తారు. బోరున ఏడుస్తారు. ఇలాంటి పనులతో సమాధులను దర్శించేవారిని దైవప్రవక్త (స) నిషేధించారు. అలాంటి స్త్రీలకు అనుమతివ్వటం మంచిదికాదు. కాబాగృహం, మస్జిదె నబవీ, బైతుల్ మఖ్దిస్ తప్ప మిగతవాటన్నింటిని సందర్శనార్థం ప్రయాణం చేయటాన్ని ఆయన (స) వారించారు. మదీనా నగరం వెళ్ళిన వారు దైవప్రవక్త (స) సమాధిని, ఆయన సూచించిన విధంగా సందర్శించవచ్చు.

దైవప్రవక్త (స) తన జీవితపు చరమ దశలో ఇలా సెలవిచ్చారు: "యూదులపై, క్రైస్తవులపై అల్లాహ్ శాపం పడుగాక! వాళ్ళు తమ ప్రవక్తల సమాధులను సాష్టాంగ ప్రణామ (సజ్దా) స్థలాలుగా చేసుకున్నారు. జాగ్రత్త! మీరు మాత్రం సమాధులను 'సజ్దా' స్థలాలుగా చేసుకోరాదు సుమా! అలాంటి చేష్ట నుండి నేను మిమ్మల్ని వారిస్తున్నాను."



"ఓ అల్లాహ్! నా సమాధిని పూజా స్థలంగా చేయకు" అని దైవప్రవక్త (స) దుఆ చేశారు.

తమ ఇమాములు, పెద్దల సమాధులను మసీదులుగా చేసుకున్నవారి గురించి అల్లాహ్ హెచ్చరిక వచ్చింది. ఆయన (స) దుఆను అల్లాహ్ ఆమోదించాడు. ఆయన సమాధి విగ్రహ స్థలంగా మారకుండా అల్లాహ్ కాపాడాడు.

**మహాశయులారా..!**

చివర్లో ఒక హదీసు వినిపిస్తున్నాను. శ్రద్ధగా వినండి. అబ్దుర్రహ్మాన్ బిన్ కాబ్ (రజి) తన తండ్రి ద్వారా ఉల్లేఖించారు వారు ఇలా అంటుండేవారు.

విశ్వాసి ప్రాణం ఒక పక్షి లాంటిది. అది స్వర్గంలోని వృక్షంపై ఉంటుంది. చివరకు ప్రళయదినాన దానిని దాని శరీరంలోకి అల్లాహ్ పంపిస్తాడు.

teluguislam.net



# 36. దైవప్రవక్త (స) మరణం

**ధార్మిక సోదరులారా..!**

ఈ రోజు ప్రసంగం దైవప్రవక్త (స) మరణం గురించి. దైవప్రవక్త (స) మరణానికి 6 నెలల ముందు నస్ర్ సూరా అవతరించింది. ఈ సూరాలో దైవప్రవక్త (స) ప్రపంచాన్ని వీడి వెళ్తారన్న విషయం తెలుపబడింది. చివరి రమజాన్ హిజ్రీ శకం 10వ యేట దైవప్రవక్త (స) ఇరవై రోజులు ఏతెకాఫ్ వ్రతం పాటించారు. అంతకుముందు దైవప్రవక్త (స) 10 రోజులు మాత్రమే. అంటే ప్రతి రమజాన్‌లో చివరి పది రోజులు మాత్రమే ఏతికాప్ పాటించేవారు. ఆయన (స) తమ ప్రియ పుత్రిక ఫాతిమా (రజి.అన్హా) తో కూడా తమ మరణం గురించి చెప్పారు. వీడ్కోలు హజ్జ్‌లో కూడా చివరి ప్రసంగంలో ఇలా నేను మీ నుండి దూరం కాబోతున్నానని సూచనాప్రాయంగా తెలిపారు. హిజ్రీ శకం 11వ యేట సఫర్ మాసం నుండి పరలోక ప్రయాణానికి ఏర్పాట్లు ప్రారంభం చేశారు. ఒక రోజు ఉహద్ పర్వతంపైకి ఎక్కి ఉహద్ అమరవీరుల కొరకు దుఆ చేశారు. తరువాత అక్కడి నుండి మస్జిదె నబవీలో సహాబాలందర్ని సమావేశపరచి మెంబర్‌పై ఎక్కి ఇలా సెలవిచ్చారు: "విశ్వాసులారా! నేను మీకంటే ముందే వెళ్ళనున్నాను. అల్లాహ్ సమక్షంలో మీ ఇస్లాం, విశ్వాసం, నమ్మకం, అమరగతి గురించి సాక్ష్యమిస్తాను.

దైవసాక్షి! కౌసర్‌ను నేను ఇక్కడి నుండి చూస్తున్నాను. నాకు ప్రపంచ రాజ్యాల నిధుల తాళపుచెవులు ఇవ్వబడ్డాయి. నా తరువాత మీరు అల్లాహ్‌కు సాటి కల్పిస్తారనే భయం నాకులేదు. కాని పరస్పరం ఒకరిని మించి ఒకరు వెళ్ళే ప్రయత్నం తప్పకుండా చేస్తారనే భయం ఉంది."

అర్ధరాత్రి బఖీఉల్ గర్ఖద్ కబరస్తాన్‌కు వెళ్ళి అక్కడి మృతుల క్షమాపణ కొరకు వేడుకొని "మేము మిమ్మల్ని త్వరలో కలువబోతున్నాము." అనే శుభవార్త వాళ్ళకి వినిపించారు. ఆ మరుసటి రోజు ముస్లింలందర్ని సమావేశ పరచి, దైవ సందేశం వినిపించి హితబోధ చేశారు ఆ తరువాత ఇలా దుఆ చేశారు: ముస్లింలారా!



అల్లాహ్ మిమ్మల్ని తన కారుణ్యంతో కాపాడుగాక! మీ బాధలను, ఆందోళనలను కష్టాలను దూరం చేయు గాక!! మీకు పుష్కలంగా జీవనోపాధిని వొసగుగాక!!! మీకు సమృద్ధిని అభివృద్ధిని ప్రసాదించి తన రక్షణలో శాంతి అనుగ్రహించుగాక అల్లాహ్ పట్ల దైవభీతిపరులుగా ఉండాలని నేను వసియ్యత్ చేస్తున్నాను. అల్లాహ్ మిమ్మల్ని భూప్రతినిధులుగా చేశాడు. ఆయనకే భయపడుతూ ఉండండి. ఎందుకంటే నేను స్పష్టంగా భయపెట్టేవాడిని.

**ముస్లింలారా..!**

అల్లాహ్ భూమిలో అరాచకం సృష్టించవద్దు. ఆయన దాసులలో ఎవరిపై కూడా ఆధిక్యతను చాటకండి. అహంకారాన్ని, గర్వాన్ని విడనాడండి. అల్లాహ్ మీకు, నాకు ఆదేశించిన ఆ దినాన్ని జ్ఞాపకముంచుకోండి.

**"ఆ పరలోక జీవితపు గృహాన్ని మేము భూమిలో పెద్దరికం చూపగోరని వారి కొరకు, కల్లోలం రేకెత్తించని వారి కొరకు ప్రత్యేకిస్తాము. మరియు దైవభీతి గలవారికే మేలైన పర్యవసానం ఉంటుంది."**

***(అల్ ఖసస్ 28 : 83)***

ఆ తరువాత ఈ ఆయత్ పఠించారు:

**"ఏమి? ఈ గర్విష్ఠుల నివాసం నరకంలోనే ఉండదా?**

***(అల్ హుజురాత్ 39 : 60)***

చివర్లో ఇలా ప్రవచించారు: "ఓ ముస్లింలారా! మీ అందరిపై శాంతి కురియు గాక, ప్రళయం వరకు వచ్చే ప్రపంచ ముస్లింలందరూ ఇస్లాం స్వీకరించి వచ్చే వారందరు కూడా ఈ శాంతిలో చేరుతారు.

**ధార్మిక సోదరులారా..!**

సఫర్ నెల 29వ తేదీ సోమవారం ఆయనకు తీవ్ర జ్వరం వచ్చింది. అబూ సయీద్ ఖుద్రీ (రజి) కథనం: ఆయన (స) తన నుదుటిపై ఒక రుమాలును పెట్టుకొని ఉన్నారు. నేను దానిపై చేయి వేసి చూస్తే వేడి ఎంత తీవ్రంగా ఉందంటే నా చేయి వేడికి తట్టుకోలేకపోయింది. అంత తీవ్ర వేడికి నేను అయోమయంగా చూస్తే దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ప్రవక్తల కంటే ఎక్కువ ఎవరికీ ఉండదు. అందుకే వారి పుణ్యఫలం కూడా అందరికంటే అత్యధికంగా ఉంటుంది. వ్యాధి

గ్రస్తులుగానే 11 రోజులు ఆయన మస్జిద్‌కు వచ్చి నమాజ్‌కు నాయకత్వం వహించే వారు.

చివరి వారం హజ్రత్ ఆయిషా (రజి) ఇంటిలో గడిచింది. ఆ చివరి ఘడియల్లో ఆయన (సఅసం) ఎక్కువగా ఈ వచనాలనే స్మరిస్తూ ఉండేవారు.

اللّٰهُمَّ اغْفِرْ لِي وَارْحَمْنِي وَأَلْحِقْنِي بِالرَّفِيقِ الأَعْلَى

**ఓ అల్లాహ్! నన్ను మన్నించు మహోన్నతుడైన నేస్తంతో నన్ను కలుపు".**

మరణానికి ఐదు రోజుల ముందు బుధవారం నాడు 7 బావుల నీళ్ళను 7 నీళ్ళ తిత్తులతో తమ తల మీద నుండి పోయించుకున్నారు. ఆ నీళ్ళ చల్లదనంతో కాస్త కుదుటపడి ఇలా సెలవిచ్చారు. "ఓ ముస్లింలారా! మీకు పూర్వం గతించిన ఒక జాతి వారు తమ ప్రవక్తల, పుణ్యపురుషుల సమాధులను ప్రార్థనా మందిరాలుగా చేసుకున్నది. జాగ్రత్త! మీరు మాత్రం అలా చేయవద్దు"

ఆ తరువాత ఇలా అన్నారు

**لَعَنَ اللهُ الْيَهُودَ وَالنَّصَارَى اتَّخَذُوا قُبُورَ أَنْبِيَائِهِمْ مَسْجِدًا قَالَتْ**
**وَلَوْلَا ذَلِكَ لَأَبْرَزُوا قَبْرَهُ غَيْرَ أَنِّي أَخْشَى أَنْ يُتَّخَذَ مَسْجِدًا**

**(యూదులు, క్రైస్తవులపై అల్లాహ్ శాపం పడుగాక! వాళ్లు తమ ప్రవక్తల సమాధులను సజ్దా - సాష్టాంగ ప్రణామ - స్థలాలుగా చేసుకున్నారు. ఓ అల్లాహ్! నా సమాధిని ప్రజలు పూజా పునస్కారాలు చేసే విగ్రహంగా చేయకు."**

**నాప్రియ అనుచరులారా..!**

నేను మీకు స్పష్టంగా సందేశాన్ని అందజేశాను. ఆ తరువాత తమ వేలును ఆకాశం వైపుకు సైగ చేస్తూ 'ఓ అల్లాహ్ నీవే సాక్షివి' అన్నారు.

ఆతరువాత నమాజ్ చేయించారు. తరువాత మెంబర్ ఎక్కి అల్లాహ్ స్తోత్రం తరువాత ఇలా ఉపదేశించారు: నేను మీకు అన్సార్‌ల విషయంలో ఈ హితవు చేస్తున్నాను - వారు నా దేహానికి కవచంలా, జీవన సామగ్రిలా నాకు అండగా నిలిచారు. వారిపై గల భాధ్యతలన్నింటిని వారు నెరవేర్చారు. ఇక వారిపట్ల మీ బాధ్యతలున్నాయి. వారిలో సత్కార్యాలు చేసేవారిని గౌరవించండి. పొరపాట్లు దొర్లితే ఉపేక్షించండి."

teluguislam.net



ఆ తరువాత ఇలా అన్నారు:

ఒక దాసుని ముందు ప్రపంచం దానిలో ఉన్న సమస్తాన్ని సమర్పించటం జరిగింది. కాని ఆ దాసుడు వాటి నుండి ముఖం త్రిప్పుకుని పరలోకాన్ని ఎన్నుకున్నాడు. ఈ సూచనను అబూ బకర్ సిద్దీఖ్ (రజి) అర్థం చేసుకొని వెంటనే, "మా తల్లిదండ్రులు, మా ప్రాణాలు, సర్వస్వం మీపై సమర్పితం" అని పలికారు. మెంబర్ పై నుండి ఇదే దైవప్రవక్త (స) చివరి ప్రసంగం.

గురువారం వ్యాధి మరింత ముదిరింది. ఆ రోజు దైవప్రవక్త (స) మూడు విషయాలను గురించి వసియ్యత్ చేశారు. 1.యూదులను అరబ్బు భూభాగం నుంచి వెళ్ళగొట్టాలి. 2. బృందాల రూపంలో వచ్చే అతిథులను నేను ఏ విధంగా గౌరవించి, సత్కరించేవాడినో ఆ విధంగానే మీరూ చేయాలి. 3. పవిత్ర ఖుర్‌ఆన్ గ్రంథాన్ని వారసత్వంగా మీకు ఇచ్చివెళుతున్నాను. దాని ప్రకారం ఆచరించినంత కాలం మీరు మార్గభ్రష్టులుకారు. ఖుర్‌ఆన్ తరువాత నా హదీసు (ఆచరనలు, సున్నత్) పై ఆచరించటం మీపై విధిగా ఉంది."

గురువారం మగ్రిబ్ నమాజ్ వరకు ఆయనే నమాజ్‌కు నాయకత్వం వహించారు. ఇషా నమాజ్ కొరకు మూడు సార్లు వుజూ (చేసుకోవటానికి) కై కూర్చుంటే స్పృహతప్పిపడిపోయేవారు. చివరికి అబూబకర్ (రజి) నమాజ్ చేయిం చాల్సిందిగా ఆదేశించారు. ఆ ఆదేశం మేరకు దైవప్రవక్త (స) జీవిత కాలంలో 17 సార్లు అబూ బకర్ సిద్దీఖ్ (రజి) నమాజ్‌కు నాయకత్వం వహించారు.

**ప్రియ సోదరులారా..!**

సర్వలోకాలకు కారుణ్యజ్యోతి అత్యంత ప్రియతమ నాయకుడు, ప్రవక్త (స) ఇహలోకాన్ని వీడి పరలోకం చేరుకునే సూచనలు స్పష్టంగా గోచరిస్తున్నాయి. మదీనా వాతావరణమంత బాధాతప్త మేఘాలు అలముకున్నాయి. ఆ చివరికి ఆదివారం వచ్చేసింది ఆ రోజు వరకు బానిసలందరికి స్వేచ్ఛ ప్రసాదించారు. ఆ సమయంలో ఇంట్లో 7 దీనార్లు మాత్రమే ఉన్నాయి. వాటిని దానం చేశారు. ఉన్న ఆయుధా లన్నింటినీ ముస్లిలంలకు ఇచ్చేశారు. ఒక యూదుని దగ్గర 30 సాల జొన్నలకు బదులుగా తీసుకున్న కవచం ఒకటి మాత్రం మిగిలిపోయింది. ఆ రోజు రాత్రి హజ్రత్ ఆయిషా (రజి) పొరుగు ఇంటి వారి నుండి నూనె అరువుగా తీసుకు వచ్చి

teluguislam.net



దీపం వెలిగించింది. సోమవారం రోజు ఫజర్ నమాజ్ వేళ ఇంట్లో నుంచే దైవప్రవక్త (సఅసం) తెరను ఎత్తి మస్జిద్‌లోకి చూశారు. ఆ సమయంలో తన అనుయాయులు సామూహిక నమాజ్‌లో లీనమై ఉంటం గమనించి తృప్తిగా నిట్టూర్చారు. ఆయన (స) పెదాలపై చిరునవ్వు తొణికసలాడింది. ఆ తరువాత ఆయనకు మరో నమాజ్‌ను పొందే అవకాశం రాలేదు. కాస్త పొద్దెక్కగానే ముద్దుల పుత్రిక ఫాతిమా (ర.అన్హా)ను పిలిపించి ఓదార్చారు. ముద్దుల మనవళ్ళను ముద్దాడారు. వారిని ఆదరించాలని తాకీదు చేశారు. తరువాత హజ్రత్ అలీ (రజి)ని పిలిచి ఆప్యాయంగా చూశారు. హిత బోధలు చేశారు. ఆ తరువాత సతీమణులను దగ్గరకు పిలిచించి ఉపదేశించారు. ఆ సమయంలో ఆయన (స) పలికిన మాటలు గమనించదగినవి: – "నమాజులను కాపాడండి. భార్యల పట్ల మంచిగా మెలగండి. బానిసలు, బానిసరాళ్ల పట్ల ఉత్తమంగా వ్యవహరించండి." ముస్లింల మనోమస్తిష్కాలు పని చేయడం ఆగిపోయాయి ప్రతి ముస్లింకు ఏమి పాలుపోవటంలేదు. ఏదో బాధ, ఆందోళన, విచారం. హజ్రత్ ఉమర్ (రజి) కు దైవప్రవక్త (స) మరణంపై నమ్మశక్యం కావటం లేదు. అబూ బకర్ సిద్దీఖ్ (రజి)కు నమ్మకం కుదరటం లేదు. అబూ బకర్ సిద్దీఖ్ (రజి) దైవప్రవక్త (స) నుదుటిని ముద్దాడి కన్నీళ్ళతో ప్రవక్త నా తల్లిదండ్రుల్ని మీకు అర్పించుగాక! అల్లాహ్ సాక్షిగా అల్లాహ్ మీకు రెండు మృత్యువులు లిఖించలేదు. మీకు ఒకే మృత్యువు లిఖించాడు అని పలికి మస్జిదె నబవీలోకి వచ్చి దైవప్రవక్త(స) మరణించారని ఇలా తమ ప్రసంగాన్ని ప్రకటిస్తూ కొనసాగించారు.

"మీలో ఎవరైతే ముహమ్మద్ (స)ను ఆరాధించారో నిశ్చయంగా ముహమ్మద్ (స) చనిపోయారు. మీలో మరెవ్వరైతే అల్లాహ్‌ను ఆరాధించారో నిశ్చయంగా అల్లాహ్ సజీవంగా ఉన్నాడు. అతనికి మరణంలేదు.

**సోదరులారా..!**

చివరికి ముస్లింలు సంయమనంతో, గుండె బరువు చేసుకుని తమప్రియ ప్రవక్త (స) ఖననానికి ఏర్పాటు చేయసాగారు. ఆమన(స) ధరించిఉన్న దుస్తుల్లోనే గుసుల్ చేయించారు. కఫన్‌లో చుట్టబడిన తరువాత ఆయన మృతదేహాన్ని గదిలో ఉంచారు. పదిమంది చొప్పున ఒక్కో బృందం గదిలోకి వెళ్ళి నమాజె జనాజా చదివి బయటకు వచ్చేవారు. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (స) జనాజా గదిలో ఒక బల్లపై ఉంచబడింది. ప్రజలు సామూహికంగా వెళ్ళి ఒకరి



తరువాత ఒకరు నమాజ్ ముగించుకొని బయటికి వచ్చేవారు. పురుషుల తరువాత స్త్రీలకు ఆ అవకాశం లభించింది. చివర్లో పిల్లలకు కూడా లోపలివెళ్ళి చూసివచ్చే అనుమతి ఇవ్వబడింది (సునన్ ఇబ్నెమాజా)

ఎవరూ జనాజా నమాజ్‌కు నాయకత్వం వహించలేదు. ప్రజలు భక్తితో వెళ్ళి బయట వచ్చేవారు. ఖననం బుధవారం రోజు దాదాపు 32 గంటల దరూద్ పంపి, మన్నింపు కొరకు వేడుకుని తరువాత ఆమలులోకి వచ్చింది. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్.

ఏ స్థలంలో ఖననం చేశారో ఆ స్థలం హజ్రత్ ఆయిషా (రజి) గారి కుటీరం. దైవ ప్రవక్తల ఆత్మ ఎక్కడ తీసుకోబడుతుందో ఆ స్థలంలోనే ఖననం చేయాలని ముందుగానే ఆజ్ఞాపించబడింది. అందుకే ఆ గదిలోనే దైవప్రవక్త (స) ఖననం జరిగింది. ఆ గదిని తరువాత కాలంలో గుమ్మదె ఖుజరా రూపంలో నిర్మించబడింది. దాని లోపలి భాగంలో దైవప్రవక్త (స), ఆయన ఇద్దరు సహచరులు హజ్రత్ అబూ బకర్ హజ్రత్ ఉమర్ సమాధులు అసలు రూపంలో భద్రంగా ఉన్నాయి. ఎలాంటి భద్రత ఉందంటే అక్కడికి ఏవ్వరూ వెళ్ళలేరు.

**మిత్రులారా!**

మరణం, మృత్యువు ఎలాంటి వస్తువంటే దాని నుండి ప్రవక్తలు, దైవ సందేశ హరులు ఎవరు తప్పించుకోలేరు. ప్రపంచమే శాశ్వత జీవితం అయితే దైవప్రవక్త (స) శాశ్వతంగా ప్రపంచంలోనే ఉండేవారు.

దైవప్రవక్త (స) దరూద్ పఠించుదాం. ఆయనే సూచించిన అడుగుజాడల్లో ఆచరిద్దాం...

teluguislam.net



# 37. ఖుర్ఆన్ సందేశం

ప్రియసోదరులారా..!

ఖుర్ఆన్ మజీద్ లోని ఒక్కొక్క పదం కూడా సన్మార్గ ఖజానా. ఖుత్బాలో పఠించిన సూరా ఖాఫ్ కూడా ఇస్లాం మౌలికాంశాలు, విశ్వాసాల దృష్ట్యా అతి ముఖ్యమైనది. ఇస్లాంలో ప్రాధమిక మౌలికాంశాలు పునాదుల్లాంటివి. వాటిగురించి స్పష్టమైన ఆధారాలతో, నిదర్శనాలతో ఈ సూరాలో తెలుపబడ్డాయి. హజ్రత్ వాఖిద్ లైసీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) పండుగ నమాజుల్లో సూరా ఖాఫ్ పఠించేవారు. హజ్రత్ ఉమ్మెహిషామ్ బిన్తె హారిస (రజి) కథనం: "దైవప్రవక్త (స) తోపాటు ఉండే అదృష్టం నాకు కలిగింది. ఆయన (స) ఎంత ఎక్కువగా ఖాఫ్ సూరాను పఠిస్తూ ఉండేవారంటే ఆయన (స) నోట వింటూ వింటూ నాకు ఈ సూరా కంఠస్థం అయిపోయింది. ప్రతి జుమా (శుక్రవారం)రోజు ప్రసంగం ఇవ్వటానికి ఉపక్ర మించినప్పుడు సూరె ఖాఫ్ పఠిస్తూ ఉండేవారు."

అల్లాహ్ ఎన్ని అంశాలనైతే ఈ సూరాలో వివరంగా ప్రస్తావించాడో వాటిన్నింటినీ జుమా ఖుత్బాలో చెప్పాలంటే చాలా సమయం అవసరం కాబట్టి ఈ సూరాలో ప్రారంభ ఆయతుల్లో తెలుపబడిన అంశాల గురించి ఈనాటి ఖుత్బాలో మీకు తెలుపుతాను. ఆ అంశమే ప్రళయదినం మరణాంతరజీవితం.

కాబట్టి అల్లాహ్ సెలవిస్తున్నాడు:

ఖాఫ్ దివ్యమైన ఈ ఖుర్ఆన్ సాక్షిగా, అలాకాదు, హెచ్చరిక చేసేవాడు, వారి వద్దకు వారిలో నుంచే వచ్చాడనే విషయం వారికి ఆశ్చర్యం కలిగించింది. కావున సత్యతిరస్కారులు ఇలా అన్నారు:

ఇది చాలా ఆశ్చర్యకరమైన విషయం. మేము మరణించి మట్టిగా మారి పోయినా మరల బ్రతికించబడతామా? ఈ విధంగా మరల సజీవమై రావటం చాలా అసంభవమైన విషయం! వాస్తవానికి వారి శరీరాలలో నుండి భూమి దేనిని తగ్గిస్తుందో మాకు బాగా తెలుసు. మా దగ్గర అంతా ఒక సురక్షితమైన గ్రంథంలో



వ్రాయబడి ఉంది. కానివారు, సత్యం వారివద్దకు వచ్చినపుడు దానిని అసత్యమని తిరస్కరించారు. కాబట్టి వారు ఈ విషయం గురించి అయోమయంలో పడి ఉన్నారు. (ఖాఫ్ 50 : 1-5)

**ఆ తరువాత అల్లాహ్ పూర్వం గతించిన జాతుల గురించి ప్రస్తావించాడు: "వారికి పూర్వం నూహ్ జాతి వారు, రస్ వారు, సమూద్ జాతి వారు కూడా సత్యాన్ని తిరస్కరించారు. మరియు ఆద్‌జాతి వారు, ఫిరౌన్ జాతివారు మరియు లూత్ సహోదరులు కూడా. మరియు అయ్‌కహ్ వన వాసులు, తుబ్బ జాతివారు కూడాను. ప్రతి ఒక్కరూ తమ ప్రవక్తలను అసత్యవాదులని తిరస్కరించారు. కావున నా బెదిరింపు వారి విషయంలో సత్యమయింది.** ***(ఖాఫ్ 50 : 12-14)***

పునరుత్థాన దినం గురించి, పూర్వ జాతుల గురించి తెలిపిన తరువాత అల్లాహ్ మానవున్ని ఇలా హెచ్చరిస్తున్నాడు. దివ్య ఖుర్ఆన్ లో ఇలా సెలవిస్తున్నాడు.

**"వాస్తవంగా మేమే మానవుణ్ణి సృష్టించాము. మరియు అతని మనస్సులో మెదిలే ఊహలను కూడా మేము ఎరుగుతాము. మరియు మేము అతనికి అతని కంఠరక్తనాళం కంటే కూడా అతి దగ్గరగా ఉన్నాము. జ్ఞాపకముంచు కోండి-అతని కుడి ఎడమ ప్రక్కలతో కూర్చుండి ప్రతి విషయాన్ని వ్రాసే ఇద్దరు పర్యవేక్షకులు దైవదూతలు అతనిని కలుసుకున్న తరువాత నుంచి అతనితోబాటు ఒక పర్యవేక్షకుడైనా సిద్ధంగా లేనిదే అతడు ఏ మాటనూ పలకలేదు.** ***(ఖాఫ్ 50 : 16-18)***

ప్రియసోదరులారా..!

హజ్రత్ ఇమామ్ హసన్ బసరీ (రహ్మ) ఈ ఆయతులను పఠించి ఇలా బోధిస్తూ ఉండేవారు: 'ఓ ఆదంసంతానమా! నీ కోసం నీ డైరీ తెరచివేయబడింది మీలో ప్రతీ వ్యక్తి కొరకు ఇద్దరు దైవదూతలు నియమించబడి ఉన్నారు. ఒకరు నీ కుడి వైపున, మరొకరు నీ ఎడమ వైపున ఉన్నారు. కుడివైపున ఉన్న దూత నీ పుణ్యకార్యాలను పరిరక్షిస్తూ ఉంటాడు. ఎడమవైపు దూత నీపాపకార్యాలను లిఖిస్తూ ఉంటాడు. ఇక పుణ్యకార్యాలు ఎక్కువ చేయాలా తక్కువ చేయాల లేదా పాపకార్యాలు ఎక్కువ చేయాలా తక్కువ చేయాలనేది నీ ఇష్టం. నీవు మరణించిన తరువాత

teluguislam.net



నీతోపాటు నీ డైరీ కూడా సమాధిలో నీతోడుగా వస్తుంది. ప్రళయదినాన నీవు సమాధినుండి లేపబడినపుడు అది నీ చిట్టా అంతా బయటపెడుతుంది.

అదే విషయాన్ని అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: మేము ప్రతి మానవుని మెడలో అతని కర్మలను కట్టి ఉంచాము. మరియు పునరుత్థాన దినమున అతని కర్మ గ్రంధాన్ని అతని ముందు పెడతాము. దానిని అతడు స్పష్టమైనదిగా గ్రహిస్తాడు. అపుడు అతనితో ఇలా అనబడుతుంది. నీవు నీ కర్మపత్రాన్ని చదువుకో. ఈ రోజు నీ (కర్మల) లెక్క చూసుకోవటానికి స్వయంగా నీవే చాలు (అల్ ఇస్రా17:13-14).

పిదప ఇమామ్ హసన్ బసరీ ఇలా అన్నారు: అల్లాహ్ సాక్షిగా! ఆయన చాలా గొప్ప న్యాయం చేశాడు. ఆయన స్వయంగా మానవున్నే తన లెక్క తీసుకొనే వాడుగా చేశాడు.

ప్రళయదినాన ప్రతి మానవుడు తన కర్మపత్రం చూసుకుని తన లెక్క తానే వేసుకుంటాడు. కొందరి ముఖాలు వికసించి సంతోషంగా కనబడతారు. వారి పుణ్యకర్మల ప్రతిఫలంగా స్వర్గ శుభవార్త ఇవ్వబడుతుంది. ఇక చెడుకర్మలు చేసిన వారికి నరకశిక్ష తప్పదు. తమ కర్మపత్రం చూసుకుని తలబాదుకుంటు, అరుస్తూ గోలచేస్తారు. కాని ఫలితం ఏమి ఉండదు.

హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఇలా పేర్కొన్నారు: మానవుడు మంచి, చెడు ఏ మాటలు తన నోటినుండి పలుకుతాడో అవన్నీ రికార్డ్‌లో రాయబడతాయి. చివరకు అతని రహస్య మంతనాలు కూడ రాయబడతాయి. తరువాత గురువారం రోజు వారి వాక్ కర్మలు, ఆచరణలు అల్లాహ్ సమక్షంలో సమర్పించబడతాయి. మంచి, చెడు మాటలు ఉంచబడతాయి. మిగతా వ్యర్థమాటలన్నీ తుడిచివేయబడతాయి.

**అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు "అల్లాహ్ తాను కోరిన దానిని రద్దు చేస్తాడు. మరియు తాను కోరిన దానిని స్థిరపరుస్తాడు. మరియు మాతృగ్రంధం ఉమ్ముల్ కితాబ్ ఆయన దగ్గరే ఉంది** ***(అర్రాద్ 13 : 39)***

**సోదరులారా..!**

ఆ తరువాత అల్లాహ్ మృత్యువు గురించి ప్రస్తావిస్తూ ఇలా సెలవిస్తున్నాడు: **మరియు మరణమూర్ఛ వచ్చేది సత్యం అది ఇదే దేనినుండైతేనీవు తప్పించుకో గోరుతూ ఉండేవాడివో. బాకా (సూర్) ఊదబడుతుంది ఆ హెచ్చరించబడిన పునరుత్థాన దినం అదే. (ఖాఫ్ 50 : 19-20)**



దైవప్రవక్త (స) మృత్యువు అంటు భయపడే వ్యక్తిని నక్కతో పోల్చుతూ ఇలా సెలవిచ్చారు: నక్క భూమి నుండి అప్పు తీసుకుని భూమి నుండి తప్పించుకు పరిగెడుతూ పరిగెడుతూ అలసిపోతుంది. తరువాత అది తన గుహలోకి చేరుతుంది. భూమి అక్కడ కూడా ఉంది కాబట్టి నక్కతో అప్పు తీర్చమని అడిగింది. అంతే అది అక్కడి నుండి పరుగెత్తడం మొదలెట్టింది. చివరికి దాని శ్వాసనాళలు ఉబ్బి పరుగెత్తి పరుగెత్తి చనిపోతుంది. నక్క పరుగెత్తడానికి దారులన్ని మూసి వేయబడ్డాయి. అదేవిధంగా మానవుడు మృత్యువు నుండి తప్పించుకోడానికి మార్గాలన్ని మూసివేయ బడ్డాయి.

దైవప్రవక్త (స) ఇలా అన్నారు: బాకా (సూర్) ఊదే దైవదూత నోట్లో బాకా (సూర్) పెట్టుకొని సిద్ధంగా ఉన్నాడు. దైవాజ్ఞకై ఎదురుచూస్తూ శిరస్సువంచి ఉన్నాడు. ఎపుడు ఆజ్ఞ అవుతుందో ఎప్పుడు ఊదాలి. అపుడు అనుచరులు, "ఓ దైవప్రవక్తా (స)! అపుడు మేము ఏమని పలుకాలి?" దానికి దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "హస్బునల్లాహు వ నిమల్ వకీల్."

(అల్లాహ్ మా రక్షణకు చాలు ఆయన అత్యుత్తమ కార్యసాధకుడు). తరువాత ఆయతులో నరకంలోని కొన్ని దృశ్యాల గురించి తెలుపబడింది.

ఆ రోజు మేము నరకంతో, "నీవు నిండిపోయావా?" అని ప్రశ్నిస్తాము. అది "ఇంకా ఏమైనా ఉందా ఏమిటి? అని అంటుంది."

నరకం ఇలా ఇంకా ఏమైనా ఉంగాఏమిటి? అని అడుగుతూనే ఉంటుంది. చివరకు అల్లాహ్ తన శుభ పాదాన్ని దానిలో పెడతాడు. అపుడు అది 'చాలు చాలు' అంటుంది. *(సహీహ్ బుఖారీ, సహీహ్‌ముస్లిం)*

అల్లాహ్‌కు పాదాలున్నాయని ఈ హదీస్ ద్వారా మనకు తెలుస్తుంది. దీనిని యదాతథంగా విశ్వసించాలి. అర్థాన్ని మార్చటంగానీ, పోల్చటంగాని చేయరాదు.

తరువాత స్వర్గం గురించి ఇలా తెలుపుతున్నాడు: స్వర్గం దైవభీతి గలవారి దగ్గరకు తీసుకురాబడుతుంది. అది వారినుండి ఏ మాత్రం దూరంగా ఉండదు. వారితో ఇలా అనబడుతుంది: ఇది మీకు వాగ్దానం చేయబడినది. మళ్ళీ మళ్ళీ మా వైపుకు మరలే ప్రతివానికి, మా హద్దులను పాటించిన వానికి అగోచరుడైన ఆ

teluguislam.net



కరుణామయునికి భయపడే వానికి మరియు మా వైపుకు పశ్చాత్తాప హృదయంతో మరలే వానికి. ఇందులో శాంతితో ప్రవేశించండి. ఇదే శాశ్వత జీవితదినం. అందులో వారికి, వారు కోరేదంతా ఉంటుంది. మా దగ్గర ఇంకా చాలా ఉంది.

*(ఖాఫ్ 50:31-34)*

అల్లాహ్ ఏయే విషయాలు తెలుపుతున్నాడో అవన్నీ అక్షరసత్యం. అల్లాహ్ సత్యం తప్ప మరేమి పలుకడు. మీరు విన్న విషయాలు కొన్ని మాత్రమే. కాని ఖాఫ్ సూరాలో మరెన్నో విషయాలు అంశాలు ఉన్నాయి. స్వయంగా భావంతో పఠిస్తే అధ్యయనం చేస్తే స్పష్టంగా బోధపడతాయి. నిశితంగా శ్రద్ధగా అధ్యయనం చేస్తే పరిశోధిస్తూ పఠిస్తుంటే మరెన్నో అనూహ్య వాస్తవాలు, విషయాలు దృష్టికి వస్తాయి. సూరా చివరి ఆయత్‌లో దైవప్రవక్త (స)కు ఆయన అనుచర సంఘానికి, ధర్మప్రచారం చేసే వారందరికి ఈ సందేశం ఇవ్వబడింది-

**"కావున నా హెచ్చరికకు భయపడే వాడికి మాత్రమే నీవు ఈ ఖుర్‌ఆన్ ద్వారా హితబోధ చెయ్యి."** ***(ఖాఫ్ 50 : 45)***

ఓ అల్లాహ్! ఖుర్‌ఆన్ గ్రంథం పై సంపూర్ణ విశ్వాసాన్ని కలిగించు. దీని పారాయణం ద్వారా మా హృదయాల్లో, మనోమస్తిష్కాల్లో వెలుగు నింపు. ఇప్పుడు విన్న ఖుర్‌ఆన్ సందేశాన్ని మా హృదయాల్లో పదిలపరుచు. వాటికనుగుణంగా ఆచరించే సద్బుద్ధిని ప్రసాదించు.

ఓ అల్లాహ్! మేము నీ పాపాత్ములైన నీ దాసులం మాపై కరుణించు, మేము నిన్నే అర్థిస్తున్నాము. మా పాపాలన్నింటిని క్షమించు. ప్రపంచంలో కమ్ముకున్న కష్టాల కారుమేఘాల నుండి, ఉపద్రవాల నుండి ఓ ప్రభూ! మమ్ము రక్షించు. ఖుర్‌ఆన్ వెలుగులో జీవితం గడిపే భాగ్యాన్ని అనుగ్రహించు. ఆమీన్.

**--: సమాప్తం : --**